
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 219

బుధవారం 30-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో దీపావళి స్ర్కాచ్ కార్డ్ స్కీమ్

సోనోవిజన్ స్ర్కాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటోంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్ర్కాచ్ చేయగా మినిమం 6%, చాలా మందికి మరింత ఎక్కువ ఎమౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీపావళికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎల్.ఇ.డి, వాషింగ్ మెషీన్స్, రిఫ్రిజిరేటర్స్, ఎ.సి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 20% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.



దీపావళి శుభాకాంక్షలతో...

సోనోవిజన్ దీపావళి సేల్



LG

Life's Good.



CELEBRATION OFFERS

CASHBACK UP TO 15% (On Select Refrigerators up to ₹15000)

FIXED EMI Starting from ₹2999*

FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000 (On Select Models of LG Refrigerators)

FREE MINI REFRIGERATOR worth up to ₹11999* (On Purchase of InstaView Side-by-Side Refrigerators GL-X257ABS3 & GL-X257AMC3)

CASHBACK UP TO 10%* (On select Refrigerators up to ₹2500)

FIXED EMI Starting from ₹888*

0 DOWN PAYMENT (Rest in EMIs) (On select Models)

Exciting Offers On
LG Refrigerators and Washing Machines



Win LG Dream Home Package

EVERY DAY



(Side-by-Side Refrigerator, Front Load Washing Machine, Microwave Oven, Water Purifier, Air Conditioner & OLED)

Grab Assured Gifts

Up to ₹ 51 CRORES

To participate, send an SMS <"First Name" "Last Name" GTM Code> to 7835073507



CELEBRATION OFFERS

CASHBACK UP TO 22.5%* Max Up To ₹13500 (Applicable on 10 kg and Above Select Models)

FIXED EMI STARTING FROM ₹3999* (Applicable on Select Machines)

T & C Apply

LG BEST Care | LG 24 x 7 CUSTOMER CARE 08069379999 | www.lg.com/in/support

LG WhatsApp No. 9711709999

LG Service India Mobile App Available at Google Play

www.facebook.com/lgindiapage/

www.twitter.com/LGIndia

To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com

www.lgbrandstore.com/in

LG Greencycle

Regd. Office: LG Electronics India Pvt. Ltd., A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044 CIN No. U32107DL1997PTC220109

*T&C Apply. Images are for illustration, actual product may vary. For more information, kindly visit www.lg.com/in

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 25,000/- విజేత



శ్రీమతి వి. మాధవి
కొంపల్లి, హైదరాబాద్.
8095912666

రూ. 25,000/- విజేత



శ్రీ మాణిక్యాల ఉదయ్
పర్శిబందమ్, ఖమ్మం
7075565624

రూ. 25,000/- విజేత



శ్రీ బి. రామాంజనేయులు
కృష్ణలంక, విజయవాడ.
9295061777

రూ. 25,000/- విజేత



శ్రీ వి.వి.కె. సంతోష్
ఏలూరు రోడ్డు, విజయవాడ.
9866239009

రూ. 25,000/- విజేత



శ్రీ యల్. హరి వెంకటసాయి
అన్నపూర్ణనగర్, గుంటూరు.
7032545050

రూ. 25,000/- విజేత



శ్రీమతి యస్. సాత్విక
గౌతమ్‌నగర్, నెల్లూరు.
8331805070

రూ. 25,000/- విజేత



శ్రీ జె. శివ శంకర్
పిఠాపురం, కాకినాడ
8341410141

రూ. 25,000/- విజేత



శ్రీ ఎ. గంగాధర్
శాంతినగర్, విశాఖపట్నం.
9494670900

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
ద్వారకానగర్ 2వ లైన్, పోలక్స్‌స్కూల్ ఎదురు, వైజాగ్. 8712635857, 858, 859.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ ముకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613

తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
సాయికృష్ణ థియేటర్, ఇన్నిస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
యన్.సి.సి.బోట్ క్లబ్ ఎదురు, సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21

పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
ఐదేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంజనాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
షైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115

తాడేపల్లిగూడెం
గొల్లగూడెం సెంటర్, తాడేపల్లిగూడెం. 8712635854, 55, 56

విజయనగరం
3 లాంతర్ల సెంటర్. 9246666208, 9390006630
బస్ ఫ్యాక్టరీ జంక్షన్. 8712600523, 8712600535

శ్రీకాకుళం
రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్, శ్రీకాకుళం. - 9154281140, 41

విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు, విజయవాడ. 9100991703, 9154281626
ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్, గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47

గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79

మచిలీపట్నం
మునిసిపల్ పార్క్ ఎదురు, రామనాయుడుపేట, కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81

గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368

ఒంగోలు
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911

రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43.
అమ్మ హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527

ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38

కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27

మా నూతన షోరూం సందర్శించండి మహబూబ్‌నగర్
గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ - 8712635851, 52, 53

మా నూతన షోరూం సందర్శించండి మిర్యాలగూడ
ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర 8712635848

హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188

కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 219

బుధవారం 30-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




భారత మహిళలదే వన్డే సిరీస్

న్యూజిలాండ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో 6 వికెట్లతో భారత్ విజయం - 14లో



'జేఎస్‌డబ్ల్యూ'తో పోస్కో జట్టు

భారత్‌లో ఉక్కు ప్లాంటు ఏర్పాటు కోసం ఎంఓయూ - 15లో



సేవ చేయలేకపోతున్నా..

పశ్చిమబెంగాల్, ఢిల్లీ రాష్ట్రాల్లో వృద్ధులకు ఉచితంగా వైద్యం లభించకపోవడం చూసి చాలా బాధపడుతున్నానని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



శ్వేతసౌధంలో దీపావళి వేడుక

అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు.


- వివరాలు 6లో▶



గాజాపై భీకర దాడి

ఇజ్రాయెల్ ఆర్మీ గాజా ప్రాంతంపై మరోసారి భీకర దాడికి పాల్పడింది. ఈ ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



హెజ్‌బొల్లాకు కొత్త సారథి

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సాయుధ గ్రూపు నూతన సారథిగా షేక్ నయీమ్ కాసిమ్ (71) ఎంపికయ్యారు.

- వివరాలు 6లో▶

కేసీఆర్ ఖేల్ ఖతం

కేటీఆర్‌ను వాడి ఆయన్ను ఫినిష్ చేశా: సీఎం రేవంత్

- ఇప్పుడు బావను ఉపయోగించి బావమరిదిని ఫినిష్ చేయిస్తా
- ఇక హరీశ్‌రావును ఎలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు
- కేసీఆర్ కుటుంబానికి రాజకీయ ఉనికి లేకుండా చేస్తా..
- సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- దీపావళి అంటే మాకు చిచ్చుబుడ్లు.. వారికి సారాబుడ్లు
- సీఎం కావాలన్న కోరిక నెరవేరింది.. ఇక ప్రజలకు సేవ చేయడమే పని
- నాది రాజమౌళి వర్కింగ్ స్టైల్.. రాంగోపాల్‌వర్మ టైపు కాదు
- సియోల్‌లో పర్యటించిన మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: 'మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాలం చెల్లిన మందు. ఆయన పని అయిపోయింది. కేసీఆర్ కోసం కేటీఆర్‌ను వాడా. పది నెలల్లో కొడుకు చేత తండ్రిని ఫినిష్ చేయించా. ఇప్పుడు బావను ఉపయోగించి బావమరిదిని ఫినిష్ చేయిస్తా. ఆ తర్వాత హరీశ్‌రావును ఎలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు. కేసీఆర్ కుటుంబానికి రాజకీయ ఉనికి లేకుండా చేస్తా...' అంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దీపావళి అంటే తమకు చిచ్చుబుడ్లు గుర్తుకు వస్తాయని, కానీ వారికి మాత్రం సారాబుడ్లు గుర్తుకొస్తాయని ఎద్దేవా చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఏమీ తప్పు చేయకపోతే ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన విచారణల్లో ఎలాంటి కక్ష సాధింపులు ఉండబోవని, దర్యాప్తు సంస్థలు ఇచ్చే నివేదికల ప్రకారమే చర్యలుంటాయని చెప్పారు. ఇటీవల దక్షిణ కొరియాలోని సియోల్‌లో పర్యటించిన మీడియా ప్రతినిధులతో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రేవంత్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

మాకు నష్టం జరిగినా ప్రజలకు మేలు చేస్తాం


'సీఎం కావాలన్నది నాకల. ఆ కల నెరవేరింది. కొత్తగా ఏదో కావాలనే కోరిక నాలో లేదు. ఇప్పుడు ప్రజలకు సేవ చేయడమే పని. నేను అనుకున్నది ఇచ్చిన ప్రజలకు మిగతా 3వ పేజీలో ▶

ఫైసా ఖర్చు లేకుండా మూసీ పునరుజ్జీవం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

- ప్రాజెక్టుపై ముందుకే.. వెనక్కి తగ్గేదిలేదు... 18 నెలల్లో మూడు పద్ధతుల్లో డీపీఆర్ రెడీ
- మేలైన మోడల్‌ను ఎంచుకుని పనులు ప్రారంభిస్తాం
- తొలిదశలో జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు ప్రాజెక్టు
- బాపూఘాట్ వద్ద అతి ఎత్తైన గాంధీ విగ్రహం, లండన్ ఐ, పెద్ద టవర్

3 లో



బెయిల్ రద్దుకే కుట్ర..
బాధితుడు జగనే

వైఎస్ విజయమ్మను ఉద్దేశించి రాసిన లేఖలో వైఎస్సార్ సీపీ స్పష్టీకరణ



- బెయిల్ రద్దు కుట్రను విజయమ్మ తన లేఖలో ఎందుకు ప్రస్తావించలేదు?
- దీనిపై వైఎస్సార్ అభిమానుల్లో తీవ్ర ఆవేదన..
- సరస్వతీ షేర్ల బదిలీని వారిస్తూ రిటైర్డ్ జడ్జీలు న్యాయ సలహా ఇచ్చినప్పటికీ కుట్రపూరితంగా బదిలీ చేయడం గురించి విజయమ్మ తన లేఖలో ఎందుకు ప్రస్తావించలేదు?
- జగన్‌కు న్యాయపరంగా చిక్కులు సృష్టించే పత్రాలను ఆమె ఆమోదించి సంతకం చేయడం నిజం కాదా?
- ఉమ్మడి ఆస్తులే అయితే ఒకరి కంపెనీల్లో ఒకరికి వాటాలు ఎందుకు లేవు?
- కుటుంబ ఆస్తులే అయితే ఎంఓయూ ఎందుకు? చెల్లెలి పట్ల ప్రేమతో తన స్వార్జిత ఆస్తుల్లో వాటా ఇస్తున్నట్లు ఎంఓయూలో జగన్ స్పష్టంగా చెప్పారు
- దాన్ని ఆమోదిస్తూ ఎంఓయూపై విజయమ్మ, షర్మిల సంతకాలు చేశారు.. అంటే జగన్ స్వార్జిత ఆస్తుల్లో తమకు హక్కు లేదని వారు అంగీకరించినట్లే కదా?
- గత నాలుగేళ్లుగా టీడీపీ నేతలతో కుమ్మక్కై షర్మిల అడుగులు.. ఎన్నికల ముందు విజయవాడలో జగన్‌పై దాడి జరిగితే హేళన చేస్తూ వ్యాఖ్యలు
- రచ్చకెక్కిందీ... కుటుంబ పరువు తీసింది షర్మిలే
- ఇన్ని జరిగినా.. చెల్లిని ఏనాడూ ఒక్క మాట అనని జగనే బాధితుడు
- కోర్టులే అంతిమ నిర్ణేతలు

12 లో

అన్నీ కుటుంబ ఆస్తులే..

- షర్మిలకు జగన్ బాధ్యతతో ఇచ్చిన ఆస్తులు
- వైవీ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి చెప్పినవి అవాస్తవాలు... షర్మిలకు డివిడెండ్‌గానే రూ.200 కోట్లు ఇచ్చిన జగన్
- ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం... లేఖలో పేర్కొన్న వైఎస్ విజయమ్మ

12 లో



న్యూస్‌రీల్

6 నుంచి కుటుంబ సర్వే



నవంబర్ 6 నుంచి మొదలయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించేలా జిల్లాల్లో కలెక్టర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. సర్వే లక్ష్యాలు, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచనలు చేశారు.

- వివరాలు 12లో▶

దేవుడిపై ఒట్లు.. అడిగితే తిట్లా?



'హామీలు, డిక్లరేషన్ల పేరుతో సభలు ఏర్పాటు చేసి దేవుళ్లపై ఒట్లు వేశారు. నెరవేర్చాలని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తే.. తిట్ల వర్షం కురిపిస్తున్నారు' అని బీఆర్‌ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

- వివరాలు 3లో▶

బ్యాంకు గ్యారంటీతోనే ధాన్యం కేటాయింపు



ఈ ఖరీఫ్‌లో మిల్లర్లకు కేటాయించే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎంఆర్ విషయంలో గోల్‌మాల్ జరిగినట్టు గుర్తించిన నేపథ్యంలో సీఎంఆర్ ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ లింకు పెడుతూ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 5లో▶

రేటు పెరిగినా.. డిమాండ్ జిగేల్



ధరలు గణనీయంగా పెరిగినా.. పసిడికి డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. మంగళవారం ధన్‌తేరాస్ సందర్భంగా అమ్మకాలు ఉదయం పూట అంతంత మాత్రంగానే ఉన్నా.. మధ్యాహ్నానికి పుంజుకున్నాయి.

- వివరాలు 15లో▶

ఇదండీ సంగతి



బాంబు బెదిరింపులు రాని విమానాలు తయారుచేస్తే బావుండు!!



క్షయ రోగుల నుంచి నమూనాలు సేకరించి.. బాధితులకు అవసరమైన మందులను అదేరోజు అందించేందుకు డ్రోన్ల సేవలను వినియోగించనున్నారు. మొదటిరోజు మంగళవారం కొండమడుగు సీహెచ్‌సీకి మందులను పంపి... భువనగిరి జిల్లా ఆస్పత్రి నుంచి శాంపిల్స్‌ను ప్రయోగాత్మకంగా సేకరించారు. ఇందుకు బీబీనగర్ ఎయిమ్స్ వేదికైంది.

16 లో



నెల ముందే 'సెట్'

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి జూలైలోనే ఇంజనీరింగ్ తరగతులు
- అన్ని ఉమ్మడి పరీక్షలు ముందే నిర్వహణపై ఉన్నత విద్యామండలి కసరత్తు
- అందరితో చర్చలు జరుపుతున్న చైర్మన్
- ప్రైవేటు కాలేజీల్లో నాణ్యతపై దృష్టి

- వివరాలు 16లో

'విజయ'వంతంగా మళ్లీ వాత!



- ప్రైవేట్ కంపెనీలతో పోటీపడి లీటరుకు రూ.10 నుంచి రూ.28 వరకు నూనె ధర పెంచిన ఆయిల్‌ఫెడ్
- దిగుమతి సుంకం పెరిగిందన్న సాకు చూపిస్తున్న యంత్రాంగం
- కానీ దిగుమతి సుంకం పెరిగిన రోజునే ధరలను పెంచేసిన ఆయిల్‌ఫెడ్
- దీపావళికి చుక్కలు చూపిస్తున్న ధరలు.. వినియోగదారుల ఆవేదన

- 16లో

అమ్మో.. అమోయ్‌కుమార్!

ప్రభుత్వ భూములే కాదు.. అటవీ, రక్షణ భూములూ ధారాదత్తం

- సీలింగ్ భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చేశారని ఆరోపణలు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇష్టానుసారంగా భూ అక్రమాలు
- ఆధారాలతో ఈడీకి ఫిర్యాదు
- ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్న బాధితులు
- దీపావళి తర్వాత మరోసారి అమోయ్‌కుమార్‌ను విచారణకు పిలవనున్న ఈడీ

సాక్షి, హైదరాబాద్: అమోయ్‌కుమార్.. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భూములనే కాదు అటవీ, రక్షణశాఖ, కాందిశీకుల భూములనూ తన అధికారాన్ని ఉపయోగించి ధారాదత్తం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహేశ్వరం మండలంలో భూదాన్‌భూములపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ చేపట్టడంతో ఆయన బారిన పడిన బాధితులు ఒక్కొక్కరుగా ఈడీకి ఫిర్యాదు చేస్తున్నారు. ఒక వైపు ఈడీ విచారణ మిగతా 12వ పేజీలో ▶




PAN BAHAR
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PEHCHAN KAMYABI KI
NEW PACK
PAN BAHAR
THE HERITAGE ELAICHI
దీపావళి
శుభాకాంక్షలు
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

చంద్రబాబూ.. రైతుల ఉసురుపోసుకోవద్దు!

- ఉచిత పంటల బీమా పథకం రద్దుపై పునరాలోచన చేయండి
- 'ఎక్స్' వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రబీ సీజన్ నుంచి పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతుల తరఫున ప్రీమియం వాటా చెల్లించడం మీ ప్రభుత్వానికి భారమా చంద్రబాబూ' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా మంగళవారం ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు ఉచిత పంటల బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన విషయాన్ని వైఎస్ జగన్ గుర్తు చేశారు. నోటిఫై చేసిన ప్రతి పంటకూ, సాగైన ప్రతి ఎకరాకు నూరు శాతం (యూనివర్సల్) బీమా కవరేజీ కల్పిస్తూ రైతులకు అండగా నిలిచామన్నారు. 'అసలే పుట్టెడు కష్టాలో ఉన్న రైతులపై పంటల బీమా ప్రీమియం భారం మోపడం భావ్యం కాదు. రైతులను బాధపెట్టిన వారు బాగుపడినట్టుగా చరిత్రలో ఎక్కడా లేదు. వాళ్ల ఉసురుపోసుకోవద్దు. తక్షణమే ఉచిత పంటల బీమా పథకం రద్దు చేసే విషయంలో పునరాలోచించాలి' అని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

రేపట్నుంచి వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి ఉత్సవాలు

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ఈ నెల 31న ప్రారంభించి వచ్చే ఏడాది అక్టోబర్ 31 వరకు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, స్వాతంత్ర్య సమరయోధుల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని గ్రామగ్రామాన ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. నిజాం సైన్యంపై జరిగిన పోరాటం గురించి ఈ తరానికి, నవతరానికి అవగాహన కల్పించేలా ఈ ఉత్సవాలు జరుపుతామని తెలిపారు. మంగళవారం ఏక్తాదివస్‌లో భాగంగా అసెంబ్లీ ఎదుటనున్న పటేల్ విగ్రహానికి పూలమాల వేసి కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాడు పటేల్ చొరవతో పోలీస్ చర్య ద్వారా రజాకార్లను ఓడించి తిరంగా జెండాను ఎగురవేసి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయన్నారు. సర్దార్ పటేల్ భారత్‌లో 562 సంస్థానాలను విలీనం చేసి దేశ సమైక్యతకు కృషి చేశారని గుర్తు చేశారు. నేటి తెలంగాణ రాష్ట్రం నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం సైన్యాన్ని భారత సైన్యం ఓడించడం ద్వారా ఇక్కడి ప్రజలకు విముక్తి కల్పించారని కొనియాడారు.

నేడు కులగణనపై కాంగ్రెస్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ ఆరో తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కులగణనపై కాంగ్రెస్ పార్టీ నేడు సమావేశం నిర్వహించనుంది. గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ, రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమం గురించి కల్పించాల్సిన విస్తృత ప్రచారంపై పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌గౌడ్‌లతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

బీఆర్‌ఎస్ పోరుతోనే తప్పిన కరెంటు చార్జీల ముప్పు

మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని, ఇది ముమ్మాటికీ తమ విజయమేనని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఈఆర్సీ ఎదుట వాదనలు వినిపించి చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై కరెంట్ భారం మోపకుండా కాపాడుకున్నామని చెప్పారు. ప్రస్తుతం చీటికి మాటికి కరెంట్ పోయే పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. సర్కారు తెలివితక్కువ నిర్ణయాలతో పోయిన 6 నెలల్లో రాష్ట్ర ఆదాయం రూ.4 వేల కోట్లు తగ్గిందన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నాలకే వర్తింపజేయడం ఎంతవరకు సమంజసమని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలోనే అత్యంత నాణ్యత కలిగిన తెలంగాణ పత్తికి కేంద్రం మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. గుజరాత్‌లో క్వింటాకు రూ.8 వేలకు పైగా కొంటూ, మన పత్తికి మాత్రం కేవలం రూ.7,521 మద్దతు ధర ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దావత్‌లకు కూడా పర్మిషన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

పైసా ఖర్చు లేకుండా మూసీ పునరుజ్జీవం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

- ప్రాజెక్టుపై ముందుకే..వెనక్కి తగ్గేదిలేదు
- 18 నెలల్లో మూడు పద్ధతుల్లో డీపీఆర్ రెడీ
- మేలైన మోడల్‌ను ఎంచుకుని పనులు ప్రారంభిస్తాం
- తొలిదశలో జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు ప్రాజెక్టు
- బాపూఘాట్ వద్ద అతిఎత్తైన గాంధీ విగ్రహం, లండన్ ఐ, పెద్ద టవర్



సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవంపై ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తూ లేనిపోని ప్రచారాలతో ప్రజల మనసులను కలుషితం చేస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పైసా ఖర్చు లేకుండా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఈ ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రి మాట్లాడారు. 'గత ప్రభుత్వం తరహాలో కాకుండా మేం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తాం. ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా వేయిసార్లు ఆలోచిస్తా. అలా ఆలోచించే మూసీ పునరుజ్జీవంపై నిర్ణయం తీసుకున్నా. ఇక ముందడుగే. వెనుకడుగు వేసేది లేదు. పైసా ఖర్చు లేకుండా ప్రైవేటు భాగస్వామ్యంతో పనిచేస్తాం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఐదు సంస్థల కన్సార్టియంకు మూసీ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాం. రివర్ బెడ్ ఆర్థికంగా ఎలా ఉపయోగపడుతుందనే కోణంలో, అన్ని సాధ్యాసాధ్యాలకు సంబంధించిన అంశాలతో 18 నెలల్లో ఈ డీపీఆర్ వస్తుంది. ప్రభుత్వ, పీపీటీ, హైబ్రిడ్.. ఈ మూడు పద్ధతుల్లో వస్తుంది. దీని ఆధారంగా ప్రపంచంలోనే మేలైన మోడల్‌ను ఎంచుకుని మూసీ పునరుజ్జీవ పనులకు శ్రీకారం చుడతాం..' అని సీఎం తెలిపారు.

తొలిదశలో 21 కిలోమీటర్లు

'తొలిదశలో బాపూఘాట్ వరకు మూసీ పునరుజ్జీవం చేపడతాం. జంట జలాశయాల నుంచి బాపూ ఘాట్ త్రివేణి సంగమం వరకు ఈ పనులు మొదలు పెడతాం. మల్లన్నసాగర్ నుంచి గండిపేట, హిమాయత్‌సాగర్‌కు గోదావరి జలాలు తరలిస్తాం. ఆలోపు వంద శాతం నీటిని శుద్ధి చేస్తాం. అక్కడికి 21 కిలోమీటర్ల మేర పునరుజ్జీవం పూర్తవుతుంది. నవంబర్ తొలివారంలో మల్లన్నసాగర్ నుంచి జంట జలాశయాలకు నీటి తరలింపు ట్రంక్ లైన్ పనులకు టెండర్లను పిలుస్తాం. బాపూఘాట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తాం. అతి పెద్ద బాపూ విగ్రహం ఏర్పాటు చేస్తాం. లండన్ ఐ (అతిపెద్ద జెయింట్ వీల్) ఏర్పాటు చేస్తాం. అక్కడి నుంచి నగరమంతా వీక్షించేలా సియోల్ టవర్ తరహాలో పెద్ద టవర్ నిర్మిస్తాం. మూసీ వెంట అంతర్జాతీయ వర్సిటీ, గాంధీ ఐడియాలజీ..రీ క్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్ ఏర్పాటు చేస్తాం..' అని రేవంత్ చెప్పారు.

నైట్‌లైఫ్‌కు వేదికగా హైదరాబాద్

'మూసీ సుందరీకరణతో ఆదాయ పరంగా మరో నగరం ఏర్పడుతుంది. రాత్రివేళల్లో మూసీ రివర్ ఫ్రంట్‌లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరుగుతాయి. ఇప్పటివరకు హైదరాబాద్ నగరం పగలు మాత్రమే మేలుకుంటోంది. మూసీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నైట్ లైఫ్‌కు వేదిక కానుంది. మూసీ నిర్వాసితులకు మంచి పరిహారం ఇస్తాం. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

ప్రజలనే అడుగుదాం రండి

ఈ ప్రాజెక్టుపై అనుమానాలున్నా, ప్రతిపక్షాలకు ఏదైనా ఆలోచన ఉన్నా నాకందజేయాలి. ఒకవేళ కేటీఆర్, హరీశ్, ఈటల లాంటి నేతలకు నా దగ్గరకు రావడం మొహమాటం అనిపిస్తే సీఎస్‌ను లేదంటే మంత్రులను కలిసి ఇవ్వొచ్చు. మూసీని నగర జీవనాడిగా మార్చేందుకు కలిసి రండి. వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా. కేటీఆర్, ఈటల, హరీశ్ కూడా నాతో కలిసి రావాలి. మూసీని అభివృద్ధి చేయాలో లేదో ప్రజలను అడుగుదాం. రూ.లక్షన్నర కోట్లు ఖర్చు కేవలం మూసీకే కాదు.. విశ్వనగర అభివృద్ధి కోసం. ట్రిపుల్ ఆర్, మెట్రో, గోదావరి జలాల తరలింపు, ఎస్టీపీల నిర్మాణం, రేడియల్ రోడ్ల అభివృద్ధికి ఈ నిధులు వెచ్చిస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

కేటీఆర్ పేరు పెట్టి ఆరోపణలు చేయలేదు

నోటీసుపై కేంద్రమంత్రి బండి సంజయ్ సమాధానం



సాక్షి, హైదరాబాద్: తనకు ఇచ్చిన లీగల్ నోటీస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు నిరాధారం, అవాస్తవమైనవని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టంచేశారు. ఈ నోటీసుల్లో పేర్కొన్నట్లు తాను కేటీఆర్‌ను ఆయన పేరు పెట్టి ఆరోపించలేదని పేర్కొన్నారు. కేటీఆర్ నోటీస్‌లకు సంజయ్ న్యాయవాది సమాధానమిస్తూ.. 'మా క్లయింట్ (సంజయ్)కు కేటీఆర్ ఇచ్చిన లీగల్ నోటీసులు, ఆయనపై చేసిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలి. మీడియా ద్వారా ప్రజలకు క్షమాపణలు తెలియజేయాలి. ఏడురోజుల్లో వారు స్పందించకపోతే తాము చట్టపరమైన చర్యలు చేపడతాం' అని తెలియజేశారు. ఇటీవల సంజయ్ మీడియా సమావేశంలో తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించిన విషయం తెలిసిందే. తమ క్లయింట్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారని, ఆయన జీవిత మంతా ప్రజా సంక్షేమానికి కృషి చేశారన్నారు. సంజయ్‌పై కేటీఆర్ చేసిన ఆరోపణల్లో ఎలాంటి సాక్ష్యాలు లేకపోవడంతో తప్పుడు ఉద్దేశాలతోనే నోటీసులిచ్చినట్టు స్పష్టమవుతోందని న్యాయవాది పేర్కొన్నారు. సంజయ్ తన వ్యాఖ్యల ద్వారా ఎవరి గౌరవాన్ని కించపరచలేదని, ఏ దశలోనూ ఆయన తన పదవిని దుర్వినియోగం చేయలేదని స్పష్టం చేశారు. రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన హక్కులకు లోబడే సంజయ్ ఆయా వ్యాఖ్యలు, ప్రకటనలు చేశారన్నారు.

పార్టీలో బీఆర్‌ఎస్ నేతల పెత్తనం ఎక్కువైంది

గంగారెడ్డి సంస్మరణ సభలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్: కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు అజమాయిషీ చేస్తున్నారని, దానిని కాంగ్రెస్ కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారని, కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఇటీవల హత్యకు గురైన మారు గంగారెడ్డి సంస్మరణ సభను జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలసి పాల్గొన్నారు. గంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, గంగారెడ్డి ప్రజాక్షేత్రంలో ఉంటూ పార్టీ అభివృద్ధికి పనిచేశారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్యకర్తలు పార్టీకోసం, నాయకుల కోసం, ప్రజల కోసం పనిచేశారని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పదవులు అడగటం వారి హక్కుగా భావిస్తున్నారని తెలిపారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. కొత్తగా వచ్చినవారి పెత్తనంతో నిజమైన కార్యకర్తలు నైరాశ్యంలో ఉన్నారన్నారు. విప్ అడ్లూరి మాట్లాడుతూ, జీవన్‌రెడ్డి గౌరవానికి భంగం కలగకుండా అధిష్టానం గుర్తిస్తుందని, కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి బాధతో ఉన్నారని, ఆయన బాధను పార్టీ అధిష్టానం అర్థం చేసుకుంటుందని తెలిపారు.

సమగ్ర సర్వేలో అందరూ భాగస్వామ్యం కావాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



నిజామాబాద్ అర్బన్: బీసీలందరూ సమగ్ర కుటుంబ సర్వేలో భాగస్వాములై వివరాలను అందించాలని, అప్పుడే బీసీ కులాలకు మేలు జరుగుతుందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల దామాషాపై బీసీ సంఘాల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కులాలు సర్వేలో తమ వివరాలు అందిస్తే మేలు జరుగుతుందని, లేదంటే కమిషన్ కూడా ఏం చేయలేదన్నారు. బీసీలలో ప్రాచుర్యంలో లేని కులాల వారు తాము బీసీలో ఉన్నామా లేదా అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. అలాగే ఏబీసీడీలుగా వర్గీకరించాలని బీసీ కులాల్లో ప్రధానంగా డిమాండ్ వస్తోందన్నారు. బీసీ కులాల్లో దొమ్మరి, పిచ్చకుంట్ల అనే కులాలు పిలవడానికి ఇబ్బందికరంగా ఉన్నాయని వీటిని మార్చాలని డిమాండ్ వస్తోందని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఎంత సమాచారం ఇస్తే అంత ప్రయోజనం ఉంటుందని ఆయన చెప్పారు. ఎంఐఎం వారు సైతం కొందరు ముస్లింలను బీసీ–ఈలో కలపాల్సిన అవసరం ఉందని తెలిపినట్లు చెప్పారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడుందో తెలియదని, దాని గురించి వివరాలే తెలియడం లేదన్నారు. అంతకు ముందు బీసీ సంఘాల నుంచి వినతులు స్వీకరించిన సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ, నవంబర్ మొదటి వారం నుంచి రాష్ట్రంలో చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే ద్వారా అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు వెల్లడి కానున్నాయని తెలిపారు. రిజర్వేషన్ల ఖరారుకు సర్వే అంశాలు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఖేల్ ఖతం

▶ మొదటి పేజీ తరువాయి

మేలు చేయడమే నా ముందున్న లక్ష్యం. మాకు రాజకీయంగా నష్టం జరిగినా ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరతాం. పనితీరులో నా స్టైల్ రాజమౌళిది.. రాంగోపాల్‌వర్మ లాంటిది కాదు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. కాళేశ్వరంపై విజిలెన్స్ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దయ్యింది. శ్రవణ్‌రావు వాస్తవాలు చెప్పడానికి ముందుకొచ్చాడు. దీపావళి దావత్ అలా చేస్తారని మాకు తెలియదు. ఏమీ చేయకపోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయారు? ముందస్తు బెయిల్ ఎందుకు అడి గారు? ఇంటి దావత్‌లో క్యాసినో కాయిన్స్, విదేశీ మద్యం ఎందుకు?..' అని సీఎం ప్రశ్నించారు.

హామీలు నెరవేరుస్తున్నాం..

'గత ప్రభుత్వం ఎంత గుడ్డిగా వ్యవహరించిందంటే.. కనీసం అధికారుల సర్వీసు రికార్డులు కూడా లేవు. రెవెన్యూ అధికారుల బదిలీల వ్యవహారంతో ఇది తేటతెల్లమైంది. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ఏకంగా రూ.7 లక్షల కోట్ల భారం మోపారు. మేం పది నెలల్లో భూములు అమ్మలేదు, లీజుకు ఇవ్వలేదు. రాబడిలో లీకేజీలను అరికట్టాం. ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నాం. ఏకకాలంలో రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలలో తొలిరోజే వేతనాలు, పింఛన్లతో ప్రజలకిచ్చిన హామీలను నెర వేరుస్తున్నాం. రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ.31 వేల కోట్లు పెట్టి ఇవ్వలేదని అంటున్నారు. అది కేవలం ప్రొవిజన్ కోసమే పెట్టాం తప్ప అదంతా ఇవ్వాలని కాదు. రైతులకు అవసరమైన మేరకు రూ.26 వేల కోట్లు కచ్చితంగా ఇస్తాం..' అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పారు.

ఆర్థిక మాంద్యంతో రియల్టీ తగ్గుముఖం

'హైడ్రాతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని ప్రచారం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా గత రెండేళ్లుగా ఆర్థిక మాంద్యం కారణంగా రియల్టీ తగ్గుముఖం పట్టిందనే విషయం బీఆర్‌ఎస్ నేతలకు తెలియదా? గండిపేటలో అక్రమంగా కట్టిన బలిసినవాళ్ల ఇళ్లే కూలగొట్టాం. పేదల జోలికి వెళ్లడం లేదు. కూకట్‌పల్లిలో చిన్నారిని పరామర్శించిన కేటీఆర్ ఇల్లు కట్టిస్తారని అనుకున్నా. పుస్తకాల బ్యాగ్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు..' అని సీఎం విమర్శించారు.

గత పదేళ్లలో రూ.20 వేల కోట్ల భారం

ఈ ఏడాది చార్జీల పెంపు లేకున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. రాష్ట్ర ప్రభుత్వ వర్గాల వివరణ

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో మొత్తం రూ.20 వేల కోట్లకు పైగా భారం వేసిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గృహ వినియోగదారుల విద్యుత్ బిల్లుల్లో ఫిక్స్‌డ్ చార్జీలను విధించే విధానం 2020కి ముందు లేదని, గత ప్రభుత్వమే దీనిని ప్రారంభించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'తమ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచలేదని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. కానీ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం వేశారు. యూనిట్ విద్యుత్‌పై కనీసం 50 పైసల నుంచి గరిష్టంగా రూపాయి వరకు చార్జీలు పెరిగాయి. వీటికి ఫిక్స్‌డ్ చార్జీలు అదనమని పేర్కొన్నా యి. వాస్తవాలు ఇలావుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచబోతోందని కేటీఆర్ ప్రజలను తప్పుదో వపట్టించే ప్రయత్నం చేశారు. చార్జీల పెంపునకు బదులుగా విద్యుత్ సబ్సిడీలను భారీగా పెంచి ప్రజలకు ఉపశమనం కలిగించింది. విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు రూ.1,200 కోట్ల చార్జీల పెంపును ప్రతిపాదించగా, ఆ భారాన్ని ప్రభుత్వమే సబ్సిడీల రూపంలో భరించడానికి అంగీకరించింది..' అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి.

అసెంబ్లీకి ముఖం చూపలేక..

కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి విసుర్లు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కనగల్: అసెంబ్లీకి ముఖం చూపించే ధైర్యం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేదని.. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా కనగల్, నల్లగొండ మండలాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై తాము నిలదీస్తామన్న భయంతోనే.. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మూసీతో నల్లగొండ జిల్లా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని.. తమ ప్రభుత్వం ప్రక్షాళనకు పూనుకుంటే.. బీఆర్‌ఎస్ నేతలంతా అడ్డు తగలడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లాలో ఒక్క ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఇప్పటికే రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రెండు నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.4,600 కోట్లతో అమెరికా నుంచి సముద్రమార్గం ద్వారా ఓడలో యంత్రాన్ని తెప్పిస్తున్నామని కోమటిరెడ్డి వెల్లడించారు.

ఈఆర్సీ తిరస్కరించడం బీఆర్‌ఎస్ విజయమే

ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపగలిగాం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించడం బీఆర్‌ఎస్ సాధించిన విజయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపగలిగినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్ మంగళవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఈఆర్సీ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా, కేవలం 10 నెలల్లోనే రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిందని విమర్శించారు. అయితే ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్సీని ఒప్పించగలిగినట్టు తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు స్వయంగా తనతోపాటు విద్యుత్ శాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి , ఇతర సీనియర్ నాయకులు రాష్ట్ర ఈఆర్సీని కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొని ప్రజల తరఫున వాదనలు వినిపించారన్నారు.


కాంగ్రెస్ నేతలు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యాలను, అవినీతిని ఎత్తి చూపినందుకు కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌పైన ఫ్రస్ట్రేషన్, డెస్పరేషన్‌లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ తమపై చేస్తున్న రాజకీయ వేధింపుల ప్రహసనంలో గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలన్నీ ప్రారంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో మరిన్ని వేధింపులు ఉంటాయని, కాంగ్రెస్ పార్టీ చేసే వ్యక్తిగత దాడులు, కుట్రలు, ప్రాపగండా, అబద్ధాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

దేవుడిపై ఒట్లు.. అడిగితే తిట్లా

అమల్లో ఉన్నవి ఆపేశారు.. కొత్త పథకాలు ఇస్తలేరు

- ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుస్తాం: హరీశ్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి తదితరులు

వనపర్తి/ సాక్షి, హైదరాబాద్: 'ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, డిక్లరేషన్ల పేరుతో సభలు ఏర్పాటు చేసి దేవుళ్లపై ఒట్లు వేసి హామీలిచ్చారు. నెరవేర్చమని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తే.. తిట్ల వర్షం కురిపిస్తున్నారు' అని బీఆర్‌ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మరికుంట పాలకేంద్రం పక్కన ఏర్పాటు చేసిన రైతాంగ నిరసన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రూపొందించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేస్తోందని.. ఇచ్చిన హామీల మేరకు కొత్త పథకాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ పూర్తి చేస్తామని రేవంత్ దేవుళ్లపై ఒట్టుపెట్టి ఏడాది కావస్తున్నా.. 50 శాతం మంది రైతులకు కూడా వర్తింపజేయలేదని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలు కోసం పోరాడాలని ఆయన బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, అందుకే మేము ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుస్తామన్నారు. ఎకరాకు రూ.10 వేలు కాదు రూ.15 వేల రైతుబంధు ఇస్తామన్న సీఎం రైతుబీమా వర్తింపజేయకుండా ఢిల్లీకి మూటలు మోస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో తొలి నిరసన సదస్సు వనపర్తి వేదికగా నిర్వహించామని త్వరలో మిగతా ప్రాంతాల్లోనూ రైతాంగ నిరసన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ పోలీసులను అవమానించడమే..

సీఎం వ్యక్తిగత భద్రతా విధుల నుంచి స్పెషల్ పోలీసులను తప్పిస్తూ తీసుకున్న నిర్ణయం 17 వేల మంది స్పెషల్ పోలీసులను అవమానించడమే అవుతుందని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సస్పెండ్, డిస్మిస్ చేసిన స్పెషల్ పోలీసులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పెషల్ పోలీసుల సమస్యల పరిష్కారానికి సీఎం తక్షణమే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, నిర్ణీత కాలవ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.



అన్ని జీవించే ప్రాణులు, వాళ్లు ఎవరైనా, గతంలో వాళ్లు నీకు ఏం చేసినా, అందరికీ సంతోషం దొరకాలని కోరుకోవాలి.

– థానిస్సారో భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 30 అక్టోబర్ 2024

సైబర్ సవాలు

అమృతంతో పాటు హాలాహలం పుట్టిందట. సౌకర్యాలెన్నో తెచ్చిన డిజిటల్ సాంకేతికత విసురుతున్న తాజా సవాళ్ళను చూస్తే అదే గుర్తొస్తుంది. రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్ళు, పెచ్చుమీరుతున్న డిజిటల్ స్కామ్‌ల సంఖ్యే అందుకు తార్కాణం. 'డిజిటల్ అరెస్ట్ మోసాల' బారినపడి ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ రూ. 75 లక్షలు, ఓ పారిశ్రామికవేత్త రూ. 7 కోట్లు నష్టపోయిన కథనాలు అమాయకుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. చదువు లేని సామాన్యుల దగ్గర నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకు చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ తమ కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్న వైనం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా కొత్త రకం మోసాలూ అంతే వేగంగా ప్రభవించడం ఆది నుంచీ ఉంది. అయితే, అడ్డుకట్ట వేసినప్పుడల్లా మోసగాళ్ళు సైతం తెలివి మీరి కొత్త రీతుల్లో, మరింత సృజనాత్మకంగా మోసాలు చేయడమే పెను సవాలు. అనేక అంశాలతో ముడిపడ్డ దీన్ని గట్టిగా తిప్పికొట్టాలంటే ఏకకాలంలో అనేక స్థాయుల్లో చర్యలు చేపట్టాలి. అందుకు ప్రజా చైతన్యంతో పాటు ప్రభుత్వ క్రియాశీలత ముఖ్యం.

సాక్షాత్తూ భారత ప్రధాని సైతం తన నెల వారీ 'మన్ కీ బాత్' రేడియో ప్రసంగంలో తాజాగా ఈ 'డిజిటల్ అరెస్ట్ మోసాల' గురించి ప్రస్తావించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. బాధితులను ముందుగా ఫోన్‌లో సంప్రతించడం, మీ ఆధార్ నంబర్ – ఫోన్ నంబర్‌పై వెళుతున్న డ్రగ్స్ పార్సిల్‌ను పట్టుకున్నామనడం, ఆపై వాట్సప్, స్కైప్‌లలో వీడియో కాల్‌కు మారడం, తాము నిజమైన పోలీసులమని నమ్మించడం, నకిలీ పత్రాలు చూపి 'డిజిటల్ అరెస్ట్' చేసినట్టు బాధితులను భయపెట్టడం, ఆఖరికి వారి కష్టార్జితాన్ని కొల్లగొట్టడం 'డిజిటల్ అరెస్ట్ మోసాల' వ్యవహారశైలి. మోసగాళ్ళు తమను తాము పోలీసులుగా, సీబీఐ అధికారులుగా, మాదకద్రవ్యాల నిరోధక శాఖకు చెందినవారిగా, రిజర్వ్ బ్యాంక్ అధికారులుగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులుగా, చివరకు జడ్జీలమని కూడా చెప్పుకుంటూ... అమాయకులపై మానసికంగా ఒత్తిడి తెచ్చి, భయభ్రాంతులకు గురి చేసి ఆఖరికి వారి నుంచి లక్షల రూపాయల కష్టార్జితాన్ని అప్పనంగా కొట్టేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ స్కామ్, ట్రేడింగ్ స్కామ్, పెట్టుబడుల స్కామ్, డేటింగ్ యాప్‌ల స్కామ్... ఇలా రకరకాల మార్గాల్లో సైబర్ ముఠాలు రెచ్చిపోతున్నాయి. ఏటేటా ఈ మోసాలు పెరుగుతున్నాయి. ఒక్క ఈ ఏడాదే కొన్ని వేల డిజిటల్ అరెస్ట్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. రోజూ లెక్కకు మిక్కిలిగా నమోదవుతున్న ఈ సైబర్ నేరాల గణాంకాలు చూస్తే కళ్ళు తిరుగుతాయి. 2021లో 4.52 లక్షల ఫిర్యాదులు వస్తే, 2022లో 9.66 లక్షలు, గత ఏడాది 15.56 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇక, ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే ఏకంగా 7.4 లక్షల ఫిర్యాదులు అందాయని నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ) కథనం.ఆర్థిక నష్టానికొస్తే జనవరి – ఏప్రిల్ మధ్య డిజిటల్ మోసాల వల్ల భారతీయులు రూ. 120 కోట్ల పైగా పోగొట్టుకున్నారు. అలాగే, ట్రేడింగ్ స్కామ్‌లలో రూ. 1420.48 కోట్లు, పెట్టుబడుల స్కామ్‌లలో రూ. 222.58 కోట్లు, డేటింగ్ స్కామ్‌లలో రూ. 13.23 కోట్లు నష్టపోవడం గమనార్హం. చిత్రమేమిటంటే, ఈ డిజిటల్ మోసాల్లో దాదాపు సగం కేసుల్లో మోసగాళ్ళు మయన్మార్, లావోస్, కాంబోడియాల నుంచి కథ నడిపినవారే!

గమనిస్తే, గత పదేళ్ళలో భారతీయ మధ్యతరగతి వర్గం వార్షికాదాయం లక్షన్నర – 5 లక్షల స్థాయి నుంచి రూ. 2.5 – 10 లక్షల స్థాయికి మారిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక. సహజంగానే ఆర్థిక స్థాయితో పాటు మధ్యతరగతి అవసరాలు, ఆకాంక్షలూ పెరిగాయి. కాలంతో పాటు జీవితంలోకి చొచ్చుకువచ్చిన డిజిటల్ సాంకేతికతను అందరితో పాటు అందుకోవాల్సిన పరిస్థితి. డిజిటల్ అక్షరాస్యత లేకపోయినా డిజిటల్ చెల్లింపు వేదికలు సహా అన్నీ అనివార్యమయ్యాయి. అయితే, సౌకర్యంతో పాటు సవాలక్ష కొత్త సవాళ్ళనూ ఆధునిక సాంకేతికత విసిరింది. అవగాహన లేమితో సామాన్యుల మొదలు సంపన్నుల దాకా ప్రతి ఒక్కరూ మోసపోతున్న ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నది అందుకే. జీవితమంతా కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ము ఇలా మోసాల పాలవుతుండడంతో మధ్యతరగతి సహా అందరిలోనూ ఇప్పుడు భయాందోళనలు హెచ్చాయి. దీన్ని ఎంత సత్వరంగా, సమర్థంగా పరిష్కరిస్తామన్నది కీలకం.

ప్రధాని చెప్పినట్టు 'డిజిటల్‌గా అరెస్ట్' చేయడమనేదే మన చట్టంలో లేదు. అసలు ఏ దర్యాప్తు సంస్థా విచారణకు ఫోన్ కాల్, వీడియో కాల్ ద్వారా సంప్రతించదు. కానీ, అలా అబద్ధపు అరెస్ట్‌తో భయపెట్టి డబ్బు గుంజడం మోసగాళ్ళ పని. అది జనం మనసుల్లో నాటుకొనేలా చేయాలి. డిజిటల్ నిరక్షరాస్యతను పోగొట్టి, సాంకేతికతపై భయాలను తొలగించాలి. సరిగ్గా వాడితే సాంకేతికతలో ఉన్న లాభాలెన్నో గ్రహించేలా చూడాలి. క్షణకాలం సావధానంగా ఆలోచించి, అప్రమత్తమైతే మోసపోమని గుర్తించేలా చేయాలి. ఒకవేళ మోసపోతే, ఎక్కడ, ఎలా తక్షణమే ఫిర్యాదు చేసి, సాంత్వన పొందాలన్నది విస్తృత ప్రచారం చేయాలి. మోసాలను అరికట్టి, అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలను చేపట్టాలి. మన సైబర్ భద్రతా వ్యవస్థను ఎప్పటికప్పుడు తాజా అవసరాలకు అనుగుణంగా నవీకరించాలి. అన్ని రకాల సైబర్ నేరాలపై చర్యల్లో సమన్వయానికి కేంద్రం ఇప్పటికే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐసీ4)ను నెలకొల్పింది. తీరా దాని పేరు మీదే అబద్ధాలు, మోసాలు జరుగుతున్నందున అప్రమత్తత పెంచాలి. అవసరంతో పని లేకుండా వ్యక్తిగత సమాచారాన్ని అన్నిచోట్లా అడగడాన్నీ, అందించాల్సి రావడాన్నీ నివారించాలి. ఎంతైనా, నిరంతర నిఘా, నిర్దిష్టమైన అవగాహన మాత్రమే సైబర్ మోసాలకు సరైన విరుగుడు.

సైనిక విమాన తయారీకి ఊపు

విశ్లేషణ



అనిల్ గోలాని
ఎయిర్ వైస్ మార్షల్ (రిటైర్డ్)

మూడేళ్ల క్రితం యూరప్ కంపెనీ 'ఎయిర్‌బస్'తో 56 సి–295 రవాణా విమానాలను కొనడానికి భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో 16 స్పెయిన్‌లో తయారవుతాయి, మిగతా 40 ఇండియాలో 'టాటా'(టీఏఎస్ఎల్) తయారు చేస్తుంది. సైనిక రవాణా విమానాల తయారీకి ఈ తరహా సహకారం ఇదే మొదటిది. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో కలిసి మోదీ అక్టోబర్ 28న వడోదరలో టీఏఎస్ఎల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ తొలి ప్రైవేట్ సైనిక విమాన తయారీ కేంద్రం ఉపాధికి కూడా తోడ్పడుతుంది. 'మేక్ ఇన్ ఇండియా' కింద తొలి సి–295 విమానం 2026లో అందుబాటులోకి రానుంది. మొత్తం 40 విమానాలను 2031కల్లా అందించడం ద్వారా టీఏఎస్ఎల్ తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంది.

భారత వైమానిక దళానికి చెందిన పాత అవ్రో విమానాల స్థానంలో 56 సి–295 రవాణా విమానాలను కొనుగోలు చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ 2021 సెప్టెంబర్ లో రూ. 21,935 కోట్ల ఒప్పందంపై సంతకాలు చేసింది. 'ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్'తో కుదుర్చుకున్న ఈ ఒప్పందం ప్రకారం, మొదటి 16 విమానాలను స్పెయిన్‌లోని సెవిల్లెలో దాని తుది అసెంబ్లింగ్ (విడిభాగాల కూర్పు) కేంద్రం నుంచి సరఫరా చేయాల్సి ఉంది. మిగతా 40 విమానాలను భారత్, స్పెయిన్ కుదుర్చుకున్న పారిశ్రామిక భాగస్వామ్య ఒప్పందం ప్రకారం మన దేశానికి చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) తయారు చేస్తుంది. భారత్‌లో రవాణా విమానాల తయారీకి ఈ తరహా సహకారం ఇదే మొదటిది. ప్రధాని మోదీ 2022 అక్టోబర్ 30న గుజరాత్‌లోని వడోదరలో టీఏఎస్ఎల్ చివరి దశ విడిభాగాల కూర్పు సదుపాయానికి శంకు స్థాపన చేశారు. అప్పటి ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌధరీకి 2023 సెప్టెంబర్ 13న స్పెయిన్‌లోని సెవిల్లెలో తొలి విమానాన్ని అందజేశారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఈ విమానం 2023 సెప్టెంబర్ 25న హిందాన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో లాంఛనంగా భారత వైమానిక దళంలో చేరింది. 'రైనోస్' అని కూడా పిలిచే ఐఏఎఫ్ 11 స్క్వాడ్రన్ ఇప్పటికే ఆరు సి–295 విమానాలను నడుపుతోంది.

తొలి ప్రైవేట్ సైనిక విమాన తయారీ

సి–295 బహుళ ప్రాయోజక సైనిక రవాణా విమానంగా రుజువు చేసుకుంది. 9.5 టన్నుల పేలోడ్, 70 మంది ప్రయాణికులు లేదా 49 మంది పారాట్రూపర్లను తీసుకెళ్లగల సామర్థ్యంతో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) శక్తిని గణనీయంగా పెంచింది. పగలు, రాత్రి తేడా లేకుండా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ నడిచే సామర్థ్యం ఉన్న ఈ విమానాన్ని ప్రపంచవ్యాప్తంగా వివిధ వైమానిక దళాలు ఉపయోగిస్తున్నాయి. ఇంకా పలు సామర్థ్యాలు ఎయిర్‌బస్ సి–295 సొంతం. సైనిక రవాణా, ఆకాశమార్గంలో రవాణా, పారాట్రూపింగ్, వైద్య సహాయం కోసం తరలింపు, సముద్రప్రాంత గస్తీ, జలాంతర్గాములను ఎదుర్కొనే యుద్ధ పరికరాలు, పర్యావరణ పర్యవేక్షణ, సరిహద్దు పహారా, వాటర్ బాంబర్, గాలి పరంగా ముందస్తు హెచ్చరికలు వంటి విస్తృత శ్రేణి మిషన్‌లలో ఇది సమర్థంగా పని చేస్తుంది.

స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్‌తో కలిసి మోదీ అక్టోబర్ 28న వడోదరలో టీఏఎస్ఎల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ సైనిక విమాన తయారీ కేంద్రం. మేక్ ఇన్ ఇండియా కింద తయారు చేసే తొలి సి–295 విమానం 2026 సెప్టెంబర్‌లో అందుబాటులోకి రానుంది. చివరి విమానం 2031 ఆగస్టు నాటికి అందుబాటులోకి వస్తుందని అంచనా. ఈ ప్రాజెక్ట్ దేశంలో విమాన రంగ అభివృద్ధికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇందులో దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న అనేక ఎంఎస్ఎంఈలు విమానాల విడిభాగాలను అందిస్తాయి. ఇప్పటికే 33 ఎంఎస్ఎంఈలను ఎయిర్‌బస్ గుర్తించింది. హైదరాబాద్‌లోని టీఏఎస్ఎల్ ప్రధాన కేంద్రంలో విమానాల విడిభాగాల తయారీ ప్రారంభమైంది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ అందించిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ (ఈడబ్ల్యూ) వ్యవస్థలను ఇప్పటికే విమానంలో అనుసంధానం చేశారు. అయితే, ఒప్పంద చర్చల తుది దశలో ఎక్కువ కాలం జాప్యం కావడంతో వీటిని అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది.



టాటా-ఎయిర్‌బస్ పరిశ్రమలో స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ - నరేంద్ర మోదీ

పెరిగే ఉపాధి కల్పన

తాజా ప్రయత్నం వైమానిక రంగంలో ఉపాధి కల్పనను పెంచుతుందని రక్షణ శాఖ చెబుతోంది. దేశంలో ఏరోస్పేస్, రక్షణ రంగంలో 42.5 లక్షలకు పైగా పనిగంటలతో ప్రత్యక్షంగా 600 అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలకు, 3,000కు పైగా పరోక్ష ఉద్యోగాలకు, అదనంగా 3,000 మధ్యతరహా నైపుణ్య ఉపాధి అవకాశాలకు వీలు కలుగుతుంది. ఇతర ఒరిజినల్ ఎక్విప్మెంట్ తయారీదారుల (ఓఈఎం) నుంచి ఎయిర్‌బస్ తెప్పించే ఏరో ఇంజిన్, ఏవియానిక్స్ మినహా అధిక శాతం నిర్మాణ భాగాలు భారత్‌లోనే తయారవుతాయి. ఒక విమానంలో ఉపయోగించే 14,000 విడి భాగాలలో 13,000 భాగాలు దేశంలోని ముడిసరుకుతోనే తయారవుతాయి. అయితే టీఏఎస్ఎల్ సకాలంలో 40 విమానాలను తయారు చేయడమే అసలైన పరీక్ష. ఇప్పటివరకు చాలా కార్యకలాపాలు ఎయిర్‌బస్ ద్వారా జరుగుతున్నాయి. టీఏఎస్ఎల్ కేవలం వాటిని అమలు చేస్తోంది. భారత వైమానిక రంగ సుస్థిర వృద్ధి కోసం స్థానిక ఉత్పత్తి, డీజీఏక్యూఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఏరోనాటికల్ క్వాలిటీ ఎష్యూరెన్స్) ద్వారా నాణ్యత నియంత్రణ, 'సెమిలాక్' ద్వారా భవిష్యత్తు ధ్రువీకరణ, దేశీయ తనిఖీ పరీక్షలు, మూల్యాంకనంపై దృష్టి సారించాలి.

రక్షణ రంగం అంచెలంచెలుగా ఎదగడానికి గత పదేళ్లలో భారత ప్రభుత్వం చేసిన కృషి దోహదపడింది. రూ. 43,726 కోట్ల నుంచి రూ. 1,27,265 కోట్లకు పెరిగిన రక్షణ ఉత్పత్తుల్లో 21 శాతం వాటా ప్రైవేటు రంగానిదే. పదేళ్ల క్రితం రూ.1,000 కోట్ల లోపు ఉన్న రక్షణ ఎగుమతులు గత ఏడాది రూ. 21,000 కోట్లకు పైగా పెరిగాయి. కొన్ని విధాన సంస్కరణలతో పాటు మూలధన పరికరాల కొనుగోలు కోసం డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్స్ – 2020లో స్వదేశీ డిజైన్, డెవలప్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఐడీడీఎం) కేటగిరీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ఈ గణాంకాలను సాధించడానికి దోహదపడింది.

కొత్తగా కేటాయించిన రక్షణ బడ్జెట్‌లో 75 శాతాన్ని దేశీయ పరిశ్రమల ద్వారా కొనుగోళ్లకు కేటాయించారు. జాయింట్ యాక్షన్ (శ్రీజన్) పోర్టల్ ద్వారా స్వయం సమృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం, సానుకూల స్వదేశీకరణ జాబితాలు (పీఐఎల్), ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడీఈఎక్స్) ఏర్పాటు, 2024 సెప్టెంబర్ నాటికి రూ. 50,083 కోట్ల పెట్టుబడి అంచనాతో ఉత్తరప్రదేశ్, తమిళనాడుల్లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు వంటి అనేక ఇతర చర్యలను ప్రభుత్వం తీసుకుంది. 2013 మేలో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసిన తరువాత ఎయిర్‌బస్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి రక్షణ మంత్రిత్వ శాఖకు ఆరేళ్ళు పట్టింది. డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడానికి, ఒప్పందం తదుపరి చర్చలకు ఇంకా చాలా చేయాల్సి ఉంది.

దేశంలో సి –295 సైనిక రవాణా విమానాల ఉమ్మడి తయారీలో ఎయిర్‌బస్ – టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) భాగస్వామ్యం ఇప్పటివరకు సవాళ్లను ఎదుర్కొంటున్న భారత వైమానిక రంగానికి ఆశ, ప్రేరణగా నిలుస్తోంది. అయితే సివిల్ సర్టిఫైడ్ వెర్షన్ కూడా అందుబాటులో ఉన్నందున ఈ ఎయిర్ క్రాఫ్ట్ వెర్షన్లను టీఏఎస్ఎల్ విస్తరిస్తుందో లేదో చూడాలి. ఈ భాగస్వామ్యం పూర్తి ప్రయోజనాలను పొందడానికి దేశంలో ఉత్పత్తి, భవిష్యత్తు ఎగుమతులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆత్మనిర్భరత సాధన దిశగా భవిష్యత్ ప్రయాణం క్లిష్టంగా అనిపించినప్పటికీ, ఎయిర్‌బస్, టీఏఎస్ఎల్ మధ్య ఈ భాగస్వామ్యం ద్వారా అడుగులు ముందుకు పడ్డాయి. టీఏఎస్ఎల్ నిర్ణీత సమయానికి 40 విమానాలను తయారు చేయడం ద్వారా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంది. అయితే ఈ తరహా భాగస్వామ్యాల విషయంలో ప్రభుత్వ రంగం ఐఏఎఫ్ అంచనాలను అందుకోలేదన్నది గత అనుభవాలు చెబుతున్న పాఠం. మరి ఈ ఒప్పందం సఫలమైతే దేశంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం మరింత ప్రబలమవుతుంది. వాటి సహకారం లేకుండా 2047 నాటికి 'వికసిత్ భారత్' కల నెరవేరదు.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడదే గొప్పా?



దేశంలోని గొప్ప మెదళ్లు– జనాల డబ్బుల్ని ఎలా దోచుకోవాలా, ద్వేషాన్ని రెచ్చగొట్టి ఎలా అధికారం పొందాలా, అధికారంలో ఉన్నవాళ్లకు బాకా ఊది ఎలా ప్రతిఫలం పొందాలా, సంస్థల సమగ్రతను పణంగా పెట్టి ఎలా ముందుకెళ్లాలా అనే దిశలో పనిచేస్తున్నాయి.

– టోనీ జోసెఫ్, రచయిత

మనవే టాప్



2023- 2028 వరకు ప్రపంచ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్న టాప్–2 దేశాలు చైనా, ఇండియా. (ఐఎంఎఫ్ అంచనా ప్రకారం, ఈ కాలానికి చైనా 22.6 శాతం, ఇండియా 12.9 శాతం, యూఎస్ 11.3 శాతం తోడ్పడుతాయి.)

– షు ఫెయిహాంగ్, ఇండియాలో చైనా రాయబారి


కృతజ్ఞత



ఢిల్లీ, ఇంకా ఇతర చోట్ల వేలాది మంది సిక్కులను చంపిన 1984 నాటి సిక్కుల వ్యతిరేక దాడులకు నలభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా– మనల్నీ, మన ఆస్తులనూ కాపాడటానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన వేలాది మందికి, అత్యధికులు హిందువులు, మన కృతజ్ఞత చెప్పుకొందాం. ఇంత కాలం నరమేధం గురించే ఎక్కువగా మాట్లాడాం. కృతజ్ఞత కూడా బాకీ ఉందని నేను అనుకుంటున్నా.

– అమర్ జీత్ సింగ్, మాజీ దౌత్యవేత్త

సంపూర్ణ శ్రేయస్సు



ఆయుర్వేద అనేది వైద్యం, సహజ స్వస్థతలతో కూడిన యోగ విధానం. ఆయుర్వేదంలో శ్రేయస్సు అంటే – శరీరం, ఇంద్రియాలు, ప్రాణం, మనసు, నశ్వరమైన ఆత్మ– అన్నీ సమ రేఖలోకి రావడం. అందుకే ఆయుర్ (ప్రాణం), విశ్వశక్తి, పరమాత్మల సంబంధాన్ని గుర్తుంచుకుందాం. (అక్టోబర్ 29న ఆయుర్వేద దినోత్సవం)

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యులు

అటు వైపేనా?




ఈ గమనింపు ఎంత వినోదాత్మకం అంటే – ఇండియాలోని రష్యా ప్రభుత్వ మీడియా, ముఖ్యంగా స్పుత్నిక్, పూర్తిగా ఇండియా అనుకూల కథనాలు ఇస్తుంది; అదే వీబో(చైనా ట్విట్టర్ లాంటిది)లో చైనా అనుకూల కథనాలు ఇస్తుంది.

– సనా హాష్మీ, ఫెలో

ఇన్‌బాక్స్

వెలుగు ప్రదాత

ఆడపిల్లలకు చదువెందుకని ప్రశ్నించే రోజుల్లో పట్టుబట్టి బాలికలకు చదువు చెప్పడానికి విద్యాలయాలు స్థాపించిన మిషనరీ జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ (1793–1873). ముఖ్యంగా తెలుగునేలపై వెలుగు నింపిన మానవతామూర్తి ఆయన. జర్మనీలోని హెల్మ్‌స్టడ్ ప్రాంతంలో 1793 జూలై 10న జన్మించిన ఈయన అమెరికా వెళ్లి ఫిలడెల్ఫియాలో వేదాంత శాస్త్రం, యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్‌లో స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుండి వైద్య విద్యలో ఎండీ పట్టా పొందాడు. మెడిసిన్ చదివే రోజుల్లోనే సంస్కృతం నేర్చుకున్నాడు. మిషనరీగా అభిషేకం పొంది దాదాపు 300 పైగా సండే స్కూల్స్ నెలకొల్పాడు. హయ్యర్ చురుకుదనాన్ని గమనించిన మెకానిక్స్ బర్గ్‌కు చెందిన 'ది సెంట్రల్ మిషనరీ సొసైటీ' వారు భారతదేశానికి మిషనరీగా ఆయన్ని ఎంపిక చేశారు. ఆ విధంగా హయ్యర్ 1842 జూలై 31న గుంటూరు వచ్చాడు. వచ్చిన వెంటనే తెలుగు నేర్చుకుని తొలి పాఠశాలను 1842 నవంబరులో ప్రారంభించాడు. అదీ కేవలం బాలికలకు మాత్రమే. నెల గడిచేసరికి ఎనిమిది మంది ముస్లిం బాలికలకు పాఠశాల ప్రవేశం కల్పించాడు. అనంతరం అన్ని వర్గాల వారికి ఏడు పాఠశాలలు నెలకొల్పి బాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. 1844 నాటికి మరో ఎనిమిది పాఠశాలలు ప్రారంభించారు.



జాన్ ఫ్రెడ్రిక్ హయ్యర్

ఆ కాలంలో ప్రసూతి సమయంలో సరైన వైద్యం లభించక తల్లీ–పిల్లలు మరణించేవాళ్లే ఎక్కువ. అందుకే గుంటూరు కొత్తపేటలో 1843లో ఉచిత వైద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటుచేశాడు. 1845 నాటికి రాజమండ్రి, భీమవరంలో పాఠశాలలను నెలకొల్పాడు. ఆ పరిసర ప్రాంతాల్లోనే వైద్యశాలలు ప్రారంభించాడు. హయ్యర్ ఒక ఆదర్శమూర్తిగా దర్శనమిస్తాడు. జీవిత భాగస్వామి ఎంపికలో ఇద్దరు పిల్లలున్న మేరీగాష్ అనే వితంతువును వివాహం చేసుకుని కొత్త జీవితం కల్పించాడు. తెలుగు భాషలో మంచి ప్రావీణ్యం సంపాదించి తెలుగులోనూ కీర్తనలు రాశాడని అంటారు. తెలుగు వారికి సేవచేసి విద్య, వైద్యంతో ప్రజల గుండెల్లో నిలిచిన హయ్యర్ 1873లో 80 ఏళ్ల వయసులో పెన్సిల్వేనియాలో మరణించాడు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, తెనాలి
(రేపు లూథరన్ సంస్థలో సువార్త దినం)

ఆ రోజు ఏం జరిగిందంటే...

సందర్భం



జిల్లా గోవర్ధన్

కొన్ని నిర్ణయాలు చరిత్ర గతినే మారుస్తాయి. స్వర్ణ దేవాలయంపై 'ఆపరేషన్ బ్లూస్టార్' పేర సైనిక చర్య జరపాలనే నిర్ణయం ఇందుకొక నిదర్శనం. 1984 జూన్‌లో పంజాబ్ స్వర్ణ దేవాలయంలో మకాం చేసుకున్న సిక్కు తీవ్రవాదులను బయటికి రప్పించడానికి మరో మార్గం లేక ప్రధాని ఇందిరాగాంధీ (67) భారత సైన్యాన్ని పంపాల్సి వచ్చింది. దీనికి దేశం పెద్ద మూల్యమే చెల్లించుకుంది. ఊహించని ఆ చర్యతో సిక్కు తీవ్రవాదం ఓ విధంగా సద్దుమణిగింది. కానీ, ఆ తర్వాత ఐరన్ లేడీగా పేరొందిన ఇందిరాజీ, జవసత్వాలు ఉడిగిన అబలగా ప్రవర్తించారని అంటారు. ప్రభుత్వ కార్యభారాలు చాల వరకు తగ్గించుకుని ఆమె, ప్రధాని నివాసం... 1, సఫ్దర్ జంగ్ రోడ్డుకే పరిమితం అయ్యారు. రాత్రి పూట ఆమెకు ఏవో పీడ కలలు కూడా వచ్చేవట. తన కుటుంబ సభ్యులను ఏవో శక్తులు కిడ్నాప్ చేస్తాయని తెలీని ఆందోళన ఆమెలో ఆవహించ సాగింది. వీలు దొరికితే సామాన్య మహిళలా, రాత్రి కొడుకు, కోడలు, మనవడు (రాహుల్), మనవరాలు (ప్రియాంక)తో కలిసి డిన్నర్ చేయటానికి ఉవ్విళ్ళూరేవారట. 12 ఏళ్ల ప్రియాంకతో, పెద్దయాక, తను వాడే పట్టుచీరలు ధరించి రాయబరేలి, ఆమేథి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని, నవ్వుతూ అనేదట (వింత కోరికలు!).

'ఆపరేషన్ బ్లూ స్టార్'కు నిరసనగా సిక్కు సమాజం కాంగ్రెస్ పార్టీకి, ఇందిరా ప్రభుత్వానికి దూరమయింది. ఇందిరా భక్తుడు, ప్రముఖ పాత్రికేయుడు ఖుష్వంత్ సింగ్ రాజ్యసభ సీటుకు రాజీనామా చేసి ప్రభుత్వం ఇచ్చిన పద్మ భూషణ్ అవార్డును వాపస్ చేశారు. అప్పటి పరిస్థితుల దరిమిలా ఇంటెలిజెన్స్, దర్యాప్తు సంస్థలు ప్రధానిని కొంతకాలం సిక్కు యువతకు దూరంగా ఉండాలని తేల్చాయి. సెక్యులర్ దేశానికి ప్రధానిగా ఉండి అలా చేయడం బావోదని, తన నివాసంలో ఉన్న ఇద్దరు సిక్కు సెక్యూరిటీ యువకులను మార్చనీయలేదు ఇందిర. 22 ఏళ్ల సెక్యూరిటీ కానిస్టేబుల్ సత్వంత్ సింగ్‌ను చూపిస్తూ ఒకసారి... 'ఈ బహదూర్ నౌ జవాన్ పర్యవేక్షణలో నాకు ఏ ప్రాణహాని లేదని' కూడా ధీమా వ్యక్తం చేశారు. ఆశ్చర్యం! వారంలోపే అదే యువకుని తుపాకి తూటాలకు ఆమె బలైపోయారు.

1984 అక్టోబర్ 31 బుధవారం ప్రొద్దుట రాహుల్, ప్రియాంకలను స్కూలుకెళ్ళే ముందు నానమ్మ ఇందిర, దగ్గరకి తీసుకుని గట్టిగా వాటేసుకుంది. ఏదో ఉద్వేగ పూరిత అనుభూతి ఆమెతో అలా చేయించింది. ఆ తర్వాత 9 గంటలకు, ముదురు ఆవరంగు కాటన్ శారీలో వడి వడిగా అడుగులేస్తూ, ప్రక్కనే ఉన్న 1, అక్బరు రోడ్డులోని పార్టీ ఆఫీసు వైపు నడుస్తున్నారామె. ఆమె వెంట పర్సనల్ స్టాఫ్ నారాయణ్ సింగ్ ఆమెకు ఎండ తగులకుండా గొడుగు పడుతూ పోతున్నాడు. అతని వెనకాలే 'మేడం మేన్ ఫ్రైడే'గా పేరొందిన పీఏ... ఆర్కే ధావన్ కూడా నడుస్తున్నాడు. బ్రిటన్ యాక్టర్ పీటర్ ఉస్తినోవ్, ఐరిష్ టీవీ యూనిట్‌తో ప్రధానిని ఇంటర్వ్యూ షూటింగ్ కోసం అక్కడ ఎదిరి చూస్తూ, రిస్ట్ వాచి చూసుకున్నాడు. సరిగ్గా 9.10 గంటలు. మేడం పది నిమిషాలు లేటు, ఎందుకో అని అనుకుంటుండగానే, అటు వైపు గన్ ఫైరింగ్ సౌండ్! ప్రధాని సెక్యూరిటీ స్టాఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బియాంత్ సింగ్... వెళ్తున్న ప్రధానికి ఎదురెళ్లి శాల్యూట్ చేస్తూనే, సర్వీస్ రివాల్వర్ తీసి ఆమెను షూట్ చేశాడు. ఈ హఠాత్ పరిణామానికి జడుసుకుని నారాయణ్ సింగ్ గొడుగును గాలిలో వదలి 'బచావ్' అంటూ కేక లేశాడు. అంతలోనే, అటు సత్వంత్ సింగ్ స్టెర్లింగ్ సబ్ మెషిన్ గన్ నుండి 30 బుల్లెట్లు మేడం శరీరంలో కెళ్ళాయి. క్షణాల్లో రక్త ప్రవాహంతో నేల కొరిగింది ఇందిర. గత కొద్ది రోజులుగా పొంచి ఉన్న మృత్యువు హుటాహుటిన ఆమెను అలా తీసుకెళ్ళింది.



మాజీ ప్రధాని ఇందిరా గాంధీ

రక్తం చుక్కల డైలాగ్...

క్రితం రోజే (అక్టోబరు 30) సాయంత్రం, భువనేశ్వర్ (ఒరిస్సా) అసెంబ్లీ ఆవరణలో జరిగిన బహిరంగ సమావేశంలో ఇందిరాజీ ప్రసంగిస్తూ, '... మై ఆజ్ యహాఁ హూ. కల్ శాయద్ యహాఁ న రహూ. ముఝే చింతా నహీ. జబ్ మై మరూంగీ‌తో, మేరీ ఖూన్ కా ఏక్ ఏక్ బూంద్ భారత్ కో మజ్బూత్ కర్నేమే లగేగా' (ఇవ్వాళ నేను ఇక్కడ ఉన్నాను. బహుశా రేపు ఇక్కడ లేకపోవచ్చు. నాకు బెంగ లేదు. నేను ఒకవేళ చనిపోతే, నా ప్రతీ రక్తం చుక్క దేశ పటిష్ఠతకు తోడ్పడుతుంది) అని అన్నారు. ఆవేశపూరితమైన ఈ రక్తం చుక్కల డైలాగు, ఆమెతో మృత్యు దేవతే పలికించిందని అప్పటి కాంగ్రెస్ నాయకులు చెప్పుకోసాగారు. ఇందిర హత్యానంతరం రాజధాని ఢిల్లీలో చెలరేగిన మత ఘర్షణల్లో 3 వేల మంది సిక్కులు చనిపోయారని ఖుష్వంత్ సింగ్ ఒక వ్యాసంలో పేర్కొన్నారు.

(రషీద్ కిద్వాయి రాసిన '24, అక్బర్ రోడ్' ఆధారం)

వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై

(రేపు ఇందిరా గాంధీ హత్యకు గురైన రోజు)

దివ్య దీపావళి

'చీకటి వెలుగుల రంగేళీ... మన జీవితమే ఒక దీపావళి' అన్నాడు మనసు కవి ఆత్రేయ. దీపావళి అంటేనే వెలుగు పండగ. చీకటిని పారదోలుతూ, చెడు మీద గెలిచిన మంచికి గుర్తు! చీకటి అజ్ఞానానికీ, నిరాశకూ ప్రతీక. కాంతి ఆనందానికి సూచిక. దీపం ఐశ్వర్యం. అంధకారం దారిద్ర్యం. అజ్ఞానమనే చీకటి నుంచి విజ్ఞానమనే వెలుగులోకి పయనింపజేయడమే దీపావళి పండుగ ఉద్దేశం. దీపం ఉన్న చోట జ్ఞాన సంపద ఉన్నదనీ, దీపం సాక్షాత్తు లక్ష్మీదేవి అనీ మన శాస్త్రాలు చెబుతున్నాయి. దీపం జ్ఞానానికీ, త్రిమూర్తులకూ ప్రతీక. అందుకే సనాతన ధర్మంలో ప్రతీ శుభ కార్యంలో దీపాన్ని వెలిగిస్తారు. చెడు అంటే అది రాక్షసుల రూపంలోనే ఉండాలని లేదు. నిరాశా నిస్పృహలు, వ్యాకుల పడటం, నిరుత్సాహ పడటం మనం చూడని రాక్షసుల కంటే మన జీవితానికి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. దీపావళి పండుగ మన జీవితంలోని అన్ని ప్రతికూల విషయాలనూ సంహరించాలనే విషయాన్ని గుర్తుచేస్తుంది.



దీపావళి ముఖ్య ఉద్దేశం, మీ జీవితంలో ఆ పండుగ వాతావరణం, వెలుగు జిలుగులు తీసుకురావటమే. అందుకే ఈ టపాసులు కూడా, మనలో కూడా కొంచం ఉత్తేజాన్ని కలిగించటానికే! ఈ ఒక్కరోజు ఆనందించి ఇక దాని గురించి మర్చిపోవటం దాని ఉద్దేశం కాదు. మనం ఒక తడిచిన తారాజువ్వ అయితే మీకు రోజూ బయట నుంచి నిప్పు కావాలి. లేకపోతే ఇలా మీలో ప్రతీ రోజూ జరగాలి: మనం అలా కూర్చుంటే మన ప్రాణ శక్తి, గుండె, మనస్సు, శరీరం ఒక తారాజువ్వలా ఎగిసి పడాలి. కేవలం ఈ ఒక్కరోజే కాదు జీవితాంతం మన మనసు, ఇల్లు సుఖ సంతోషాలతో ఓ పండుగలా వెలుగుతూ ఉండాలన్నదే దీపావళి పండుగ ముఖ్య ఉద్దేశం. దీపం నుంచి వచ్చే వెలుగు బాహ్యమైనదే కాదు అంతర్గతమైనది కూడా! అంటే మన మనస్సు కూడా ఎలాంటి కల్మషం లేకుండా, మనలోని దుర్గుణాలు పోగొట్టుకుని, సుగుణాలు వెల్లివిరిసేలా వెలిగించుకోవాలనే వాస్తవాన్ని గుర్తు చేసేదే ఈ దీపాల పండుగ.

జీవితం కష్టసుఖాల కలబోత. చీకటి వెలుగుల విరిపూత. కష్టాల్లోనూ సుఖాన్ని కలగనడం ఆశాజీవుల లక్షణం. ఇదే చిమ్మచీకట్లను వెలిగించే దివ్య దీపావళి చెబుతున్న సందేశం!

– ముద్దం నరసింహ స్వామి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.12.39 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** హస్త రా.10.04 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.23 నుండి 12.11, వరకు, **అమృత ఘడియలు:** ప.3.21 నుండి 5.08 వరకు, మాసశివరాత్రి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 5.27.

అత్యుత్తమ ధాన్యం సేకరణ పాలసీ తెచ్చాం

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి
- బ్యాంకు గ్యారంటీతో మిల్లర్లలో జవాబుదారీతనం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ కోసం అత్యుత్తమ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు పండించే సన్న ధాన్యానికి కనీస మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని కూడా నిర్ణయించిన నేపథ్యంలో కొత్త విధానంలో అనేక మార్పులు చేసినట్లు 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్రంలో ఖరీఫ్‌లో పండిన ధాన్యంలో 86 లక్షల మెట్రిక్ టన్నులు ఈసారి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించి తదనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయింపులు జరుపనున్నట్లు తెలిపారు. అలాగే మిల్లులకు కేటాయించే ధాన్యానికి అనుగుణంగా బ్యాంకు గ్యారంటీలను తీసుకోనున్నట్లు వెల్లడించారు. సీఎంఆర్ ఎగవేసిన డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు ఉండవని, మిగతా మిల్లులకు వాటి గత చరిత్ర ఆధారంగా 10 నుంచి 25% వరకు బ్యాంకు గ్యారంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు తీసుకోనున్నామని తద్వారా మిల్లర్లకు జవాబుదారీతనం ఉంటుందని స్పష్టం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మిల్లర్లకు కేటాయించినప్పుడు సకాలంలో మిల్లింగ్ చేయాల్సిందేనని, లేదంటే పౌరసరఫరాల సంస్థ నష్టపోతుందని తెలిపారు. అందుకే బ్యాంకు గ్యారంటీలను తప్పనిసరి చేసినట్లు వివరించారు. జిల్లా కలెక్టర్లతో మంగళవారం జరిపిన సమావేశంలో కూడా ధాన్యం సేకరణకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

బ్యాంకు గ్యారంటీతోనే మిల్లర్లకు ధాన్యం కేటాయింపు

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పాలసీ ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం.. డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వకూడదని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఈ ఖరీఫ్ సీజన్‌లో మిల్లర్లకు కేటాయించే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవలి కాలంలో ధాన్యం దిగుబడి పెరగడం, మిల్లులకు కెపాసిటీకి మించి ధాన్యాన్ని ఇవ్వడంతో సీఎంఆర్ విషయంలో గోల్‌మాల్ జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో సీఎంఆర్ ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ లింకు పెడుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బ్యాంక్ గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేసిన మిల్లర్లకే ధాన్యం ఇవ్వనున్నారు. మిల్లర్ల గత చరిత్రను బట్టి బ్యాంకు గ్యారంటీలు, సెక్యూరిటీ డిపాజిట్‌లలో హెచ్చు తగ్గులను కల్పించింది. ఈ మేరకు వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల విధానాన్ని మంగళవారం విడుదల చేసింది. ఈ పాలసీలో ధాన్యం కొనుగోళ్లు, సన్న ధాన్యం ఔటర్న్, మిల్లులకు ధాన్యం కేటాయింపు, మిల్లింగ్ చార్జీలు, సీఎంఆర్ అంశాలపై కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది.



10 శాతం బ్యాంక్ గ్యారంటీతో మొదలు

గతంలో సీఎంఆర్ ఇవ్వకుండా ఎగ్గొట్టిన డిఫాల్ట్ మిల్లర్లకు ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపులు ఉండవు. మిగిలిన మిల్లర్లను మూడు కేటగిరీలుగా విభజించి సీఎంఆర్ విషయంలో గత చరిత్ర ఆధారంగా బ్యాంకు గ్యారంటీలను నిర్ణయించింది.

- గడువులోగా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యం విలువకు 10 శాతం బ్యాంక్ గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.
- గతంలో సీఎంఆర్ పెండింగ్‌లో ఉండి, అపరాధ రుసుముతో బకాయి సీఎంఆర్ అప్పగించిన మిల్లర్లు 20 శాతం బ్యాంక్ గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలి.
- ఇక పెండింగ్ సీఎంఆర్‌ను వంద శాతం అప్పగించినప్పటికీ, 25 శాతం పెనాల్టీ చెల్లించని మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ ధాన్యానికి 25 శాతం బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి. కేటాయించే ధాన్యానికి అదనంగా 25 శాతం బ్యాంక్ గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ ఇవ్వాల్సి ఉంటుంది.

గడువులోగా సీఎంఆర్ ఇస్తేనే చార్జీల పెంపు వర్తిస్తుంది

మిల్లింగ్ చార్జీలు పెంచాలనే మిల్లర్ల డిమాండ్ పట్ల సానుకూలంగా వ్యవహరించిన ప్రభుత్వం దానికి కూడా షరతులు పెట్టింది. ప్రస్తుతం సన్న, దొడ్డు రకాల బియ్యానికి క్వింటాల్‌కు రూ. 10 మిల్లింగ్ చార్జీ కింద ఇస్తుండగా, ఇక నుంచి దొడ్డు రకానికి రూ. 30, సన్న రకానికి రూ. 40కి పెంచింది. అయితే ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ఇచ్చిన గడువులోగా సీఎంఆర్ అప్పగించిన మిల్లులకు మాత్రమే పెంచిన మిల్లింగ్ చార్జీలు వర్తిస్తాయని, గడువు తర్వాత ఇచ్చిన బియ్యానికి వర్తించబోవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సన్నధాన్యం పంచాయితీ తేల్చేది ఏఈఓలే

- సన్న ధాన్యం గుర్తింపు, కొనుగోలులో ఎదురయ్యే సమస్యల పరిష్కార బాధ్యతలను అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఏఈవో)లకు అప్పగించింది. సన్న ధాన్యంపై ఏమైనా అభ్యంతరాలుంటే మిల్లర్లు ఆన్‌లైన్ ద్వారా 48 గంటల్లో ఫిర్యాదు చేయాలని పేర్కొంది. ఆ తర్వాత 24 గంటల్లో ఏఈవోలు వారి సమస్యను పరిష్కరిస్తారని సూచించింది. సన్నధాన్యం విషయంలో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి మిల్లుకు ఒక ఏఈవోను కేటాయించింది. ఒకవేళ ఏఈవో నిర్ణయంపై మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తే జిల్లా స్థాయిలో రెండు కమిటీలను ఏర్పాటు చేసింది. అందులో ఒకటి రెవెన్యూ డివిజనల్ కమిటీ కాగా రెండోది డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ. రెవెన్యూ డివిజనల్ కమిటీలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, డిప్యూటీ తహసీల్దార్‌లు ఉంటారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉంటారు. ఈ రెండు కమిటీలు సమస్యను పరిష్కరిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

'కొత్త పాలసీతో మిల్లర్లకు తీవ్ర నష్టం'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ధాన్యం సేకరణ పాలసీ వల్ల మిల్లర్లు తీవ్రంగా నష్టపోతారని, ప్రభుత్వ ఉత్తర్వులను సవరించాలని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు క్వింటాల్ సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కిలోల బియ్యం ఔటర్న్ రాదని, కేవలం 58 నుంచి 59 కిలోలే వస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి పేర్కొన్నారు. దీనిని సవరించాలని ప్రభుత్వాన్ని కోరినా, కొత్త నిబంధనల్లో ఆ మార్పు చేయలేదన్నారు. తాజాగా రా రైస్ మిల్లులన్నింటినీ అప్‌డేట్ చేసి, ఫైన్ క్వాలిటీ బియ్యం ఇస్తున్నామని, తద్వారా కరెంట్ చార్జీలు భారీగా పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి ధాన్యం సేకరణ విధానంలో మార్పులు చేయాలన్నారు.

తరుగు తీసినా.. తేడా వచ్చినా సహించం

పత్తి రైతులకు అన్యాయం జరగనివ్వం : మంత్రి పొంగులేటి



తిరుమలాయపాలెం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని.. ఎక్కడైనా రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలులో చెరువు ఆధునికీకరణ పనులను మంగళవారం ప్రారంభించారు. అనంతరం గోల్‌తండా పరిధిలోని భాగ్య లక్ష్మి కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి రైతులు నష్టపోయారని, దిగుబడి గణనీయంగా తగ్గిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతు లకు మద్దతు ధర దక్కేలా సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. రైతులు 12 శాతం తేమ ఉండేలా పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ మిల్లర్లు తేమ పేరుతో అధికంగా తరుగు తీస్తున్నారని, ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వ్యాపారులకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మంత్రి మార్కెటింగ్ అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, తరుగు తీసినా, వేబ్రిడ్జి కాంటాలో తేడా వచ్చినా మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మిల్లు యజమాని వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా 'మధ్యలో నువ్వెవరు'అంటూ మంత్రి మండిపడ్డారు. కాగా, రుణమాఫీపై ప్రతిపక్షాలవి కారుకూతలని, చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ.18వేల కోట్ల రుణమాఫీ చేయగా, మిగిలిన రూ.13వేల కోట్లే కాక అవసరమైతే మరో రూ.200 కోట్లయినా కేటాయించి డిసెంబర్‌లోపు మాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన పేదలందరికీ దీపావళి తర్వాత ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'ఈ-కార్ రేస్' గోల్‌మాల్‌పై విచారణ జరపాలి

ఏసీబీకి మున్సిపల్‌శాఖ అధికారుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్‌రేస్ నిర్వహణకు సంబంధించిన నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ జరపాలని మున్సిపల్‌శాఖ అధికారులు ఏసీబీని కోరినట్టు తెలిసింది. దీనిపై విచారణ చేసేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసినట్టు సమాచారం. దీంతో తెలంగాణలో మరో కుంభకోణం తెరపైకి వచ్చినట్లయింది. ఈ రేస్ నిర్వహణకు సంబంధించి నిధుల బదిలీపై ఏసీబీకి ఫిర్యాదు అందినట్టు తెలిసింది. బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రేస్ నిర్వహిస్తున్న విదేశీ ప్రైవేటు సంస్థ ఎఫ్ఈఓకు ఎంఏయూడీ నుంచి రూ.55 చెల్లింపులు జరిగాయి. కాగా, గతేడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ చుట్టూ దీన్ని ఏర్పాటు చేశారు. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ-రేసింగ్ సీజన్-10 రద్దు అయిన విషయం తెలిసిందే.

విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్ల సజీవ దహనం

పెద్దపల్లి జిల్లాలో ఘటన



పోచమ్మ(ఫైల్)




కొమురమ్మ(ఫైల్)

రామగిరి(మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్లు కల్వల పోచమ్మ, గడ్డం కొమురమ్మ సజీవ దహన మయ్యారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌లో నివాసం ఉంటున్న కూతురు గడ్డం కొమురమ్మను చూసేందుకని ఇదే జిల్లాలోని కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామ పరిధి ముల్కలపల్లి గ్రామంలో ఉంటున్న కల్వల పోచమ్మ సోమవారం సాయంత్రం వచ్చింది. కొమురమ్మ భర్త గడ్డం కనుకయ్య కల్వచర్లలోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్నాడు. ఆమె కుమారుడు గడ్డం సాయి కోళ్లవ్యాన్‌పై పనికి వెళ్లాడు. అయితే, కనుకయ్య సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా...ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయి కనిపించాయి. మంచంపై తన భార్య కొమురమ్మ, అత్త పోచమ్మ మంటల్లో కాలిపోయి నిర్జీవంగా కనిపించారు. ఇంట్లో పెంపుడు కుక్క, కోడి కూడా మృతి చెందాయి. దీంతో ఆందోళనకు గురైన కనుకయ్య వెంటనే ఇరుగుపొరుగువారిని పిలవగా వారు గోదావరిఖని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు క్లూస్ టీంతో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగి తల్లీకూతుళ్లు మృతి చెంది ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కుమారుడు కల్వల శంకర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మూడోసారి 'యాదాద్రి' అంచనాలు పెంపు?

- థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ. 36,131 కోట్లకు పెంచాలని కోరిన జెన్‌కో
- రూ. 25,099 కోట్లతో 2015లో మొదలైన యాదాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణం
- ఆ తర్వాత రూ. 29,965 కోట్లకు, మళ్లీ రూ. 34,543 కోట్లకు పెరిగిన అంచనాలు..
- మూడేళ్ల జాప్యంతో భారీగా పెరిగిన పెట్టుబడి రుణాలపై వడ్డీల భారం



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా దామరచర్లలో తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం (వైటీపీఎస్) అంచనా వ్యయం మరింతగా పెరగనుంది. రూ. 25,099 కోట్ల అంచనా వ్యయంతో 2015-16లో వైటీపీఎస్ నిర్మాణాన్ని మొదలుపెట్టిన గత, ఆ తర్వాత కాలంలో అంచనా వ్యయాన్ని రూ. 29,965 కోట్లకు, అనంతరం రూ. 34,543 కోట్లకు సవరించింది. తాజాగా మూడోసారి రూ. 36,131 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచేందుకు అనుమతి కోరుతూ జెన్‌కో పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ప్రభుత్వం అనుమతిస్తే వాస్తవ అంచనా వ్యయంతో పోలిస్తే మూడోసారి సవరించే అంచనా వ్యయం రూ. 11,032 కోట్లు అంటే 43.95 శాతం అధికం కానుంది. సగటున ఒక్కో మెగావాట్‌కు రూ. 6.27 కోట్ల అంచనాతో వైటీపీఎస్ నిర్మాణాన్ని ప్రారంభించగా తాజాగా అది రూ. 9.03 కోట్లకు పెరగనుంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే పొగలో సల్ఫర్ డయాక్సైడ్ లాంటి విషవాయువుల నియంత్రణకు అదనపు పనులు చేపట్టాలని కేంద్రం నిర్దేశించడంతో వైటీపీఎస్ నిర్మాణ వ్యయాన్ని తొలిసారిగా సవరించారని అధికార వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో పెట్టుబడి రుణాలపై వడ్డీల భారం పెరిగి మరో రెండుసార్లు అంచనాలను సవరించాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. కొత్త గడువుల ప్రకారం అక్టోబర్‌లో తొలి రెండు యూనిట్ల నిర్మాణాన్ని పూర్తి చేసి మొత్తం 1,600 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభించాల్సి ఉండగా 800 మెగావాట్ల తొలి యూనిట్ పనులు 92 శాతం, మరో 800 మెగావాట్ల రెండో యూనిట్ పనులు 93 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రూ.28,363 కోట్ల వ్యయంతో పనులు పూర్తయ్యాయి.

పీఎఫ్‌సీ నుంచి రూ.7037 కోట్ల అదనపు రుణాలు..

వైటీపీఎస్ అంచనా వ్యయం భారీగా పెరగడంతో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి మరో రూ.7037 కోట్ల అదనపు రుణం పొందడానికి జెన్‌కో చేసిన ప్రతిపాదనలను ఈ నెల 26న జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశం ఆమోదించింది.

వైటీపీఎస్ విద్యుత్ భారమే!

ప్రస్తుతం సగటున యూనిట్‌కు రూ. 4.92 వ్యయంతో విద్యుత్ కొనుగోలు చేస్తుండగా యాదాద్రి విద్యుత్ ధర యూనిట్‌కు సుమారు రూ. 8.50 వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 30 ఏళ్ల జీవితకాలంగల యాదాద్రి విద్యుత్ కేంద్రం సరఫరా చేసే విద్యుత్ వల్ల భవిష్యత్తులో ధరలు మరింతగా పెరగొచ్చని.. అంతిమంగా ఇది భారీగా విద్యుత్ చార్జీల పెంపునకు దారితీయొచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



ట్రంప్ పుట్టిని ప్యూర్టోరీకో

ముంచుతుందా?

ప్యూర్టోరీకోను సముద్రంలో కదిలే చెత్తకుప్పలా అభివర్ణించిన స్టాండప్ కమేడియన్ టోనీ

ట్రంప్ ప్రచారవేదికగా లాటిన్ అమెరికన్లపై విద్వేష వ్యాఖ్యలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

పెన్సిల్వేనియా వంటి రాష్ట్రాల్లో ఫలితాలు మారే చాన్స్ !?

విశాలమైన రహదారిపై ప్రయాణం సాఫీగా సాగుతున్న వేళ జరిగే ఓ చిన్న పొరపాటు పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చిట్టచివరి భారీ బహిరంగ సభ అనూహ్యంగా పెద్ద వివాదానికి, జాత్యహంకార వ్యాఖ్యలు వేదికగా మారింది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన ప్రచార కార్యక్రమం చివరకు లాటిన్ అమెరికన్లు, యూదులు, ఆఫ్రో అమెరికన్లపై జాత్యహంకార వ్యాఖ్యలతో వివాదాస్పదంగా ముగిసింది. దీంతో రిపబ్లికన్ పార్టీ పట్ల ఆయా వర్గాల ఓటర్లలో ఆగ్రహం కట్టలు తెంచుకుందని కథనాలు వెలువడుతున్నాయి. వివాదం చిలికిచిలికి గాలివానగా వ్యతిరేక ఓట్ల దుమారంగా మారితే ట్రంప్ విజయావకాశాలు సన్నగిల్లే ప్రమాదముంది. కరేబియన్ దీవుల్లో ఒకటైన ప్యూర్టోరీకో అమెరికా అధీనంలో ఉంది. ఇక్కడి ద్వీపవాసులకు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటువేయకపోయినా పెద్దసంఖ్యలో ప్యూర్టోరికో వారసులు అమెరికాలోని 50 రాష్ట్రాల్లో ఓటర్లుగా నివసిస్తున్నారు. తమ ద్వీపాన్ని అవహేళన చేయడంతో వాళ్లంతా ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటేసే అవకాశముంది.

అసలేం జరిగింది?

ఆదివారం జరిగిన ఈ సభలో ట్రంప్, భార్య మెలానియా ప్రసంగించారు. వీరితోపాటు ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ సైతం పాల్గొన్నారు. కార్యక్రమానికి ఊపు తెచ్చేందుకు ప్రచారానికి మరింత పాపులారిటీ వచ్చేందుకు స్టాండప్ కమేడియన్ టోనీ హించ్‌క్లిఫ్‌తో మాట్లాడించారు. నవ్వించాల్సిన ఆయన పలు వర్గాల ఓటర్లలో ఆగ్రహజ్వాలలు రగిల్చారు. ''సముద్రం మధ్యలో కదిలే చెత్త కుప్ప ఒకటుంది. అదేంటో తెలుసా?. అదే ప్యూర్టోరీకో'' అని హించ్‌క్లిఫ్ చేసిన వ్యాఖ్యలతో అమెరికాలోని ప్యూర్టోరికన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. లక్షలాది మంది ప్యూర్టోరీకన్లకు అమెరికా పౌరసత్వం ఉంది. దశాబ్దాలుగా పోలింగ్‌లో క్రియాశీలకంగా ఉన్నారు. 2022 గణాంకాల ప్రకారం ప్యూర్టోరికో మూలాలున్న అమెరికా ఓటర్లు ఏకంగా 60 లక్షల మంది ఉన్నారని తెలుస్తోంది. 1898లో స్పానిష్-అమెరికా యుద్ధం తర్వాత స్పెయిన్ వలస సరాజ్యమైన ప్యూర్టోరీకోను అమెరికా తన వశం చేసుకుంది. 1917లో తొలిసారిగా అక్కడి వారికి అమెరికా పౌరసత్వం ఇచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్యూర్టోరికన్లు అమెరికాకు లక్షలాదిగా వలసవచ్చారు. అమెరికా ఓటర్లలో మెక్సికన్ల తర్వాత హిస్పానియన్ మూలాలున్న ఓటర్లలో రెండో అతిపెద్ద వర్గంగా ప్యూర్టోరికన్లు నిలిచారు. సొంత ద్వీపం కంటే అమెరికా గడ్డపై నివసించే వాళ్లే ఎక్కువ.

కీలక రాష్ట్రాల్లో వీరి ప్రభావమెంత?

ఏ పార్టీకీ మద్దతు తెలపని తటస్థ ఓటర్లు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలనే స్వింగ్ స్టేట్స్ అంటారు. మద్దతు పలికే రాష్ట్రాలను ఆయా పార్టీలు ఎలాగూ గెల్చుకుంటాయి. కానీ స్వింగ్ రాష్ట్రాల ఓటర్లు ఎవరికి ఓటేస్తారో తెలీదుకాబట్టి వీళ్లను ప్రసన్నం చేసుకోవడమే ట్రంప్, హారిస్‌కు ముఖ్యం. పెన్సిల్వేనియా స్వింగ్ రాష్ట్రంలో 3.7 శాతం రాష్ట్రజనాభాకు సమానమైన 4.86 లక్షల మంది ప్యూర్టోరికన్లు ఉన్నారు. 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఉన్న ఈ రాష్ట్రాన్ని గెల్చుకోవడం తప్పనిసరి. ఇక్కడ హారిస్‌పై ట్రంప్ కేవలం 0.2 శాతం ఆధిక్యతతో కొనసాగుతున్నారు. తాజా ఉదంతంలో ఈ ఆధిక్యత మటుమాయమై ట్రంప్ వెనుకంజ వేయడం ఖాయమని వార్తలు వస్తున్నాయి. జార్జియాలోనూ 1.31 లక్షల మంది ప్యూర్టోరికన్లు ఉన్నారు. ఇక్కడ కూడా హారిస్‌పై ట్రంప్ ఆధిక్యత స్వల్పంగా ఉంది. వీళ్ల కోపంతో ఆ ఆధిక్యత పోవచ్చని విశ్లేషణలు వస్తున్నాయి. నార్త్ కరోలినా రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

స్వింగ్‌యేతర రాష్ట్రాల పరిస్థితి ఏంటి ?

ఏదో ఒక పార్టీకే మద్దతు పలికే రాష్ట్రాల్లోనూ ప్యూర్టోరికన్ల ప్రభావం ఉండొచ్చని తెలుస్తోంది. ఫ్లోరిడా రాష్ట్రంలో వీళ్లు ఏకంగా 12 లక్షల మంది ఉన్నారు. కనెక్టికట్ రాష్ట్ర జనాభాలో 8 శాతానికి సమానంగా 3 లక్షల మంది ప్యూర్టోరికన్లు ఉన్నారు. మసాచుసెట్స్‌లోనూ 3.26 లక్షల మంది వీళ్లే ఉన్నారు. న్యూయార్క్ రాష్ట్రంలో ఏకంగా పది లక్షల మంది వీళ్లే ఉన్నారు. ఇన్నేసి లక్షల మంది ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటేస్తే హారిస్ విజయం నల్లేరుపై నడకేనని కథనాలు వెలువడుతున్నాయి.

గతంలో జాత్యహంకార వ్యాఖ్యలు

ట్రంప్ జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి. 2018లో ఎల్‌సాల్విడార్, హైతీ, ఆఫ్రికా ఖండ దేశాలను దారుణంగా కించపరుస్తూ ట్రంప్ మాట్లాడారు. గత వారం సైతం వలసలపై ప్రసంగంలో ''అమెరికా చెత్తకుప్పనా ఏంటి?. వ్యర్థాలు(వలసలు) అన్నీ అమెరికాకే వస్తున్నాయి'' అని వ్యాఖ్యానించడం తెల్సిందే. తాను అధికారంలోకి వచ్చాక దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనిరీతిలో అనధికార వలసదారుల బహిష్కరణ కార్యక్రమం చేపడతానని ట్రంప్ అన్నారు. దీనికితోడు ఆదివారం హించ్‌క్లిఫ్ చేసిన వ్యాఖ్యలు ప్యూర్టోరికో మూలాలున్న ప్రముఖుల్లో ఆగ్రహజ్వాలలను ఎగసేలా చేసింది. జెన్నీఫర్ లోపేజ్, రికీ మార్టిన్, బ్యాడ్ బన్నీ ఇలా పలువురు ప్యూర్టోరికో సంగీత దిగ్గజాలూ తమ నిరసన వ్యక్తంచేశారు. ''ట్రంప్ సంగతి తెల్సిందే. గెలిస్తే తానెంత ప్రమాదకరమో, దేశ ప్రజల మధ్య ఎంతగా విభజన తీసుకురాగలరో మరో సారి నిరూపించుకున్నారు'' అని కమలా హారిస్ విమర్శించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



శిథిలాల నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు

గాజాపై భీకర దాడి

109 మంది మృతి | **మృతుల్లో సగం మంది చిన్నారులు, మహిళలు** | **దాడిపై నోరువిప్పని ఇజ్రాయెల్ ఆర్మీ**

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ ఆర్మీ గాజా ప్రాంతంపై మరోసారి భీకర దాడికి పాల్పడింది. గాజా ఉత్తరప్రాంతంలోని బెయిట్ లహియా పట్టణంలో శరణార్థులు తలదాచుకుంటున్న ఐదంతస్తుల భవనంపై మంగళవారం ఉదయం జరిపిన దాడిలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సగం మంది చిన్నారులు, మహిళలేనని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఇందులో ఇద్దరు తల్లులు,వీరి 11 మంది పిల్లలున్నారని వివరించింది. ఘటన సమయంలో భవనంలో 200 మంది ఉన్నట్లు సమాచారం. హమాస్ సాయుధులు మళ్లీ ఏకమవుతున్నారని ఆరోపిస్తూ ఉత్తర గాజాపై మూడు వారాలుగా దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్ ఆర్మీ తాజా ఘటనపై స్పందించలేదు. గాజా నగరంపై జరిగిన మరో దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. బెయిట్ లహియా దాడిలో గాయపడిన వారితో తమ ఆస్పత్రి నిండిపోయిందని దగ్గర్లోని కమాల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ హొస్సమ్ అబూ సఫియా తెలిపారు. సరైన వైద్య చికిత్సలు అందించేందుకు అవకాశం లేకపోవడంతో చాలా మంది క్షతగాత్రులు తమ కళ్లెదుటే ప్రాణాలు కోల్పోతున్నారని సఫియా ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు రోజుల క్రితం ఈ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడి చేసి, వైద్య సిబ్బందిని నిర్బంధంలోకి తీసుకుంది. అయితే, కమాల్ అద్వాన్ ఆస్పత్రిపై చేపట్టిన దాడిలో పెద్ద సంఖ్యలో హమాస్ మిలిటెంట్లను పట్టుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది.

ఐరాస సాయంపై ఇజ్రాయెల్ నిషేధం

తమ భూభాగంలో ఐరాస పాలస్తీనా శరణార్థి విభాగం(యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) కార్యకలాపాలపై నిషేధిస్తూ సోమవారం ఇజ్రాయెల్ పార్లమెంట్ రెండు చట్టాలను ఆమోదించింది. ఇకపై యూఎన్ ఆర్‌డబ్ల్యూఏతో ఇజ్రాయెల్ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధాలు ఉండవు. ఫలితంగా ఇజ్రాయెల్ నియంత్రణలో ఉన్న గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ పనిచేయడం సాధ్యం కాదు. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ముసుగులో హమాస్ కార్యకలాపాలు సాగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఐరాసకు అందే నిధులను, ఇతర సరఫరాలను ఈ గ్రూపే లాగేసుకుంటోందని, ఐరాస కార్యాలయాల్లో తిష్టవేసిందని అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏపై తాజాగా నిషేధం విధించింది. ఇజ్రాయెల్ చర్యను ఐరాస తీవ్రంగా ఖండించింది. పాలస్తీనియన్లకు మంచినీరు, టీకాలు, దుస్తులు, పౌష్టికాహారం, ఇతర ప్రాణావసరాలను అందించే దారులు మూసుకుపోతాయని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డెర్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తాము తప్ప మరెవరూ అందించేందుకు అవకాశాల్లేవన్నారు. ఇజ్రాయెల్ చర్య మరింతమంది చిన్నారుల ఉసురు తీస్తుందన్నారు. 1948 యుద్ధంతో ఇజ్రాయెల్ అవతరించాక, సొంతప్రాంతాల నుంచి వెళ్లగొట్టబడిన లక్షలాది మంది పాలస్తీనా శరణార్థులకు యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ఆధ్వర్యంలోనే విద్య, ఆరోగ్యం, అత్యవసర సాయం అందుతోంది.

హెజ్‌బొల్లా నూతన సారథి కాసిమ్



బీరుట్: లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సాయుధ గ్రూపు నూతన సారథిగా షేక్ నయీమ్ కాసిమ్(71) ఎంపికయ్యారు. ఈయన మూడు దశాబ్దాలుగా డిప్యూటీ చీఫ్‌గా కొనసాగుతున్నారు. హెజ్‌బొల్లాకు దీర్ఘకాలంగా చీఫ్‌గా కొనసాగుతున్న హస్సన్ నస్రల్లాతోపాటు కీలక కేడర్ గత నెలలో ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. నస్రల్లా తర్వాత బాధ్యతలు చేపడతారని భావించిన సఫియెద్దీన్ కూడా ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయారు. ఈ నేపథ్యంలో కాసిమ్ హెజ్‌బొల్లా తాత్కాలిక చీఫ్‌గా కొనసాగుతున్నారు. తమ గ్రూపు అత్యున్నత నిర్ణాయక మండలి షురా మంగళవారం కాసిమ్‌ను సెక్రటరీ జనరల్ పదవికి ఎంపిక చేసిందని హెజ్‌బొల్లా ఒక ప్రకటనలో తెలిపింది. ఎదురుదెబ్బలెన్ని ఎదురైనా వెనుకడుగు వేసేది లేదని ప్రకటించింది. నస్రల్లా విధానాలను కొనసాగిస్తూ విజయం సిద్ధించేదాకా పోరాడుతామని స్పష్టం చేసింది. 1982లో లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న నేపథ్యంలో హెజ్‌బొల్లా అవతరించింది. ఈ గ్రూపు వ్యవస్థాపక సభ్యుల్లో నయీమ్ కాసిమ్ ఒకరు. దక్షిణ లెబనాన్‌లోని కెఫర్ ఫిలాలో 1953లో జన్మించిన కాసిమ్ లెబనీస్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశారు. కొన్నేళ్లపాటు కెమిస్ట్రీ టీచర్‌గా పనిచేశారు. అనంతరం మత సంబంధ విషయాలపై దృష్టి సారించారు. విద్యార్థుల్లో మతంపై ఆసక్తి కలిగించే లక్ష్యంతో లెబనీస్ యూనియన్ ఫర్ ముస్లిం స్టూడెంట్స్ అనే గ్రూపును స్థాపించారు. 1970ల్లో షియా వర్గాన్ని రాజకీయంగా బలోపేతం చేసే మూవ్‌మెంట్ ఆఫ్ డిస్‌పొసెస్డ్‌లో చేరారు. ఈ గ్రూపే సాయుధ అమాల్ ఉద్యమంగా, అనంతరం రాజకీయ పార్టీగా రూపుమార్చుకుంది.

ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దు

మల్లికార్జున ఖర్గేకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆధారాల్లేకుండా ఆరోపణలు చేయొద్దని, ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతను దెబ్బతీసేలా వ్యవహరించకూడదని కాంగ్రెస్‌తోపాటు ఇతర రాజకీయ పార్టీలకు స్పష్టంచేసింది. సంచలనాత్మక ఫిర్యాదులకు దూరంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మంగళవారం లేఖ రాసింది. ఎన్నికలు, కౌంటింగ్ జరిగే కీలక సమయాల్లో ఆధారాల్లేకుండా ఆరోపణలు, ఇష్టానుసారంగా ఫిర్యాదులు చేస్తే ప్రజల్లో భయాందోళనలు పెరుగుతాయని, సమాజంలో అశాంతి నెలకొంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ చేసిన అన్ని ఆరోపణలను తాము ఖండిస్తున్నట్లు తేల్చిచెప్పింది. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి ఇలాంటి ఆరోపణలు తాము ఊహించలేదని వెల్లడించింది. దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విషయంలో రాజకీయ పార్టీల ప్రయత్నాలను తాము అభినందిస్తున్నామని తెలియజేసింది. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా ఫిర్యాదులు వస్తే ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించింది. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా వచ్చినప్పుడల్లా ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఆక్షేపించింది.

జేపీసీ సమావేశంలో రగడ

ఢిల్లీ వక్ఫ్ బోర్డు ప్రజెంటేషన్‌పై విపక్షాల అభ్యంతరం

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమావేశం మరోసారి రసాభాసగా మారింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డు అధికారి అశ్వినీ కుమార్ ఇచ్చిన ప్రజెంటేషన్‌పై మంగళవారం జేపీసీ భేటీలో విపక్ష సభ్యులు సంజయ్ సింగ్, మొహమ్మద్ అబ్దుల్లా, అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రతిపాదిత బిల్లును అశ్వినీ కుమార్ సమర్థించడాన్ని వారు తప్పుపట్టారు. ఢిల్లీ ప్రభుత్వ అనుమతి లేకుండానే అశ్వినీ కుమార్ ఈ ప్రజెంటేషన్ ఇచ్చారని, ఆయనపై కేసు నమోదు చేయాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ముస్లిమేతరుడైన అశ్వినీ కుమార్‌ను ఢిల్లీ వక్ఫ్ బోర్డు అధికారిగా ఎలా నియమించారని ప్రశ్నించారు. అందుకు చట్టం ఒప్పుకోదని అన్నారు. బీజేపీ ఎంపీ ఒకరు స్పందిస్తూ ఢిల్లీ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరుడిని నియమించిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయని గుర్తుచేశారు. విపక్ష సభ్యులు గంటపాటు నినాదాలు చేశారు. చివరకు జేపీసీ చైర్మన్ జగదాంబిక పాల్ స్పందిస్తూ... వక్ఫ్(సవరణ) బిల్లుపై ఢిల్లీ ప్రభుత్వ వాదన వినేందుకు అంగీకరించారు. మరోవైపు అశ్వినీ కుమార్ ప్రజెంటేషన్‌ను తాము ఆమోదించలేదని ఢిల్లీ సీఎం అతిశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అనుచిత ప్రవర్తనకుగాను గతం వారం సస్పెండైన తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ మంగళవారం జేపీసీ సమావేశానికి హాజరయ్యారు.

మరో ఇద్దరు ముష్కరులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖకు సమీపంలోని అఖ్నూర్ సెక్టార్‌లో మంగళవారం మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని ఆర్మీ తెలిపింది. సోమవారం ఆర్మీ కాన్వాయ్‌పైకి కాల్పులు జరిపి పరారైన ముష్కర ముఠాలోని ఒకరిని బలగాలు హతమార్చడం తెలిసిందే. దీంతో, దాదాపు 27 గంటలపాటు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఉగ్రవాదుల సంఖ్య మూడుకు చేరిందని అధికారులు తెలిపారు. భారీ విధ్వంసానికి పాల్పడేందుకు ప్రయత్నించిన ఉగ్రవాదులను విజయవంతంగా ఏరివేశామన్నారు. ఈ క్రమంలో బలగాలకు ఎటువంటి నష్టం జరగలేదని వివరించారు. ఆపరేషన్‌లో ప్రత్యేక బలగాలు, ఎన్‌ఎస్‌జీ కమాండోలతోపాటు బీఎంపీ–2 పదాతి దళ పోరాట శకటాలను కూడా రంగంలోకి దించారు. ఉగ్రమూకల కదలికలపై కన్నేసి ఉంచేందుకు హెలికాప్టర్లు, డ్రోన్లను వినియోగించారు. బట్టాల్–ఖౌర్ ప్రాంతం జొగ్వాన్ గ్రామ సమీపంలోని అస్సన్ ఆలయం సమీపంలో మంగళవారం ముష్కరులతో జరిగిన తుది పోరులో విజయం సాధించామని ఆర్మీ ప్రకటించింది.

మీకు సేవ చేయలేకపోతున్నా.. క్షమించండి

పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని వృద్ధులకు మోదీ క్షమాపణలు

- ‘ఆయుష్మాన్ భారత్’లో ఆ రెండు రాష్ట్రాలు చేరకపోవడంపై ఆగ్రహం
- ‘ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన’కు శ్రీకారం



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ప్రభుత్వాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేయడం లేదని, అక్కడి ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతుండడమే ఇందుకు కారణమని మండిపడ్డారు. ఆ రెండు రాష్ట్రాల్లో వృద్ధులకు ఉచితంగా వైద్యం లభించకపోవడం చూసి చాలా బాధపడుతున్నానని చెప్పారు. వారికి సేవ చేసే అదృష్టం రాకపోవడం పట్ల చింతిస్తున్నానని తెలిపారు. ఆ వృద్ధులను క్షమాపణ కోరుతున్నానని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను మరింత విస్తరింపజేస్తూ 70 ఏళ్లు దాటిన వారందరికీ ఈ పథకం వర్తించేలా ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(ఏబీ-పీఎంజేఏవై)ను మోదీ మంగళవారం శ్రీకారం చుట్టారు. తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జన్మదినోత్సవం సందర్భంగా వైద్య రంగానికి సంబంధించి రూ.12,850 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. 70 ఏళ్లు దాటిన వారిని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం పరిధిలోకి తీసుకొస్తానని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ఈరోజు నెరవేరుస్తున్నానని తెలిపారు.ఏబీ-పీఎంజేఏవైతో 4 కోట్ల మంది లబ్ధి పొందుతారని వెల్లడించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

ఐదేళ్లలో మరో 75,000 ఎంబీబీఎస్, ఎండీ సీట్లు

''70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ వయ వందన కార్డులు అందజేస్తాం. వీటితో ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14,000కుపైగా ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో 80 శాతం డిస్కౌంట్‌తో ఔషధాలు లభిస్తున్నాయి. ఈ కేంద్రాలతో పేదలు, మధ్యతరగతికి రూ.30,000 కోట్ల మేర లబ్ధి కలిగింది. స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్ల వంటి పరికరాల ధరలు తగ్గించడంతో సామాన్య ప్రజలకు రూ.80,000 కోట్లు ఆదా అయ్యాయి. దేశంలో గత పదేళ్లలో దాదాపు లక్ష ఎంబీబీఎస్, ఎండీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే ఐదేళ్లలో మరో 75,000 సీట్లు రాబోతున్నాయి. వైద్య విద్య నిరుపేదలకు సైతం సులభంగా అందుబాటులోకి రావాలన్నదే మా లక్ష్యం'' అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి నియామక పత్రాలు

దేశంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించేలా, వారి ఆకాంక్షలు నెరవేరేలా ఒక పటిష్టమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. గరిష్ట సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మంగళవారం ‘రోజ్‌గార్ మేళా’లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 51,000 మందికి వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేశారు. అంతరిక్షం, సెమీకండక్టర్ల వంటి ఆధునిక రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దాంతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్‌తేరాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అయోధ్యలోని భవ్యమందిరంలో బాలరాముడిని ప్రతిష్టించుకున్న తర్వాత వచ్చిన ఈ తొలి దీపావళి పండుగ మనకు చాలా ప్రత్యేకమని చెప్పారు.

100 విమానాలకు బెదిరింపులు

న్యూఢిల్లీ/ముంబై: దేశీయ విమానయాన సంస్థలకు మళ్లీ బాంబు హెచ్చరికలు అందాయి. మంగళవారం మరో 100 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు బాంబులతో పేల్చేస్తామంటూ ఆగంతకులు సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులు పంపారు. దీంతో, గత 16 రోజుల్లో మొత్తం 510 విమాన సర్వీసులకు బెదిరింపులు అందినట్లయింది. ఇవన్నీ ఉత్తుత్తివేనని తేలడం గమనార్హం. మంగళవారం ఎయిరిండియాకు చెందిన 36 విమానాలకు, ఇండిగో 35 సర్వీసులు, విస్తారకు చెందిన 32 విమానాలకు బాంబు హెచ్చరికలు అందాయి. మూడు విమానయాన సంస్థలకు బెదిరింపులు పంపిన గుర్తు తెలియని వ్యక్తిపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు.

కేరళ ఆలయ ఉత్సవంలో అపశ్రుతి

బాణాసంచా పేలి 150 మందికి గాయాలు

కాసరగోడ్: కేరళలోని కాసరగోడ్ జిల్లా నీలేశ్వరం సమీపంలోని వీరార్కవు ఆలయం వద్ద సంప్రదాయ సంగీత, నృత్య తెయ్యమ్ ప్రదర్శన సమయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. సోమవారం రాత్రి జరిగిన ప్రదర్శన చూసేందుకు మహిళలు, పిల్లలు సహా వందలాదిగా జనం తరలివచ్చారు. నిర్వాహకులు టపాసులు కాల్చారు. అవి పేలి అక్కడే నిల్వ ఉంచిన బాణాసంచాపై పడి అంటుకుని ఒక్కసారిగా భారీ పేలుడు చోటుచేసుకుంది. మంటలు, పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. ఈ ఘటనలో 150 మంది వరకు గాయపడ్డారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 108 మంది క్షతగాత్రుల్లో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

జడ్జితో లాయర్ల కొట్లాట.. పోలీసుల లాఠీచార్జి

ఘాజియాబాద్: ఓ కేసు విషయమై లాయర్లు, జడ్జికి మధ్య వివాదం కొట్లాటకు దారితీసింది. జడ్జి అందించిన సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. లాఠీలు ఝుళిపించి జడ్జి చాంబర్ నుంచి లాయర్లను బయటకు పంపారు. ఈ పరిణామాలకు యూపీలోని ఘాజియాబాద్ జిల్లా కోర్టు ఆవరణ వేదికైంది. బార్ అసోసియేషన్ నేతకు సంబంధించిన కేసు విచారిస్తున్న సమయంలో బెయిల్ ట్రాన్స్‌ఫర్‌కు జిల్లా జడ్జి నిరాకరించారు. దీంతో లాయర్లు, జడ్జికి మధ్య కొట్లాట మొదలైంది. సమాచారం అందుకున్న పోలీసులు లాఠీచార్జి చేసి జడ్జి చాంబర్‌ను చుట్టుముట్టిన లాయర్లను చెదరగొట్టారు. ఆగ్రహంతో లాయర్లు కోర్టు ఆవరణలోని పోలీస్ పోస్టును ధ్వంసం చేశారు. జడ్జికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుర్చీలు విసిరేశారు. పోలీసుల వైఖరిపై ధర్నాకు దిగారు. ఈ ఘటన నేపథ్యంలో న్యాయమూర్తులు కేసుల విచారణ నిలిపివేసి, బార్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు.

శ్వేతసౌధంలో ఘనంగా దీపావళి వేడుక

- ప్రమిద వెలిగించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్
- హాజరైన 600మందికి పైగా భారతీయ అమెరికన్లు



వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాల సందర్భంగా మాట్లాడుతున్న బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యక్షుడు బైడెన్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ సభ్యుడు శ్రీ థానేదార్, అమెరికా సర్జన్ జనరల్, వైస్ అడ్మిరల్ వివేక్ మూర్తి, అంతర్జాతీయ ద్రవ్య నిధి మొదటి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ సహా 600 మందికి పైగా భారతీయ అమెరికన్ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ సైతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి వీడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో మునిగిపోయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ప్రథమ మహిళ డాక్టర్ జిల్ బైడెన్ ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. సోమవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. వైట్‌హౌజ్‌లోని బ్లూ రూమ్‌లో అధ్యక్షుడు బైడెన్ ప్రమిదను వెలిగించారు. అనంతరం కిక్కిరిసిన ఈస్ట్‌రూమ్‌లో బైడెన్ మాట్లాడారు. ఈ సందర్భంగా దక్షిణాసియా అమెరికన్లను కొనియాడారు. ''శ్వేతసౌధం చరిత్రలోనే అతిపెద్ద దీపావళి వేడుకలు నా హయంలో జరగడం నాకెంతో ఆనందాన్నిస్తోంది. మా ప్రభుత్వ పాలనలో దక్షిణాసియా అమెరికన్లు కీలక పాత్ర పోషించారు. కమల హారిస్ నుంచి వివేక్ మూర్తి దాకా మీలో ఎంతో మంది నా ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ అమెరికాకు మరో గొప్ప పరిపాలనావ్యవస్థను అందించారు'' అని అన్నారు. తర్వాత ట్రంప్ పాలనపై విమర్శలు గుప్పించారు. ''2016 నవంబర్ తర్వాత అమెరికాలో వలసదారులు ముఖ్యంగా దక్షిణాసియా అమెరికన్లపై విద్వేష మేఘాలు కమ్ముకున్నాయి. వాటిని పారదోలిన విజయగర్వంతో మేం అధికారంలోకి వచ్చాం. ఆనాడు ఉపాధ్యక్షురాలు కమలా హారిస ఇంట్లో మేం దీపావళి వేడుకలు జరుపుకున్నాం. హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు అందరం కలిసి దీపావళి వేడుక చేసుకున్నాం. మనందరి సమైక్య శక్తి ప్రమిదల వెలుగును అమెరికా గుర్తుంచుకుంటుంది. దక్షిణాసియా అమెరికన్లు ప్రతి అమెరికన్ జీవితాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషిచేశారు. అంతగా కష్టపడతారుకాబట్టే ఇప్పుడు అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న వర్గంగా మీరంతా నిలిచారు. ఈ వెలుగుల పథాన్ని ఓసారి గుర్తుచేసుకుందాం. ఈ వెలుగు ఒకప్పుడు అనుమానపు చీకట్లో మగ్గిపోయేది. ఇప్పుడు శ్వేతసౌధంలో సగర్వంగా ప్రకాశిస్తోంది. ఇంతటి ప్రగతికి మేం సాక్ష్యంగా నిలిచాం'' అని భారతీయులను బైడెన్ పొగిడారు.

అరుదైన అవకాశం: సునీతా విలియమ్స్

నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రికార్డ్ చేసిన వీడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సంవత్సరం భూమికి 260 మైళ్ల ఎత్తులో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో దీపావళి జరుపుకునే అరుదైన అవకాశం నాకు అనుకోకుండా లభించింది. దీపావళి, ఇతర భారతీయ పండుగల గురించి మాకు బోధించి భారతీయ సాంస్కృతిక మూలాలను నాకు అందించిన మా నాన్నగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నా. ఈ రోజు భారతీయులతో దీపావళి జరుపుకొంటున్నందుకు, భారతీయుల సహకారాన్ని గుర్తించినందుకు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నా ధన్యవాదాలు'' అని సునీతా తన సందేశంలో వ్యాఖ్యానించారు.

మరికొన్ని చిత్రాలు సాక్షిప్లస్‌లో..

సాక్షి హైదరాబాద్

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



'సిటీ'పై సైబర్ ఎటాక్!
ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్య హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో 2,336 కేసులు నమోదు కాగా..రూ.231.88 కోట్లు సైబర్ నేరగాళ్ల పరమైంది. -8లో



శారీ ఫర్ ఎవర్
శారీలకు అతిపెద్ద షోకేస్‌గా మారింది నగరం. వెస్టర్న్ ప్యాటర్న్స్ ఎన్ని వచ్చినా వీటిని స్వాగతిస్తూనే ఉంది. చీరను ట్రెండ్ నుంచి ఎప్పుడూ కాపాడుకుంటూనే ఉంది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం
నగరంలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి వేళ చలి పెరుగుతుంది.



ధన్‌తేరస్ ధగధగ

బంగారం తళుక్కుమంది. వజ్రాభరణం వన్నెలీనింది. కనకం ధర అంబరమంటినా తగ్గేదే లేదంటూ కొనుగోలుదారులు పోటీ పడ్డారు. మంగళవారం ధన్‌తేరస్ సందర్భంగా నగరంలోని స్వర్ణాభరణాల దుకాణాలు కిటకిటలాడాయి. మగువలు తమ మనోభీష్టానికి అనుగుణంగా బంగారం కొనుగోలు చేశారు.





రేపటితో ముగియనున్న జలమండలి ఓటీఎస్ గడువు

సాక్షి, సిటీబ్యూరో: నల్లా నీటి పెండింగ్ బిల్లుల చెల్లింపు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (ఓటీఎస్) గురువారంతో ముగియనుంది. బకాయిదారులు బిల్లులను చెల్లించి.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. ఓటీఎస్ ఈ నెల 31 వరకు మాత్రమే వర్తించనుందని స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లుల అసలు మొత్తం కట్టి.. ఆలస్య రుసుం, వడ్డీపై రాయితీ పొందాలన్నారు. చాలా కాలంగా బిల్లులు చెల్లించకుండా పేరుకుపోయిన మొండి బకాయిలు క్లియర్ చేసుకోవడానికి మంచి అవకాశమన్నారు. జలమండలి అందించిన క్యూఆర్ కోడ్‌ను వినియోగదారులు స్కాన్ చేసి తమ బకాయిలు, చెల్లించే మొత్తం, రాయితీ తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఏవైనా సందేహాలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని అశోక్ రెడ్డి సూచించారు.

త్వరలో కుటుంబ సర్వే

- కుటుంబ, రాజకీయ నేపథ్యం వివరాల సేకరణ
- సర్వే పూర్తయిన ఇళ్లకు స్టిక్కర్లు

కసరత్తు ప్రారంభించిన యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే త్వరలో ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా అన్ని కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను నిర్వహించనున్నారు. ఇందుకుగాను గ్రేటర్ పరిధిలోని దాదాపు 25 లక్షల కుటుంబాల సర్వేను నిర్వహించేందుకు త్వరలోనే ఎన్యూమరేటర్లను నియమించనున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు దాదాపు 175 కుటుంబాల సర్వే బాధ్యతలను అప్పగించనున్నారు. సర్వే పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ సర్వే ద్వారా ఎలాంటి ఫలితాలు వెలువడనున్నప్పటికీ, భవిష్యత్‌లో ఆయా పథకాల అమలుకు వివరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది.

పదేళ్లకు మళ్లీ..

జీహెచ్ఎంసీ పరిధిలో 2014లో సమగ్ర కుటుంబ సర్వే పేరిట సర్వే నిర్వహించారు. అప్పుడు గ్రేటర్ మొత్తాన్నీ ఒకే రోజు సర్వే చేశారు. ఒక్కరోజు సర్వేలో 19.43 లక్షల కుటుంబాల సర్వే చేసినట్లు పేర్కొన్నప్పటికీ, అనంతరం 20.39 లక్షల కుటుంబాల సర్వే జరిగినట్లు పేర్కొన్నారు ఎంతో వ్యయప్రయాసల కోర్చి నిర్వహించిన ఆ సర్వే ఫలితాలు ఎవరికి, ఏ రకంగా ఉపయోగపడ్డాయో తెలియదు. జీహెచ్ఎంసీ పరిధిలో సర్వే నిర్వహించినప్పటికీ.. అనంతరం సర్వే వివరాలను మాత్రం జిల్లాల వారీగానే పేర్కొన్నారు. తిరిగి ఇప్పుడు మళ్లీ జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్వే నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. అప్పటితో పోలిస్తే గ్రేటర్‌లో కుటుంబాలు దాదాపు 25 లక్షలు ఉండవచ్చని అంచనా.



మాతృభాష ఏదో తెలపాలి..

ఎన్యూమరేషన్ బ్లాకుల వారీగా త్వరలో ఈ సర్వే ప్రారంభించనున్నారు. ఉప కులాల వారీగా కులాల వివరాలు కూడా సేకరించనున్న ఈ సర్వేలో ప్రజల విద్యార్హతలు, మాతృభాష వంటి వివరాలు సైతం నమోదు చేయనున్నారు. స్థిరాస్థి, చరాస్తుల వివరాలు, నివాస గృహాల విస్తీర్ణం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, రేషన్‌కార్డు ఉందా .. లేదా? వంటి వివరాలు సైతం సేకరించనున్నారు.

రాజకీయ వివరాలు సైతం

రాజకీయాల్లో పనిచేస్తే ఆ వివరాలు సైతం సేకరించనున్నారు. ఎంతకాలం(ఎన్ని టర్ములు) ప్రజాప్రతినిధిగా ఉన్నారు. మంత్రి, చైర్మన్, స్పీకర్‌వంటి పదవులు నిర్వహిస్తే ఆ వివరాలు సైతం సేకరించనున్నారు. నామినేటెడ్, కార్పొరేషన్, వంటి పదవులు నిర్వహిస్తే ఆ వివరాలూ పొందుపరచనున్నారు. వీరిలో ఎవరైనా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలూ సేకరించనున్నారు.

వివరణాత్మక సమాచార సేకరణే ప్రధాన ధ్యేయం

ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితి, విద్యాస్థాయి, ఉపాధి పరిస్థితులు, రాజకీయ ప్రయోజనం, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై వివరణాత్మక సమాచారం సేకరించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం. సర్వే ద్వారా ప్రజల జీవనస్థితి తెలుసుకొని అవసరమైన పరిష్కార మార్గాలను గుర్తించనున్నట్లు అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ తెలిపారు. సర్వే డేటా సేకరణలో పాటించాల్సిన నైతిక ప్రమాణాలు, వ్యక్తిగత గోప్యతా హక్కులను కాపాడటంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. సర్వే కోసం ఎన్యూమరేటర్స్‌ను, సూపర్‌వైజర్స్‌ను నియమించుకోవాలని, వీరు తమకు కేటాయించిన అన్ని కుటుంబాల డేటా సేకరించాలన్నారు. సర్వే పూర్తైన ఇళ్లకు స్టిక్కర్ వేయాలని సూచించారు. సూపర్వైజర్లు ఎన్యూమరేటర్ సేకరించిన డేటాలో 10 శాతం ర్యాండం కుటుంబాలను చెక్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ చంద్ర ఎన్యూమరేటర్లకు మార్గదర్శకాలు, స్టిక్కర్ తదితరాలపై వివరించారు. పీపీటీ ద్వారా సర్వే ఏ విధంగా చేయాలి, ఫారం నింపే విధానం, ఇతర ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం సర్వేకు సంబంధించి పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ..

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ డిప్యూటీ కమిషనర్లు, సర్కిల్ లెవల్ మాస్టర్ ట్రైనర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే సమర్థంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ సర్వే నవంబర్‌లో (తేదీ నిర్ణయించాలి) చేపట్టనున్నట్లు తెలిపారు.

పోటెత్తిన రద్దీ

దీపావళికి సొంతూరి బాటలో జనం

కిక్కిరిసిపోయిన ఉత్తరాది రైళ్లు

- రైళ్లు లేక, బెర్తులు లభించక..
- జనరల్ బోగీల్లో చోటులేక ప్రయాణికుల పడిగాపులు
- మరో రెండు రోజులూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి సందర్భంగా ప్రయాణికుల రద్దీ పోటెత్తింది. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు మంగళవారం కిటకిటలాడాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లు ప్రయాణికుల రద్దీతో సందడి నెలకొంది. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజలకు దీపావళి, ఛట్ పండుగలు ఎంతో ముఖ్యం. ఈ మేరకు నగరంలో ఉంటున్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తప్పనిసరిగా సొంత ఊళ్లకు తరలి వెళ్తారు. దీపావళి పర్వదినానికి మరో రెండు రోజులే మిగిలి ఉండడంతో మంగళవారం పెద్ద ఎత్తున బయలుదేరారు. ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే అన్ని రైళ్లు కిక్కిరిశాయి.

నెల రోజుల క్రితమే రిజర్వేషన్లు..

- హైదరాబాద్ నుంచి పాట్నా, కోల్‌కతా, వారణాసి, దానాపూర్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలో సాధారణ రోజుల్లోనే రద్దీ ఎక్కువగా ఉంటుంది. దానాపూర్ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, దర్భంగా తదితర రైళ్లలో నెల రోజుల క్రితమే రిజర్వేషన్‌లు భర్తీ అయ్యాయి. వెయిటింగ్ లిస్ట్ సైతం వందల్లోకి చేరింది. కొన్ని రైళ్లలో బుకింగ్‌కు కూడా అవకాశం లేకుండా నో రూమ్ దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణికులు అనివార్యంగా జనరల్ బోగీలపై ఆధారపడాల్సి వస్తోంది.
- ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు రైళ్లను నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. కానీ డిమాండ్ మేరకు రైళ్లు అందుబాటులో లేవు. జనరల్ బోగీల్లో కాలు మోపేందుకు కూడా చోటు లేకుండాపోయిందని దానాపూర్ ప్రయాణికులు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా సరే ఏదోఒక విధంగా సొంత ఊళ్లకు వెళ్లాలనే పట్టుదలతో జనరల్ బోగీల్లోనే అతికష్టంగా బయలుదేరి వెళ్తున్నారు. మరో రెండు రోజుల పాటు కూడా ఇదే రద్దీ ఉండవచ్చని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అధికారులు తెలిపారు. జనరల్ టికెట్‌ల కోసం అదనపు బుకింగ్ కౌంటర్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అదనంగా 30 వేల మంది ప్రయాణికులు..

ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది వలస కూలీలు నగరంలో నిర్మాణరంగంలో పని చేస్తున్నారు. కుటుంబాలతో సహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కూలీలంతా దీపావళి వేడుకల కోసం సొంత ఊళ్లకు తరలి వెళ్తున్నారు. దూరభారం దృష్ట్యా రోడ్డు మార్గంలో కంటే రైళ్లలో బయలుదేరి వెళ్లేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపడంతో అనూహ్యంగా రద్దీ పెరిగింది. ఈ రద్దీని ముందే ఊహించి అదనపు రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ అవి ఏ మాత్రం చాలడం లేదు. ముఖ్యంగా జనరల్ బోగీల కొరత కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా వరకు 18 బోగీలు ఉన్న రైళ్లలో కేవలం 2 మాత్రమే జనరల్ బోగీలు ఉన్నాయి. కొన్నింటిలో మాత్రం 3 నుంచి 4 సాధారణ బోగీలు ఉన్నాయి. అయినప్పటికీ అందుకు 5 రెట్ల మంది ప్రయాణికులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు తరలి వస్తున్నారు. భార్యాపిల్లలతో సహా సికింద్రాబాద్ స్టేషన్‌కు తరలి వచ్చిన ప్రయాణికులు చివరకు జనరల్ బోగీల్లో కూడా వెళ్లేందుకు అవకాశం లేక స్టేషన్ బయటపడిగాపులు కాస్తున్నారు. 'తిరిగి ఇంటికి వెళ్లడం కంటే ఇక్కడే ఉండి ఏదో ఒక ట్రైన్ పట్టుకొని వెళ్లిపోవడం మంచిది కదా' అని సంజన్ అనే ప్రయాణికుడు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజు సుమారు 1.85 లక్షల మంది రాకపోకలు సాగిస్తుండగా.. మంగళవారం అదనంగా మరో 30 వేల మందికి పైగా సొంత ఊళ్లకు బయలుదేరినట్లు అంచనా.





సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట కిక్కిరిసిన జనం

షాపింగ్ సందడి

దీపావళి, ధన్‌తేరస్ సందర్భంగా నగరంలోని టపాసులు, బంగారం, వస్త్ర దుకాణాలు మంగళవారం కిటకిటలాడాయి. ఎటు చూసినా దీపావళి సందడే కనిపించింది. కాగా.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బంగారం రేట్లు కాస్త పెరిగినప్పటికీ... దీపావళితో పాటు ధన్ తేరస్, ముఖ్యంగా వివాహాల సీజన్ కావడంతో నగరంలో బంగారం కొనుగోళ్లు రోజు రోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. ప్రజలకున్న సెంటిమెంట్లు, అపోహలు ఇతర ఏ అంశాలు బంగారం కొనుగోళ్లపై ప్రభావం చూపలేదు. అంతేకాకుండా పండుగ నేపథ్యం, వివాహాల శుభ కార్యాల కారణంగా వజ్రాభరణాల దుకాణాల యాజమాన్యాలు వినియోగదారులను సంతృప్తి పరచడానికి ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే.. షాపింగ్ మాల్స్ సైతం కొనుగోనుదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి.

ఆయుర్వేద కళాశాలకు అదనపు గదులు

బాలికల హాస్టల్, సీట్ల పెంపు

- మంత్రి దామోదర రాజనర్సింహ

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు అదనపు గదులు, బాలికల కోసం అధునాతన వసతి గృహంతో పాటు సీట్లు పెంపునకు త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. మంగళవారంజాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. పూర్వీకులు ప్రకృతితో మమేకమై శ్వాస ద్వారానే ప్రకృతి రహస్యాలను కనుగొన్నారని, తద్వారా ఆయుర్వేద, సిద్ధ, యోగ, యునానీ, ఆసనాల ద్వారా వైద్య రహస్యాలను మన పూర్వీకులు వెలికి తీశారని పేర్కొన్నారు. అల్లోపతికి దీటుగా అయుర్వేద వైద్యం అభివృద్ధి చెందుతోందన్నారు. దీనిని ప్రతి గ్రామానికి సైతం విస్తరింపజేయాలని సూచించారు. రాష్ట్రంలో 421 యోగా ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించి మారుమూల ప్రాంతాల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే మరో 241 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య విద్యార్థులకు వారంలో స్టైపెండ్ చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేదం అనేది మతం కాదని శరీరానికి, ఆరోగ్యానికి సంబంధించినదని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొత్త యోగా ఇన్‌స్ట్రక్టర్లకు నియామకపు పత్రాలు అందించారు. వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, ఆయుష్ విభాగం డిప్యూటీ డైరెక్టర్స్ ప్రమీలాదేవి, స్వరూపారాణి, అడిషనల్ డైరెక్టర్ పరమేశ్వర్ నాయక్, డాక్టర్ వసంతరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ మమత కస్తూరీబాయి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.యశోద, డాక్టర్ ఉమా శ్రీనివాస్, సీనియర్ వైద్యులు నర్సింహ, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రశాంతంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సాక్షి, సిటీ బ్యూరో: డీఎస్సీ- 2024లో ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టు కోసం ఎంపికైన మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం గవర్నమెంట్ ఆలియా ఉన్నత పాఠశాలలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మొత్తం 33 నోటిఫైడ్ పోస్టులకు గాను 1:3 ప్రకారం 34 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 31 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది.

రూ.50 వేలు లంచం తీసుకుంటూ

ఏసీబీకి చిక్కిన ఏఈ



రాజేంద్రనగర్: కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటూ గోషామహల్ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ వెంకోబా అవినీతి నిరోధక శాఖ అధికారులకు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో వెంకోబా ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి ఆయన గోషామహల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వచ్చాడు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పని చేసిన సమయంలో ఓ కాంట్రాక్ట్ పనికి సంబంధించిన బిల్లుపై సంతకం చేసేందుకు కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు సంప్రదించాడు. అధికారుల సూచన మేరకు కాంట్రాక్టర్ మంగళవారం మధ్యాహ్నం ఏఈకి ఫోన్ చేసి డబ్బులు తీసుకొచ్చానని తెలిపాడు. అబిడ్స్ ప్రాంతంలోని ఓ హోటల్ వద్దకు రావాలని తెలపడంతో కాంట్రాక్టర్ హోటల్ వద్ద అవినీతి నిరోధక శాఖ అధికారులతో కలిసి వేచి ఉన్నారు. ఏఈ వెంకోబా కాంట్రాక్టర్ వద్దకు వచ్చి డబ్బులు తీసుకున్న వెంటనే అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

తప్పుడు పత్రాలతో భూ రిజిస్ట్రేషన్

అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతి రిమాండ్

జీడిమెట్ల: నకిలీ పత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసిన కేసులో అప్పటి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్.. ప్రస్తుతం నాంపల్లిలోని చిట్స్ అండ్ ఫైనాన్స్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జ్యోతిని జీడిమెట్ల పోలీసులు 14 రోజుల రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ చెప్పిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లోని సర్వే నంబర్ 33/8, 33/11లో ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన లెండ్యాల సురేష్‌కు రూ. కోటి విలువ చేసే 200 గజాల ప్లాట్ ఉంది. సదరు ప్లాట్ ఖాళీగా ఉండటంతో దానిపై సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు పద్మజారెడ్డి కన్నుపడింది. ఆ భూమిని కాజేయాలని ఆమె పథకం వేసింది. నకిలీ పత్రాలను సృష్టించేందుకు పెద్ద అంబర్‌పేటకు చెందిన గగనం నరేంద్ర, గుంటూరు సాకేతపురానికి చెందిన వి. రవిశంకర్, అదే ప్రాంతానికి చెందిన మేకల హరీష్, హయత్‌నగర్‌కు చెందిన రేపాక కరుణాకర్‌లను ఆశ్రయించింది. వీరి సహాయంతో నకిలీ ఆధార్, పాన్ కార్డులు సృష్టించారు. ప్లాట్ యజమాని సురేష్ మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తయారు చేయించింది. సదరు పత్రాలను గత ఏడాది మార్చి నెలలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతికి సమర్పించి 200 గజాల ప్లాట్‌ను తనకు వరుసకు సోదరి అయ్యే నాగిరెడ్డి కోమల కుమారి పేరుపై పద్మజారెడ్డి రిజిస్ట్రేషన్ చేయించింది. విషయం తెలుసుకున్న ప్లాట్ యజమాని సురేష్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. తప్పుడు పత్రాలతో భూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న పద్మజారెడ్డితో పాటు ఆమెకు సహకరించిన నలుగురిని ఈ నెల 4న రిమాండుకు తరలించారు.



అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతి

పద్మజారెడ్డి కస్టడితో బయటపడిన జ్యోతి పాత్ర..

ఈ కేసులో తగిన విచారణ చేసేందుకు పోలీసులు పద్మజారెడ్డిని వారం రోజుల క్రితం కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. విచారణలో అప్పటి కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ జ్యోతి పాత్ర ఉన్నట్లు పోలీసులకు ఆమె తెలిపింది. దీంతో జీడిమెట్ల పోలీసులు సోమవారం నాంపల్లిలోని చిట్స్ అండ్ ఫైనాన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న జ్యోతిని స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. అనంతరం ఆమెపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం మేడ్చల్ కోర్టులో హాజరుపర్చి 14 రోజుల రిమాండుకు తరలించారు.

హైదరాబాద్ జిల్లా ఓటర్లు 46.22 లక్షలు

హైదరాబాద్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు
ముషీరాబాద్	3,08,378
మలక్‌పేట	3,19,556
అంబర్‌పేట	2,80,451
ఖైరతాబాద్	3,01,160
జూబ్లీహిల్స్	3,89,287
సనత్‌నగర్	2,54,165
నాంపల్లి	3,29,839
కార్వాన్	3,64,390
గోషామహల్	2,76,628
చార్మినార్	2,32,004
చాంద్రాయణగుట్ట	3,53,401
యాకుత్‌పురా	3,64,855
బహదూర్‌పురా	3,25,241
సికింద్రాబాద్	2,67,933
కంటోన్మెంట్	2,54,845
మొత్తం	46,22,133



గతంలో కంటె పెరిగిన ఓటర్లు 52 వేలు

సాక్షి, సిటీబ్యూరో: స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా మంగళవారం తాజాగా వెలువరించిన ఓటర్ల ముసాయిదా జాబితాలో హైదరాబాద్ జిల్లా ఓటర్లు 46,22,133 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 23,53,124 మంది కాగా, మహిళలు 22,68,666 మంది, థర్డ్ జెండర్లు 343 మంది ఉన్నారు. హైదరాబాద్ జిల్లా (కోర్ సిటీ) పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధికంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,89,287 మంది ఓటర్లుండగా, అత్యల్పంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో 2,54,165 మంది ఓటర్లున్నారు.

- గత ఫిబ్రవరి 8న వెలువడిన తుదిజాబితాలో జిల్లా ఓటర్లు 45,70,138 మంది ఉండగా, 51,995 మంది పెరిగి ప్రస్తుతం 46,22,133 మందికి చేరుకున్నారు. అంటే దాదాపు 52వేల మంది ఓటర్లు పెరిగారు.



తొలగించిన ఓట్లు 1.29 లక్షలు

గత తుదిజాబితా అనంతరం కొత్తగా 1,81,879 మంది ఓటర్లు తమ పేర్లు నమోదు చేయించుకోగా, 1,29,884 మంది ఓటర్లను జాబితాల్లోంచి తొలగించారు. చేరికలు, తొలగింపులు పరిగణనలోకి తీసుకుంటే 51,995 మంది (1.14శాతం) ఓటర్లు పెరిగారు. పెరిగిన ఓటర్లు (కొత్త ఓటర్లు) అత్యధికంగా యాకుత్‌పురా నియోజకవర్గంలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో కొత్తగా 8,876 మంది ఓటర్లుగా నమోదయ్యారు. గత ఫిబ్రవరిలో 3,55,979 మంది ఉండగా, ప్రస్తుతం 3,64,855కు పెరిగారు. తొలగించిన ఓటర్లలో అత్యధికంగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్నారు. అక్కడ 22,002 ఓటర్లను తొలగించారు. కొత్తగా నమోదు చేసుకున్న వారు అక్కడ 27,789 మంది ఉన్నారు. వెరసి.. 5787 మంది ఓటర్లు పెరిగారు.

ఆల్కహాల్, పొగాకుతో హైబీపీ, స్ట్రోక్ ముప్పు

- ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా వైద్యుల హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటలలోపు బాధిత వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్తే ముప్పు తీవ్రత నుండి కాపాడవచ్చు. స్ట్రోక్ ద్వారా ప్రభావితమైన మెదడు కణాలను మార్పిడి చేయలేకపోయినా, జీవించి ఉన్న కణాలను ఇంజెక్షన్ ద్వారా రక్షించవచ్చని వైద్యనిపుణులు పేర్కొన్నారు. అక్టోబర్ 29న వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా గ్రీన్ ఫీల్డ్ మల్లారెడ్డి బ్రెయిన్ అండ్ హార్ట్ హాస్పిటల్ డాక్టర్లు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మీడియా ప్లస్ ఆడిటోరియంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో న్యూరో ఫిజీషియన్ షకీబ్ అహ్రార్, న్యూరో సర్జన్ డాక్టర్ ముహమ్మద్ అలీ, జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్టు డాక్టర్ ముహమ్మద్ యూసుఫ్, సర్జన్ డాక్టర్ సతీష్ మాట్లాడారు. బ్రెయిన్ స్ట్రోక్‌లు రెండు రకాలుగా ఉంటాయని – మెదడుకు రక్తాన్ని చేరవేసే సిరలో రక్తం గడ్డకట్టినా, అప్పుడు స్ట్రోక్ వస్తుందని, మెదడు లోపలి భాగంలో నరాలు చిట్లినా ఆక్సిజన్ అందకపోవడం వల్ల స్ట్రోక్ వస్తుందని చెప్పారు. పొగాకు, ఆల్కహాల్ వినియోగం, షుగర్ వ్యాధి, ఊబకాయం, అధిక రక్తపోటు బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతాయన్నారు. దీనికి సర్జికల్, నాన్ సర్జికల్ వైద్యం అందుబాటులో ఉందన్నారు. డాక్టర్ల బృందం స్ట్రోక్ లక్షణాలను వివరించారు. నవ్వేటప్పుడు ముఖం వంకర పోయినట్లు అనిపించినా, రెండు చేతులు పైకి లేపేటప్పుడు సమయం పడుతున్నా, ఇవన్నీ స్ట్రోక్ లక్షణాలని డాక్టర్లు చెప్పారు. యువతలో వచ్చే గుండె జబ్బుల గురించి వారు మాట్లాడుతూ.. జీవన శైలిలో మార్పులు, జంక్‌ఫుడ్ తినడం, తీరిక లేని పనివేళలు, సరైన వ్యాయామం చేయకపోవడం ఇవన్నీ గుండె జబ్బులకు దారితీస్తున్నాయని అన్నారు. మొబైల్ ఫోన్ల అతి వినియోగం గురించి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లకు అలవడ్డ పిల్లలు ఒంటరితనాన్ని ఇష్టపడుతున్నారని, చిరాకు, యాంగ్జయిటీకి గురవుతున్నారని అన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం పండ్లు, కూరగాయలు తినాలని వైద్యులు సూచించారు.

ఆరుగురు మోమోస్ విక్రేతలు అరెస్టు


నిందితుడు అర్మాన్ రజిక్

బంజారాహిల్స్: రోడ్డు పక్కన తోపుడు బండ్లపై..కలుషిత ఆహార పదార్థాలతో తయారుచేసిన మోమోస్‌ను విక్రయించి ఓ మహిళ మృతికి కారకులైన ఆరుగురు విక్రేతలను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..గత శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని సింగాడబస్తీలో వారాంతపు సంతలో రోడ్డు పక్కన రేష్మాబేగం (31) అనే మహిళ తన ఇద్దరు కూతుళ్లు ధింసా, రాఫియాలతో కలిసి మోమోస్ తిన్నారు. ఆ తెల్లవారునుంచే రేష్మాబేగంతో పాటు ఆమె పిల్లలు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అనారోగ్యం పాలయ్యారు. ఫుడ్ పాయిజన్‌తో రేష్మాబేగం కన్నుమూసింది. ఆమె పిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరుసటిరోజు శనివారం నందినగర్‌లో కూడా మోమోస్ తిని 38 మంది ఫుడ్‌పాయిజన్‌తో ఆస్పత్రుల పాలయ్యారు. సింగాడబస్తీలోనూ మోమోస్ తిన్న 53 మంది ఫుడ్‌పాయిజన్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తన సోదరి మృతికి కారకుడైన మోమోస్ విక్రేతపై చర్యలు తీసుకోవాలంటూ రేష్మాబేగం సోదరుడు షారూఖ్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అర్మాన్, షాజిద్, ఫారూఖ్; మక్రం, రాదిఖ్ తదితరులపై బీఎన్ఎస్ సెక్షన్ 105, 110, 274, 275, 125 (ఏ), రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘సిటీ’పై సైబర్ ఎటాక్!

9 నెలల్లో 2336 కేసులు, రూ.231 కోట్లు స్వాహా

- వీటిలో అత్యధికం ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులే
- ఈ నేరానికి సంబంధించి 634 కేసులు నమోదు
- ఫెడెక్స్ ఫ్రాడ్‌లో ఓ వ్యక్తి కోల్పోయిందే అత్యధికం
- స్పష్టంచేస్తున్న సిటీ సైబర్ క్రైమ్ గణాంకాలు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు నగరవాసుల్ని నంజుకుంటున్నారు. పూటకో పంథాలో నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి–సెప్టెంబర్ మధ్య హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో 2336 కేసుల నమోదు కాగా..రూ.231.88 కోట్లు సైబర్ నేరగాళ్ల పరమైంది. ఓ పక్క కేసుల దర్యాప్తు, నగదు ఫ్రీజ్, రీఫండ్‌లకు ప్రాధాన్యం ఇస్తున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ‘ఈ–నేరాలపై’ అవగాహనకు పెద్దపీట వేస్తున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో క్యాంపెయినింగ్ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడటం, మోసపోవడం, ఆర్థికంగా నష్టపోవడం ఎంత తేలికో..ఈ కేసులు కొలిక్కి రావడంతో పాటు నగదు రికవరీ అంత కష్టమని అధికారులు చెప్తున్నారు.

ప్రథమ స్థానంలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్..

నగర వాసులు ప్రధానంగా 27 రకాలైన సైబర్ నేరాల బారినపడుతున్నారు. వీటిలో అత్యధికం ఆర్థికంగా నష్టం కలిగించేవైతే..మిగిలినవి మానసికంగా, వ్యక్తిగత పరువు ప్రతిష్టలకు చేటు చేసేవి. ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న సైబర్ నేరాల్లో ప్రధానంగా మూడు రకాలైనవి ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ట్రేడింగ్ ఫ్రాడ్, కస్టమ్స్ ఫ్రాడ్ తొలి స్థానాల్లో నిలుస్తున్నట్లు సైబర్ క్రైమ్ అధికారులు చెప్తున్నారు. ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ చేసే సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్నారు. వివిధ రకాలైన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ప్రకటన ఇస్తారు. దీనికి ఆకర్షితులై సంప్రదించిన వారికి కొన్ని చిన్న చిన్న టాస్క్‌లు ఇస్తారు. ఫేస్‌బుక్‌లోని అంశాలను లైక్స్ చేయడం, షేర్లు తదితరాలు చేస్తే నిర్ణీత మొత్తాలు చెల్లిస్తారు. దీంతో వీరిపై కొంత నమ్మకం కలుగుతుంది. ఆపై తమ వద్ద పెట్టుబడి పెట్టినా భారీ లాభాలు ఉంటాయని చెప్తారు. ఇలా తమ వల్లోపడిన వారు పూర్తి నమ్మకం కలగడం కోసం ప్లే స్టోర్స్, యాపిల్ స్టోర్స్‌లో ఉన్న కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. వీటి ద్వారా వాట్సాప్, టెలిగ్రామ్ తదితర గ్రూపుల్లో వారికి సభ్యులుగా చేస్తున్నారు. ఆపై ప్రత్యేక లింకుల ద్వారా తమ యాప్స్ టార్గెట్ చేసిన వారి ఫోన్లలో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. దీని డ్యాష్ బోర్డ్‌లో సదరు వ్యక్తి ఎంత పెట్టుబడి పెట్టారు? ఎంత లాభం వచ్చింది? మొత్తం ఎంతకు పెరిగింది? తదితరాలు కనిపిస్తూ ఉంటాయి. తొలినాళ్లల్లో వాళ్లు పెట్టిన పెట్టుబడికి రూ.వేలల్లో లాభాలు ఇచ్చి పూర్తిగా నమ్మిస్తారు. ఆపై పెట్టుబడి మొత్తాన్ని రూ.లక్షలు, రూ.కోట్లకు పెంచేలా చేసి ఆ మొత్తం స్వాహా చేస్తుంటారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు నమోదైన వాటిలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ 634 ఉన్నాయి.

అధిక మొత్తం పోయింది ఫెడెక్స్ ఫ్రాడ్‌లో...

డిజిటల్ అరెస్టుకు మూలమైన కొరియర్ ఫ్రాడ్, ఫెడెక్స్ ఫ్రాడ్స్ ఇటీవల ఎక్కువగా నమోదవుతున్నాయి. డార్క్ నెట్ నుంచి ఖరీదు చేసిన డేటా ఆధారంగానే ఈ సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగుతున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తులకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) విధానంలో కాల్స్ చేస్తున్నారు. ఆపై మీ డేటాతో విదేశాలకు బుక్ అయిన పార్శిల్ వెనక్కు వచ్చిందని, మీ పేరుతో మనీ లాండరింగ్ జరిగిందని, తమ ప్రతినిధితో మాట్లాడాలని చెప్తారు. అలా లైన్‌లోకి వచ్చే నేరగాళ్లు ఆ పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, సీబీఐ లేదా ఆయా నగరాల పోలీసులు మాట్లాడతారని చెప్తారు. అక్కడ నుంచి కథ వీడియో కాల్స్‌కు వెళ్తుంది. బాధితులతో వీడియో కాల్ చేసి మాట్లాడే వాళ్లు పోలీసు యూనిఫాంలోనే ఉంటారు. సీబీఐ, ఐబీ, కస్టమ్స్ లోగోలు, పేర్లతో రూపొందిన నోటీసులనూ వాట్సాప్ ద్వారా బాధితులకు పంపుతారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎక్కడకూ కదలకుండా చేసి, తీవ్రస్థాయిలో భయపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు నమోదైన 2336 కేసుల్లో మొత్తం రూ.231,88,40,435 నష్టపోగా..అత్యధిక మొత్తం ఫెడెక్స్ ఫ్రాడ్‌కు సంబంధించిందే. ఓ నగరవాసి ఈ స్కామ్‌లో ఏకంగా రూ.2.88 కోట్లు కోల్పోయారు.

ఇవీ గణాంకాలు

	2023	2024 (సెప్టెంబర్ వరకు)
నమోదైన కేసులు	2984	2336
కోల్పోయిన మొత్తం	రూ.147.22 కోట్లు	రూ.231.88 కోట్లు
కొలిక్కి వచ్చిన కేసులు	286	247
డిటెక్షన్ శాతం	9.58	10.67
అరెస్టైన నిందితులు	413	346

సైబర్ నేరాల బారినపడిన వారు 1930 నెంబర్‌ను లేదా (www.cybercrime.gov.in) పోర్టల్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలి.

ఏడాదిన్నరలో 2,624 గృహహింస కేసులు

సాక్షి, సిటీబ్యూరో: మహిళా సాధికారత కోసం సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) విభాగం నడుం బిగించింది. గృహ హింస బాధితులకు కౌన్సిలింగ్, చట్టపరమైన మార్గదర్శకత్వం, ఆచరణాత్మక మద్దతు అందించడం దీని ప్రధాన లక్ష్యం. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని సీడీఈడబ్ల్యూ విభాగం గృహ హింసపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. గతేడాది ఫిబ్రవరిలో కార్యకలాపాలను ప్రారంభించిన ఈ విభాగం ఇప్పటివరకు కమిషనరేట్ పరిధిలో ఏడు కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 2,624 గృహ హింస కేసులు నమోదయ్యాయి. 8,052 కౌన్సిలింగ్ సెషన్లను నిర్వహించారు. 999 కేసులను పరిష్కరించి మూసివేశారు. వీటిలో 43 శాతం భార్యా భర్తలు తిరిగి కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ డీసీపీ రాజేశ్, మహిళా భద్రతా విభాగం ఎస్పీ అశోక్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బాలరాజు, నాగేశ్వర్‌రావు, ప్రతాపలింగం, సునీత పాల్గొన్నారు.

మోమోస్ దుకాణాల్లో తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: కలుషిత మోమోస్ తిని ఒకరి మృతితోపాటు పలువురు ఆస్పత్రుల పాలైన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు మోమోస్ విక్రయించే దుకాణాలపై మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 110 దుకాణాల్లో నిర్వహించిన ఈ స్పెషల్‌డ్రైవ్‌లో పరీక్షల నిమిత్తం 69 శాంపిళ్లను సేకరించారు. పరీక్షల ఫలితాల అనంతరం తగు చర్యలు తీసుకోనున్నారు. కల్తీకి అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

బాణాసంచా పేలి భారీ అగ్నిప్రమాదం

- దంపతుల దుర్మరణం
- ఇంట్లో నిల్వ ఉంచడంతో మంటలంటుకుని పేలిన సిలిండర్
- పాతబస్తీలో ఘటన



మృతిచెందిన మోహన్ లాల్, ఉషా బాయి

డబీర్‌పురా/యాకుత్‌పురా: అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన టపాసులు ప్రమాదవశాత్తు పేలడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..యాకుత్‌పురా ఈస్ట్ చంద్రానగర్ ప్రాంతానికి చెందిన మోహన్‌లాల్ (55), ఉషాబాయి (50) దంపతులు. కాగా దీపావళి పండుగ సందర్భంగా మోహన్‌లాల్ దంపతులు ఇంట్లో టపాసులు నిల్వ చేసి ఉంచారు. దీంతో సోమవారం రాత్రి సమయంలో టపాసులలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలింది. మంటలు మరింత వ్యాపించడంతో స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈలోగా సమాచారం అదుకున్న అగ్రిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో మోహన్ లాల్, ఉషాభాయి, కూతురు శృతిలు తీవ్ర గాయాలకు గురయ్యారు. దీంతో స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మోహన్‌లాల్, ఉషాబాయి మృతి చెందారు. కూతురు శృతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదం విషయం తెలిసిన వెంటనే యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలసి మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన ఇంటిని సందర్శించారు. జరిగిన సంఘటనపై స్థానికులతో ఆరా తీశారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి చేరుకొన్ని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విద్యుత్ లైట్లు అమర్చుతుండగా...

అంబర్‌పేట: హోటల్‌కు దివాళీ లైటింగ్ అలంకరిస్తుండగా ప్రమాదవశాత్తు ఓ యువకుడు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఉప్పుగూడ లలిత్‌బాగ్‌కు చెందిన రమేశ్ కుమారుడు అభిలాష్(18) డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇతను ఆలీకేఫ్ చౌరస్తా ప్రాంతంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు దీపావళీ అలంకరణ లైట్లను ఏర్పాటు చేస్తున్నాడు. హోటల్‌పైన హైటెన్షన్ వైర్లు గమనించక పనులు చేస్తుండడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘జూ’లో జిరాఫీ మృత్యువాత



చార్మినార్: నెహ్రూ జూలాజికల్ పార్కులో సునామీ బసంత్ (జిరాఫీ) వృద్ధాప్యం, ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. జంతువు మార్పిడిలో భాగంగా ఢిల్లీలోని నేషనల్ జూలాజికల్ పార్క్ నుంచి 2009వ సంవత్సరంలో ఇక్కడి జూకు చేరుకున్న సునామీ బసంత్ 15 సంవత్సరాలుగా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటూ అలరించింది. గత సంవత్సరం నుంచి తీవ్రమైన ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న బసంత్ సోమవారం రాత్రి మృతి చెందిందని జూ అధికారులు పేర్కొన్నారు. నిపుణులైన పశు వైద్యులు జూ పార్కులో బసంతికి పోస్టుమార్టం నిర్వహించారు.

నేరాల నిరోధంపై సీపీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఆనంద్

బంజారాహిల్స్: ఆశ్రయం లేని వ్యక్తులు, ఒంటరిగా ఉండేవారు, మానసిక అస్థిరత కలిగిన వ్యక్తుల వల్ల జరిగే నేరాలను నిరోధించేందుకు సీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆశ్రమాలు నడిపే ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలో పెరుగుతున్న నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వీధుల్లో ఉండేవారు, యాచకులు, మానసిక స్థిరత్వం లేని వ్యక్తులను గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తూ వారిలో మార్పునకు కృషిచేయాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద స్థితిలో మతిస్థిమితం లేని వారు కనిపిస్తే లోకల్ ఏరియా పోలీసులకు తక్షణ సమాచారం ఇవ్వాలని, పోలీసులు లోకల్ ఏరియా హాస్పిటల్‌లో చూయించి షెల్టర్ హోమ్‌కు తరలిస్తారని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు

- టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి


సమీక్షా సమావేశంలో టీజీపీసీబీ అధికారులు

సనత్‌నగర్: నిబంధనలు పాటించకుండా..రసాయన వాయువులను గాలిలోకి వదిలే పరిశ్రమలపై చర్యలు తప్పవని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సభ్య కార్యదర్శి రవి హెచ్చరించారు. హైదరాబాద్, చుట్టుపక్కల పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల ప్రతినిధులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పలు సూచనలు చేశారు. అక్రమంగా నిర్వహించే పరిశ్రమలపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఘాటైన రసాయన వాయువులతో పాటు దుర్వాసనను నియంత్రించడంలో క్లస్టర్ల వారీగా పరిశ్రమల సంఘాలు కీలకపాత్ర పోషించాలన్నారు. పీసీబీ నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించకపోతే ఆ ప్రాంతంలోని సభ్యులందరిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో పీసీబీ అధికారులు తనిఖీలు చేపట్టాలని, పరికరాల నిర్వహణపై దృష్టిపెట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యాన్ని టీజీపీసీబీ సహించదన్నారు. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో మూసివేతకు ఉత్తర్వులు జారీతో సహా డిఫాల్టింగ్ పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణమే మొదటి ప్రాధాన్యత అన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రజావాణి, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనేక ఫిర్యాదులు అందాయని, వాటి సత్వర పరిష్కార చర్యలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఫార్మాస్యూటికల్స్, కెమికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన వారితో పాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు చెందిన 20 పారిశ్రామిక వాడల నుంచి 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ రఘు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇక హైడ్రా ట్రాఫిక్ కాప్స్

- ట్రాఫిక్ పోలీసులకు హైడ్రా వాలంటీర్ల సహకారం
- 50 మంది డీఆర్ఎఫ్ సిబ్బందికి శిక్షణ


శిక్షణ పొందుతున్న హైడ్రా సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా.. ఇక ట్రాఫిక్ విధుల్లోనూ భాగస్వామ్యం కానుంది. వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించనున్నారు. ఈమేరకు గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మెళకువలపై డీఆర్ఎఫ్ సిబ్బంది మెరుగైన శిక్షణ పొందారు. తొలి విడతగా 50 మంది సుశిక్షితులైన డీఆర్ఎఫ్ సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పాలు పంచుకోనున్నారు. ఆయా సిబ్బంది హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్ పేరిట రేడియం జాకెట్లు వేసుకుని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ సేవలను అందిస్తారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

తెలుగు వర్సిటీ ఫలితాలు విడుదల

నిజాంపేట్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న 13 ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల ఫలితాలను మంగళవారం బాచుపల్లిలోని యూనివర్సిటీ ఆవరణలో వర్సిటీ ఉపాధ్యక్షుడు వెలుదండ నిత్యానందరావు, పరీక్షల నియంత్రణాధికారి హనుమంతరావు విడుదల చేశారు. జులై నెలలో జరిగిన డిప్లొమో, సర్టిఫికేషన్ కోర్సుల ఫలితాలను తెలుసుకునేందుకు తెలుగు వర్సిటీ వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ప్రైవేటు మెడికల్ దుకాణాలపై డ్రగ్స్ నియంత్రణ విభాగం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, కరీంనగర్‌లోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో జరిపిన తనిఖీల్లో అధికారులు పలు అవకతవకలను గుర్తించారు. శాంపిల్ మందులతో పాటు గడువు తేదీలు దాటిన మందులను అమ్ముతున్నట్లు తేల్చారు. ఇక, డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా కొన్ని మెడికల్ షాపుల్లో మందులు అమ్ముతున్నట్టు గుర్తించారు. ఇక, కొన్ని దుకాణాల్లో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టు లేకుండా సాధారణ వ్యక్తులతో అమ్మకాలు జరుపుతున్నారని అధికారులు తెలిపారు. ప్రైవేటు దుకాణాలైనప్పటికీ ప్రభుత్వ మందులు కూడా ఉన్నట్టు గుర్తించినట్టు పేర్కొన్నారు. ఆయా మందుల దుకాణాలు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ నియంత్రణ విభాగం డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీల్లో పీజీ సీట్ల భర్తీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల క్యాంపస్ కాలేజీల్లో పీజీ సీట్లు భర్తీ అయినట్లు అధికారులు తెలిపారు. మూడో విడత, చివరి విడత కౌన్సెలింగ్‌కు నవంబరు 4 వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. మూడో విడతలో సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను 8న విడుదల చేయనున్నారు. ఇదిలా ఉండగా ఈ విద్యా సంవత్సరం కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలు అధిక సంఖ్యలో ప్రవేశం పొందినట్లు అధికారులు చెప్పారు.

మార్కెట్లకు ప్రమిదల శోభ

దీపావళి పండుగను పురస్కరించుకొని మార్కెట్లు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ఈసారి వినియోగదారులను ఆకర్షించే విధంగా వ్యాపారులు భిన్నమైన రూపాల్లో ప్రమిదలను అందుబాటులో ఉంచడంతో ప్రమిదలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంజగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, ఫిలింనగరర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు పెద్దఎత్తున అమ్మకం కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడ చూసినా దీపావళి సందడి కనిపిస్తోంది.
– బంజారాహిల్స్:












ప్రాచీన వైద్యంతోనే మెరుగైన జీవన విధానం

ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్‌గోయల్



ధన్వంతరికి నివాళులు అర్పిస్తున్న శశాంక్‌గోయల్

బంజారాహిల్స్: ప్రాచీన వైద్యంతో మెరుగైన జీవన విధానం అలవడుతుందని జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్‌గోయల్ అన్నారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఆవరణలో ఉన్న ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య నారాయణ ధన్వంతరీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్వంతరీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టాలంటే నేచురోపతి, ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ తదితర భారతీయ సంప్రదాయ వైద్యం ఎంతగానో దోహదపడుతుందన్నారు. బారతీయ సంప్రదాయ వైద్యాన్ని మరింతగా విస్తృతం చేయాలనే ఉద్దేశంతోనే ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో విశాలమైన ఆవరణను ఆయుష్ సెంటర్‌కు కేటాయించడం జరిగిందన్నారు. దేశ విదేశాల నుంచి ఇక్కడ శిక్షణ పొందుతున్న వారికే కాకుండా బయటివారికి కూడా ఇక్కడ వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ సెంటర్ తెరిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ పి.విమలకుమారి, ఆయుర్వేదిక్ డాక్టర్ భవానీ, నేచురోపతి డాక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పనులను జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పరిశీలించారు. గత కొన్ని నెలలుగా రోడ్డు నిర్మాణ పనులు ముందుకుసాగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌ను పలుమార్లు కలిసి సమస్య తీవ్రతను వారి దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలని ఇంజినీర్లను కోరారు.



పనులను పరిశీలిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

విద్యార్థుల పట్ల వివక్షను విడనాడాలి



ఏఐఎస్‌ఎఫ్ నిరసన దీక్షలో విద్యార్థి నేతలు

కాచిగూడ: విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్షతను విడనాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు అన్నారు. పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణగూడలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద విద్యార్థి నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజులపై సర్కారు నిర్లక్ష్యం, కళాశాలల కఠినత్వం తగదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలు విడుదల చేస్తామని ఇచ్చిన హామీని నేడు అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విస్మరిస్తుందన్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల రామకృష్ణ, బానోతు రఘురాం, గ్యార నరేష్, గ్యార క్రాంతి, లెనిన్, వంశీవర్ధన్ రెడ్డి, చైతన్య, అన్వర్, అంజి, రామారావు, వెంకటేష్, శరత్, శ్రావణ్, పార్వతి, శాంతికుమార్, ప్రేమ్‌కుమార్, రవితేజ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

- ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: 2025 సంవత్సరంలో చేపట్టనున్న జనాభా గణనలో కులగణనను చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా గణనలో కులగణన చేయాలని ఎన్‌డీఏ ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాలు జనతాదళ్, టీడీపీ, అప్నాదళ్, రిపబ్లికన్ అండ్ పార్టీ, జనశక్తి పార్టీ, తదితర పార్టీలతో పాటు ఆర్ఎస్ఎస్ కూడా కులగణన చేయాలని డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీలు, వామపక్షాలు, దేశంలోని ప్రజా సంఘాలు అన్ని కులగణన చేయాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు.

ట్రాఫిక్ పోలీసులపై యువకుడి వీరంగం

కేసు నమోదు

బంజారాహిల్స్: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36 నుంచి జూబ్లీహిల్స్ క్లబ్‌కు వెళ్లేదారిలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్లు లేని వారు, పెండింగ్ చలానాలను పరిశీలించేందుకు వాహనాలను ఆపుతున్నారు. అదే సమయంలో ఆ దారిలో మంగలి శ్రీనివాస్ బైక్‌పై అక్కడకు వచ్చాడు. హెల్మెట్ లేకపోవడంతో అతడిని ట్రాఫిక్ పోలీసులు ఆపి పత్రాలు పరిశీలించారు. అతడి బైక్‌పై ఎనిమిది చలాన్లు పెండింగ్‌లో ఉండడంతోపాటు హెల్మెట్ లేకపోవడంతో, ఆర్‌సీ, పొల్యూషన్ సర్టిఫికెట్ చూపించాలని కోరారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన శ్రీనివాస్ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా బైక్‌ను గట్టిగా తోసేయడంతో ఓ కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు నిందితుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిటకిటలాడిన బంగారం దుకాణాలు



శ్రీనగర్‌కాలనీ: ధన్‌తేరస్ వేడుకల సందర్భంగా సోమాజీగూడ, పంజగుట్ట, అమీర్‌పేటలోని పలు బంగారం దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. ధన్‌తేరస్ రోజున బంగారం కొనడం సెంటిమెంట్‌గా పెట్టుకున్న మహిళలు బంగారాన్ని కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపారు. బంగారం కొంటే మంచి జరుగుతున్న నేపథ్యంలో బంగారు దుకాణాల్లో సందడి నెలకొంది.

ఎన్ని ఇబ్బందులొచ్చినా చదువు మానేయొద్దు

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వచ్చినా చదువును మానేయవద్దని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు ఉన్నతంగా ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. అందుకే ఏ కారణం చేతనైనా చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టవద్దని ఆమె కోరారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదివి చదువుకున్న స్కూల్‌కు, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.

ట్రాఫిక్‌ను పరిశీలించిన అదనపు కమిషనర్



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ విశ్వప్రసాద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని సాగర్ సొసైటీ, కేబీఆర్‌పార్కు చౌరస్తాల్లో సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్‌ను నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ రాత్రి పరిశీలించారు. గత వారం రోజులనుంచి సీసీ కెమెరాల్లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుంది..అందుకు గల కారణాలు ఏంటీ అని విశ్లేషించిన అనంతరం ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ సజావుగా సాగుతుందో లేదో, ఎక్కడెక్కడ ట్రాఫిక్ నిలుస్తున్నది.. అందుకు గల కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రెండు గంటలపాటు ఆయన ఈ ప్రాంతాల్లోని సిగ్నల్స్ వద్ద నిలబడి ట్రాఫిక్ ఎలా ముందుకు కదులుతుందో పరిశీలించారు.





బంజారాహిల్స్ రోడ్ నెం.14 నందినగర్‌లో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్ల తీగలు అల్లుకోవడంతో సోమవారం 'సాక్షి'లో 'అల్లుకున్న ప్రమాదం' కథనంతో ప్రచురించమైంది. ఈ కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్ల తీగలను తొలగించారు.
– బంజారాహిల్స్

వరంగల్‌లో కళాక్షేత్రానికి గద్దర్ పేరుపెట్టాలి



పంజగుట్ట: గద్దర్ లేనిదే తెలంగాణ ఉద్యమం లేదని, తెలంగాణ రాష్ట్రం ఆయనను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని గద్దర్ గళం ప్రతినిధులు అన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, ప్రధాన కార్యదర్శి పసునూరి రవీందర్, సామాజికవేత్త ఎ.సమ్మిరెడ్డిలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ. 120 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభించిన కళాక్షేత్రానికి తెలంగాణలోనే ప్రముఖ కళాకారులు, తన ఆట, పాటతో యావత్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన గద్దర్ పేరును పెట్టడమే సమంజసమని వారు అభిప్రాయపడ్డారు. కాళోజీ కూడా తెలంగాణకు చేసిన సేవలు మరవలేనివని, కానీ ఆయన పేరుతో ఇప్పటికే హెల్త్ యూనివర్సిటీ ఉన్నందున దీనికి గద్దర్ పేరును పెట్టాలని వారు అన్నారు.

ప్రజావాణికి 'ఇందిరమ్మ ఇళ్ల' తాకిడి

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల తాకిడి పెరిగింది. నగరంలోని పాతబస్తీ నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పెద్ద సంఖ్యలో అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 588 దరఖాస్తులు అందాయి. వాటిలో 221 అర్జీలు మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

ఆర్థిక భద్రత, లావాదేవీలపై అవగాహన



ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్థిక భద్రత, లావాదేవీలపై సంబంధించి సమగ్ర అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ద్వారా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఆర్థిక నిపుణులు, శిక్షణ పొందిన బోధన సిబ్బంది హాజరై ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్పించారు. స్థిరమైన భవిష్యత్తు, సురక్షితమైన ఆర్థిక లావాదేవీల గురించి వివరించారు. వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం,ఆన్‌లైన్ గోప్యతను అర్థం చేసుకోవడం, సురక్షితంగా ఇంటర్నెట్‌ను అభ్యసించడం వంటి అంశాలను వివరించారు. పాస్‌వర్డ్ మేనేజ్‌మెంట్, సోషల్ మీడియా ఖాతాల భద్రత, కస్టమర్ కేర్ ఫోన్‌కాల్స్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ జాబ్ స్కామ్‌ల గురించి వివరించారు. బ్యాంకింగ్‌లో తాజా పోకడలు, మోసాలు జరక్కుండా విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తూ వెబ్‌సైట్‌లకు సంబంధించి చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తెలియని అపరిచితుల కాల్స్‌కు సమాధానం ఇవ్వకూడదని, ఎటువంటి వెబ్‌సైట్ లింక్‌లను తొందరపడి ఓపెన్ చేయవద్దని సూచించారు. చివరగా విద్యార్థులకు ఆయా అంశాలపై ఎంతమేర అవగాహన కలిగిందో క్విజ్ పోటీలను నిర్వహించారు. వారి సమాధానాలను, వినూత్న ఆలోచనలను, అభిప్రాయాలను తెలుసుకుంటూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ఈ వర్క్‌షాప్ కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగం,ఆర్థిక భద్రత కేవలం వృత్తిపరమైన అవసరం కాదని, వ్యక్తిగతమైన బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.

31న రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

లిబర్టీ: కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఏఐటీయూసీ స్థాపించి 105 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాలు ఈ నెల 31వ తేదీన గురువారం రోజున తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మండల కేంద్రాల్లో పట్టణ కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డాలు,ప్రధాన కూడళ్ల వద్ద పని చేస్తున్న ప్రాంతాల్లో నిర్మాణ కార్మికులు, శ్రామికులు సభలు, సమావేశాలు నిర్వహించి జెండాలు ఆవిష్కరించాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గానికి వివరించాలని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య సంగ్రామం నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి ఏఐటీయూసీ కార్మికుల పక్షాన ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. పదెకరాల స్థలం కేటాయిచాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు లంచ్ అవర్ డెమోన్‌స్ట్రేషన్‌లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనను కొనసాగించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ చక్రపాణి, అవినాష్, కిషోర్, ప్రమీల కేతావత్, పరాంకుశం, వెంకటరమణ, రవీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, ఎన్సీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత

లక్డీకాపూల్: మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న కమిశెట్టి చంద్రకళకు నిమ్స్ పీఆర్‌ఓ తొమ్మిది సంవత్సరాలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్‌పై ఉన్నారు. వారానికి మూడు రోజులు నిమ్స్ కు వస్తున్నా ఆమెకు ఇటీవల పక్షవాతం కారణంగా తన రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. ఆ పరిస్థితిలో కూడా తప్పనిసరైన డయాలిసిస్ కోసం నిమ్స్‌కు వచ్చేందుకు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. వీల్‌చైర్ అవసరం ఉన్నా అందుకు ఆమె ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో డయాలిసిస్ సమయంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన నిమ్స్ పీఆర్‌ఓ ఆశారాణి తన సొంత ఖర్చులతో మంగళవారం చంద్రకళకు వీల్‌చైర్ సమకూర్చుకుంది. ఈ కార్యక్రమంలో నిమ్స్ మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

రహమత్‌నగర్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకుడు చంద్రోఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులు అతి తక్కువ కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపిస్తూ రాష్ట్ర ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. మూసీ నది పునరుజ్జీవనం పథకం ద్వారా హైద్రాబాద్ నగరాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు సీఎం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. అది గిట్టని ప్రతిపక్ష నేతలు మూసీ పరీవాహక ప్రాంతాల పేద ప్రజలను రెచ్చగొడుతూ వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో హైద్రాబాద్ నగరం ప్రపంచ పర్యాటక నగరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలని సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతున్నదని చంద్రోఖర్‌రెడ్డి గుర్తు చేశారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

రహమత్‌నగర్ : ఓ వైద్యుడి భార్య పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మోతీనగర్‌లో నివాసం ఉండే వెంకట్ వృత్తిరీత్యా వైద్యుడు. అతడికి భార్య సుజాత (38), పిల్లలు లౌక్య (18), అమృత (15), అనిరుధ్ (9) ఉన్నారు. కాగా మంగళవారం సుజాత థైరాయిడ్‌కు సంబంధించిన టాబ్లెట్స్‌ను అధికమొత్తంలో మింగి, పిల్లలకు కూడా వేసింది. అపార్ట్‌మెంట్స్‌లో ఉండే చుట్టు పక్కల వారు గమనించి ఆమె బంధు వులకు సమాచారం అందించారు. దీంతో వీరి బంధువులు సతీష్, రఘులు 108 సాయంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం వారి పరిస్థితి స్థిమితంగా ఉన్నట్టు వైద్యులు తెలియజేశారు. కాగా వారి ఆత్మహత్యాయత్నానికి సంబంధి కారణాలు తెలియరాలేదు. బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు విజ్ఞానాన్ని పంచిన ఫీల్డ్ ట్రిప్

బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు



బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియాన్ని తిలకిస్తున్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

బంజారాహిల్స్: ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మూడో తరగతి విద్యార్థులు మంగళవారం బిర్లా ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. పిల్లల ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశంగా కొనసాగింది. 'జర్నీ త్రూ ది యూనివర్స్' పేరిట ప్లానిటోరియం షో సందర్శన నిర్వహించారు. ఖగోళ సందర్శనశాలలోని దృశ్యాలు చూస్తున్నప్పుడు చిన్నారులకు నిజంగా ఆకాశంలో విహరిస్తున్నామన్న భావన పొందినట్లు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా విశ్వం ప్రతిరూపాన్ని చూసి ఆశ్చర్యపోయారు. సౌర వ్యవస్థ, నక్షత్ర రాశులు తదితర అంశాలను తిలకించారు. అలాగే బిర్లా సైన్స్ మ్యూజియంలో పురాతన వస్తువులను తిలకించి మురిసిపోయారు. డైనోసార్లు కేవలం ఊహాత్మకమైనవి అని భావించే పిల్లలకు డైనోసారియంలో పెద్ద డైనోసార్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మ్యూజియం లోపల రాతియుగం నుంచి మానవజాతి ఆధునిక యుగం వరకు వివిధ రకాల సావనీర్లను తిలకించామని, ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్లు, ఇన్ఫర్మేటివ్ డిస్‌ప్లేలు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదం చేశాయని విద్యార్థులు వివరించారు.

నగరంలో నేడు

- ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత న్యూరాలజీ కన్సల్టేషన్ సదుపాయం ఉంది.
- దీపావళి మహా మహోత్సవ్–2024లో భాగంగా చార్మినార్ ప్రాంతంలోని శ్రీభాగ్యలక్ష్మి మందిర్ వద్ద నరక చతుర్దశి వేడుకలు జరుగుతాయి.
- జాగృతి ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 4.30 గంటలకు దీపావళి స్పెషల్ ఎడిషన్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'బాపు గారితో నేను' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, యండమూరి, ఓలేటి పార్వతీశం తదితరులు

సుల్తాన్‌బజార్: బాపుగీత, ఆయన రాత తెలుగు వారి సంస్కృతిలో భాగంగా ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో బాపు రమణ అకాడమి(ఆత్రేయపురం–హైదరాబాద్) సౌజన్యంతో అక్షజ్ఞ పబ్లికేషన్స్, హాస్యానందం నిర్వహించిన కళారత్న.. బ్నిం పుట్టినరోజు వేడుకల్లో ఆయన రచించిన 'బాపుగారితో నేను' పుస్తకావిష్కరణ మంగళవారం జరిగింది. ఇదే వేదికపై నామ రామాయణం, తెలుగు, ఆంగ్ల వ్యాఖ్యానం, అదేవిధంగా కార్టూనిస్ట్ కమల్ గిరీశం కార్టూన్ల పుస్తకావిష్కరణలు జరిగాయి. కార్యక్రమంలో బాపూ వ్యక్తిత్వాన్ని ఆయన సంధించే చమత్కారాల గురించి రమణాచారి ప్రస్తావించారు. రచయిత యండమూరి వీరేంద్రనాథ్, ప్రముఖ కవి డాక్టర్ ఓలేటి పార్వతీశం, రచయిత్రి డాక్టర్ ఉప్పలపాటి కుసుమ, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, డాక్టర్ ముదునూరు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులు సివిల్ అకాడమిలో ఉచితంగా ఇచ్చే శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ కొండ ప్రొ.నాగేశ్వర్ మంగళవారం తెలిపారు. యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష కోసం ఓయూ పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు నవంబర్– 8 వరకు దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

దివ్యాంగుల యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు


దివ్యాంగుల యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో చిన్నారులు

సనత్‌నగర్: రాష్ట్రస్థాయి ప్యారా దివ్యాంగుల యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు బేగంపేటలోని దేవనార్ బ్లైండ్ స్కూల్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో దేవనార్ బ్లైండ్ స్కూల్ యాజమాన్యం సహకారంతో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది దివ్యాంగ యోగాసన క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–20, అండర్–17 గ్రూపుల్లో ఆరు గ్రూపుల్లో పోటీలు నిర్వహించి బహుమతులు, మెడల్స్ అందజేశారు. పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులు డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో న్యూఢిల్లీ హాజియాబాద్‌లో జరిగే పోటీలకు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్, దేవనార్ ఫౌండర్ చైర్మన్ సాయిబాబాగౌడ్, తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ రామ్‌రెడ్డి, తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ టెక్నికల్ జాయింట్ సెక్రటరీ తోటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల పరీక్షా ఫలితాలు విడుదల


పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు, చిత్రంలో ఆచార్య కోట్ల హనుమంతరావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు వివిధ అంశాల్లో నిర్వహించిన వార్షిక పరీక్షల ఫలితాలను మంగళవారం విశ్వవిద్యాలయం విడుదల చేసింది. తెలుగువర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఫలితాలను ప్రకటిస్తూ ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ ఫలితాలను తెలుగు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు.

శివారులో సమగ్ర కులగణనకు

అంతా రెడీ!

నవంబర్ 25 వరకు ఇంటింటి సర్వే పూర్తయ్యేలా యంత్రాంగం చర్యలు

- 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్.. 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్
- కులగణనలో భాగంగా ఇంటింటి సర్వేలో 2,800 మంది సిబ్బంది
- గణన సర్వేపై సిబ్బందికి ఒక రోజు శిక్షణ పూర్తి చేసిన జిల్లా ప్రణాళిక శాఖ
- నవంబర్ మొదటి వారం నుంచి ఇంటింటి కులగణన సర్వే ప్రారంభం
- రాజకీయ, ఉద్యోగ అవకాశాల్లో కులగణన ఉపయోగపడుతుందని అంచనా

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో సమగ్ర కులగణన సర్వే కార్యక్రమానికి అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. నవంబర్ 6వ తేదీ నుంచి సమగ్ర కులగణన కోసం ఇంటింటి సర్వేను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కులగణనలో పాలుపంచుకోనున్న 2,800 మంది సిబ్బందికి మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సర్వేలో భాగంగా 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున కులగణనలో భాగస్వామ్యాన్ని పంచుకుంటారు. 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ సర్వేను పర్యవేక్షిస్తారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఒక్కరితో గౌరవ, మర్యాదలతో నడుచుకోవాలని అధికార యంత్రాంగం సూచించింది. సర్వే పూర్తి చేసిన ఇంటి ముఖ ద్వారం వద్ద స్టిక్కరు అతికించాలన్నారు. నవంబర్ 25 వరకు సమగ్ర కులగణనలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసేలా అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.

- రాష్ట్ర ఆవిర్భావ సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకోవటంతో ఆయా సామాజిక వర్గాల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

రాజకీయ ప్రాధాన్యత లభిస్తుందని..



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుత మొత్తం జనాభాలో బీసీలు అధికంగా ఉంటారని తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- 2011జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం జనాభా 24,60,095 కాగా, ఇందులో కుటుంబాల సంఖ్య (హౌజ్ హోల్డర్లు) 5,86,112గా ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత 2014 సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) నిర్వహించిన సందర్భంగా జిల్లాలో మొత్తం జనాభా 28,05,365 ఉండగా, ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు) 7,69,313గా ఉంది. 2011 నుంచి 2014 వరకు దాదాపు నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా జనాభా 3,45,270 పెరగగా, ఇందులో కుటుంబాల సంఖ్య (హౌజ్ హోల్డర్లు) 1,71,201గా ఉంది.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మొత్తం కుటుంబాల సంఖ్య 7,69,313 కాగా, జనాభా 28,05,365 మంది ఉన్నారు. అలాగే, జిల్లాలో కులాల వారీగా కుటుంబాల సంఖ్య, జనాభా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో ఓసీ కుటుంబాల సంఖ్య 2,96,379 కాగా, జనాభా 10,62,969 మంది ఉన్నారు. బీసీలో కుటుంబాల సంఖ్య 3,43,326 కాగా, జనాభా 12,63,522 మంది ఉన్నారు. ఎస్సీలో కుటుంబాల సంఖ్య 1,08,174 కాగా, జనాభా 3,99,572 మంది ఉన్నారు. ఎస్టీ కుటుంబాల సంఖ్య 21,434 కాగా, జనాభా 79,302 మంది ఉన్నారు.

సమగ్ర అంతా సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాలవారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపర్చనున్నారు. దీని ద్వారా రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటా

– ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం


ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, అల్వాల్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు

అల్వాల్: జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అల్వాల్‌లో జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా పోరాడతానన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరతానన్నారు. అనంతరం పలు కార్మిక నేతలు, కార్మికులు ఆయనను ఆత్మీయ సన్మానం చేశారు. అల్వాల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఆయన సమక్షంలో ప్రకటించి వారి సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాదు సత్యంగౌడ్, ఆకుల శ్రీనివాస్, జగదీష్, అశోక్‌రెడ్డి, అల్వాల్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాల వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డికి కన్నీటి వీడ్కోలు


ఇంద్రసేనారెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.ఇంద్రసేనారెడ్డి అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో ఈ నెల 27న కన్నుమూసిన విషయం విదితమే. కుటుంబ సభ్యులు విదేశాల నుంచి రావడంతో ప్రజలు, ఆత్మీయుల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని సోమవారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఎంఏ ఖాన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ మంత్రి జి.చంద్రశేఖర్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్, దైవజ్ఞశర్మ తదితరులు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మన చేతుల్లోనే.. తెలుగు భాష మనుగడ

కాచిగూడ: తెలుగు భాషపై ఇంగ్లిష్ ఆధిపత్యం చెలాయిస్తోందని, ఆ ఆధిపత్యాన్ని నిలువరించాల్సిన అవసరం ఉందని సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు భాషా విభాగాధిపతి ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు అన్నారు. నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన చిత్రపటాలు, కవితలు, నీతి పద్యాలు, వేదాలకు సంబంధించిన విషయాలతో కూడిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకు మాతృభాషకు బేధం లేదని, ఆంగ్లభాషా ప్రపంచాన్ని ఏలుతున్నందున ఆంగ్లభాషా అంటే భయాన్ని పోగొట్టుకొని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.జైకిషన్, కళాశాల సలహాదారులు డాక్టర్ వై.అశోక్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణారావు, పాండిచ్చేరి విశ్వవిద్యాలయం డాక్టర్ హెచ్.కల్పనా, సిటీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రొఫెసర్ పిల్లల మర్రి రాములు, విద్యార్థులు, అధ్యాపకులు

సమస్యల పరిష్కారానికి కృషి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణా యాదవ్, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు జల మండలి ఎండీ అశోక్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ వారిని అభినందిస్తూ టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తమ సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలను సామాన్యులకు అందేలా కృషి చేయాలని కోరారు

ఓయూ ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల ప్రవేశ పరీక్ష 9న

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ ఈవినింగ్, ఎంబీఏ(టీఎం) కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం ప్రవేశానికి నవంబర్ 9న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంపస్‌లోని ఎంబీఏ కాలేజీలో ఈవినింగ్ కొనసాగే కోర్సులో ప్రవేశానికి ఐసెట్–2024 అర్హత గల అభ్యర్థులు నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఈవినింగ్ ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి ఏదైనా కంపెనీలో రెండు సంవత్సరాలు మేనేజర్ స్థాయిలో పని చేసే అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా ఆర్టిస్టిక్ – రిథమిక్ జిమ్నాస్టిక్స్ కాంపిటేషన్ మ్యాగ్ – వాగ్, హైదరాబాద్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిమ్నాస్టిక్స్ పోటీలను యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని శ్రీసాయిరామ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న శ్రీవిద్య బంగారు, రజతం, బ్రాంజ్ మెడల్స్ సాధించింది. 7వ తరగతి చదువుతున్న పి.ప్రజ్వల్ కుమార్ బంగారు, రెండు రజత పతకాలను సాధించాడు. సీనియర్ జిమ్నాస్టిక్ కోచ్ బ్రహ్మానంద ప్రసాద్ చిన్నారులను అభినందించారు.



'టీహబ్'లో ఈబీ–5 వీసా పెట్టుబడుల సెమినార్



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఎంప్లాయిమెంట్ బేస్డ్–5 సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్‌ను మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిమెంట్ బేస్డ్–5 సీఈఓ అబ్దుల్ ఆరీఫ్ మాట్లాడుతూ వీఎస్‌పీ క్యాపిటల్‌తో పాటు 20 మిలియన్ల రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్, లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాపర్టీస్ ఫోకస్‌లో అగ్రగామిగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఈబీ–5 వీసాను ఆయన ప్రకటించారు. పెట్టుబడిదారులు, వారి కుటుంబాలు ఈ ప్రాజెక్టులో భాగం అయ్యేందుకే ఈ వీసా అని ఆయన గుర్తు చేశారు. యూఎస్‌ఏలో ఉన్న ఈబీ–5 మార్కెట్ ప్రాంతంలో డౌన్ టౌన్, సబర్బన్ ప్రాంతాలు మొదలైన ప్రధాన అభివృద్ధిని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

రాత్రికి రాత్రే అమ్మేశారు


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

- నిబంధనలకు విరుద్ధంగా రూ.వందల కోట్ల భూమి క్రమబద్ధీకరించారు
- నానక్‌రాంగూడలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి
- ఖాజాగూడ, గుట్టలబేగంపేటలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలి
- సీఎస్ శాంతికుమారికి ఫిర్యాదు చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: జీఓ నంబర్ 59ను దుర్వినియోగం చేసి వందల కోట్ల విలువైన భూములను క్రమబద్ధీకరించిన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఔటర్ సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను కొందరు నిబంధనలకు విరుద్ధంగా జీఓ నంబర్ 59లో రెగ్యులరైజ్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు, ప్రధాన సూత్రదారి పి.సురేందర్, అతడి కుటుంబ సభ్యులు బినామీ పేర్లతో వేలాది చదరపు గజాల స్థలాన్ని రెగ్యులరైజ్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా రెగ్యులరైజ్ అయిన కొద్ది గంటల్లోనే వివిధ నిర్మాణ సంస్థలకు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. డీడ్ చేసుకున్న వ్యక్తి రాత్రికి రాత్రే అమ్మేసుకున్నాడని ఆరోపించారు. డాక్యుమెంట్లు జతచేసి ఆధారాలతో సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా ఖాజాగూడ సర్వే నంబర్ 27లో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలన్నారు. గుట్టలబేగంపేటలోని సున్నం చెరువులో మట్టితో పూడ్చి అక్రమ లేఅవుట్ వేసి కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చెరువుకు పూర్వ వైభవం వచ్చేలా అధికారులను ఆదేశించాలని ఆయన కోరారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు నాగ్‌పూర్ నమూనా ప్రకారం ఒకే పిల్లర్‌పై మెట్రో రైలు నిర్మాణం చేపట్టాలని చీఫ్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లారు.

ఐ అండ్ పీఆర్ కమిషనర్‌కు డబ్ల్యూజేఐ అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం (ఐ అండ్ పీఆర్) కమిషనర్‌గా నూతనంగా స్వీకరించిన ఎస్.హరీశ్‌ను వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ) రాష్ట్ర కమిటీ అభినందించింది. సెక్రటేరియట్‌లో మంగళవారం ఆయనను కలిసి పాత్రికేయుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించింది. అక్రిడిటేషన్ కమిటీల్లో, మీడియా అకాడమీలో, ప్రభుత్వం నియమించే వివిధ కమిటీల్లో తమ యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. దేశంలోని 17 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ యూనియన్ రాష్ట్రంలో చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించింది. రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీకి సంబంధించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులను సవరించి, అన్ని జర్నలిస్ట్ సంఘాలకు కమిటీలో స్థానం కల్పించాలని కోరింది. చిన్న, మాధ్యమిక పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో, వీడియో జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కమిటీలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్, అధ్యక్షుడు రాజాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అనిల్ దేశాయ్, ప్రతినిధులు క్రాంతి, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాలు అందజేసింది.

'బృహన్నలపేట' పుస్తకావిష్కరణ


బృహన్నలపేట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సన్నిదానం నర్సింహాశర్మ, జూలూరి గౌరీశంకర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు సతీష్ చందర్ రచించిన బృహన్నలపేట పుస్తకాన్ని మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత సన్నిదానం నర్సింహాశర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మార్పులు తీసుకువచ్చే ఇలాంటి రచనలు ఎంతో అవసరం అన్నారు. సతీష్ చందర్ రచించిన ఈ పుస్తకానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. ఈ కాలం జాషువా సతీష్‌చందర్ అని, ఈ నవల నోబెల్ బహుమతికి తక్కువేం కాదన్నారు. ప్రతి వాఖ్యం ఒక కావ్యంలా కనిపిస్తుందని చెప్పారు. సమాజాన్ని అట్టడుగు పొరల నుంచి అన్నికోణాల్లో విశ్లేషిస్తూ రచనలు చేస్తున్న ఈ కాలం జాషువా అన్నారు. సాహిత్య చరిత్రలో సతీష్‌చందర్ నిలిచిపోతారని అన్నారు. ప్రముఖ నవలా రచయిత కుప్పిలి పద్మ, జర్నలిజం అధ్యాపకులు శ్రవంత్ పాల్గొన్నారు.


ఏకీకృత పోలీస్ విధానాన్ని అమలు చేయాలి



పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ప్రత్యేక బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు మూడు రోజులుగా చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని పౌర హక్కుల సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసులు రోడ్డెక్కితే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిని తొలగించడం దుర్మార్గం అన్నారు. తొలగించిన 39 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, కార్యవర్గ సభ్యులు లింగన్న, విష్ణువర్ధన్‌రావు మాట్లాడారు. ప్రత్యేక బెటాలియన్ పోలీసులు సివిల్ పోలీసుల మాదిరిగా 3 నుంచి 5 ఏళ్ల వరకు ఒకేచోట ఉద్యోగం కల్పించాలని ఏకీకృత పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని వారు గుర్తు చేశారు. ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ వ్యవస్థ వారి ప్రధాన డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆత్మవిశ్వాసంతోనే లక్ష్యసాధన


ఫెయిర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎం.శ్రీనివాస్‌రావు

కాచిగూడ: విద్యార్థులు, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివితే లక్ష్యసాధనలో ముందుకు సాగుతారని, ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వై.జహంగీర్ అన్నారు. నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో మంగళవారం జరిగిన అవంతి పీజీ కళాశాల విద్యార్థుల ఫెయిర్‌వెల్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని సూచించారు. ఎటువంటి ఆటంకాలు ఎదురైనా నిరుత్సాహానికి గురికావొద్దని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులు పట్టు సాధించాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి, స్టూడెంట్ ట్రైబ్ సీఈఓ చరణ్ లక్కరాజు, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాస్‌రావు, డైరెక్టర్(హెచ్ఆర్) డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎంబీఏ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుక, కళాశాల అడ్మిన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 30, అక్టోబర్, 2024

నగరం ఓ మినీ ఇండియా. నార్త్, సౌత్, నార్త్ ఈస్ట్‌తో పాటు మధ్య భారతం, పశ్చిమ, వాయువ్య భారతం అంతా కనిపిస్తుంది. నోరు విప్పి మాట్లాడిన తరవాత భాషను బట్టి వారిది ఏ రాష్ట్రమో తెలుస్తుంది. కానీ మహిళల వస్త్రధారణ మౌనంగా మాట్లాడుతుంది. ఇండియన్ ఫ్యాషన్ అవుట్ ఫిట్‌లో చీరది ప్రత్యేకమైన స్థానం. చీరలకు అతి పెద్ద షోకేస్ హైదరాబాద్ నగరం. వెస్టర్న్ ప్యాటర్న్స్ ఎన్ని వచ్చినా వాటిని స్వాగతిస్తూనే ఉంది.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



శారీ.. ఫర్ ఎవర్

చీర మీద ఫ్యాషన్ ముద్ర

ఇండియన్ అవుట్ ఫిట్‌లో ప్రత్యేక స్థానం
ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్ సృష్టిస్తూ
పాతికేళ్లుగా పక్కకు పోనివ్వకుండా
చీర చుట్టూ తిరుగుతున్న ఫ్యాషన్ మార్కెట్



చీర చుట్టూ ఫ్యాషన్..

పాతికేళ్ల క్రితం హైదరాబాద్‌లో నూటికి 70 నుంచి 80 శాతం మహిళలు రోజూ చీరలే ధరించేవారు. క్రమంగా 2015 నాటికి 40 శాతానికి పరిమితమైంది. వర్కింగ్ ఉమెన్స్, డాక్టర్లు, లెక్చరర్లు చీరలతోనే డ్యూటీ చేశారు. ఇప్పుడిది పాతిక శాతం మాత్రమే ఉంది. ఆధునిక వనితల వార్డ్‌రోబ్‌లో చుడీదార్, జీన్స్ డైలీ వేర్ స్థానాన్ని ఆక్రమించాయి. కానీ చీర మాత్రం దూరం కాలేదు. తనను తాను మార్చుకుంటూ ఎప్పటికప్పుడు ఫ్యాషనబుల్‌గా మారుతోంది చీర. అందుకే శారీఫ్యాషన్ ఎప్పటికీ తెరమరుగు కాదు.

పాతికేళ్ల కిందట ఒక టేబుల్ వేసుకుని కాటన్ వస్త్రం మీద అందమైన డిజైన్లను అద్దడంతో చీర కొత్త పుంతలు తొక్కింది. అప్పటి వరకూ చేనేతకారులు తరతరాల సాదా మోడల్స్ దగ్గరే ఉన్నారు. సూరత్‌లోని టెక్స్‌టైల్ మిల్స్ ఒక డిజైన్ రూపొందిస్తే ఆ డిజైన్‌లో వేలాది చీరలు దేశమంతటా విస్తరించేవి. అలాంటి సమయంలో ఒక చీరకు అద్దిన డిజైన్ మరో చీరలో ఉండకూడదని, వేటికవే వినూత్నంగా ఉండాలని మహిళా డిజైనర్లు చేసిన ప్రయోగం సక్సెస్ అయ్యింది. ప్రతిదీ యూనిక్‌గా ఉండాలని కోరుకునే మహిళలకు ఈ ప్రయోగం ఓ వరంలా కనిపించింది. డిజైనర్లు రూపొందించిన డిజైన్లకే పరిమితం కాకుండా సొంత డిజైన్లు గీసి మరీ చేయించుకోవడం మొదలైంది. క్రమంగా అద్దకం ఓ ట్రెండ్ అయ్యింది. చీరను ట్రెండ్ నుంచి పక్కకు పోనివ్వకుండా కాపాడుకుంటూనే ఉంది మెట్రో ఫ్యాషన్. పాతికేళ్లుగా హైదరాబాద్ ఫ్యాషన్ ట్రెండ్‌ని గమనిస్తున్న ప్రముఖ డిజైనర్ గాయత్రి రెడ్డి చెబుతున్న మాట ఇది.

నేతలో క్రియేటివిటీ..

చీర మీద అద్దిన డిజైన్ హైలైట్ కావడానికి డిజైన్ అవుట్ లైన్ ఎంబ్రాయిడరీ చేయడం మరో ప్రయోగం. అక్కడి నుంచి మగ్గం వర్క్ మొదలైంది. చీరతోపాటు బ్లౌజ్‌కు ఎంబ్రాయిడరీ, చీర కంటే బ్లౌజ్‌కు పెద్ద ఎంబ్రాయిడరీ, బ్లౌజ్‌కు హైలైట్ కావడానికి ప్లెయిన్ చీర కాంబినేషన్ వంటి ప్రయోగాలన్నీ సక్సెస్ అయ్యాయి. ఇదే సమయంలో మహిళా డిజైనర్లు తమ క్రియేటివిటీని చేనేత వైపు మళ్లించారు. పోచంపల్లి, ఇకత్ నుంచి నారాయణ పేట, ఉప్పాడ, ధర్మవరం, వెంకటగిరి, పాటూరు వంటి నేతలన్నింటికీ ఫ్యాషన్ లుక్ తెచ్చారు. దాంతో ఫ్యాషన్ ప్రపంచాన్ని చేనేత శాసించేంతగా డిజైన్లు పాపులర్ అయ్యాయి. పట్టు చీరల బరువు తగ్గించడంలో విజయవంతమయ్యారు. దాదాపు క్రేప్ మాదిరి తేలిగ్గా ఉంటోందిప్పుడు.



వాతావరణం మారింది

నగరంలో ఏడాదిలో పది నెలలు చల్లని వాతావరణం ఉండేది. ఈ పాతికేళ్లలో బాగా మార్పులు వచ్చాయి. ఏడాదిలో పది నెలలు వేడిగా ఉంటోంది. వెదర్‌కు అనుకూలంగా ఉండేటట్లు డిజైనర్ శారీస్ కాటన్‌లో తీసుకురావడం కొత్త తరం మహిళలు చీర్లపై మోజు పడడానికి ఓ కారణం. చీర కట్టే రోజులు తగ్గినా.. కొనడం మాత్రం తగ్గలేదు. ప్రతి ఫంక్షన్‌కీ ఓ కొత్త చీర కొనే ట్రెండ్ వచ్చేసింది. సాఫ్ట్‌వేర్ ఉమన్స్ పార్టీలకు చీరలో మెరిసిపోతున్నారు. రోజూ చుడీదార్ ధరించే వాళ్లు కూడా బర్త్‌డే పార్టీ, గెట్ టు గెదర్ వంటి వాటికి చీర కడుతున్నారు.





‘బ్రెయినీ బోట్స్’కు ఏఐ అర్జున అవార్డ్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కెఎల్‌హెచ్ యూనివర్సిటీ (అజీజ్‌నగర్) ఆధ్వర్యంలోని బ్రెయినీ బోట్స్ టీమ్ జాతీయస్థాయి ఎస్ఎక్స్‌పీఏఐఎమ్ పోటీల్లో నాల్గో స్థానం దక్కించుకుంది. ఈ విషయాన్ని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ టీమ్‌లో బీటెక్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, ఆవిష్కరణ పరంగా, సమస్యల పరిష్కారంలో చూపిన ప్రతిభకు గానూ ఈ టీమ్‌కు ఏఐ అర్జున అవార్డ్‌తో పాటు రూ.10వేల నగదు పురస్కారం లభించిందని వివరించారు. ఈ బృందంలో విద్యార్థులు లక్ష్మి, నౌషీన్, మేఘన ఉన్నారని తెలియజేశారు.



ఫుట్‌పాత్‌పై.. బొమ్మల కొలువు..

రాజస్థాన్ నుంచి దిగుమతి
దీపావళి ప్రత్యేక మార్కెట్
నగరంలో ఏటా ఇదో ట్రెండ్





సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై దేవతామూర్తుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా యేటా ప్రత్యేకంగా అమ్మకాలు ఉంటాయి. నగరవాసులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారు. రాజస్థాన్‌లో తయారు చేసిన వేలాది బొమ్మలను తయారీ దారులు ఇక్కడ విక్రయిస్తారు. తాజాగా ఏర్పాటు చేసిన మార్కెట్‌లో వివిధ రంగులు, ఆకృతుల్లో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, బుద్ధుడు, ఛత్రపతి శివాజీ, ఏనుగు, నెమలి, కలశం, లాఫింగ్ బుద్ధ వంటి బొమ్మలు పెద్ద సంఖ్యలో అమ్మకానికి ఉంచారు. ముసారంగ్‌బాగ్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం, లింగంపల్లి, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో బొమ్మల కొనుగోళ్లకు నగరవాసులు మంగళవారం ఆసక్తి చూపించడం కనిపించింది.

సైజును బట్టి ధర..

ఒక్కో బొమ్మ సైజు, వినియోగించిన మెటల్, తయారీ విధానం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ధరలు నిర్ణయిస్తున్నారు. చిన్న బొమ్మలు రూ.300 ఉండగా, పెద్ద సైజు బొమ్మ రూ.4,500 వరకూ ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. పెద్ద బొమ్మలు ప్రత్యేకంగా ఆకర్షణీయమైన స్టాండ్స్‌తో అందిస్తున్నారు.

దీపావళి ప్రత్యేక మార్కెట్..

ప్రతి సంవత్సరం మేం రాజస్థాన్ నుంచి బొమ్మలను తెస్తాం. హైదరాబాద్‌లో దీపావళికి ప్రత్యేక మార్కెట్ ఉంటుంది. పెద్ద సంఖ్యలో బొమ్మలు కొనుగోలు చేస్తారు. సుమారు 500 కుటుంబాల వరకూ ఇక్కడకు వస్తారు. వినాయక చవితి, దేవీ నవరాత్రులు, ఇతర బొమ్మలు తయారు చేసి అమ్మకాలు సాగిస్తుంటాం.



- ఓం ప్రకాష్, బొమ్మల వ్యాపారి, రాజస్థాన్



పవర్‌ఫుల్ దియాస్

సాధారణంగా దీపావళి అంటే.. ఇంటి చుట్టూ సంప్రదాయ మట్టి ప్రమిదల్లో ఒత్తి, నూనె వేసి దీపాలను వెలిగిస్తుంటారు. ఇవి గాలికి తరచూ ఆరిపోతుంటాయి. మరికొంత మంది కొవ్వొత్తులను వెలిగిస్తుంటారు. వెలిగించిన కొద్ది సేపటికే కరిగిపోతుంటాయి. ఖర్చుతో కూడినవే కాకుండా పరోక్షంగా వాతావరణ కాలుష్యానికీ కారణమవుతున్నాయి. ప్రస్తుతం వీటి స్థానంలో స్మోక్‌లెస్ క్యాండిల్స్, జ్యోతిర్లింగాలు, క్రిస్టల్ క్యాండిల్, ఎల్ఈడీ లైట్స్, కొవ్వొత్తిని పోలిన రంగురంగుల విద్యుత్ డెకరేషన్ దీపాలు అందుబాటులోకి వచ్చాయి. సంప్రదాయ ప్రమిదలతో పోలిస్తే.. ఈ డెకరేషన్ లైట్ల ఖరీదు కొంత తక్కువే. చిమ్మ చీకట్లో ఇంటి ప్రధాన ద్వారం సహా ప్రహరీలు, బాల్కనీలు, ఎలివేషన్ గోడలపై మిరమిట్లు గొలుపుతూ కనువిందు చేస్తుంటాయి. - సాక్షి, సిటీబ్యూరో

తక్కువ ధరకే లభిస్తున్న లైట్లు..
పెద్ద ఎత్తున కొనుగోలు



మార్కెట్‌ను ముంచెత్తిన డెకరేషన్ లైట్స్ | మినుకు మినుకుమంటూ మిరమిట్లు గొలుపుతున్న వైనం | ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, ఆఫీసులు ముస్తాబు

దీపావళి వేళ గృహ, వాణిజ్య సముదాయాల్లో ఎక్కువగా విద్యుత్ దీపాలను అమర్చుతున్నారు. ఎలక్ట్రీషియన్‌తో పని లేకుండా నేరుగా గృహ యజమానులే వీటిని ఇంటి ముందు అందంగా అమర్చుకుంటున్నారు. దీపావళి మొదలు.. కార్తీక మాసం పూర్తయ్యే వరకూ ఇంటి ముందు ఈ లైట్లను వెలిగిస్తుంటారు.

కస్టమర్ల అభిరుచి మేరకు..

కస్టమర్ల అభిరుచి మేరకు వ్యాపారులు లైట్లను షోకేసుల్లో చూపిస్తున్నారు. చైనా నుంచి పెద్ద ఎత్తున నగర మార్కెట్‌లోకి ఈ డెకరేటీవ్ లైట్లు దిగుమతి అవుతున్నాయి. రూ.100 నుంచి రూ.700 వరకూ ధర పలుకుతున్నాయి. జ్యోతిర్లింగాలు, క్రిస్టల్ క్యాండిల్ లైట్స్, ఇలా ఒక్కో పీసు మార్కెట్లో ధర రూ.45 నుంచి రూ.50 వరకూ పలుకుతోంది. వరుస పండుగల నేపథ్యంలో వీటిని కొనేందుకు నగరవాసులు ఆసక్తికనబరుస్తున్నారు. దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి వంటి పండుగలకు తక్కువ ఖర్చుతో వెలుగులు జిమ్మే లైటింగ్ ఏర్పాటు చేసుకోవచ్చని చెబుతున్నారు.



అబిడ్స్ కేంద్రంగా అమ్మకాలు..

అబిడ్స్ ట్రూప్ బజార్‌లో సుమారు వెయ్యి దుకాణాల వరకూ ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ రోజుకు కనీసం కోటి రూపాయలకుపైగా వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. ప్రస్తుతం దీపావళి నేపథ్యంలో ఆయా దుకాణాలన్నీ రద్దీగా మారాయి. ఎల్బీనగర్, కూకట్‌పల్లిలో గ్లో ఎల్ఈడీ ఫ్యాక్టరీ అవుట్‌లెట్ ప్రారంభించింది. ఆర్కిటెక్ ఇంటిరీయల్ లైట్స్‌తో పాటు డెకరేషన్ లైట్లను కూడా విక్రయిస్తున్నారు. కనీసం 50 నుంచి వంద లైట్లు ఆర్డర్ ఇస్తే నచ్చిన మోడల్‌లో తయారు చేసి ఇస్తున్నారు.

టాక్సిక్.. షో 2న

సాక్షి, సిటీబ్యూరో: స్టాండప్ కామెడీ స్టార్‌గా పేరొందిన ఉత్తరాది స్టాండప్ కమెడియన్ అభిషేక్ ఉపమన్యు నగరంలో రెండు రోజుల పాటు నవ్వులు కురిపించనున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో వచ్చే శనివారం, ఆదివారం రోజుకు రెండు చొప్పున అభిషేక్ ప్రదర్శనలు ఉంటాయి. వర్తమాన సామాజిక పరిస్థితులపై, మారుతున్న కుటుంబ బంధాలపై చమక్కులతో చురుక్కుమనిపించే వ్యంగ్యోక్తుల వర్షంలో తడిసి ముద్దావ్వాలని కోరుకుంటే.. అభిషేక్ షో బెస్ట్ ఛాయిస్. ఎంట్రీలకు బుక్ మై షోలో సందర్శించవచ్చు.

13న చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో : రెయిన్ బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ, దాశరథి ఫిల్మ్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించనున్న లఘుచిత్రాలు పోటీలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలు 13 నవంబర్ 2024న హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. విజేతలకు నగదు బహుమతులు, ఎంపికైన అన్ని చిత్రాలకూ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ చిత్రాల్లో 5 నుండి 18 సంవత్సరాలలోపు వారే నటించాలి. చిత్రాల నిడివి 5 నుండి 15 నిముషాల లోపు ఉండాలి. నవంబర్ 07 లోపు మెయిల్ ఐడి : mohanfilmacadamy@gmail.com. ఎంట్రీలు పంపాలి. ఎంట్రీ ఫీజు రూ.500/- విజేతలకు 14న ముగింపు ఉత్సవంలో బహుమతులు అందచేస్తారు. 8978251150లో సంప్రదించాలని సొసైటీ కార్యదర్శి కె.మోహన్ తెలిపారు.



బెయిల్ రద్దుకే కుట్ర.. బాధితుడు జగనే

వైఎస్ విజయమ్మను ఉద్దేశించి రాసిన లేఖలో వైఎస్సార్ సీపీ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి న్యాయపరమైన ఇబ్బందులు కలిగించి ఆయన బెయిల్ రద్దుకు జరుగుతున్న కుట్రపూరిత వ్యవహారాలను వైఎస్ విజయమ్మ తన లేఖలో ఎందుకు ప్రస్తావించలేదని వైఎస్సార్‌సీపీ ప్రశ్నించింది. షర్మిల భావోద్వేగాలు, ఒత్తిళ్లకు లొంగి సరస్వతి కంపెనీ షేర్ల సర్టిఫికెట్లు పోయాయంటూ.. జగన్ సంతకాలు లేకుండానే షేర్లు బదిలీ చేయడం మోసపూరితం కాదా? అని నిలదీసింది. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడమే కాకుండా ఆయన కుమారుడు వైఎస్ జగన్‌ను అక్రమంగా 16 నెలలు జైల్లో పెట్టిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలంటూ ఎన్నికలకు కొద్ది గంటల ముందు విజయమ్మ వీడియో రికార్డింగ్‌ను విడుదల చేసినప్పుడు వైఎస్సార్ అభిమానులు తీవ్రంగా కలతచెందారని తెలిపింది. వైఎస్ విజయమ్మ రాసిన లేఖపై స్పందిస్తూ ఈమేరకు వైఎస్సార్‌సీపీ ఆమెను ఉద్దేశించి ఓ లేఖను విడుదల చేసింది. షర్మిల ఎన్నో రకాలుగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా జగన్ ఒక్కరోజు కూడా తన చెల్లెలిని ఒక్క మాట కూడా అనలేదనే విషయాన్ని గుర్తు చేసింది. చెల్లెలుపై ప్రేమాభిమానాలతోనే జగన్ తన స్వార్జిత ఆస్తుల్లో షర్మిలకు వాటా ఇచ్చేందుకు ఎంవోయూ చేశారని... అవి కుటుంబ ఆస్తులే అయితే ఎంవోయూ చేయాల్సిన అవసరం ఉండదు..చట్టా రీత్యా హక్కు వస్తుంది కదా? అని పేర్కొంది. అసలైన బాధితుడైన జగన్‌కు బాసటగా ఉండటం విజయమ్మ ధర్మమని స్పష్టం చేసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణిగా, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాతృమూర్తిగా విజయమ్మను అమితంగా గౌరవిస్తామని పేర్కొంది. వాస్తవాలను ఆమెకు, ప్రజల ముందు ఉంచేందుకు వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన లేఖ పూర్తి పాఠం ఇదీ...

బెయిల్ రద్దు కుట్రను విజయమ్మ ఎందుకు ప్రస్తావించ లేదు?

ప్రజలను పక్కదోవ పట్టించడమే

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని న్యాయపరంగా ఇబ్బంది పెట్టేందుకు... తద్వారా బెయిల్ రద్దుకు పన్నిన కుట్ర వ్యవహారాన్ని విజయమ్మ తన లేఖలో కనీసం ప్రస్తావించ లేదు. అది ప్రజలను పక్కదోవ పట్టించడమే. సరస్వతీ కంపెనీ విషయంలో ఈడీ అటాచ్‌మెంట్ ఉంది. తెలంగాణ హైకోర్టు స్టేటస్‌కో ఆదేశాలు ఉన్నాయి. యాజమాన్య బదిలీ జరిగేలా క్రయవిక్రయాలు చేయకూడదని అటాచ్‌మెంట్లో ఉందనే విషయం అందరికీ తెలుసు. సరస్వతీ కంపెనీ విషయంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయవద్దని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీలతో సహా పలువురి న్యాయసలహాలు ఉన్నాయి. అయినప్పటికీ తప్పని తెలిసినప్పటికీ.. మోసపూరితంగా, కుట్రపూరితంగా షేర్లు బదిలీ చేసిన మాట వాస్తవమే కదా...! షర్మిల భావోద్వేగాలకు, ఒత్తిళ్లకు గురై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి న్యాయపరంగా, చట్టపరంగా చిక్కులు తెచ్చే ఈ పనికి తెలిసి కూడా విజయమ్మ ఆమోదించి సంతకం పెట్టడం నిజమేకదా...! విజయమ్మ తన లేఖలో ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులను పక్కదోవ పట్టించడమే.

కాంగ్రెస్‌కు ఓటేయమని విజయమ్మ ఎలా అంటారు?

ఆనాడే వైఎస్సార్ అభిమానులు తీవ్ర కలత చెందారు

2024 ఎన్నికల్లో జగన్ ఒక్కరే ఒకవైపున ఉంటే... అటువైపు చంద్రబాబు నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు అంతా జట్టు కట్టారు. మరికొన్ని గంటల్లో ఎన్నికల ప్రచారం ముగుస్తుందనగా.. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో పెట్టిన కాంగ్రెస్ పార్టీకి, తన కుమారుడు జగన్‌ను అన్యాయంగా 16 నెలలు జైల్లో పెట్టిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయమని కోరుతూ విజయమ్మ వీడియో విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెడుతూ.. తాను షర్మిలవైపు ఉన్నాననే విషయాన్ని తద్వారా చాలా స్పష్టంగా చెప్పారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్ కుటుంబంపై నిరంతరం కుట్రలు పన్నే చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసేలా ఇలా వ్యవహరించడం ధర్మమేనా..! రాజకీయాలు పక్కనపెడితే ఒక తల్లిగా ఆరోజు విజయమ్మ మద్దతు సంగతి దేవుడెరుగు...కనీసం తటస్థ వైఖరిని మరిచిపోయి పక్షపాతం వహించిన వైనం చూసి వైఎస్సార్ అభిమానులు తీవ్ర కలత చెందారు. బాధపడ్డారు.

సర్టిఫికెట్లు పోయాయని..

మోసపూరితంగా షేర్ల బదలాయింపు

సరస్వతీ కంపెనీ వ్యవహారంలో షర్మిల భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో షేర్ల సర్టిఫికెట్లు పోయాయని విజయమ్మ చెప్పారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు లేకుండానే, జగన్ సంతకాలు లేకుండానే ఎవరికీ తెలియకుండా మోసపూరితంగా షేర్లు బదిలీ చేశారు. తన కుమారుడికి న్యాయపరంగా ఇబ్బందులు వస్తాయని, అది బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసినా అలా చేశారు. తద్వారా తాను షర్మిలతోనే ఉన్నానని మరోసారి స్పష్టంగా చెప్పారు.

షర్మిలను ఏనాడూ ఒక్క మాట అనని జగన్..

వైఎస్ జగన్‌కు షర్మిల వ్యక్తిగతంగా రాసిన లేఖ టీడీపీ సోషల్ మీడియా ఖాతాలో ప్రత్యక్షమైంది. విజయమ్మ కూడా సంతకం చేసిన ఆ లేఖను టీడీపీ విడుదల చేయడం ఏమిటి...? ఇంత జరిగినా జగన్ ఏనాడూ తన చెల్లెలను ఉద్దేశించి ఒక్కమాట కూడా మాట్లాడ లేదు. కానీ షర్మిల ఎన్నోసార్లు వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు.


ఎన్నికల సమయంలో విజయవాడలో జగన్‌పై దాడి జరిగితే హేళనగా మాట్లాడారు. షర్మిలను సరిదిద్దాలని విజయమ్మ ఏనాడూ ప్రయత్నించకపోవడం ఆమె వైఖరిని ప్రశ్నిస్తున్నాయి.

బాధితుడు జగనే...

కోర్టు కేసులపై ప్రతికూల ప్రభావితం పడేలా షర్మిల ప్రవర్తన, చర్యలు ఉంటున్నాయి. ఓ వైపు ఆస్తులపై హక్కులు కోరుతూ మరోవైపు అందుకు విరుద్ధంగా ఆమె వ్యవహరిస్తున్నారు. అక్రమ కేసులపై వైఎస్ జగన్ పోరాటం చేస్తుంటే... వాటి ఫలితాలు ఎలా ఉంటాయన్న దానిపై తనకు ఎలాంటి ఆందోళనలేనట్టు ఆమె ప్రవర్తిస్తున్నారు. జగన్‌ను రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీసేందుకు అనుగుణంగానే ఆమె వ్యవహరిస్తున్నారు. షర్మిల వేసే ప్రతి అడుగూ ప్రత్యర్థులకు లబ్ధి చేకూర్చేలా ఉంటోంది. మూడు నాలుగేళ్లుగా ఇంత జరుగుతున్నా జగన్ ఓపికతో, సహనంతో, మౌనంగా ఆ బాధను భరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు బాధితులు ఎవరు...? ఒక తల్లిగా విజయమ్మ ఎవరికి బాసటగా ఉండాలనే బలమైన ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

రచ్చ కెక్కింది... పరువు తీసింది షర్మిలే

రాజకీయాల పేరిట తెలంగాణలో అడుగుపెట్టిన దగ్గరనుంచి అవకాశం వచ్చిన ప్రతిసారి జగన్‌ను షర్మిల ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. అక్కడ నుంచి ఒక్కసారిగా మాయమై వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఎఫ్ఐఆర్‌లో పెట్టిన పార్టీకి... అన్నను 16 నెలలు జైల్లో అక్రమంగా నిర్బంధించిన పార్టీకి ఈ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలిగా వచ్చారు. రాజకీయాలు ఇంతే అనుకున్నా ప్రజాస్వామ్య విమర్శల పరిధిని దాటి ఆజన్మ శత్రువు మాదిరిగా జగన్‌ను షర్మిల అనరాని మాటలు అంటున్నారు. ఎన్నికల సమయంలో జగన్‌పై దాడి జరిగితే ఎగతాళి చేసి అమానవీయంగా మాట్లాడింది షర్మిల కాదా..? వీటన్నింటినీ జగన్ ఓపికతో భరించారు. మరి రచ్చకెక్కింది ఎవరు... పరువుతీసింది ఎవరు... నిజమైన బాధితుడు ఎవరు... జగనే కదా..!!



విచక్షణ విస్మరించిన విజయమ్మ

కుమార్తె ప్రభావం, ఒత్తిళ్లతో విజయమ్మ విచక్షణ విస్మరించారు. కుమార్తెను వెనకేసుకువచ్చే ధోరణితో సరస్వతీ కంపెనీ విషయంలో తనవంతు పాత్ర పోషిస్తూ చట్టవ్యతిరేక పనులకు తోడ్పడ్డారు. తన కుమారుడు ఎదుర్కోబోయే చట్టపరమైన సంక్లిష్ట పరిస్థితులేంటో తెలిసి కూడా విజయమ్మ దాన్ని విస్మరించారు. ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం ఇదే.

ఉమ్మడి ఆస్తులే అయితే ఒకరి కంపెనీల్లో ఒకరికి ఎందుకు వాటాలు లేవు?

వైఎస్సార్ ఆ ఆస్తులను షర్మిలకు ఎందుకు పంచలేదు?

వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉన్నపుడే జగన్ కంపెనీలు నడిపారు. అలాగే షర్మిల తన కంపెనీలను తాను నడిపారు. ఉమ్మడి ఆస్తులు అయితే మరి ఒకరి కంపెనీల్లో ఒకరికి వాటాలు ఎందుకు లేవు? వైఎస్సార్ మనోభావాలు, ఆజ్ఞ వేరేలా ఉంటే ఇలా ఎందుకు జరిగింది ? తన కుమార్తెకు వైఎస్సార్ పూర్వీకుల ఆస్తులతో పాటు తాను సంపాదించిన ఆస్తులను ఇచ్చారు. జగన్ ఆస్తులు తనవి కాదు కాబట్టే ఇవ్వలేదు. ఎందుకంటే అవన్నీ జగన్ స్వార్జితం కాబట్టి.

తన స్వార్జిత ఆస్తులను షర్మిలకు ఇచ్చిన జగన్

షర్మిలకు వివాహమైన 20 ఏళ్ల తర్వాత జగన్ తన స్వార్జిత ఆస్తుల్లో కొన్నింటిని చెల్లెలిపై ప్రేమానురాగాలకొద్దీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కోర్టు కేసుల నేపథ్యంలో 2019లో ఆమెకు మంచి చేస్తూ ఒక ఎంఓయూ రాసి ఇచ్చారు. అంతేకాకుండా గడచిన పదేళ్లలో దాదాపు రూ.200 కోట్లు పైచిలుకు జగన్ ద్వారా షర్మిల పొందినా ఆమె తన సోదరుడిపట్ల ఏమాత్రం కృతజ్ఞత చూపలేదు.

ఉమ్మడి ఆస్తులే అయితే ఎంవోయూ ఎందుకు ?

తన స్వార్జిత ఆస్తులను ప్రేమానురాగాలతో షర్మిలకు ఇస్తున్నట్లు జగన్ ఎంఓయూ రాస్తే... దానిపై విజయమ్మ, షర్మిల ఇద్దరూ సంతకాలు చేశారు. అంటే దీని అర్థం జగన్ స్వార్జిత ఆస్తుల్లో హక్కులేదని ఆరోజు వారు మనస్ఫూర్తిగా అంగీకరించినట్టేగా? మరి ఇప్పుడు ఉమ్మడి ఆస్తులు అంటూ లేఖలో పేర్కొనడం ప్రజలను తప్పుదోవ పట్టించడానికే కదా. నిజంగా ఉమ్మడి ఆస్తులే అయితే వాటిని పంచుకునే పద్ధతి ఇలా ఎంఓయూల రూపంలో ఉండదు... చట్టరీత్యా హక్కుగా వస్తుందని ప్రతి కుటుంబానికి తెలుసు.

షర్మిల ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టారా ?

ఇంత యాగీ చేస్తున్న షర్మిల ఈ సంస్థల్లో ఒక్క రూపాయి అయినా పెట్టుబడి పెట్టారా? ఒక్కరోజైనా కంపెనీ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారా? కంపెనీలకున్న రూ.1400 కోట్ల అప్పుల్లో తన వాటా కింద వ్యక్తిగత పూచీకత్తు ఇస్తూ సంతకం పెట్టారా? రూ.500 కోట్ల నష్టాల్లో అయినా ఆమె పాత్ర ఆమె పోషించారా? ఈ కంపెనీలకు సంబంధించిన కష్టాల్లో, చిక్కుల్లో, కోర్టు కేసుల్లో ఏరోజైనా తానుగా బాధ్యత తీసుకున్నారా?

వాటాలు ఉంటే ఇలా నష్టం చేస్తారా?

ఈ కంపెనీల మీద, జగన్ మీద ఎవరైతే కేసులు పెట్టారో వారికి రాజకీయ ప్రయోజనం కల్పించేలా షర్మిల వారిని బలపరుస్తున్నారు. కంపెనీలను బలహీనపరుస్తున్నారు. ఆమె నడవడిక, వైఖరి చూస్తే ఈ కంపెనీల్లో వాటాలు ఉన్నాయని ఎవరికైనా అనిపిస్తుందా? నిజంగా వాటాలు ఉంటే ఇలా చేస్తారా? ఇలా జగన్‌ను, ఆయన కంపెనీలను ఇబ్బందులు పాలు చేస్తారా?

కోర్టులే నిర్ణయిస్తాయి

ఇప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ వ్యవహారం కోర్టులో ఉంది. ఇరువురి వాదనలు ప్రజలముందు ఉన్నాయి. ఎవరు చేసింది సరైనదో, ఎవరివైపు న్యాయం ఉందో కోర్టులే నిర్ణయిస్తాయి.

జగన్ స్వార్జిత ఆస్తి కోసం షర్మిల యాగీ ఏమిటి?

జగన్ స్వార్జితమైన ఆస్తిలో ఎలాంటి హక్కులేకపోయినా, ఆ ఆస్తిలో తనకు భాగం కావాలని షర్మిల ఇంత రాద్ధాంతం చేయడం ఏంటి? ఇంత యాగీ చేయడం ఏంటి? ఇన్ని లేఖలు రాయడం ఏంటి? ఆ లేఖను టీడీపీ విడుదల చేయడం ఏంటి? ఆమె పద్ధతి, ప్రవర్తన మారి తన ప్రేమానురాగాలను చూరగొంటే, కోర్టు కేసులు పరిష్కారం అయిన తర్వాత ఆమెకు ఏమేరకు మంచి చేయాలో, ఎంత చేయాలో, ఏం చేయాలో ఆరోజు నిర్ణయం తీసుకుంటానని జగన్ ఇదివరకే స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కుటుంబ వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌లో ఇంకెంతమాత్రం మునిగిపోకూడదని, ప్రజాసమస్యలపై దృష్టిసారిస్తామని ఇదివరకే మా పార్టీ స్పష్టం చేసింది.

అన్నీ కుటుంబ ఆస్తులే..

- షర్మిలకు జగన్ బాధ్యతతో ఇచ్చిన ఆస్తులు.. వైవీ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి చెప్పినవి అవాస్తవాలు
- షర్మిలకు డివిడెండ్‌గానే రూ.200 కోట్లు ఇచ్చిన జగన్
- ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం
- లేఖలో పేర్కొన్న వైఎస్ విజయమ్మ

సాక్షి, అమరావతి: తమ ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని వైఎస్ విజయమ్మ స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉండగానే ఆస్తులు పంచి ఇచ్చేశారని ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి తదితరులు మాట్లాడింది వాస్తవం కాదన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో విజయమ్మ ప్రస్తావించిన ప్రధాన అంశాలు ఆమె మాటల్లోనే..

- వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, ఇతరులంతా మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉండగానే ఆస్తులు పంచేశారు అని అన్నారు. ఇది అవాస్తవం. పిల్లలు ఇద్దరు పెరుగుతున్న రోజుల నుండి కొన్ని ఆస్తులు పాప పేరుమీద.. అలాగే కొన్ని ఆస్తులు జగన్ పేరుమీద పెట్టారు. అది ఆస్తుల పంపకం కాదు. ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం. కానీ అన్ని ఆస్తులు కుటుంబ ఆస్తులే అన్నది కూడా నిజం. జగన్ బాధ్యత గల కొడుకుగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలి అన్నది కూడా నిజం.
- 2009 నుంచి 2019 వరకు 10 ఏళ్లు కలిసి ఉన్నారు. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకుని 200 కోట్లు పాప (షర్మిల) భాగానికి ఇచ్చారు. ఎందుకంటే పాపకు సమానవాటా ఉంది కాబట్టి. 2019లో జగన్ సీఎం అయిన రెండు నెలలకు డివైడ్ అవ్వాలని ఇజ్రాయిల్‌లో ఉండగా చెప్పాడు. 'ఇద్దరి పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు.. నాకు అల్లుళ్లు వస్తారు.. నీకు అల్లుడు, కోడలు వస్తారు.. మనం కలిసి ఉన్నట్లు వాళ్లు కలిసి ఉండకపోవచ్చు.. కాబట్టి విడిపోదాం' అన్నాడు. అలా 2019 వరకు కలిసి ఉన్న కుటుంబం ఆస్తులపరంగా విడిపోవాలనే నిర్ణయం జరిగింది.
- విజయవాడలో నా సమక్షంలోనే ఆస్తుల్లో ఇవి జగన్‌కి, ఇవి పాప (షర్మిల)కు అని అనుకున్నారు. 2019లో అప్పుడు రాసిన ఎంవోయూనే ఈ ఎంవోయూ. షర్మిలకు ఇవ్వాల్సిన ఆస్తులు జగన్ గిఫ్టుగా ఇస్తున్నవి కాదు బాధ్యతగా ఇస్తున్నవి. అటాచ్‌మెంట్‌లో లేవు కాబట్టి ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ 100 శాతం, ఎంవోయూలోలేని ఎలహంక ప్రాపర్టీ 100 శాతం ఇస్తాను అని జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. ప్రతి తల్లిదండ్రులకు బిడ్డలందరూ సమానమే. వాళ్లు ఇద్దరు అన్నాచెల్లెళ్లు. ఇది వాళ్లిద్దరి సమస్య. ఈ సమస్యను వారే పరిష్కరించుకుంటారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ డ్రగ్స్ టెస్ట్ చేయించాలి

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ డ్రగ్స్ టెస్టులు చేయించాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ విషయం బయటకు వచ్చిన ప్రతిసారి ఆ పార్టీ నేతలే మాట్లాడుతున్నారని, అందుకే వారికి టెస్టులు చేయించాలని పోలీసులను కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన బావమరిది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిలను వెనకేసుకురావడానికి కేటీఆర్‌కు సిగ్గుండాలని దుయ్యబట్టారు.

డ్రగ్స్ టెస్ట్ ఎక్కడ చేస్తారో కూడా తెలియదా?

కౌశిక్‌రెడ్డి తీరుపై బల్మూరి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి డ్రగ్స్ శాంపిళ్ల పరీక్షలు ఎక్కడ చేస్తారో కూడా తెలియకుండా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు విమర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌యాదవ్, అధికార ప్రతినిధి లింగంయాదవ్‌లతో కలసి గాంధీభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీరామారావు బావమరిదిపై వచ్చిన ఆరోపణలపై కేటీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంటే కౌశిక్‌రెడ్డి ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి తీరు ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ నాగేశ్వరరావు దగ్గర శాంపిల్స్ ఇద్దామని కౌశిక్‌రెడ్డి అంటున్నారని, అసలు డ్రగ్స్ టెస్టుకు గ్యాస్ట్రో ఎంటరాలజీకి ఏం సంబంధముందని ప్రశ్నించారు.

అజ్ఞాతంలో విజయ్ మద్దూరి!

- రెండోరోజూ విచారణకు గైర్హాజరు
- ఇంట్లో సోదాలు చేపట్టిన పోలీసులు

శంకర్‌పల్లి: మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో అనుమతి లేకుండా నిర్వహించిన పార్టీలో కొకైన్ తీసుకున్నట్లు గుర్తించిన విజయ్ మద్దూరి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గత ఆదివారం 41 సీఆర్‌పీసీ కింద ఆయనకు స్టేషన్ బెయిల్ ఇచ్చిన మోకిల పోలీసులు, సోమవారం విచారణకు రమ్మని చెప్పినా ఆయన హాజరు కాలేదు. మంగళవారం సైతం హాజరుకాకపోవడంతో సీఐ వీరబాబు ఆయనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో వివరాలు తెలిపేందుకు



విజయ్ మద్దూరి ఇంటి వద్ద పోలీసులు

రావాల్సిందిగా ఫోన్‌లో మెసేజ్ పంపారు. ఒకటి, రెండురోజులు వేచిచూసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మరోవైపు మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ లోని రోడ్ నంబర్ 41లో ఉన్న విజయ్ నివాసంలో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదని సమాచారం.

మరో సెక్షన్ కింద కేసు

పార్టీకి హాజరైన వారిలో కేవలం విజయ్ ఫోన్‌ను మాత్రమే పోలీసులు సీజ్ చేశారు. అయితే ఆయన తన ఫోన్‌ను కాకుండా పార్టీకి వచ్చిన మరో మహిళ ఫోన్‌ను ఇచ్చి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. ఇలా పోలీసులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, ఆధారాలు లభించకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినందుకు ఆయనపై మరో సెక్షన్ కింద కేసు నమోదు చేయనున్నట్లు మోకిల పోలీసులు తెలిపారు.

రోజుకు ఐదుగురి స్టేట్‌మెంట్లు రికార్డు

రాజ్ పాకాల ఇంట్లో నిర్వహించిన పార్టీలో మొత్తం 38 మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. వీరందరినీ ఒకేసారి కాకుండా, రోజుకు ఐదుగురి చొప్పున నోటీసులు అందించి విచారిస్తున్నారు. అనంతరం వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. అయితే పార్టీలో పాల్గొన్న మహిళల స్టేట్‌మెంట్లను మాత్రం వారు సూచించిన ప్రదేశంలో రికార్డు చేస్తామని సీఐ వీరబాబు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం తొమ్మిదిమంది స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. ఇలావుండగా.. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల హైకోర్టులో దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ గడువు బుధవారం సాయంత్రం ముగియనుంది. దీంతో ఆయన మోకిల పీఎస్‌కు వస్తారా.. లేదా..? అనే సందిగ్ధత నెలకొంది.

కలెక్టర్ ఉత్తర్వులు చెల్లవు

- 2022లో నిషేధిత జాబితాలో నుంచి తొలగించడం చట్టవిరుద్ధమన్న హైకోర్టు
- ప్రైవేట్ పార్టీకి అనుకూలంగా డీనోటిఫై చేయడంపై ఆగ్రహం
- గుట్టల బేగంపేట్‌లోని 52 ఎకరాల వివాదంపై తీర్పు



సాక్షి, హైదరాబాద్: గుట్టల బేగంపేటలోని సర్వే నంబరు 63లో 52 ఎకరాలను నిషేధిత జాబితాలో నుంచి తొలగించడం చట్టవిరుద్ధమని, అది చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగిస్తూ నాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ 2022లో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట గ్రామం (ఎన్‌సీఆర్ హెచ్చార్డీ సమీపంలో)లోని దాదాపు 78 ఎకరాల భూమి కంచ సర్కారీ (ప్రభుత్వ భూమి)గా రికార్డుల్లో నమోదై ఉంది. ఈ భూమిపై 1950 నుంచి కోర్టు వివాదాలున్నాయి. 2018లో ఈ భూములపై హైకోర్టు స్టేటస్‌కో కూడా విధించింది. అయితే 2022లో 78 ఎకరాల్లోని 52 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగిస్తూ రిజిస్ట్రేషన్ చేయడానికి అనుకూలంగా రంగారెడ్డి కలెక్టర్ అమోయ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. తమ ప్రత్యర్థులైన ప్రైవేటు పార్టీలకు అనుకూలంగా రిజిస్ట్రేషన్ చేయడానికి వివాదంలోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలిగించారని.. కలెక్టర్ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ భూవివాదంలో పార్టీలైన బుఖ్యార్‌ఖాన్‌తో పాటు మరో ఇద్దరు 2022, అక్టోబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి కలెక్టర్ జారీచేసిన ఆదేశాలపై పిటిషన్ దాఖలు చేసిన సమయంలోనే సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం.. తాజాగా తీర్పు వెలువరించింది. కలెక్టర్ ఉత్తర్వులను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. 52 ఎకరాలపై 1950 నుంచి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన తగాదాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు, ఏ ప్రాతిపదికన వదులుకుందో సరైన కారణాలు తెలపలేదన్నారు. కొన్ని ప్రైవేట్ పార్టీలకు అనుకూలంగా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడానికి సులభతరం చేస్తూ నిషేధిత జాబితా నుంచి ఆ భూమిని తొలగిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వులను తప్పుబట్టారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22 A ప్రకారం నిషేధిత జాబితా నుంచి డీనోటిఫై చేయాలని స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను కోరుతూ కలెక్టర్ 2022 ఆగస్టు 10న ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు.

అమ్మో.. అమోయ్‌కుమార్!

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తుండగానే.. మరోవైపు హైకోర్టు, అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు 52 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడాన్ని తప్పుపడుతూ ఆ నిర్ణయాన్ని మంగళవారం కొట్టేయడం చూస్తుంటే.. కలెక్టర్‌గా ఆయన ప్రభుత్వానికి తీవ్రంగా ఆర్థిక నష్టం కలిగించారో తెలుస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీపావళి తర్వాత అమోయ్ కుమార్‌ను మరోసారి విచారణకు పిలిచే అవకాశాలున్నాయి.

- ఆదిబట్లలోని సర్వే నంబరు 44లోని సీలింగ్ భూములైన 18 ఎకరాలను కొంతమందికి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వడం పూర్తిగా అధికార దుర్వినియోగమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- శామీర్‌పేట మండలంలోని తూముకుంటలోని అటవీ భూములకు సంబంధించి సర్వే నంబరు 164లో మొత్తం 26 ఎకరాలను కూడా అన్యాయంగా కొంతమంది వ్యక్తులు, పరిశ్రమల పేరిట పెద్దవారికి ధారాదత్తం చేశారని రాఘవేందర్‌గౌడ్ డాక్యుమెంట్లతో సహా ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు.
- సర్వే నంబరు 165/1, సర్వేనంబరు 1266లోని భూములను కూడా ఒకసారి పరిశీలించాలని అందులో పేర్కొన్నారు. 26 ఎకరాలను మరొకరి పేరిట చేయడమేకాక, మ్యుటేషన్ కూడా చేశారని, ఆ స్థలం అటవీశాఖ అధీనంలోనే ఉన్నా.. ఇలా మ్యుటేషన్ చేయడంతో వారు ఆ కాగితాలను వినియోగించుకొని రుణాలు కూడా తెచ్చుకున్నారని చెబుతున్నారు. 1953లోనే ఆ సర్వే నంబరులోని భూములు రిజర్వ్ ఫారెస్ట్ కోసం కేటాయించినట్టు గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్నా, వారసులం అంటూ కొందరు చేసుకున్న దరఖాస్తు ఆధారంగా వారికి ఆ భూములు ధారాదత్తం చేశారని ఆ ఫిర్యాదులో వివరించారు. ఆ భూమి తమదంటూ దరఖాస్తు చేసుకున్న వారసుల తండ్రి 1976లో చనిపోతే.. వారు 2017లో వచ్చి తమ భూమి అంటూ దరఖాస్తు చేసుకోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం వారసులకు భూములు అప్పగించే ముందు ఆ భూమిలో వారి అధీనంలో ఉందా.. వారు ఆ భూమిని సాగు చేస్తున్నారా.? రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం, దానిపై అభ్యంతరాలను ఆహ్వానించడం, సక్సెషన్‌కు అవసరమైన డాక్యుమెంట్లను కోరడం, యుఎల్‌సీ, తదితర వాటిని పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు కేవలం 10 నిమిషాల దూరంలో ఉన్న ఆ భూములు ఎవరి అధీనంలో ఉన్నాయో తెలుసుకోకుండా మ్యుటేషన్ చేశారని ఈడీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.
- 261, 273 తదితర సర్వే నంబర్లలోని భూములను కూడా అదే విధంగా అప్పగించారని పేర్కొన్నారు. కూకట్‌పల్లి సమీపంలోని హైదర్‌నగర్ దగ్గర మూడు ఎకరాల భూమిని కూడా అమోయ్‌కుమార్ ధరణిని అడ్డుపెట్టుకొని ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారన్నారు.
- శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పాన్‌మక్తలోని నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించి కొందరికి అప్పగించారని పేర్కొన్నారు.

మరో పిటిషన్..

అమోయ్‌కుమార్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో గోపనపల్లిలో 50 ఎకరాలు, మాదాపూర్‌లో 5 ఎకరాలు, హఫీజ్‌పేటలో 20 ఎకరాలు, మోకిలలో 115 ఎకరాలు, వట్టినాగుల పల్లిలో 20 ఎకరాలు, గండిపేట ఖానాపూర్‌లో 150 ఎకరాలు, మియాపూర్‌లో 27 ఎకరాలు అన్యాక్రాంతం చేశారని బక్క జడ్సన్ మంగళవారం ఈడీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేయడంలో ఆయనతోపాటు మాజీ చీఫ్ సెక్రటరీ, ప్రస్తుత రెవెన్యూ ముఖ్యకార్యదర్శుల పాత్ర ఉన్నట్టు ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే

- సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- మధిర తహసీల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి



ఇందిరా డెయిరీ లోగో

మధిర: వచ్చే నెల 6వ తేదీ నుంచి మొదలయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించేలా జిల్లాల్లో కలెక్టర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. మధిర తహసీల్ నుంచి సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మంగళవారం సమీక్షించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు సీఎస్ శాంతికుమారి వీసీకి వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్ష్యాలు, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలపై భట్టి మాట్లాడారు. ఈ సర్వే ద్వారా ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. సర్వే షెడ్యూల్ ప్రజలకు చేరేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ధరణి పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచేలా అవగాహన కల్పించడంతోపాటు వివరాలు గోప్యంగా ఉంటాయనే విషయాన్ని వివరించాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జిల్లాల యంత్రాంగం సమన్వయంతో సర్వేను విజయవంతం చేయాలన్నారు. కాగా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో పాటు మరికొందరు కలెక్టర్లు కుటుంబాల ఆదాయం వివరాల సేకరణ నమోదులో ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ అవసరం, కుల వివరాలు సేకరణ సమయాన బీసీ–సీ వర్గాల వారు ఎస్సీలుగా తెలిపితే ఎలా నమోదు చేయాలనే అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై మంత్రి ఉత్తమ్ సమీక్షిస్తూ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు.

గత పాలకులు చేసిన అప్పులు తీర్చే పనిలో ఉన్నాం

గత పాలకులు రూ.7లక్షల కోట్ల అప్పు చేసి వెళితే.. ఆ అప్పులను తీర్చే పనిలో తాము ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. మధిరలో నిర్వహించిన సమావేశంలో ఇందిరా మహిళా డెయిరీ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు.

ఇందిరా డెయిరీ ద్వారా నెలకు రూ.25కోట్ల ఆదాయం

డెయిరీలో 20 వేల మహిళలు సభ్యులుగా ఉండగా, వీరికి రెండు చొప్పున పాడి పశువులు అందించి రోజూ 2.40లక్షల పాలు సేకరిస్తామని, తద్వారా నెలకు రూ.25 కోట్లకు పైగా మహిళలకు ఆదాయం సమకూరుతుందని భట్టి చెప్పారు. అనుబంధ ఉత్పత్తుల అమ్మకం ద్వారా డెయిరీ టర్నోవర్ ఏటా రూ.500 కోట్లు దాటుతుందని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని రాజుల దేవరపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపారు. - ఎర్రుపాలెం



బాల్యం ఇక్కడ సేఫ్

సమస్యలు చూసి 'అయ్యో!' అనుకునే వాళ్లు కొందరు. సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కార మార్గాలు ఆలోచించేవారు కొందరు. సూరేపల్లి సుజాత రెండో కోవకు చెందిన యాక్టివిస్ట్. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత 'శాతవాహన యూనివర్సిటీ'లో సోషియాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్. ప్రొఫెసర్‌గా క్లాసు నాలుగు గోడలకే పరిమితం కాలేదు. పర్యావరణ సమస్యల నుంచి సామాజిక సమానత్వం వరకు ఎన్నో ఉద్యమాలలో భాగం అయింది. తన గళాన్ని గట్టిగా వినిపించింది. 'సేఫ్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా మురికివాడల్లోని పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది...





> సమాజంలోని అవలక్షణాలను వదిలించి, మనిషి సన్మార్గంలో నడిచేలా పనిచేయడమే మా లక్ష్యం.
>
> – ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో 2021లో ఒక చిన్నారిపై జరిగిన హత్యాచార ఘటనపై నిరసన తెలియజేసేందుకు సుజాత అక్కడి మురికివాడకు వెళ్లింది. ఆ బస్తీలో కనీస సదుపాయాలు లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పేదలను చూసి చలించిపోయింది. సాయంత్రమైతే ఆ బస్తీలో గంజాయి, మద్యం, మత్తుపదార్థాల వరద పారుతుంది.

'ఇలా ఎందుకు?' అని తెలుసుకోవడానికి ఆరునెలలపాటు అక్కడి సామాజిక, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసింది.

తల్లిదండ్రులు వారి పిల్లలను బాల కార్మికులుగా చేస్తున్న తీరును గమనించి స్కూల్ పిల్లల్ని డ్రాపౌట్స్‌గా మారకుండా చూడడంపై దృష్టి పెట్టింది.

మత్తు పదార్థాల ప్రభావం చిన్నారులపై పడకుండా, వారి భవిష్యత్‌ను కాపాడడం కోసం రంగంలోకి దిగిన సుజాత మొదటి అడుగుగా చిన్న స్థలాన్ని చూసి స్టడీ సెంటర్ ఏర్పాటు చేసింది. దీనికి 'సావిత్రి బాయి పూలే స్టడీ సెంటర్'గా నామకరణం చేసింది. ఒకటితో మొదలైన స్టడీ సెంటర్‌ల సంఖ్య పదిహేనుకు పెరిగింది.

మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు ప్రభుత్వ పాఠశాలలో చదివే మూడువందల మందికి పైగా విద్యార్థులు ఈ కేంద్రాల్లో సాయంత్రం చదువుకోవడానికి వస్తారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పార్ట్‌టైం టీచర్లుగా పనిచేస్తున్నారు.

డ్రాపౌట్‌లను తగ్గించడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం, చిన్నారులపై లైంగిక వేధింపులను నిరోధించడం లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

పిల్లల మానసిక వికాస అభివృద్ధి, పౌష్టికాహార లోపం అధిగమించడంపై ఈ విద్యాకేంద్రాలు దృష్టి పెట్టాయి.

సింగరేణి కాలనీలో అంతా చెత్త ఏరుకుని బతికే పేదలే. వారి పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తారు. నాలుగో తరగతి వరకు చదివించి ఆపై ఆపేస్తారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి, పిల్లలు పై చదువులు చదవడానికి 'సావిత్రిబాయి పూలే సెంటర్'ల ద్వారా విశేష కృషి చేస్తోంది సుజాత.

పదవ తరగతి చదివే పిల్లలకోసం బ్రేక్‌ఫాస్ట్ (డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు) అందించారు. ఇది సత్ఫలితాలను ఇచ్చి ఆ ఏడాది ఉత్తీర్ణతా శాతాన్ని పెంచింది. ఏటా పిల్లల కోసం సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆటల నుంచి ఆత్మరక్షణ విద్య, సైన్స్ ప్రాజెక్ట్‌ల వరకు ఈ క్యాంప్‌లో ఎన్నో యాక్టివిటీస్ ఉంటాయి. మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన కలిగించడం మరో కీలక అంశం.

తొలిసారిగా తాను ఆ మురికివాడలో అడుగు పెట్టినప్పటితో పోల్చితే విద్యార్థుల చదువుకు సంబంధించి ఇప్పుడు ఎంతో మార్పు వచ్చింది. అది రాత్రికి రాత్రి వచ్చిన మార్పు కాదు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎంతో శ్రమిస్తే వచ్చిన మార్పు.

'తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తీసుకు వస్తే పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట వేయవచ్చు' అని నిరూపించిన మార్పు.

– భాషబోయిన అనిల్ కుమార్,
సాక్షి, కరీంనగర్

వేస్ట్‌తో బెస్ట్



యువత సామాజిక బాధ్యతతో ఓ ముందడుగు వేస్తే వారి వెనుక నడవడానికి సమాజం సిద్ధంగా ఉంటుంది. ప్రకృతి, అక్షరల ప్రయోగాన్ని విజయవంతం చేసి ఆ విషయాన్ని నిరూపించింది ముంబయి నగరం. టెక్స్‌టైల్ రంగంలో వచ్చే వేస్ట్ మెటీరియల్‌తో ఫ్యాషన్ మార్కెట్‌లో అడుగుపెట్టారు. ఇప్పుడు వాళ్లు తమ జుహూ బీచ్ స్టూడియో బ్రాండ్‌ను సగర్వంగా ప్రకటించుకుంటున్నారు.

హ్యాట్ కేక్

ముంబయికి చెందిన ప్రకృతి రావు, అక్షర మెహతాలు అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశారు. కోర్సు పూర్తయింది ఇక కెరీర్ నిర్మాణం మీద దృష్టి పెట్టాలి. మార్కెట్‌లోకి కొత్త ఆలోచనలతో రావాలి. అది పర్యావరణానికి హితంగానూ ఉండాలి... అని ఆలోచించిన మీదట వారికి వచ్చిన ఆలోచన ఇది. చేనేత, వస్త్రాలకు రంగులద్దే కుటుంబ నేపథ్యం వారిది. వస్త్రాల మీద ఒకింత అవగాహన ఎక్కువనే చెప్పాలి. రా మెటీరియల్ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా ఉండాలని ఆలోచించారు. వస్త్రాల తయారీ పరిశ్రమల నుంచి తానులోకి రీల్ చుట్టగా మిగిలిన క్లాత్, ఎక్కడో ఓ చోట మిస్ ప్రింట్ కారణంగా పక్కన పడేసిన మీటర్ల కొద్దీ వస్త్రం... ఇలా సేకరించిన క్లాత్‌తో నాలుగేళ్ల కిందట 60 హ్యాట్‌లు తయారు చేశారు. అవి హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆ తర్వాత వంద స్లింగ్ బ్యాగ్‌లు చేశారు. తమ మీద తమకు ధైర్యం వచ్చిన తర్వాత బేబీ ప్రోడక్ట్స్ మీద దృష్టి పెట్టారు. వారి ప్రయోగం పూర్తి స్థాయి వ్యాపార రూపం సంతరించుకుంది. ముంబయిలోని జుహూ బీచ్ స్టూడియో (జేబీఎస్) వారి వర్క్ ప్లేస్. ఇప్పుడు వాళ్లు పదిమంది మహిళలకు హ్యాండ్ క్రాఫ్ట్స్‌లో శిక్షణనిచ్చి ఉపాధి కల్పించారు. గిఫ్ట్ ఆర్టికల్స్ మార్కెట్‌లో జేబీఎస్ ఒక బ్రాండ్ ఇప్పుడు.



నిరుపయోగం కాకూడదు

ప్రకృతి రావు... టెక్స్‌టైల్ రంగం గురించి వివరిస్తూ... వస్త్రం తయారయ్యే క్రమంలో భూగర్భ జలాలు భారీ స్థాయిలో ఖర్చవుతాయి. తయారైన వస్త్రం అంతా ఉపయోగంలోకి రాకపోతే ఎలా? మిల్లులో తయారయ్యే వస్త్రంలో ముప్పావు వంతు మాత్రమే మార్కెట్‌కు వెళ్తోంది. మిగిలినది వృథా అవుతుంటుంది. ఇక ఫ్యాషన్ స్టూడియోల దగ్గరకు చేరిన క్లాత్‌లో డిజైన్ కోసం కొంత వాడేసి మిగిలినదానిని పారేస్తుంటాయి. ఇలా చెత్తకుండీల్లోకి చేరిన క్లాత్ మట్టిలో కలిసేలోపు కాలువల్లోకి చేరి ప్రవాహాలకు అడ్డుపడి వరదలకు కారణమవుతాయి. ప్రకృతి నుంచి మనం తీసుకున్న వనరులను నూటికి నూరుశాతం ఉపయోగించుకోవాలి. అదే ప్రకృతికి, పర్యావరణానికి మనమిచ్చే గౌరవం అన్నారు ప్రకృతిరావు, అక్షర మెహతా.

దివి నుండి భువికి దీపావళి



దీపావళి తారాజువ్వ ఒకటి అంతరిక్షంలోకి దూసుకుని వెళ్లి, అక్కడున్న సునీతా విలియమ్స్‌ని ఎక్కించుకుని తిరిగి భూమి మీదకు చేరుకుంటే ఎంత బాగుంటుంది!

వారంలో తిరిగొచ్చేందుకు వెళ్లి, అవాంతరం వల్ల అక్కడే చిక్కుకుపోయారు సునీత, ఆమె సహ వ్యోమగామి విల్మోర్. వారిని స్పేస్‌లోకి మోసుకెళ్లిన వ్యోమనౌక వారిని అక్కడే వదిలేసి, భూమి పైకి తిరిగొచ్చి కూడా రెండు నెలలు అవుతోంది. వచ్చే ఫిబ్రవరిలో గానీ మరో కొత్త వ్యోమనౌకలో సునీత భూమి పైకి వచ్చే అవకాశాలు లేవు.

సునీత ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు 'నాసా'కు సంకేతాలు అందుతున్నాయి. కానీ అవి సునీత పంపుతున్న సంకేతాలు కావు. నాసా అంచనాలు మాత్రమే. నిజానికి ఆమె ధైర్యంగా ఉన్నారు. భూమిపైకి సందేశాలు పంపుతున్నారు. సోమవారం వైట్‌హౌస్‌లో దీపావళి సంబరాలు జరుగుతున్నప్పుడు.. ''అంతరిక్ష కేంద్ర నుండి మీ అందరికీ హ్యాపీ దీపావళి' అంటూ వీడియోలో శుభాకాంక్షలు పంపారు! ఇది కదా ఈ ఏడాది అసలైన దీపావళి. భూమికి 260 మైళ్ల ఎత్తులో, నక్షత్రంలా మెరుస్తున్న మన సునీతను కళ్లారా చూడ్డం, ఆమె స్వరాన్ని చెవులారా వినటం.. ఇది కదా నిండైన దీపావళి.

''ఇంత ఎత్తు నుండి దీపావళిని జరుపుకునే అవకాశం నాకు మాత్రమే లభించింది. దీపావళి, ఇతర భారతీయ పండుగల గొప్పతనం గురించి చిన్నప్పుడు నాన్న మాకు చెప్పేవారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన దీపావళి ఉత్సవాలలో పాల్గొన్నందుకు అమెరికా ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌కు సునీతా విలియమ్స్ కృతజ్ఞతలు'' అని సునీత తన సందేశాన్ని వినిపించారు.

కష్టకాలంలో ఉన్నప్పుడు ధీరులు మాత్రమే ఇతరుల సంతోషాలలో పాల్పంచుకోగలరు. తమ కష్టాన్ని దాచి పెట్టి చిరునవ్వుల మతాబులను వెలిగించగలరు.

చచ్చిపోతాననే అనుకున్నా!

SHE



బహిరంగ ప్రదేశాలలో ఉన్నప్పుడు ప్రకృతి కల్పించిన అత్యవసరతను తీర్చుకోటానికి మహిళలకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవటం అన్నది ఇప్పటికీ ఉంది. ఏ చోటా వారికి 'చాటు' దొరకదు. ప్రతి చోటా మగవాళ్లు.. మగవాళ్లు... మగవాళ్లు. ఎంతసేపని ఆపుకుని ఉండగలరు? చచ్చేంత పనౌతుంది.

1990 లలో 'జాన్' షూటింగ్ అప్పుడు ట్వింకిల్ ఖన్నాకు ఇలాంటి గడ్డు కాలమే దాపురించింది. చీకటి తోనే కాలకృత్యాలు ముగిసినా, వెలుగొచ్చాక మళ్లీ ఒకసారి 'ఒకటికి' వెళ్లాల్సి వచ్చింది. షూటింగ్ జరుగుతూ ఉన్నది ఒక కొండ పైన. చుట్టూ అంతా మగవాళ్లు. తను, ఒక హెయిర్ డ్రెసర్ మాత్రమే అక్కడున్న అమ్మాయి. వ్యానిటీ వ్యాన్ కూడా లేని రోజులు అవి! అసహాయంగా అలా ప్రాణాలు ఉగ్గబట్టుకునే ఉన్నారు ట్వింకిల్. మధ్యాహ్నం 3 గంటలు అయింది. 'ఇక చచ్చిపోతాననే అనుకున్నాను. చివరికి భరించలేక నేనే ట్రాలర్ నడుపుకుంటూ ఆ కొండ ప్రాంతంలో వెళ్లగలిగినంత దూరం వెళ్లి, తేలికపడ్డాను ' అని.. తనకెదురైన అనుభవాన్ని తన 'ట్వీక్ ఇండియా' ఛానల్‌లో తాజాగా షేర్ చేసుకున్నారు ట్వింకిల్ ఖన్నా.

మునుపు జయా బచ్చన్ కూడా ఇలాంటి భయానక పరిస్థితి గురించే తన మనవరాలు నవ్య నవేలీ నందా పాడ్ కాస్ట్‌లో బయటికి చెప్పుకున్నారు. 'ఔట్ డోర్ షూటింగ్‌లకు వెళ్ళినప్పుడు మాకు వ్యాన్ లు ఉండేవి కావు. పొదల చాటునే దుస్తులు మార్చుకోవలసి వచ్చేది. ప్రతిదీ పొదల వెనకే! కనీసం టాయ్‌లెట్స్ కూడా ఉండేవి కావు. చాలా అంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కొన్నిసార్లు 3-4 సార్లు ప్యాడ్స్ మార్చుకోవలసి వచ్చేది. వాటిని ఒక ప్లాస్టిక్ కవర్ లో కట్టి ఉంచి, ఇంటికి వెళ్లాక పడేయవలసి వచ్చేది' అని చెప్పారు జయాబచ్చన్.

పిల్లలు ఎక్కడ కావలిస్తే అక్కడ పని కానిచ్చేస్తారు. ఈ విషయంలో మగవాళ్లు పిల్లలుగా ఉండగలరు. కానీ స్త్రీలకు ప్రకృతి కొన్ని స్వభావసిద్ధమైన పరిమితులను విధించింది. సగటు మహిళ అయినా, స్టార్ సెలబ్రిటీ అయినా.. వారి దేహధర్మాలు, సంకోచాలు, బిడియాలలో తేడాలేమీ ఉండవు. వాళ్లకు ఆ 'స్పేస్' కల్పించటం, చూపించటం, లేదా ముందుగా ఏర్పాటు చేసి ఉంచటం పురుష ధర్మం. పురుష లక్షణం కూడా!

ఫ్లాష్ బ్యాక్

ధాం... ధాం... ఒకసారి వెనక్కి వెళదాం



పండగకు ముందే 'ధాం... ధాం'లు మొదలయ్యాయి. ఎప్పుడూ శబ్దాలు వినడమేనా, ఈసారి వాటి చరిత్ర కొంచెం తెలుసుకుందాం.

లాంగ్ లాంగ్ ఎగో.... అనగా క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంలో చైనాలో టపాసులు లేవు. అయినను 'ధాం... ధాం'లు మాత్రం ఉండేవి. వెదురు గొట్టాలను మంటల్లోకి విసిరేవారు. వెదురు లోపల కణువుల మధ్య ఉన్న ఎయిర్ పాకెట్లు వేడెక్కి పేలి పోవడంతో పెద్ద శబ్దాలు వచ్చేవి.

పదవ శతాబ్దానికి చెందిన ఒక చైనీస్ ఆల్కెమిస్ట్ ద్వారా కొత్త పటాసులు రంగంలోకి వచ్చాయి. పొటాసియం నైట్రేట్, సల్ఫర్, బొగ్గును కలిసి వెదురు గొట్టాల్లో పోసి 'ధాం' అనిపించేవారు. ఆయన తయారు చేసిన మిశ్రమం ఆ తరువాత కాలంలో 'గన్ పౌడర్'గా ప్రసిద్ధి చెందింది. ఇది మానవ నిర్మిత మొదటి బాణసంచా అంటారు. ఈ ప్రమాదకరమైన, ప్రకాశవంతమైన ఆవిష్కరణలు సిల్క్ రూట్ గుండా యూరోపా వరకు వెళ్లాయి. ఆ తరువాత కాలంలో వాటి తయారీకి సంబంధించిన సాంకేతికత పెరగడంతో విందులు, వినోదాలు, పండగలలో బాణసంచా పేల్చడం మామూలైపోయింది.

లీగల్

గిఫ్ట్ డీడ్ ముందే పకడ్బందీగా రాసుకోవాలి

నాకు, నా భార్యకి కలిపి కొంత ఆస్తి ఉండేది. వయసు అయిపోతుంది అని మా ఇద్దరి పిల్లలకి సమానంగా పంచుతూ గిఫ్ట్ డీడ్ చేశాము. అందులో ప్రస్తుతం మేము ఉంటున్న ఇల్లు కూడా వుంది. గిఫ్ట్ ఇచ్చి నాలుగు సంవత్సరాలు అవుతుంది. మా పిల్లల మధ్య వచ్చిన మనస్పర్థల వల్ల మమ్మల్ని పట్టించుకోవడం లేదు. పరస్పరం తగాదా పడుతున్నారు. మాకు ఇదంతా చాల ఇబ్బందిగా మారింది. మేము ఇచ్చిన గిఫ్టు తిరిగి తీసుకోవాలి అనుకుంటున్నాము. పరిష్కారం తెలుపగలరు.

– నరసింహ శర్మ, గుంటూరు

ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ (ఆస్తి బదిలీ చట్టం) ప్రకారం ఒకసారి ఆస్తిని బదిలీ చేసిన తర్వాత, అది గిఫ్ట్ (బహుమతి) అయినప్పటికీ, సాధారణ పరిస్థితులలో రివోకేషన్ (రద్దు చేయటం) సాధ్యపడదు. ఒకవేళ మీరు గిఫ్ట్‌గా ఇస్తున్న ఆస్తిని ఏదైనా కారణంచేత భవిష్యత్తులో తిరిగి తీసుకోవాలి అని మీరు అనుకుంటే, అలాంటి నిబంధనని, ఎలాంటి పరిస్థితులలో తిరిగి తీసుకోవచ్చు అన్న అంశాలను గిఫ్ట్ డీడ్ లో పొందుపరచవలసి ఉంటుంది. అలా రద్దు చేసుకోవచ్చు అని మీరు పేర్కొన్న సందర్భం ఎదురైతే, రద్దునకు తగు చర్యలు చట్టపరంగా తీసుకోవచ్చు.

మీరు సీనియర్ సిటిజన్ అని అర్థం అవుతోంది. అందుకే మీకు అదనంగా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం కింద కూడా కొన్ని వెసులుబాట్లు ఉన్నాయి. మీ పిల్లలు మిమ్మల్ని పట్టించుకోవడం లేదు కనుక, మీరు చేసిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ పత్రంలో సదరు 'గిఫ్టు తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం నిబంధనలకు లోబడి ఉంటుంది' అనే అర్థం వచ్చేట్టు రాసుకుని వుంటే గనుక, మీరు ఇచ్చిన గిఫ్టును సులభంగా రద్దు చేసుకోవచ్చు లేదా ఉపసంహరించవచ్చు అంటే తిరిగి వెనక్కి తీసుకోవచ్చు. అలా కాకపోయినా తిరిగి తీసుకునే అవకాశం ఉందా లేదా అనే విషయం, కేవలం మీ పత్రాలు చూసిన తర్వాత మాత్రమే చెప్పగలం.

తల్లిదండ్రులు – వయోవృద్ధులు తమ పిల్లలకి, కుటుంబ సభ్యులకు, మరే ఇతర వారసులకు లేదా మీరు ఆస్తి గిఫ్టు గా ఇవ్వాలి అనుకునే ఎవరికైనా సరే, గిఫ్టు డీడ్ (బహుమాన పత్రం/ఒప్పందం) లో కనీసం పైన పేర్కొన్న చట్టానికి ఆ గిఫ్టు లోబడి ఉంటుంది అని రాసుకోవటం ఉత్తమం. మీ వారసులు ఏదో చేస్తారు అని కాదు కానీ, మీ ప్రయోజనార్థం ఈ సూచన ఇస్తున్నాను.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

బేబీనామా

పేరెంటింగ్



డా. సుమిత్ర మీనా

'మా పాపకు నిద్ర సరిపోతోందా?'
'నా బిడ్డ బరువు వయస్సుకు సరిపడా ఉందా?'
'మా పాప బాగా ఏడుస్తుంటుంది. ఏం చెయ్యాలి?'
'మా పాపకు తిండిసరిపోతుందంటారా?'

చాలామంది న్యూ పేరెంట్స్‌కు తమకు వచ్చిన సందేహాలకు సమాధానాలు ఎక్కడ తెలుసుకోవాలో తెలియదు. అన్ని ప్రశ్నలూ ముఖ్యమైనవే అనిపిస్తాయి. హాస్పిటల్‌కు వెళ్లడం అన్నిసార్లూ సాధ్యం కాకపోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారికి మరింత కష్టం.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని న్యూపేరెంట్స్ సందేహాలకు తక్షణ సమాధానం ఇచ్చే డిజిటల్ పీడియాట్రిక్ కేర్ ప్లాట్‌ఫామ్ 'బేబీనామా'ను ప్రారంభించింది గురుగ్రామ్‌కు చెందిన డా.సుమిత్ర మీనా. గత రెండేళ్లలో శ్వాసకోశ సమస్యలు, మూర్ఛ, ఆటిజంలాంటి క్లిష్టమైన సమస్యల ప్రారంభ లక్షణాలను గుర్తించడానికి లక్షలాది మంది తల్లిదండ్రులకు సహాయపడింది.

రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోని మారుమూల గ్రామాలతో సహా దేశ నలుమూలల నుంచి సుమిత్రకు కాల్స్ వస్తుంటాయి. 'బేబీనామా'లో ఇప్పుడు 50 మంది శిశువైద్యులు ఉన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కలిగించడానికి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో పేజీలను క్రియేట్ చేసింది. సాలిడ్స్ ఇంట్రడక్షన్ కోర్స్, బ్రెస్ట్‌ఫీడింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, బేబీ న్యూట్రిషన్ ప్రోగ్రామ్, స్లీప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, హోలిస్టిక్ కేర్ ప్రోగ్రామ్‌లాంటి ప్రత్యేక ప్రోగ్రామ్‌లకు రూపకల్పన చేశారు.

రాజస్థాన్‌లోని దౌజా జిల్లాలోని చిన్న గ్రామానికి చెందిన సుమిత్ర తన చిన్నతనంలో సొంత కుటుంబంలో విషాదాన్ని చూసింది. తక్షణ వైద్యం అందకపోవడంతో పుట్టిన కొన్ని గంటల్లోనే తన చెల్లి కన్నుమూసింది. ఈ విషాదమే సుమిత్ర మీనాను వైద్యవృత్తిని ఎంచుకునేలా చేసింది. తన కుటుంబంలో సుమిత్ర తొలి గ్రాడ్యుయేట్. ఢిల్లీలోని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీలో ఎంబీబియస్, పీడియాట్రిక్స్‌లో ఎం.డీ. చేసింది.



ఏటీపీ ఫైనల్స్‌కు రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ జంట

టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న అర్హత సాధించాడు. ప్రతిష్టాత్మక టోర్నీ పురుషుల డబుల్స్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి రోహన్ బోపన్న బరిలోకి దిగనున్నాడు. నవంబర్ 10 నుంచి 17 వరకు జరగనున్న ఈ టోర్నీలో ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది జోడీలు పాల్గొననున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో బోపన్న-ఎబ్డెన్ జోడీ ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గింది. దీంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బోపన్న ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడు (43 ఏళ్ల 331 రోజులు)గా బోపన్న రికార్డుల్లోకి ఎక్కాడు. అనంతరం ఈ జోడీ మియామి ఓపెన్ టైటిల్ సైతం కైవసం చేసుకుంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరిన బోపన్న-ఎబ్డెన్ జోడీ... అడిలైడ్‌లో ఫైనల్‌కు చేరింది. 2023 ఏటీపీ ఫైనల్స్ సెమీఫైనల్లో ఓడిన బోపన్న-ఎబ్డెన్ జంట ఈసారి టైటిల్ సాధించాలని భావిస్తోంది. ఇప్పటి వరకు మూడుసార్లు ఈ టోర్నీ బరిలోకి దిగిన బోపన్న... నాలుగోసారి సీజన్ చివరి టోర్నీ ఆడనున్నాడు.

స్మృతి శతకం... సిరీస్ సొంతం



స్మృతి మంధాన



చివరి వన్డేలో భారత మహిళల గెలుపు

6 వికెట్లతో ఓడిన న్యూజిలాండ్ • 2-1తో సిరీస్ హర్మన్ బృందం కైవసం

అహ్మదాబాద్: వారెవా... స్మృతి మంధాన ఇలా ఆడి ఎన్నాళ్లైంది. ఆఖరి వన్డే చూసినవారందరి నోటా విని పించిన మాట ఇదే! కీలకమైన పోరులో ఆమె సాధించిన శతకంతో భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌ను 2-1తో వశం చేసుకుంది. ఈ విజయంలో బౌలర్లు దీప్తిశర్మ, ప్రియా మిశ్రాలతో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా తోడయ్యారు. దీంతో మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మహిళల జట్టు 49.5 ఓవర్లలో 232 పరుగుల వద్ద ఆలౌటైంది. బ్రూక్ హాలిడే (96 బంతుల్లో 86; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆదుకుంది. ఓపెనర్ జార్జియా ప్లిమెర్ (67 బంతుల్లో 39; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. భారత బౌలర్లలో దీప్తిశర్మ 3 వికెట్లు పడగొట్టగా, యువ లెగ్‌స్పిన్నర్ ప్రియా మిశ్రా (2/41) కీలకమైన వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు 44.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసి గెలిచింది. చాన్నాళ్ల తర్వాత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (122 బంతుల్లో 100; 10 ఫోర్లు)బ్యాట్‌కు పనిచెప్పింది. హర్మన్‌ప్రీత్ (63 బంతుల్లో 59 నాటౌట్; 6 ఫోర్లు) రాణించింది. హన్నా రోవ్ 2 వికెట్లు పడగొట్టింది. కివీస్, భారత్ తమ తుది జట్లలో ఒక్కోమార్పు చేశాయి. జెస్ కెర్ స్థానంలో హన్నా రోవ్ బరిలోకి దిగింది. భారత జట్టులో హైదరాబాద్ సీమర్ అరుంధతి రెడ్డి స్థానంలో రేణుకా సింగ్‌ను తీసుకున్నారు.

హాలిడే ఒంటరి పోరాటం

భారత బౌలర్లు, ఫీల్డర్లు కట్టుదిట్టం చేయడంతో కివీస్‌కు ఆరంభంలోనే కష్టాలెదురయ్యాయి. జెమీమా మెరుపు ఫీల్డింగ్‌తో సుజీ బేట్స్ (4)తో పాటు మ్యాడీ గ్రీన్ (15)ను రనౌట్ చేసింది. సైమా, ప్రియా బౌలింగ్‌లలో లౌరెన్ (1), సోఫీ డివైన్ (9)లు అవుటయ్యారు. దీంతో ఒక దశలో 88/5 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడిన కివీస్‌ను మిడిలార్డర్ బ్యాటర్ బ్రూక్ హాలిడే ఆదుకుంది. చూడచక్కని బౌండరీలు, మూడు భారీ సిక్సర్లతో ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఇసాబెల్లా గేజ్ (49 బంతుల్లో 25; 1 ఫోర్)తో ఆరో వికెట్‌కు 64 పరుగులు, తహుహు (14 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)తో ఏడో వికెట్‌కు 47 పరుగులు జోడించాక హాలిడే నిష్క్రమించింది.

గెలిపించిన స్మృతి, హర్మన్

చూసేందుకు లక్ష్యం సులువుగానే కనిపిస్తుంది. అయితే గత మ్యాచ్ గుర్తుకొస్తే ఎక్కడ, ఎప్పుడు కూలిపోతోందోనన్న బెంగ! నాలుగో ఓవర్లోనే షఫాలీ (12) అవుట్. స్మృతి ఫామ్‌పై దిగులు! కానీ స్టార్ ఓపెనర్ కీలకమైన మ్యాచ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. వన్‌డౌన్ బ్యాటర్ యస్తిక భాటియా (49 బంతుల్లో 35; 4 ఫోర్లు)తో కలిసి జట్టును పరుగుల బాట పట్టించింది. జట్టు స్కోరు వందకు చేరువయ్యే సమయంలో 92 పరుగుల వద్ద యస్తికను సోఫీ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చింది. క్రీజులోకి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ రాగా... 73 బంతుల్లో స్మృతి ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. ఇద్దరు కలిసి న్యూజిలాండ్ బౌలర్లపై కదం తొక్కడంతో జట్టు గెలుపుబాట పట్టింది. హర్మన్ 54 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించింది. కాసేపటికే మంధాన 121 బంతుల్లో సెంచరీ మైలురాయిని చేరుకుంది. అదే స్కోరు వద్ద ఆమె క్లీన్‌బౌల్డయ్యింది. అప్పటికే జట్టు గెలుపుతీరానికి చేరుకుంది. జెమీమా (18 బంతుల్లో 22; 4 ఫోర్లు)తో హర్మన్ లాంఛనాన్ని దాదాపు పూర్తి చేస్తుండగా, విజయానికి పరుగుదూరంలో జెమీమా ఎల్బీగా వెనుదిరిగింది. తేజల్ (0 నాటౌట్) ఖాతా తెరువకముందే హర్మన్‌ప్రీత్ బౌండరీతో జట్టును గెలిపించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సుజీ బేట్స్ రనౌట్ 4; జార్జియా (సి) దీప్తి (బి) ప్రియా 39; లౌరెన్ (సి) యస్తిక (బి) సైమా 1; సోఫీ డివైన్ (బి) ప్రియా 9; హాలిడే (సి) రాధ (బి) దీప్తి 86; మ్యాడీ గ్రీన్ రనౌట్ 15; ఇసాబెల్లా (సి) అండ్ (బి) దీప్తి 25; హన్నా రోవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి 11; తహుహు నాటౌట్ 24; కార్సన్ (సి) రాధ (బి) రేణుక 2; జొనాస్ రనౌట్ 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 232. వికెట్ల పతనం:** 1-24, 2-25, 3-36, 4-66, 5-88, 6-152, 7-199, 8-210, 9-219, 10-232. **బౌలింగ్:** రేణుకా సింగ్ 10-1-49-1, సైమా ఠాకూర్ 9.5-1-44-1, ప్రియా మిశ్రా 10-1-41-2, దీప్తిశర్మ 10-2-39-3, రాధా యాదవ్ 4-0-21-0, హర్మన్‌ప్రీత్ 6-0-34-0.

భారత మహిళల ఇన్నింగ్స్: స్మృతి మంధాన (బి) రోవ్ 100; షఫాలీ (సి) ఇసాబెల్లా (బి) రోవ్ 12; యస్తిక (సి) అండ్ (బి) సోఫీ 35; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 70; జెమీమా (ఎల్బీడబ్ల్యూ) (బి) జొనాస్ 11; తేజల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (45.2 ఓవర్లలో 4 వికెట్లకు) 236. వికెట్ల పతనం:** 1-16, 2-92, 3-209, 4-232. **బౌలింగ్:** లియా తహుహు 6-0-30-0, హన్నా రోవ్ 8-0-47-2, ఎడెన్ కార్సన్ 10-0-45-0, సోఫీ డివైన్ 7.2-0-44-1, సుజీ బేట్స్ 4-0-18-0, ఫ్రాన్ జొనాస్ 9-1-50-1.



చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు సభ్యులకు హైదరాబాద్‌లో మంగళవారం ప్రత్యేక అభినందన కార్యక్రమం జరిగింది. స్పాన్సర్‌షిప్, మేనేజ్‌మెంట్ ద్వారా సుదీర్ఘ కాలంగా చెస్‌కు అండగా నిలుస్తున్న ప్రవాహ ఫౌండేషన్, మైత్రా ఎనర్జీ, ఎంజీడీ1 సంస్థలు ఆటగాళ్లను సన్మానించాయి. ప్లేయర్లు ఇరిగేశి అర్జున్, పెంటేల హరికృష్ణ, ద్రోణవల్లి హారిక, వంతిక అగర్వాల్‌లతో పాటు కోచ్ శ్రీనాథ్ నారాయణన్ ఇందులో పాల్గొన్నారు.

మూడో టెస్టుకు హర్షిత్



హర్షిత్

జట్టుతో చేరనున్న పేస్ బౌలర్

ముంబై: భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే మూడో టెస్టు కోసం పేస్ బౌలర్ హర్షిత్ రాణాను జట్టులోకి తీసుకున్నారు. బుధవారం అతను జట్టుతో చేరతాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన ట్రావెలింగ్ రిజర్వ్‌లలో ఢిల్లీకి చెందిన హర్షిత్ కూడా ఉన్నాడు. అయితే ఇప్పుడు ప్రధాన జట్టులోకి రానున్నాడని సమాచారం. నవంబర్ 1 నుంచి భారత్, కివీస్ మధ్య మూడో టెస్టు వాంఖెడే మైదానంలో జరుగుతుంది. హర్షిత్‌కు ఇప్పటికే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లే భారత టెస్టు టీమ్‌లో చోటు లభించింది. దానికి ముందు ఒక టెస్టులో అతడిని ఆడిస్తే బాగుంటుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కివీస్‌తో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన నేపథ్యంలో మూడో టెస్టులో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి నిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే హర్షిత్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టవచ్చు. బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లకు ఎంపికైనా... హర్షిత్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. మంగళవారం అస్సాంతో ముగిసిన రంజీ మ్యాచ్‌లో 7 వికెట్లు తీసిన హర్షిత్...ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 10 మ్యాచ్‌ల ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 24.00 సగటుతో రాణా 43 వికెట్లు పడగొట్టాడు.

విలియమ్సన్ దూరం



విలియమ్సన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ భారత్‌తో సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు. గాయం కారణంగా తొలి రెండు టెస్టులకు అందుబాటులో లేని అతను ఇప్పుడు మూడో టెస్టునుంచి తప్పుకున్నాడు. విలియమ్సన్ భారత్‌కు రావడం లేదని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గాయం నుంచి కోలుకొని అతను ప్రస్తుతం రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. అయితే ముందు జాగ్రత్తగా బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. సంచలన ప్రదర్శనతో కివీస్ ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న నేపథ్యంలో హడావిడిగా విలియమ్సన్‌ను బరిలోకి దించరాదని బోర్డు భావించింది. ఈ సిరీస్ తర్వాత సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ తలపడనుంది. దాని కోసం విలియమ్సన్ పూర్తి స్థాయిలో ఫిట్‌గా అందుబాటులో ఉండాలనేదే ప్రధాన కారణం. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ఆడిన తర్వాత స్వదేశానికి వెళ్లిన విలియమ్సన్ గాయం కారణంగా భారత గడ్డపై అడుగు పెట్టనే లేదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

అందుకే ముంబైకి షిఫ్ట్ అయ్యాం

- హీరో సూర్య



చెన్నైలో పుట్టి, పెరిగి, అక్కడే చదువుకుని, కెరీర్ కూడా అక్కడే ఆరంభించిన స్టార్ హీరో సూర్య హఠాత్తుగా ముంబైకి మారారు. కుటుంబంతో సహా ఆయన ఆ మధ్య ముంబైకి షిఫ్ట్ కావడం హాట్‌టాపిక్‌గా మారింది. అకస్మాత్తుగా సూర్య ఈ నిర్ణయం తీసుకోవడం వెనక కారణం ఏంటి? అనే విషయంపై పలు ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ విషయంపై సూర్య స్పందించారు. ''నా భార్య జ్యోతిక మా కుటుంబం, పిల్లలు ఇతర విషయాల కోసం 27 ఏళ్ల చెన్నైలోనే ఉన్నారు. ముంబైలోని తన స్నేహితులు, బంధువులు, బాంద్రా లైఫ్‌స్టైల్... ఇలా అన్నింటినీ జ్యోతిక త్యాగం చేసి, కుటుంబం కోసం చెన్నైలో ఉన్నారు. ఓ మార్పు కావాలనుకున్నప్పుడు అది ఎప్పుడూ నా కోసమే ఎందుకై ఉండాలి? తన (జ్యోతికను ఉద్దేశిస్తూ..) కోసం కూడా ఉండాలి కదా. పురుషులు ఏం కోరుకుంటారో, మహిళలకూ అవి ఉండాలి. అందుకే జ్యోతిక కోసం ముంబైకి షిఫ్ట్ అయ్యాను. విహారయాత్రలు, తన స్నేహితులతో గడపడం, ఆర్థిక స్వేచ్ఛ, తనకు నచ్చిన జీవన విధానం... ఇవన్నీ ఇప్పుడు జ్యోతికకు కావాలి. నేను సపోర్ట్ చేస్తున్నాను. చెప్పాలంటే... నేను కాస్త ఆలస్యంగా ఈ నిర్ణయం తీసుకున్నానని అనుకుంటున్నాను'' అని సూర్య చెప్పుకొచ్చారు.



సమంత

హీరోయిన్ సమంత

ఇటీవల ఓ కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. 'సినిమా బండి' చిత్రంతో ప్రేక్షకుల మనసు గెలిచి, ఇటీవల 'పరదా' (ఇంకా రిలీజ్ కావాల్సి ఉంది) చిత్రాన్ని పూర్తి చేసిన దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల కథకు సమంత గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైందనే టాక్ వినిపిస్తోంది. తన సొంత నిర్మాణసంస్థ

ట్రా లా లాలో రెండో సినిమా?

'ట్రా లా లా'పై ఈ సినిమాను సమంత నిర్మిస్తున్నారని, త్వరలోనే ప్రకటన రానుందని భోగట్టా. 'ట్రా లా లా' బ్యానర్‌పైనే 'మా ఇంటి బంగారం' అనే సినిమాను గతంలో ప్రకటించారు సమంత. కానీ ఆ తర్వాత మరో అప్‌డేట్ రాలేదు. ఈలోపు ఈ బేనర్‌పై మరో సినిమా అంటూ... రెండో సినిమా గురించిన వార్త ప్రచారంలోకి వచ్చింది.

వేటలో..!



రాజమౌళి

కెన్యాలో లొకేషన్ వేట ఆరంభించారు రాజమౌళి. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఆఫ్రికన్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని తెలిసింది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి చేసిన రాజమౌళి లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం కెన్యాలోని అంబోసెలి నేషనల్ పార్క్‌లో రాజమౌళి ఉన్నారు. కెన్యా, ఆఫ్రికా లొకేషన్స్‌లో కొన్ని లొకేషన్స్‌ని ఎంపిక చేసి, తొలి షెడ్యూల్‌ని అక్కడే ఆరంభిస్తారని సమాచారం. ఇక ఈ సినిమాకు 'మహారాజా', 'మహారాజ్' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారని, 18వ శతాబ్దం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని, ఓ నిధి అన్వేషణతో ఈ సినిమా ఉంటుందనీ వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

నవంబరులో జీబ్రా



ధనుంజయ, సత్యదేవ్

సత్యదేవ్, డాలీ ధనుంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన చిత్రం 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అన్నది ట్యాగ్‌లైన్. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సునీల్, సత్యరాజ్, సత్య అక్కల కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ఈ సినిమాని నవంబరు 22న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, సత్యదేవ్, ధనుంజయ పోస్టర్‌ని విడుదల చేశారు. ''క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జీబ్రా'. ఫస్ట్ లుక్ పోస్టర్స్, మోషన్ వీడియో, టీజర్‌కి మంచి స్పందన వచ్చింది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, సహనిర్మాత: ఎస్. శ్రీలక్ష్మి రెడ్డి.

బుల్లెట్ బండిపై కాలభైరవ



'బుల్లెట్ బండి'లో...

నృత్య దర్శకుడిగా, దర్శకుడిగా, నటుడిగా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు రాఘవా లారెన్స్. మంగళవారం (అక్టోబరు 29) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్ హీరోగా రూపొందుతోన్న 'బుల్లెట్ బండి, కాలభైరవ' సినిమాల నుంచి ఆయన ప్రత్యేక పోస్టర్లు విడుదల చేశారు మేకర్స్. ఇన్నాసి పాండియన్ దర్శకత్వం వహిస్తున్న 'బుల్లెట్ బండి'లో ఎల్విన్, సునీల్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఫైవ్‌స్టార్ క్రియేషన్స్‌పై కదిరేసన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్న లారెన్స్ లుక్ విడుదల చేశారు. ఈ మూవీకి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: అరవింద్ సింగ్.



'కాలభైరవ'లో...

కాలభైరవ... రాఘవా లారెన్స్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియన్ సూపర్ హీరో ఫిల్మ్ 'కాలభైరవ'. రమేశ్ వర్మ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఏ స్టూడియోస్ ఎల్ఎల్‌పీ, గోల్డ్ మైన్ టెలీ ఫిల్మ్స్, నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్‌పై కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. యాక్షన్ అడ్వెంచరస్‌గా రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని కోనేరు సత్యనారాయణ, మనీష్ షా నిర్మిస్తున్నారు.

రహస్యం ఇదం జగత్ తీయడం కష్టం

- చందు మొండేటి



స్రవంతి, చందు మొండేటి, కోమల్ ఆర్. భరద్వాజ్

''రహస్యం ఇదం జగత్' సినిమా టీజర్, ట్రైలర్ చూసి ఎగ్జైట్ అయ్యాను. మన పురాతన ధర్మానికి ఈ మూవీ దగ్గరగా అనిపించింది. ఇలాంటి సినిమా తీయడం చాలా కష్టం. అయితే ప్రేక్షకులు ఇలాంటి చిత్రాన్ని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు కాబట్టి ఈ సినిమా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ చందు మొండేటి పేర్కొన్నారు. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్యతారలుగా కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్స్‌పై పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించిన ఈ సినిమా నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకకి చందు మొండేటి ముఖ్య అతిథిగా హాజరై, విడుదల చేశారు. కోమల్ ఆర్. భరద్వాజ్ మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ, హనుమాన్, కార్తికేయ' లా మా 'రహస్యం ఇదం జగత్' కూడా మైథలాజికల్ సినిమా. సైన్స్ ఫిక్షన్‌కు మైథలాజికల్ అంశాలు జోడించి నేటి తరం ప్రేక్షకుల మెప్పు పొందేలా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని తెలిపారు.

ఆ గుర్తింపే వేరు

- చింతా గోపాలకృష్ణా రెడ్డి



''కిరణ్ అబ్బవరం ద్వారా 'క' ప్రాజెక్ట్ నా వద్దకు వచ్చింది. సుజీత్, సందీప్ చెప్పిన 'క' కథ విన్నప్పుడు కంటెంట్ చాలా కొత్తగా ఉందనిపించింది. మంచి సినిమా చేస్తే వచ్చే గుర్తింపు, కిక్కే వేరు. ఆ కిక్కు ఏ వ్యాపారంలోనూ రాదు. నా సినిమా కోట్ల మంది చూశారనే సంతృప్తి ఎంతో విలువైనదిగా భావిస్తా. ఒక మంచి చిత్రం చేయాలనే తపనతోనే 'క' సినిమా నిర్మించాను'' అని చింతా గోపాలకృష్ణా రెడ్డి అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. 'క'ని తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ– ''నాది రాజమండ్రి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. నాకు చిన్నప్పటి నుంచి పాటలు వినడం ఇష్టం. అలా సినిమాలపై ఆసక్తి ఏర్పడింది. వృత్తిపరంగా వ్యాపారవేత్తగా మారినా సినిమాలపై ఆసక్తితో తొలిసారి 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' సినిమా నిర్మించాను. ఆ చిత్రం తర్వాత సమంత 'యశోద' సినిమాకు కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాను. 'క'కి సీక్వెల్ చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 350కి పైగా థియేటర్స్‌లో 'క' రిలీజ్ అవుతోంది. ఇక శివలెంక కృష్ణప్రసాద్‌గారితో 'యశోద' తర్వాత 'సారంగపాణి జాతకం' అనే మూవీకి కో ప్రొడ్యూసర్‌గా చేస్తున్నాను. మా సంస్థ నుంచి వచ్చే కొత్త ప్రాజెక్ట్‌ని జనవరిలో ఫైనలైజ్ చేస్తాను'' అన్నారు.

చిత్తూరు నేపథ్యంలో...



శివశంకర్ రెడ్డి, రాజ్ కందుకూరి, సతీష్‌బాబు

సతీష్‌బాబు రాటకొండ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్‌గా నటించారు. గల్లా మంజునాథ్ సమర్పణలో రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నవంబరు 8న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'అమ్మోరు తల్లి ఊరు వదిలి వెళ్లిపోయిందహో..' అనే డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభం అవుతుంది. ''చిత్తూరు జిల్లాలోని ఓ జాతర నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్, ఇంటెన్స్ డ్రామా ఇందులో ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి కెమెరా: కేవీ ప్రసాద్, సంగీతం: శ్రీజిత్ ఎడవణ.

పది ప్రేమకథలతో...



వీరశంకర్, చిమ్మని మనోహర్

'కల, అలా, వెల్కమ్, స్విమ్మింగ్ పూల్' వంటి చిత్రాల దర్శకుడు చిమ్మని మనోహర్ దర్శకత్వంలో 'యో 10' అనే చిత్రం ఆరంభమైంది. పది ప్రేమకథలతో ఈ చిత్రాన్ని పీసీ క్రియేషన్స్ సమర్పణలో మనూటైమ్ మూవీ మిషన్ సంస్థ నిర్మించనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఆరంభమైంది. ఈ వేడుకలో దర్శకుడు, తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, దర్శకుడు చంద్రమహేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మనోహర్ చిమ్మని మాట్లాడుతూ – ''యో... అనే మాట యువతకు ప్రతీక. ఈ తరం యువతీయువకుల ఆలోచనలు, జీవనశైలి చుట్టూ అల్లిన 10 ప్రేమకథలతో ఈ సినిమా తీస్తున్నాను. సుమారు 2 గంటల నిడివి ఉండే ఈ సినిమాలో పది జంటలుంటాయి. ఈ సినిమాలో పది మంది పాపులర్ హీరోహీరోయిన్లు నటిస్తున్నారు. సపోర్టింగ్ రోల్స్‌లో కొందరు పాపులర్ నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ నటిస్తున్నారు'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
30-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
364	128
80,369	24,467

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,705	▼	141
డోజోన్స్	42,302	▼	92
ఎఫ్‌టీఎస్ఈ 100	8,220	▼	66
డాక్స్	19,478	▼	54
షాంఘై	3,286	▼	36
నికాయ్	38,903	▲	298

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
78,745	▲	500
బంగారం (99.5 స్వచ్ఛత)		
78,430	▲	498
వెండి (కిలో)		
97,873	▲	1,787

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.65

మారుతీ రివర్స్‌గేర్

- క్యూ2 లాభం రూ. 3,102 కోట్లు
- రూ. 37,449 కోట్ల రికార్డ్ టర్నోవర్

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 3,102 కోట్లకు పరిమితమైంది. ఇండెక్సేషన్ లబ్ధిని ఎత్తివేయడం, రుణ ఎంఎఫ్‌లపై దీర్ఘకాలిక లాభాల పన్ను రేట్లలో సవరణలతో ప్రొవిజనింగ్ చేపట్టడం ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది.



గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,786 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం స్వల్పంగా బలపడి రూ. 37,449 కోట్లను తాకింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికమని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. గత క్యూ2లో రూ. 37,339 కోట్ల టర్నోవర్ నమోదైంది. అనుకోకుండా చేపట్టిన రూ. 800 కోట్ల ప్రొవిజనింగ్‌ను మినహాయిస్తే నికర లాభంలో వృద్ధి నమోదయ్యేదని తెలియజేశారు.

విక్రయాల తీరిలా: ప్రస్తుత సమీక్షా కాలంలో మారుతీ మొత్తం 5,41,550 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీయ అమ్మకాలు 4,63,834 యూనిట్లు(4 శాతం డౌన్)కాగా.. 12 శాతం అధికంగా 77,716 వాహనాలను ఎగుమతి చేసింది. ఈ ఏడాది ఎగుమతులు 3 లక్షల యూనిట్లను మించనున్నట్లు భార్గవ అంచనా వేశారు. కాగా.. సొంత అనుబంధ సంస్థ సుజుకీ మోటార్ గుజరాత్ ప్రయివేట్‌ను విలీనం చేసుకునేందుకు బోర్డు సూత్రప్రాయంగా అనుమతించినట్లు మారుతీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో మారుతీ సుజుకీ షేరు బీఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 11,010 వద్ద ముగిసింది.



రేటు పెరిగినా.. డిమాండ్ జిగేల్!

ధన్‌తేరాస్ 'పసిడి' అమ్మకాల జోరు

- నాణేలు, తేలికపాటి ఆభరణాలకు గిరాకీ...
- విలువపరంగా అమ్మకాల్లో 20 శాతం వృద్ధి
- ధన్‌తేరాస్, దీపావళితో కలిపి రూ. 30,000 కోట్ల అమ్మకాల అంచనాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ పసిడికి డిమాండ్ పటిష్టంగానే ఉంటోంది. ధన్‌తేరాస్ సందర్భంగాను అదే ధోరణి నెలకొంది. మంగళవారం ధన్‌తేరాస్ సందర్భంగా అమ్మకాలు ఉదయం పూట అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి పుంజుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వివరించాయి. ఎక్కువగా చిన్న ఐటమ్స్, నాణేలకు డిమాండ్ నెలకొన్నట్లు పేర్కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం వరకు ధన్‌తేరాస్ ఉండటంతో మరింతగా వ్యాపారం జరగవచ్చని పీఎన్ గాడ్గిల్ జ్యుయలర్స్ సీఎండీ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు. ధరలు అధిక స్థాయిలో ఉన్నా డిమాండ్ పటిష్టంగా ఉన్నట్లు కల్యాణ్ జ్యుయలర్స్ ఈడీ రమేష్ కల్యాణరామన్ చెప్పారు. అయితే, అధిక ధరల వల్ల విలువపరంగా అమ్మకాలు పెరిగినా, పరిమాణంపరంగా మాత్రం తగ్గొచ్చని కొన్ని వర్గాలు పేర్కొన్నాయి. 'రేటు అధికంగా ఉన్నా కొనుగోళ్లు మెరుగ్గానే ఉన్నాయి. పరిమాణంపరంగా గతేడాదితో పోలిస్తే 10 శాతం తగ్గినా, విలువపరంగా చూస్తే 20 శాతం అధికంగా ఉండొచ్చు' అని ఆలిండియా జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ సయ్యమ్ మెహ్రా తెలిపారు. రీసైకిల్డ్ ఆభరణాల అమ్మకాలు కూడా బాగున్నట్లు పేర్కొన్నారు. 2, 3, 4, 5, 8 గ్రాముల గోల్డ్ కాయిన్స్, తేలికపాటి ఆభరణాలు విక్రయాలు గణనీయంగా ఉన్నట్లు వివరించారు. ఆఫర్లు, డిస్కౌంట్లను కొనుగోలుదార్లు వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొత్తం అమ్మకాల్లో 30–40% వాటా వివాహ ఆభరణాలది ఉండగా, మిగతాది పండుగపరమైన నామమాత్రపు కొనుగోళ్లది ఉన్నట్లు సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ సువంకర్ సేన్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే పసిడి అమ్మకాల పరిమాణం 15% తగ్గొచ్చని, విలువపరంగా మాత్రం 12% అధికంగా ఉండొచ్చన్నారు. ధన్‌తేరాస్, దీపావళి సందర్భంగా దేశీ మార్కెట్లో అమ్మకాలు రూ. 30,000 కోట్ల పైగా ఉంటాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రేటు 33 శాతం జంప్..

గతేడాది నవంబర్ 11న ధన్‌తేరాస్ నాడు న్యూఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల పసిడి ధర రూ. 61,200గా ఉండగా ఈసారి ఏకంగా 33 శాతం ఎగిసి రూ. 81,400కి చేరింది. వెండి ధర కేజీకి గతేడాది ధన్‌తేరాస్ నాడు రూ.74,000గా ఉండగా ఈసారి 35% పెరిగి రూ. 99,700గా ఉంది.

సుంకాల తగ్గింపుతో బూస్ట్: ఎంఎంటీసీ

ఇటీవల పసిడిపై దిగుమతి సుంకాలను తగ్గించడంతో ధన్‌తేరాస్ సందర్భంగా బంగారం కొనుగోళ్లకు ఊతం లభించిందని ఎంఎంటీసీ–పీఏఎంపీ ఎండీ వికాస్ సింగ్ తెలిపారు. కస్టమర్లు అధిక స్వచ్ఛత గల పసిడి ఉత్పత్తులపై ఆసక్తి కనపరుస్తున్నట్లు చెప్పారు. రాబోయే పెళ్లిళ్ల సీజన్‌లోనూ ఇదే సానుకూల ధోరణి కొనసాగవచ్చని సింగ్ చెప్పారు. సీజన్‌తో సంబంధం లేకుండా సంప్రదాయాలపరమైన వివిధ వేడుకల కారణంగా కూడా పసిడికి డిమాండ్ కొనసాగుతూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ లాభాలు

- రాణించిన బ్యాంకులు, ఆయిల్ షేర్లు
- మైనస్ 589 నుంచి ప్లస్ 364 పాయింట్లకు సెన్సెక్స్

ముంబై: చివరి గంటలో బ్యాంకులు, ఫైనాన్స్, ఆయిల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 364 పాయింట్లు పెరిగి 80,369 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 128 పాయింట్లు బలపడి 24,467 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చాయి. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ఇంట్రాడేలో ఎక్కువ సేపు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 589 పాయింట్లు క్షీణించి 79,421 వద్ద, నిఫ్టీ 198 పాయింట్లు కోల్పోయి 24141 కనిష్టాన్ని తాకాయి. కన్జూమర్ డిస్క్రెషనరీ, టెలికమ్యూనికేషన్, ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.75%, 0.74 శాతం చొప్పున రాణించాయి.



- ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లకు రెండో రోజూ డిమాండ్ నెలకొంది. ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, మహారాష్ట్ర బ్యాంకు షేర్లు 5% లాభపడ్డాయి. సెంట్రల్ బ్యాంకు, ఐఓబీ, పీఎన్‌బీ, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు 3% పెరిగాయి. యుకో బ్యాంక్ 2%, బ్యాంక్ ఆఫ్ బరోడా ఒకశాతం లాభపడ్డాయి.
- ఫెడరల్ బ్యాంక్ ఒక త్రైమాసికంలో రికార్డు నికరలాభం ప్రకటించడంతో ఈ బ్యాంకు షేరు భారీగా పెరిగింది. బీఎస్ఈలో 9% లాభపడి రూ.201 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో పోస్కో జట్టు

- భారత్‌లో ఉక్కు ప్లాంటు ఏర్పాటు కోసం ఎంఓయూ
- రూ. 40,000 కోట్ల పెట్టుబడి?

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఉక్కు సంస్థ పోస్కో తాజాగా దేశీ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో జట్టు కట్టింది. భారత్‌లో 5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం (ఎంటీపీఏ) గల సమగ్ర ఉక్కు ప్లాంటు ఏర్పాటు కోసం ఒప్పందం కుదుర్చుకుంది. పెట్టుబడులు, ప్లాంటు నెలకొల్పే ప్రాంతంపై జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఎలాంటి వివరాలు వెల్లడించనప్పటికీ 1 ఎంటీపీఏ ప్రాజెక్టుకు సగటున సుమారు రూ. 8,000 కోట్ల చొప్పున 5 ఎంటీపీఏ ప్రాజెక్టుకు రూ. 40,000 కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 'భారత్‌లో ఉక్కు, బ్యాటరీ మెటీరియల్స్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భాగస్వామ్యానికి సంబంధించి పోస్కో గ్రూప్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాం' అని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. ముంబైలో జరిగిన ఎంఓయూ కార్యక్రమంలో గ్రూప్ చైర్మన్ జిందాల్, పోస్కో చైర్మన్ చాంగ్ ఇన్–హువా తదితరులు పాల్గొన్నారు. 'భారత్‌లో తయారీ రంగ ముఖచిత్రాన్ని మార్చే విధంగా టెక్నాలజీ, పర్యావరణహితమైన విధానాల విషయంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతాం' అని జిందాల్ తెలిపారు. 'కొరియా, భారత్ ఆర్థిక వృద్ధికి ఈ భాగస్వామ్యం గణనీయంగా ఉపయోగపడుతుంది' అని చాంగ్ ఇన్–హువా పేర్కొన్నారు.



ఎంట్రీ కోసం పోస్కో ప్రయత్నాలు ..

భారత మార్కెట్లో ప్రవేశించేందుకు పోస్కో సంస్థ చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. గతంలో ఒరిస్సాలో 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 12 ఎంటీపీఏ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించింది. అయితే, స్థల సమీకరణలో తీవ్ర జాప్యం జరగడంతో ప్రణాళికలను విరమించుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ (వైజాగ్ స్టీల్)తో కూడా జట్టు కట్టే ప్రయత్నం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మెగా స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి సాధ్యాసాధ్యాల రిపోర్టును తయారు చేసేందుకు ఇరు సంస్థల అధికార్లతో ఒక వర్కింగ్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేసినప్పటికీ ఆ ప్రయత్నం కూడా ముందుకు సాగలేదు.

అజిమత్ ఏఐలో సైయెంట్‌కు వాటాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ ఎనర్జీ, పవర్ సొల్యూషన్స్ అందించే అజిమత్ ఏఐలో 27.3 శాతం వాటా కొనుగోలు చేసినట్లు ఇంటెలిజెంట్ ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ తెలిపింది. సెమీకండక్టర్ల విభాగంలో వృద్ధికి సంబంధించి ఈ పెట్టుబడి తమకు కీలక మైలురాయని కంపెనీ ఎండీ కృష్ణ బోదనపు తెలిపారు. ఇటీవలే పూర్తి అనుబంధ సంస్థ ఏర్పాటుతో తమ సెమీకండక్టర్ వ్యాపార విస్తరణను ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. అధునాతన ఏఎస్ఐసీ చిప్‌లను ప్రపంచం కోసం భారత్‌లో రూపొందించడంపై మరింతగా దృష్టి పెట్టేందుకు అజిమత్ ఏఐలో పెట్టుబడులు ఉపయోగపడగలవని కృష్ణ వివరించారు.



కాకినాడలో లిఫియస్ ఫార్మా పెన్సిలిన్–జీ ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెన్సిలిన్–జి ఉత్పత్తి కోసం కాకినాడలో నెలకొల్పిన ప్లాంటును ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించినట్లు ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మాలో భాగమైన లిఫియస్ ఫార్మా వెల్లడించింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద రూ. 2,500 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడులతో ఈ ప్లాంటు ఏర్పాటైంది. ఈ ప్లాంటు వార్షికోత్పత్తి సామర్థ్యం 15,000 మెట్రిక్ టన్నులుగా (ఎంటీ) ఉంటుందని సంస్థ డైరెక్టర్ ఎంవీ రామకృష్ణ తెలిపారు. భారత్‌ను ఫార్మా తయారీ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో స్వయంసమృద్ధి సాధించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో కంపెనీ తన వంతు తోడ్పాటును అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు నాంది పడింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జోరుగా ఐఫోన్ల ఎగుమతులు | అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం హైజంప్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

» 354 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» గ్రూప్–ఎ హోదాలో ఉద్యోగ నియామకాలు
» ఇంటర్వ్యూ,పీఎస్‌టీలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

సాయుధ దళాల్లో మెడికల్ ఆఫీసర్

ఎంబీబీఎస్, ఎండీ వంటి వైద్య కోర్సులు పూర్తి చేశారా! ఈ అర్హతలతో కేంద్ర ప్రభుత్వ కొలువులు సాధించాలని కోరుకుంటున్నారా!! కేంద్ర సాయుధ దళాల్లో గ్రూప్–ఎ హోదాలో మెడికల్ ఆఫీసర్ కొలువులు స్వాగతం పలుకుతున్నాయి. ఎంపికైతే నెలకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వేతనం పొందొచ్చు. ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ తాజాగా మెడికల్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ నేపథ్యంలో.. ఐటీబీపీ మెడికల్ ఆఫీసర్స్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర సమాచారం..

కేంద్ర సాయుధ దళాల్లో వైద్యులది ఎంతో కీలక పాత్ర. భద్రతా సిబ్బంది విధి నిర్వహణలో కొన్ని సందర్భాల్లో గాయాలపాలవుతుంటారు. అలాంటి వారికి తక్షణం వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నియమిస్తోంది. డాక్టర్లుగా కేంద్ర ప్రభుత్వ కొలువులు కోరుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.



మొత్తం పోస్టుల సంఖ్య 345

కేంద్ర సాయుధ దళాలుగా పేర్కొనే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్, సశస్త్ర సీమా బల్, అస్సాం రైఫిల్స్ విభాగాల్లో మూడు హోదాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కేంద్ర హోంశాఖ శ్రీకారం చుట్టింది. సూపర్ స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్స్(సెకండ్ ఇన్ కమాండ్)–5 పోస్టులు,స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ (డిప్యూటీ కమాండెంట్)–176 పోస్టులు, మెడికల్ ఆఫీసర్స్ (అసిస్టెంట్ కమాండెంట్)–164 పోస్టులకు నియామకాలు చేపట్టనుంది.

విద్యార్హతలు

- **సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఆఫీసర్స్:** నిర్దేశిత స్పెషలైజేషన్లలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉండాలి. అదే విధంగా పీజీ తర్వాత డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్ (డీఎం) తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సంబంధిత సూపర్ స్పెషాలిటీ విభాగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి.
- **స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్స్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు ఏడాదిన్నర పని అనుభవం లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమాతోపాటు రెండున్నరేళ్ల పని అనుభవం ఉండాలి.
- **మెడికల్ ఆఫీసర్స్:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారు ఇంటర్వ్యూ సమయానికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోవాలి.

వయసు

సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఆఫీసర్స్‌కు 50 ఏళ్లు, స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్స్‌కు 30 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ–నాన్‌క్రీమీ లేయర్ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున మినహాయింపు ఇస్తారు.

ప్రత్యేక నియామక బోర్డ్

సాయుధ దళాల్లోని వైద్య విభాగంలో మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి కేంద్ర హోంశాఖ ప్రత్యేకంగా.. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ మెడికల్ ఆఫీసర్స్ సెలక్షన్ బోర్డ్–2024 పేరుతో ప్రత్యేక రిక్రూట్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. దరఖాస్తు నుంచి నియామకాల ఖరారు వరకు అన్ని వ్యవహారాలను ఈ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

మెడికల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అవి.. పర్సనల్ ఇంటర్వ్యూ, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

అకడమిక్ మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూకు

రాత పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూల ద్వారా పోస్టుల భర్తీ క్రమంలో..అకడమిక్ మెరిట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను క్రోడీకరించి..ఒక్కో పోస్ట్‌కు ముగ్గురు లేదా నలుగురిని చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

200 మార్కులకు ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో కీలకమైన ఇంటర్వ్యూకు 200 మార్కులు కేటాయించారు. ఇందులో అభ్యర్థులకు వైద్య రంగంలో ఉన్న అనుభవం, పరిజ్ఞానం, సామాజిక దృక్పథం, మేథో ప్రజ్ఞ, నాయకత్వ లక్షణాలు, నిజాయితీ వంటి అంశాలను పరిశీలిస్తారు. ఇలా ఇంటర్వ్యూకు ఎంపిక చేసే ముందు డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఇందులో కనీస అర్హత మార్కుల నిబంధనను కూడా విధించారు. కనీసం 40 శాతం (80 మార్కులు)తో ఉత్తీర్ణత సాధించాలి. అప్పుడే వారిని తదుపరి దశ ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

పీఎస్‌టీ ఇలా

ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. మరుసటి రోజు రెండో దశగా ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు 157.5 సెంటీ మీటర్ల ఎత్తు, మహిళా అభ్యర్థులు 142 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. అదే విధంగా.. పురుష అభ్యర్థులు ఛాతీ కొలత 77 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు 82 సెంటీ మీటర్లు ఉండాలి. తర్వాత దశలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి.. అన్నింటిలోనూ నిబంధనల మేరకు ఉంటే నియామకం ఖరారు చేస్తారు.

ఆకర్షణీయ వేతనం

సూపర్ స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్స్‌ను గ్రేడ్–2 హోదాలో (సెకండ్ ఇన్ కమాండ్ స్థాయి) నియమిస్తారు. పే లెవల్–12లో రూ.78,800–రూ.2,09,200 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం ఉంటుంది. స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్స్‌ను గ్రేడ్–2 (జూనియర్ టైమ్ స్కేల్)లో నియమిస్తారు. వీరికి డిప్యూటీ కమాండెంట్ హోదా కల్పిస్తారు. పే లెవల్–11లో రూ.67,700–రూ.2,08,700తో ప్రారంభ వేతనం ఇస్తారు. మెడికల్ ఆఫీసర్ పోస్ట్‌కు ఎంపికైన వారికి అసిస్టెంట్ కమాండెంట్ హోదా కల్పిస్తారు. వీరికి పే లెవల్–10లో రూ.56,100–రూ.1,77,500 శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది. ఆయా పోస్టుల్లో నియామకం ఖరారు చేసుకున్న వారు భవిష్యత్తులో అత్యున్నత హోదాలకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, నవంబర్ 14
- **ఇంటర్వ్యూ తేదీ:** 2025 జనవరి మొదటి వారంలో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in





కోల్ ఇండియా లిమిటెడ్‌లో 640 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్), కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్ దేశవ్యాప్తంగా ఉన్న సీఐఎల్ కేంద్రాలు/అనుబంధ సంస్థల్లో వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 640.
» **విభాగాల వారీగా ఖాళీలు:** మైనింగ్–263, సివిల్–91,ఎలక్ట్రికల్–102,మెకానికల్–104,సిస్టమ్–41,ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్–39.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(మైనింగ్/సివిల్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఐటీ /ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్), ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 30.09.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి 1,60,000.
» **ఎంపిక విధానం:** గేట్–2024 స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 29.10.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.coalindia.in

ఐటీఐ లిమిటెడ్, బెంగళూరులో 50 యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఐటీఐ లిమిటెడ్).. యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
» **విభాగాల వారీగా ఖాళీలు:** రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్–డీ)–04, ఫుల్‌స్టాక్ వెబ్ డెవలపర్–02, డేటా సెంటర్–04, లీగల్ సెల్–04, సివిల్–03, హెచ్‌ఆర్–02, ఫైనాన్స్–08, మార్కెటింగ్–07, ప్రాజెక్ట్స్(ఎన్ఎస్‌యూ)–10, ప్రొడక్షన్/మ్యానుఫ్యాక్చరింగ్–06.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.itiltd.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ తమిళనాడులో 23 టీచింగ్ పోస్టులు

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ తమిళనాడు డైరెక్ట్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–08, అసోసియేట్ ప్రొఫెసర్–09, అసిస్టెంట్ ప్రొఫెసర్–06.
» **విభాగాలు:** అప్లైడ్ సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, జాగ్రఫీ, హిస్టరీ, లా, మెటీరియల్ సైన్స్, మ్యూజిక్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, బోధనానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2024.
» **వెబ్‌సైట్:** https://cutn.ac.in

తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీలో 15 నాన్ టీచింగ్ పోస్టులు

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ తమిళనాడు డైరెక్ట్ ప్రాతిపదికన నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **పోస్టుల వివరాలు:** ఇన్ఫర్మేషన్ సైంటిస్ట్–01, అసిస్టెంట్ లైబ్రేరియన్–01, ఎల్‌డీసీ–04, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–03, లైబ్రరీ అటెండెంట్–02, ల్యాబొరేటరీ అటెండెంట్–01, హాస్టల్ అటెండెంట్–02, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్/కన్సల్టెంట్ ఇంటర్నల్ ఆడిట్(కాంట్రాక్ట్)–01.
» **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఇన్ఫర్మేషన్ సైంటిస్ట్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులకు 40 ఏళ్లు, కన్సల్టెంట్ ఇంటర్నల్ ఆడిట్ పోస్టులకు 65 ఏళ్లు, మిగతా పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2024.
» **వెబ్‌సైట్:** http://cutn.ac.in

ఐఐటీ హైదరాబాద్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లో వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్.
» **విభాగాలు:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–మేనేజ్‌మెంట్, లిబరల్ ఆర్ట్స్, కెమికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్–మెటలర్జికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్–ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, ఫిజిక్స్, డిజైన్.
» **అర్హత:** పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పారిశ్రామిక/పరిశోధన/బోధనలో మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1 పోస్టులకు రూ.1,01,500. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2 పోస్టులకు రూ.98,200. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,39,600. ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,59,100.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.11.2024.
» **వెబ్‌సైట్:** https://iith.ac.in

ఆస్తులు పంచి ఇచ్చినా అన్నం పెట్టట్లేదు!

- ఇద్దరు కొడుకులపై ఆర్డీవోకు వృద్ధుడి ఫిర్యాదు



సిరిసిల్ల: కన్నకొడుకులకు ఆస్తులు పంచి ఇచ్చినా వారు అన్నం పెట్టేందుకు ససేమిరా అంటుండటంతో ఓ వృద్ధుడు ఆకలితో అలమటిస్తున్నాడు. దీనిపై పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కినా.. కులసంఘాన్ని ఆశ్రయించినా న్యాయం జరగకపోవడంతో ఆర్డీవోను ఆశ్రయించాడు. బాధితుడి కథనం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మందుల నారాయణ (84) అనే వృద్ధుడు తన ఇద్దరు కొడుకులు శ్రీనివాస్, రవితోపాటు కుమార్తెకు పెళ్లిళ్లు చేశారు. కొడుకులకు చెరో ఇల్లుతోపాటు సాగుభూమి, బంగారం, ఇతర ఆస్తులు పంచి ఇచ్చారు. ఒక ఇల్లు, రెండు స్థలాలను మాత్రం తన పేరిటే పెట్టుకున్నారు. అయితే భార్య మణెమ్మ పదేళ్ల కిందట మరణించడంతో పెద్ద కొడుకు శ్రీనివాస్ వద్ద ఉండేవారు. అతను బాగానే చూసుకుంటాడనే నమ్మకంతో నారాయణ తన పేరిట ఉన్న ఇంటితోపాటు రెండు ప్లాట్లను ఇటీవల శ్రీనివాస్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అప్పటి నుంచి తండ్రి పోషణను పెద్ద కొడుకు పట్టించుకోవట్లేదు. దీంతో చిన్నకొడుకు వద్దకు వెళ్లగా ఆస్తి అన్నకు ఇచ్చి ఇప్పుడు తన వద్దకు వస్తే ఎలా పోషించాలంటూ నిలదీశాడు. దీంతో కొడుకుల నిర్వాకంపై నారాయణ స్థానికుల సాయంతో ఇటీవల సిరిసిల్ల ఆర్డీవో రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు తండ్రిని పోషించకపోతే చట్టప్రకారం ఆయన రాసిచ్చిన ఆస్తులను రద్దు చేస్తానని హెచ్చరించారు. తదుపరి విచారణ మంగళవారం ఉండగా ఈలోగా ఆయన బదిలీ అయ్యారు. దీంతో ఆర్డీవో కార్యాలయ ఏవో మంగళవారం విచారణ చేపట్టి విచారణను మరోసారి వాయిదా వేశారు. అయితే అన్నదమ్ములిద్దరూ ఆర్డీవో ఆఫీస్ ముందే తిట్టుకున్నారు. దీంతో పెద్ద మనుషుల సూచనతో మరోసారి గంభీరావుపేట పోలీసులను ఆ అభాగ్యుడు ఆశ్రయించాడు.

చంపుతానంటున్నాడు..

ఆర్డీవోకు ఫిర్యాదు చేసినందుకు పెద్ద కొడుకు చంపుతానని బెదిరిస్తున్నాడు. నేను ఉంటున్న ఇంటికొచ్చి ఖాళీ చెయ్యమన్నాడు. అద్దెకిస్తే రూ. 6 వేలు వస్తాయన్నాడు. ఆస్తి తీసుకొని అన్నం పెట్టరా అని అడిగితే ముఖంపై ఉమ్మేశాడు.

- మందుల నారాయణ

నెల ముందే ఇంజనీరింగ్ సెట్



- వచ్చే విద్యా సంవత్సరం నుంచి జూలైలోనే తరగతులు
- అన్ని ఉమ్మడి పరీక్షలు ముందే నిర్వహణపై ఉన్నత విద్యామండలి కసరత్తు
- అందరితో చర్చలు జరుపుతున్న చైర్మన్.. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యతపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ సహా అన్నింటికీ సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)లను వచ్చే విద్యా సంవత్సరం నుంచి గతానికంటే నెల రోజులు ముందే నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ దిశగా అవసరమైన కసరత్తు మొదలు పెట్టింది. జాతీయ ఇంజనీరింగ్ సంస్థల ఉమ్మడి ప్రవేశ పరీక్షల (జేఈఈ మెయిన్స్) తేదీలను ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. జనవరిలో తొలి విడత, ఏప్రిల్‌లో రెండో విడత పరీక్షలు చేపడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)ను నెల రోజుల ముందే నిర్వహించే యోచన చేస్తున్నట్టు మండలి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఇంజనీరింగ్ క్లాసులు సెప్టెంబర్‌లో మొదలవుతున్నాయి. దీన్ని జూలై ఆఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో మొదలయ్యేలా మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి దీనిపై అన్ని వర్గాలతోనూ చర్చలు జరుపుతున్నారు. అదే విధంగా పీజీ, లా, ఎడ్‌సెట్, ఈ–సెట్, ఐసెట్, పాలిసెట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్‌లను గతంతో పోల్చుకుంటే నెల రోజుల ముందే ఎలా నిర్వహించాలనేది పరిశీలిస్తున్నామని చైర్మన్ తెలిపారు. దీన్ని బట్టి చూస్తే ఇంటర్ పరీక్షలు ముగిసిన కొద్ది రోజుల్లోనే ఈఏపీసెట్ నిర్వహించే వీలుంది.

ప్రైవేటు కాలేజీలపై దృష్టి

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యతపై ప్రధానంగా దృష్టి పెట్టాలనే ఆలోచన ఉన్నట్టు బాలకిష్టారెడ్డి మీడియాకు తెలిపారు. చాలా కాలేజీల్లో అర్హతలేని అధ్యాపకుల చేత పాఠాలు చెప్పిస్తున్నారని, దీనివల్ల ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత ఉండటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని సీరియస్‌గా తీసుకోవాలని మండలి భావిస్తోంది. త్వరలో అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో ఈ విషయమై సమావేశం ఏర్పాటు చేయాలని చైర్మన్ భావిస్తున్నారు. ప్రతి ప్రైవేటు కాలేజీలో ఎవరెవరు బోధిస్తున్నారు? వారి అర్హతలు ఏమిటి? అనే వివరాలు సేకరించాలని నిర్ణయించారు. అర్హత లేని వారిని తొలగించడంతో పాటు, అన్ని అర్హతలు ఉన్న వారికి టీ–శాట్ తోడ్పాటుతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ తరహా పునఃశ్చరణ వల్ల బోధన విధానంలో మార్పు వస్తుందని భావిస్తున్నారు. మండలి పరిధిలో ఇప్పటివరకూ జరిగిన కార్యకలాపాలను సమీక్షించి, మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు బాలకిష్టారెడ్డి వివరించారు.

ఇ-మెయిల్ చేస్తే చాలు

ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు, సూచనలు, అర్జీలు ఇచ్చేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ అనేకమంది వస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఇ-మెయిల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని బాలకిష్టారెడ్డి తెలిపారు. మెయిల్ అందిన వెంటనే దానికి స్పందన వస్తుందని, వీలైనంత త్వరగా పరిశీలించి, అవసరమైన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు.

వచ్చే నెల 2 నుంచి యాదాద్రిలో కార్తీక మాసోత్సవాలు

- ప్రతి రోజు ఆరు బ్యాచ్‌లుగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు: ఈవో భాస్కర్‌రావు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం యాదాద్రి ఆలయ సన్నిధిలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడారు. కార్తీక మాసం సందర్భంగా యాదాద్రి క్షేత్రానికి భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీస్వామిని దర్శించుకోవడంతో పాటు ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని, ఈమేరకు కొండ కింద వ్రత మండపంలో డిసెంబర్ 1వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆరు బ్యాచ్‌లుగా వ్రతాల నిర్వహణ ఉంటుందన్నారు. వచ్చే నెల 15వ తేదీన ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని చెప్పారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలో నెల రోజులపాటు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 5 బ్యాచ్‌లు, కార్తీక శుద్ధ పౌర్ణమి రోజు 6 బ్యాచ్‌లుగా వ్రతాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా 15వ తేదీన ప్రధానాలయం, శివాలయంలో రాత్రి 6.30 గంటలకు ఆకాశ దీపారాధన ఉంటుందని తెలిపారు. ఈ నెల 31న దీపావళిని పురస్కరించుకుని ఆలయ నిత్య కైంకర్య వేళల్లో మార్పులు చేశామని చెప్పారు. వేకువజామున 3.30 గంటలకు సుప్రభాతం ప్రారంభమవుతుందన్నారు. 4.15 గంటల నుంచి 4.45 వరకు శ్రీస్వామి అమ్మవార్లకు మంగళహారతుల పూజ జరుగుతుందని, ఉదయం 8.15 గంటల నుంచి సర్వ దర్శనాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఒకేరోజు క్షయ పరీక్ష.. మందులు

బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు ప్రారంభం

- వర్చువల్‌గా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రధాని .. తొలిరోజు ప్రయోగాత్మకంగా రెండు కేంద్రాలకు డ్రోన్లు

సాక్షి, యాదాద్రి: వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక సేవలకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలను మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. జాతీయ క్షయ నిర్మూలన (ఐసీఎంఆర్) కార్యక్రమంలో భాగంగా రోగుల నమూనాలు సేకరించడంతో పాటు అవసరమైన వారికి మందులను పంపడంలో డ్రోన్ల సేవలను వినియోగించుకోనున్నారు. ప్రయోగాత్మకంగా బీబీనగర్ ఎయిమ్స్‌కు 10 కిలో మీటర్ల పరిధిలో ఉన్న భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి, కొండమడుగు పీహెచ్‌సీలకు డ్రోన్ సేవలను అనుసంధానం చేశారు. ఒకేరోజు టీబీ రోగ పరీక్ష, మందుల సరఫరా జరిగేలా డ్రోన్ సేవలను వినియోగిస్తారు.

తొలిరోజు రెండుచోట్లకు..

డ్రోన్లను బీబీనగర్ ఎయిమ్స్ సమకూరిస్తే జిల్లా వైద్యారోగ్యశాఖ టీబీ పరీక్షల నిర్వహణతో పాటు అవసరమైన వారికి మందుల పంపిణీ చేపట్టనుంది. మునిపంపుల, వర్కట్‌పల్లి, బొమ్మల రామారం, కొండమడుగు, బొల్లేపల్లి, రాజాపేట, నారాయణపురం పీహెచ్‌సీలకు చెందిన 50 సబ్‌సెంటర్ల పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది టీబీ రోగుల తెమడ (కఫం) శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల కోసం డ్రోన్ల ద్వారా భువనగిరి, రామన్నపేట,



శాంపిల్ సేకరణకు బీబీ నగర్ ఎయిమ్స్ నుంచి భువనగిరిలోని టీబీ యూనిట్‌కు వెళ్తున్న డ్రోన్

ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రులకు పంపుతారు. అదే రోజు రోగ నిర్ధారణ జరుగుతుంది. తర్వాత వారికి జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ఇచ్చే మందులను డ్రోన్ల ద్వారానే సంబంధిత పీహెచ్‌లకు చేరవేస్తారు. ఆరోగ్య సిబ్బంది వాటిని రోగులకు అందజేస్తారు. తొలిరోజు మంగళవారం శాంపిల్స్ కోసం ఎయిమ్స్ నుంచి కొండమడుగు, భువనగిరి ఆరోగ్య కేంద్రాలకు పంపిన రెండు డ్రోన్లు ఐదు నిముషాల్లో చేరుకున్నాయి. కొండమడుగు నుంచి ఆరు శాంపిళ్లను సేకరించారు. క్రమంగా ఈ సేవలు జిల్లా మొత్తం విస్తరించనున్నామని, తొలుత 44 గ్రామాలకు ఈ సేవలను అందిస్తామని ఎయిమ్స్ ఇన్‌చార్జి డాక్టర్ భూషణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా, డీన్ డాక్టర్ రాహుల్ నారంగ్, డాక్టర్ సుమిత్ అగర్వాల్, డాక్టర్ కుల్దీప్ నిగమ్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సాయిశోభ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మెడికల్ సీటు సాధించిన పేద విద్యార్థినికి పొన్నం భరోసా

ఆర్థిక సాయానికి హామీ



దేవి జాయినింగ్ రిపోర్టును చూస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి ఎఫెక్ట్..

హుస్నాబాద్ రూరల్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం భల్లునాయక్ తండాకు చెందిన పేద విద్యార్థిని లావుడ్య దేవి ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినా ఆర్థిక స్థోమత లేక కూలి పనులకు వెళ్తోంది. దీనిపై 'సాక్షి' సోమవారం సంచికలో 'డాక్టర్ చదువుకు డబ్బుల్లేక కూలి పనులకు..' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గిరిజన విద్యార్థి కుటుంబం గురించి స్థానిక నాయకులతో ఆరా తీశారు. మంగళవారం హుస్నాబాద్‌కు వచ్చిన మంత్రి.. గిరిజన విద్యార్థిని అభినందించారు. ఆమె కాలేజీ ఫీజుకు ఆర్థిక సాయంతో చేయడంతోపాటు హాస్టల్ ఫీజు చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. వచ్చే ఏడాదికి కూడా కాలేజీ ఫీజుకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.



'మేం లంచం తీసుకోం.. నిస్వార్థంగా పనులు చేస్తాం'

సూర్యాపేట: 'మేం లంచం తీసుకోం.. నిస్వార్థంగా విధులు నిర్వహిస్తాం'అంటూ సూర్యాపేట ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగులు బ్యానర్, ప్లకార్డులతో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ కూడా చేశారు. అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ డీఈ గాలి నాయుడు, విజిలెన్స్ సీఐ డి.లింగయ్య మాట్లాడుతూ ఎవరైనా సరే లంచం తీసుకోవడం నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేందర్, దుర్గాప్రసాద్, ఉపేందర్, మధు, ఎస్ఈ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ సీటొచ్చినా కూలి పనులకు..

కౌడిపల్లి(నర్సాపూర్): కూలి పనులు చేస్తేనే కూడు దొరకని కుటుంబం.. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. అయితేనేం ముత్యాల్లాంటి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు చదువులో మేటిగా ఉన్నారు. ఇప్పుడా దంపతుల రెండో కుమార్తెకు ఎంబీబీఎస్ సీటొచ్చినా.. డబ్బుల్లేక కూలి పనులకు వెళ్తోంది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ భద్యతండాకు చెందిన కాట్రోత్ శివరాం, గంసీలకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు ఉన్న ఎకరం భూమి సాగు చేస్తూ, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్ద కొడుకు విజయ్‌కుమార్ కాకినాడలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం.. పెద్దకూతురు అనిత సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో నర్సింగ్ చదువుతున్నారు. చిన్న కొడుకు రాహుల్ ఖమ్మం ఎస్టీ గురుకుల కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కూతురు కాట్రోత్ సుమలత సిద్దిపేటలోని సురభి ప్రైవేట్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. కానీ ప్రైవేట్ కళాశాల కావడంతో ఏటా సుమారు రూ 3 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ నేపథ్యంలో ఉన్న పొలం తాకట్టుపెట్టి రూ.లక్షన్నర చెల్లించింది. ఇంకా హాస్టల్ ఇతరత్రా ఖర్చులకు రూ.లక్షన్నర అవసరం కావడంతో ఏం చేయాలో తెలియక సుమలత ఆవేదన చెందుతోంది. పెద్ద మనసున్న దాతలు 77801 06423 ఫోన్ నంబర్‌కు తోచిన సాయం చేయాలని కోరుతోంది.

దక్షిణమధ్య రైల్వేలో విజిలెన్స్ వారోత్సవాలు



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వీటిని నవంబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వారోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జె.వినయన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే మాజీ జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ బులెటిన్ 'అనిమిష'ను ఆవిష్కరించారు.

ప్రతి ఎంఈవో రోజూ రెండు స్కూళ్లకు వెళ్లాలి

ఎంఈవోలకు శిక్షణ కార్యక్రమంలో బుర్రా వెంకటేశం



సాక్షి, హైదరాబాద్: మండల విద్యాశాఖాధికారులు ప్రతిరోజూ కనీసం రెండు పాఠశాలలను సందర్శించాలని, విద్యార్థుల వ్యక్తిత్వం పెంచేలా సరికొత్త కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఎంఈవోలను కోరారు. పాఠశాలల పర్యవేక్షణ ద్వారానే విద్యలో నాణ్యత పెంచడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని 624 మంది ఎంఈవోలకు హైదరాబాద్ కుమురంభీం ఆదివాసీ భవన్‌లో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్, జూనియర్ రెడ్ క్రాస్‌లో చేరేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులను ఆహ్వానించి, స్ఫూర్తి, ప్రేరణ కల్పించాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ఇతర రంగాల్లో రాణించేలా చూడాలని కోరారు.

నాయకత్వ లక్షణం ముఖ్యం: ఈవీ నర్సింహారెడ్డి

విద్యాశాఖ అధికారులకు నాయకత్వ లక్షణం ముఖ్యమని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి కోరారు. ఎంఈవో విద్యాశాఖకు కళ్లు చెవులు అన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ వంటి గుణాత్మక కార్యక్రమాల అమలు ద్వారా నాణ్యత పెరుగుతుందన్నారు. డిసెంబర్ 4 నుంచి నిర్వహించే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపులో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేలా కృషి చేయాలని ఎంఈవోలకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు.

విచారణ కమిషన్ల గడువు పొడిగింపు?

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం విషయంలో తీసుకున్న నిర్ణయాలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్ గడువు గత మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో మళ్లీ రెండు నెలల గడువు పొడిగించవచ్చని తెలుస్తోంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు ఈ నెల 31తో ముగియనుండగా, మరో రెండు నెలలను పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ చేసిన ప్రతిపాదనలపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. డిసెంబర్ చివరి నాటికి రెండు కమిషన్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

జెన్‌కో ఇంజనీర్లకు పోస్టింగ్‌లు


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో భారీ సంఖ్యలో ఈ నెల 9న అడ్‌హాక్ (తాత్కాలిక) పదోన్నతులు పొందిన ఇంజనీర్లకు ఎట్టకేలకు కొత్త పోస్టింగ్స్ కేటాయిస్తూ సోమవారం సంస్థ సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్, మెకానికల్, టెలీ కమ్యూనికేషన్ విభాగాల్లోని 203 మంది ఏడీఈలు, ఎలక్ట్రికల్ విభాగంలో 34 మంది డీఈలు, ఏడుగురు ఎస్ఈలు, ఇద్దరు సీఈలతో పాటు మెకానికల్ విభాగంలో 12 మంది డీఈలు, ఎస్ఈలు.. సివిల్ విభాగంలో ఐదుగురు ఏఈఈలుగా, ఇద్దరు ఈఈలకు కొత్త పోస్టింగ్స్ ఇచ్చారు.

4న నూతన ఈఆర్సీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్ నవంబర్ 4న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ప్రస్తుత ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రావు, బండారు లక్ష్మయ్యల పదవీకాలం మంగళవారంతో ముగియడంతో కమిషన్ అధికారులు, సభ్యులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

టుడేస్ గ్రాఫిక్

ఎన్నికల సంబంధ వార్తల విషయంలో దేశ ప్రజలంతా నేటికీ అత్యధికంగా విశ్వసిస్తున్నది వార్తాపత్రికలనేనని ఇటీవలి సర్వేలో వెల్లడైంది. అదే సమయంలో వాట్సాప్, సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టే ఎన్నికల సమాచారాన్ని అతితక్కువగా ప్రజలు విశ్వసిస్తున్నట్లు తేలింది. ఎన్నికల వార్తలకు సంబంధించి వార్తాపత్రికలు అందించే సమాచారాన్నే ఎక్కువగా నమ్ముతామని 39 శాతం మంది ప్రజలు చెప్పగా కొంత వరకు నమ్ముతామని 49 శాతం మంది పేర్కొన్నారు. వార్తాపత్రికల తర్వాత న్యూస్ చానళ్లను ఎక్కువగా నమ్ముతామని 32 శాతం మంది, వార్తల వెబ్‌సైట్లను విశ్వసిస్తామని 25 శాతం మంది తెలిపారు. మరోవైపు వాట్సాప్‌లో షేర్ అయ్యే ఎన్నికల సమాచారాన్ని ఏమాత్రం నమ్మబోమని ఏకంగా 45 శాతం మంది పేర్కొన్నారు. కేవలం 15 శాతం మందే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై వరకు యూగవ్ ఇండియా, సీపీఆర్ మిలీనియల్ సర్వేస్ అనే సంస్థలతో కలిసి ప్రముఖ ఇంగ్లిష్ బిజినెస్ డెయిలీ 'ద మింట్'ఈ సర్వే నిర్వహించింది.



సాక్షి సెంట్రల్‌డెస్క్

'విజయ'వంతంగా మళ్లీ వాత!

- ప్రైవేట్ కంపెనీలతో పోటీపడి లీటరుకు రూ.10 నుంచి రూ.28 వరకు నూనె ధర పెంచిన ఆయిల్‌ఫెడ్
- దిగుమతి సుంకం పెరిగిందన్న సాకు చూపిస్తున్న యంత్రాంగం
- కానీ దిగుమతి సుంకం పెరిగిన రోజునే ధరలను పెంచేసిన ఆయిల్‌ఫెడ్.. దీపావళికి చుక్కలు చూపిస్తున్న ధరలు..వినియోగదారుల ఆవేదన



సాక్షి, హైదరాబాద్: 'విజయ'నూనె ధరలు భారీగా పెరిగాయి. దీపావళి పండుగ వేళ నూనె ధరలు సామాన్య ప్రజలపై భారం పడేలా చేశాయి. ప్రైవేట్ నూనె తయారీ కంపెనీలతో పోటీ పడుతూ ఆయిల్‌ఫెడ్ ధరలను పెంచింది. బహిరంగ మార్కెట్లో నూనెల ధరలు పెరిగే సమయంలో వాటిని స్థిరీకరించాల్సిన బాధ్యత ఆయిల్‌ఫెడ్‌పై ఉండగా, అందుకు భిన్నంగా ధరలు పెంచడం ఏ మేరకు సబబని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా సరుకుల ధరలు పెంచుతున్నప్పుడు, వాటిని కట్టడి చేయడానికి, ధరలను స్థిరీకరించేలా ప్రభుత్వ సంస్థలు చూడాలి. అది వాటి సామాజిక బాధ్యత కూడా. కానీ ఆయిల్‌ఫెడ్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి.

పామాయిల్‌పై లీటరుకు రూ.28 అధికం

రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నూనెల ప్యాకింగ్ జరుగుతోంది. వివిధ ఏజెన్సీల నుంచి వచ్చే నూనె నాణ్యతను నిర్ధారించి ప్యాకింగ్ చేసి విజయ బ్రాండ్‌తో ఆయిల్‌ఫెడ్ విక్రయిస్తుంది. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, శనగ నూనె, రైస్‌బ్రాన్ ఆయిల్ ఇలా వివిధ రకాల వంట నూనెలను ప్యాకింగ్ చేసి సరఫరా చేస్తుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకు దాదాపు 25 వేల మెట్రిక్ టన్నుల నూనెలను వాడుతారు. అందులో విజయ నూనె దాదాపు 2,500 మెట్రిక్ టన్నులు ఉంటుంది. తన విజయ నూనెల మార్కెట్‌ను పెంచుకోవడంలోనూ ఆయిల్‌ఫెడ్ విఫలమైందన్న విమర్శలున్నాయి.

- రాష్ట్రంలో పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా పామాయిల్ నూనెనే వాడుతారు. అటువంటి విజయ నూనె రైతుబజారు ధర గత నెల 12వ తేదీన లీటరుకు కేవలం రూ.104 మాత్రమే ఉండగా, దిగుమతి సుంకం పెంచిన రోజే రూ. 120కి పెంచి, మళ్లీ ఈ నెల 25వ తేదీ నాటికి ఏకంగా రూ.132 పెంచేసింది. అంటే అదనంగా లీటరుకు వినియోగదారులపై ఆయిల్‌ఫెడ్ రూ. 28 పెంచినట్లయింది.
- సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరను రూ.112 నుంచి రూ.135కు పెంచింది. అంటే ఏకంగా 23 అదనంగా పెంచింది.
- రైస్‌బ్రాన్ ఆయిల్ ధరను రూ.112 నుంచి రూ.133కు పెంచింది.

50 రోజుల వరకు కూడా ఆగొచ్చు.. కానీ

తెలంగాణ వంట నూనె అమ్మకాల వాటాలో 90 శాతానికిపైగా ప్రైవేట్ కంపెనీలదే కావడంతో అవి ఇష్టారాజ్యంగా ధరలను పెంచేశాయి. సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగ నూనెపై దిగుమతి సుంకాన్ని కేంద్రం 12.5 శాతం నుంచి 32.5 పెంచింది. దీంతో అప్పటి వరకు లీటరుకు రూ.110 ఉన్న పొద్దు తిరుగుడు నూనె... ఇప్పుడు మార్కెట్లో రూ.135 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. మిగిలిన ధరలు కూడా రూ.150 వరకు చేరుకున్నాయి. దిగుమతి సుంకం పెంపు కొత్తగా దిగుమతి చేసుకునే వాటికే అయినా.. కేంద్రం దిగుమతి సుంకం పెంచినట్టు ప్రకటించిన రోజు నుంచే పెంచేశాయి. కేంద్రం పేర్కొన్నట్టు ప్రస్తుత నిల్వలు అయిపోయే వరకు కంపెనీలు ధరలను గరిష్ట రిటైల్ ధరలకే విక్రయించాల్సి ఉన్నా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. సుమారు 3 మిలియన్ టన్నుల వంట నూనెలను కనీసం 50 రోజుల వరకు పాత ధరలకే వినియోగదారులకు ఇవ్వొచ్చు. కానీ లాభాలే పరమావధిగా ధరలు పెంచేశారు. 50 రోజులు కాకుండానే అదే రోజు ఆయిల్‌ఫెడ్ పామాయిల్ ధరను పెంచింది. గత నెల 12వ తేదీన విజయ పామాయిల్ ధర రూ. 104 ఉండగా, కేంద్రం దిగుమతి సుంకం పెంచిన రోజే రూ.120కు పెంచింది. పైగా దిగుమతి సుంకం పెంపును సాకుగా చూపుతూ ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రజలను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దిగుమతి సుంకం పెరిగినందునే

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచినందునే విజయ నూనెల ధరలను పెంచాల్సి వచ్చిందని హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఆయిల్‌ఫెడ్ విజయ నూనెల నిల్వ కేంద్రం ఇన్‌చార్జ్ సునీత చెప్పారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం | 30-10-2024



సీఎంను కలిసిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు వంశీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మొడెం వంశీ మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలానికి చెందిన వంశీ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారత్ తరఫున బంగారు పతకం సాధించడం తెలిసిందే. దీంతో పాటు ఇటీవల జరిగిన సౌత్ ఆఫ్రికా కామన్వెల్త్ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్‌లోనూ వంశీ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా వంశీని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తన వివాహానికి ఆహ్వానించిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్



భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టులో సభ్యుడైన హరికృష్ణను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్.. స్వర్ణోత్సవం

వచ్చే నెలలో ఉత్సవాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు

- 50 ఏళ్లలో 21 లక్షల మందికి అందిన ఆర్థిక సహకారం
- 1.17 లక్షల ఎకరాల భూమి కొనుగోలు, లబ్ధిదారులకు పంపిణీ
- అర శతాబ్దంలో రూ.10 వేల కోట్ల మేర రాయితీలు
- ఎల్బీ స్టేడియంలో స్వర్ణోత్సవాలు నిర్వహించాలని యోచన
- నవంబర్ 15న నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్
- అదే రోజు లబ్ధిదారులకు ఆసెట్ల పంపిణీకి చర్యలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ (టీజీ ఎస్సీ కార్పొరేషన్) స్వర్ణోత్సవ సంబరాలకు సన్నద్ధమవుతోంది. ఈ సంస్థ ఏర్పాటై 50 సంవత్సరాలు కావస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఈ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, ఒరిగిన లబ్ధి, చేపట్టిన రాయితీ, ఆర్థిక చేకూర్పు పథకాలకు సంబంధించి సమాచార సేకరణ, క్రోడీకరణకు ఉపక్రమించింది. 1973, నవంబర్ 15న ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటైంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అప్పటి ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి ఎంఏ హలీమ్ జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడిన తర్వాత సహకార శాఖలో రిజిస్ట్రేషన్ చేయడం, బైలాస్ రూపకల్పన తదితర ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏడాది కాలం పట్టగా ఆ తర్వాత కార్యకలాపాలను ప్రారంభించింది. 50 ఏళ్ల పూర్తి చేసుకున్న తొలి కార్పొరేషన్ ఇది కావడంతో అధికారులు ఘనంగా సంబరాలు చేపట్టాలని భావిస్తున్నారు. వచ్చేనెల 15న ఎల్బీ స్టేడియంలో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో కార్పొరేషన్ ప్రస్థానం మొదలు పురోగతి, ఇతర కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, అదే సమయంలో కొత్తగా లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, సరికొత్త కార్యక్రమాల ప్రకటన, ఇతర కార్యాచరణ కూడా ప్రకటించే అవకాశముందని సమాచారం.



50 ఏళ్లు.. రూ.50 వేల కోట్లు

యాభై సంవత్సరాల చరిత్ర ఉన్న ఎస్సీ కార్పొరేషన్ ఎన్నో రికార్డులు సాధించింది. 1974లో చిన్నపాటి సాయంతో మొదలుపెట్టిన స్వయం ఉపాధి కార్యక్రమాలు ఇప్పుడు భారీ మొత్తాలకు చేరింది. మొదట్లో కూరగాయల విక్రేతలకు రాయితీ రుణాలు, రిక్షాలు, సైకిళ్ల పంపిణీ, చెప్పుల దుకాణా నిర్వాహకులకు రుణాలు తదితర కార్యక్రమాలు మొదలు పెట్టి రూ.400 వరకు గరిష్ఠ సహకారం అందించగా.. ఇప్పుడు దళితబంధు కింద రూ.10 లక్షల సాయం, అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల సాయం ఇచ్చే వరకు ఎదిగింది. అర్ధ శతాబ్దకాలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్ల మేర నిధులు వెచ్చించి దాదాపు 20.44 లక్షల మందికి లబ్ధి చేకూర్చింది. ఈ కార్పొరేషన్ ద్వారా 1.12 లక్షల ఎకరాల భూమిని కొనుగోలు చేసిన అధికారులు అర్హత కలిగిన ఎస్సీ రైతులకు పంపిణీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కార్పొరేషన్ కొనుగోలు చేసిన భూములు చాలావరకు లబ్ధిదారు పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. వాటిపై 15 సంవత్సరాల సీలింగ్ విధించగా కాలపరిమితి ముగిసిన తర్వాత వారికి పూర్తిస్థాయి యాజమాన్య హక్కులను కల్పించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పంపిణీ చేసిన భూములకు సంబంధించిన రికార్డులు సీలింగ్ పరిధిలో పొందుపర్చారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అత్యధిక సాయాన్ని దళితబంధు పథకం కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.10 లక్షల మేర అందించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు స్థానంలో అంబేడ్కర్ అభయహస్తం పేరిట రూ.12 లక్షల సాయానికి కార్యాచరణ రూపొందిస్తోంది. స్వర్ణోత్సవ వేడుకలో ఈ పథకానికి సంబంధించి ప్రకటన ముఖ్యమంత్రి చేసే అవకాశం ఉంది. అలాగే ఎస్సీ కార్పొరేషన్ వార్షిక కార్యాచరణ కూడా ఈ ఉత్సవాల్లో ప్రకటించే అవకాశం ఉంది.

జస్టిస్ లక్ష్మణరావు సేవలు మరువలేనివి

- మాజీ ప్రధాన న్యాయమూర్తికి హైకోర్టు ఘన నివాళి



సాక్షి, హైదరాబాద్: అలహాబాద్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఆయనకు మంగళవారం హైకోర్టు ఘనంగా నివాళులు అర్పించింది. జస్టిస్ అంబటి లక్ష్మణరావు ఈనెల 17న హైదరాబాద్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు సమావేశమై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి న్యాయవ్యవస్థకు జస్టిస్ లక్ష్మణరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే తరాలకు తెలంగాణ చరిత్ర అందుబాటులో ఉండాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గొప్పతనం, చారిత్రక విశిష్టతను రాబోయే తరం తెలుసుకునే విధంగా రచనలు అందుబాటులో ఉండాలని, ఆ దిశగా తెలంగాణ చరిత్రకారులు, కవులు, రచయితలు, సంస్థలు, ఉద్యమకారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ విభాగం అధిపతిగా కెప్టెన్ పాండురంగారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమ ఘట్టాల నేపథ్యాన్ని విస్తృత స్థాయిలో ప్రజలకు వివరించేందుకు సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ ఘట్టాలు, మలి దశ ఉద్యమాన్ని రగిలించిన తన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి వివరించిన ఘట్టాలు అందుబాటులో ఉండాలని సూచించారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన రచనలను హెచ్‌ఆర్‌డీ సంస్థ ద్వారా ప్రచురించాలని శశాంక్ గోయల్‌ను చిన్నారెడ్డి కోరగా.. అందుకు ఆయన సమ్మతించారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ అధికారి మాధవి రావులపాటి, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో 25 సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన తెలంగాణ పోలీసులు

- అక్రమ మద్యం, నగదు, మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటివరకు రూ.15లక్షల విలువైన మద్యం, నగదు, వస్తువుల పట్టివేత

సాక్షి, హైదరాబాద్: త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర సరిహద్దు వెంట మొత్తం 25 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. మ హారాష్ట్ర సరిహద్దు వెంట ఉన్న జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డిల ఎస్పీల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల మహారాష్ట్ర డీజీపీ రష్మీశుక్లాతో తెలంగాణ డీజీపీ జితేందర్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ సైతం వీడియో సదస్సు నిర్వహించారు. ఎన్నికల బందోబస్తు, అంతర్రాష్ట్ర తనిఖీల అంశంపై చర్చించారు. పోలీసులతోపాటు ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులు సైతం తనిఖీల్లో పాల్గొంటున్నారు. ప్రధానంగా అక్రమ మద్యం, నగదు, మత్తుపదార్థాలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇచ్చే బహుమతులతోపాటు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 15 నుంచి కొనసాగుతున్న ఈ తనిఖీల్లో ఇప్పటివరకు రూ.15లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారు

టీపీసీసీ అధికార ప్రతినిధులు గౌరీసతీశ్, చరణ్ కౌశిక్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వమని, అలాంటి ప్రభుత్వాన్ని కొందరు బద్నాం చేయాలని చూస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధులు గౌరీసతీశ్, చరణ్ కౌశిక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. తెలంగాణలో లక్షల కోట్లు అప్పు చేసిన బీఆర్‌ఎస్.. కేంద్రంలో రూ.40 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ.. కాంగ్రెస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు మానుకోవాలని హితవుపలికారు. తొమ్మిదిన్నరేళ్లలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వేయని అసమర్థ ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతు రుణమాఫీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. తెలంగాణ రైతుల పట్ల నీటి బుడగలాంటి మాటలు చెప్తే ఎవరూ నమ్మరని, రైతులకు బీఆర్‌ఎస్ చేసిన మోసాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని గౌరీసతీశ్, చరణ్‌కౌశిక్ అన్నారు.



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ పరిధిలోని పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు తెలిపారు. ఉల్లంఘనలు చోటుచేసుకున్న షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

శిక్షణ పూర్తయినా ఎందుకీ వివక్ష

- ఎంపీహెచ్‌డబ్ల్యూ పురుష అభ్యర్థుల నిరీక్షణ
- ఉద్యోగాల భర్తీలో ఏళ్ల తరబడి జాప్యం
- శిక్షణ పూర్తి.. 30వేల మంది ఎదురుచూపు
- పోస్టులు అవసరమైనా భర్తీ చేయని ప్రభుత్వం

సాక్షి, మహబూబాబాద్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం.. సర్కారు వైద్యానికి ప్రాధాన్యమిస్తూ వేల సంఖ్యలో ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ఎంఎల్‌హెచ్‌పీలు, ప్రభుత్వ వైద్యులు, టెక్నీషియన్లను నియమిస్తున్నా.. ప్రజారోగ్యంలోని కీలకమైన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (మెయిల్) ఉద్యోగాల భర్తీ ప్రస్తావనే లేకుండా పోయింది. దీంతో తమ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని ఎంపీహెచ్‌డబ్ల్యూ (పురుష) అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

ప్రజారోగ్యంలో కీలకం

ప్రభుత్వం అందించే వైద్య సేవలతోపాటు వ్యాధుల నివారణలో మల్టీపర్పస్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తారు. ఇందుకోసం మున్సిపాలిటీ, ప్రజారోగ్యం విభాగంలో హెల్త్ అసిస్టెంట్లు, బీఎస్సీ బీజెడ్‌సీ పూర్తి చేసిన వారిని పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు నియమిస్తారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదు వేల జనాభాకు ఒక క్లస్టర్‌గా విభజించి.. అక్కడ హెల్త్ అసిస్టెంట్లను నియమిస్తారు. వీరు ప్రజలు మలేరియా, బోదకాలు, టైఫాయిడ్ జ్వరాల బారినపడకుండా చర్యలు తీసుకోవడం, లక్షణాలు కనిపిస్తే రక్త నమూనాలు సేకరించి నిర్ధారించి మందులు ఇవ్వడం, ఆరోగ్య సేవా కార్యక్రమాలు నిర్వహించడం, దోమల నివారణ, వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటారు.

రెండు దశాబ్దాలుగా..

రెండు దశాబ్దాలుగా ఎంపీహెచ్‌డబ్ల్యూ (పురుష) పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. ప్రభుత్వ వైద్యాన్ని విస్తరించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. దీనిని అనుగుణంగా పనిచేసే పురుష హెల్త్ వర్కర్లు 4,229, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 1,156, మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి శాఖలో మరో మూడువేల పోస్టులు.. మొత్తంగా ఎనిమిది వేలకు పైగా సిబ్బంది అవసరం. కానీ ఇటీవల మున్సిపల్ విభాగంలో పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు 86, హెల్త్ అసిస్టెంట్లు 96 మొత్తం 182 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఆర్థిక శాఖ అనుమతి లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రకటించారు.

ప్రభుత్వాలు మారినా..

ఇరవయ్యేళ్ల క్రితం పురుష హెల్త్ అసిస్టెంట్ల పోస్టులను త్వరితగతిన భర్తీ చేశారు. ఈక్రమంలో ఉమ్మడి రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో ఉన్న 150 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌ల్లో 30 వేలకు పైగా నిరుద్యోగులు శిక్షణ పూర్తి చేశారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా.. పోస్టులు భర్తీ చేయలేదు. ఇదిగో నోటిఫికేషన్ వస్తుంది.. అదిగో నోటిఫికేషన్ వస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు నమ్మి ఆశగా ఎదురుచూస్తున్నారు. వయసు మీద పడి ఏ పనిచేయలేక, నోటిఫికేషన్ రాకపోవడంతో.. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు.



పురుష హెల్త్ వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన నిరుద్యోగులు (ఫైల్)

పోస్టులు భర్తీ చేస్తేనే బతుకు..



ప్రభుత్వం పురుష హెల్త్ అసిస్టెంట్ల పోస్టులు భర్తీ చేస్తుందనే ఆశతో రూ.50 వేల మేరకు ఖర్చు చేసి శిక్షణ పూర్తి చేశాను. ఇరవై ఏళ్లవుతున్నా.. పోస్టులు భర్తీ చేయలేదు. వేరే పని చేయలేక.. ఈ పోస్టులు భర్తీ కాక ఇబ్బంది పడుతున్నాం. పోస్టులు భర్తీ చేస్తేనే మాకు బతుకు.

–అల్లె రాములు, శాలిగౌరారం, నల్లగొండ జిల్లా

ఖాళీలన్నీ భర్తీ చేయాలి




ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని డిగ్రీ చేసి కూడా ఎంపీహెచ్‌డబ్ల్యూ (మెయిల్) శిక్షణ పూర్తి చేశాను. కానీ ఇరవై సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ చేయలేదు. ప్రభుత్వం అందించే ఉచిత వైద్యానికి ప్రాధాన్యమిస్తూ.. అన్ని విభాగాల్లో పోస్టులు భర్తీ చేస్తున్నారు. కానీ మా పోస్టులను భర్తీ చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలి.

– బోగ అనిల్, మహబూబాబాద్

విమాన టికెట్ ధరలను నియంత్రించండి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: విమాన సంస్థలు ప్రయాణికుల నుంచి వేల రూపాయలు దోచుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. ప్రయాణదూరం మారనప్పుడు ధరలెలా పెంచుతారంటూ పౌరవిమానయాన శాఖను ప్రశ్నించారు. వెంటనే టికెట్ ధరలను నియంత్రణలోకి తేవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ/తెలంగాణ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రైవేట్ విమానయాన సంస్థలు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచుతున్నాయని విమర్శించారు. మన దేశ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విమాన టికెట్ ధరలు నియంత్రించాలన్నారు. కార్పొరేట్ వ్యక్తులు, ధనికులు మాత్రమే కాదు.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా విమానాల్లో ప్రయాణిస్తున్నారనే విషయాన్ని కేంద్రం గుర్తించాలని సూచించారు. విమానయాన సంస్థలకు బాంబు బెదిరింపులు వస్తుంటే ఇంటెలిజెన్స్ విభాగం ఏం చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. విమాన టికెట్ ధరలు తగ్గించాలని కోరుతూ కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడికి లేఖ రాశానని చెప్పారు.

ఫామ్ హౌజ్‌లో దీపావళి ముందు గెట్ టు గెదరా?

- కేటీఆర్, హరీశ్‌రావు తీరుపై కాంగ్రెస్ నేతల ధ్వజం

సాక్షి,హైదరాబాద్ : రాజ్ పాకాల ఫామ్ హౌజ్‌లో దీపావళి ముందు గెట్ టు గెదర్ అనడానికి మాజీమంత్రులు కేటీరామారావు, హరీశ్‌రావులకు సిగ్గు ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధులు సత్యం శ్రీరంగం, లింగంయాదవ్, ప్రధాన కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ... మాజీ మంత్రి కేటీఆర్ బావమరిదిపై పోలీసులు చట్ట ప్రకారమే కేసు నమోదు చేశారన్నారు. ఏమీలేకపోతే బావమరిది సన్నిహితుడికి పాజిటివ్ ఎలా వస్తుందని నిలదీశారు. ఫ్యామిలీ పార్టీ అయితే డ్రగ్స్, క్యాసియోనా ఎలా దొరుకుందని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలని చూస్తున్నారన్నారు. ఇద్దరం డ్రగ్స్ టెస్ట్ చేయించుకుందాం అని రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కేటీఆర్‌కు సవాల్ విసిరితే కేటీఆర్ పారిపోయారని గుర్తు చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాజీనామా గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. సచివాలయానికి రాకుండా ఫామ్‌హౌజ్ నుంచి పాలన చేసిన బీఆర్‌ఎస్...కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. మూసీని బాగు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుంటే బీఆర్‌ఎస్ వాళ్లు ఆరోపణలు చేస్తున్నారని, త్వరలో రంగారెడ్డి జిల్లా రైతులందరం కలసి మూసీ ప్రక్షాళన కోసం ఉద్యమం చేస్తామని తెలిపారు.



దేదీప్య మానం..!

పల్లెల్లో, పట్టణాల్లో దీపావళి సందడి మొదలైంది.. విశాఖలోని జగదాంబ జంక్షన్ వద్ద కుమ్మరి వీధిలో వివిధ ఆకృతుల్లో ఉన్న మట్టి ప్రమిదలను కొనుగోలు చేస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' చిత్రీకరించింది.
– పీఎల్ మోహన్, సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఆపదలో 'సంజీవని'

వాహనాల కాలం చెల్లిపోయింది అంటూ..నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, దిశ పోలీస్ స్టేషన్ వద్ద 108 వాహనాలను దేనికి ఉపయోగించకుండా చెట్ల మధ్యనే ఇలా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో అవి తుప్పపట్టిపోతున్నాయి.
– విజయకృష్ణ, సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇట్టా వెయ్యి... అట్టా పట్టేయ్..

విజయవాడ ప్రకాశం బ్యారేజిలో నీరు పుష్కలంగా ఉండటంతో మత్స్యకారులు చేపల వేటను జోరుగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో బ్యారేజీ దిగువన వలవేసి చేపలను పడుతున్న దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.
– కిశోర్, సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ

'విమాన టికెట్ ధరలను నియంత్రించండి'

సాక్షి, న్యూఢిల్లీ: విమాన సంస్థలు ప్రయాణికుల నుంచి వేల రూపాయలు దోచుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. వెంటనే టికెట్ ధరలను నియంత్రణలోకి తేవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ/తెలంగాణ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రైవేట్ విమానయాన సంస్థలు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచుతున్నాయన్నారు.

స్త్రీ నిధి ఎండీగా జీవీబీడీ హరిప్రసాద్

సాక్షి, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కు అనుబంధంగా ఏర్పాటు చేసిన స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీగా జీవీబీడీ హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా విజయనగరం రీజనల్ డిప్యూటీ హెడ్‌గా ఉన్న హరిప్రసాద్‌ను సెర్ప్ కమిటీ సిఫార్సు మేరకు ఈ బాధ్యతల్లో నియమించారు.

ఉద్యోగులను టీడీపీ నేతలు బెదిరించటం తగదు

సాక్షి, అమరావతి: ఉద్యోగులను టీడీపీ నేతలు బెదిరించడం తగదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైఎస్సార్‌సీపీ వాళ్లు గానీ, వలంటీర్లు గానీ గ్రామ, వార్డు సచివాలయం మెట్లెక్కితే ఆ సచివాలయం అడ్మిన్ (సచివాలయ ఉద్యోగి) గూబ పగలగొట్టండి. ఏ పోలీసోడు కేసు పెడతాడో చూద్దాం' అంటూ ఒంగోలు టీడీపీ నియోజకవర్గ సమావేశంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎద్దు శశిభూషణ్ వ్యాఖ్యానించడం టీడీపీ నేతల కండకావరానికి నిదర్శనమన్నారు. దీనిపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'యాక్టివ్ వలంటీర్ల వివరాలివ్వండి'

సాక్షి, అమరావతి: సచివాలయాల వారీగా వలంటీర్ల వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంగళవారం అత్యవసరంగా సేకరించింది. ఎన్నికల సమయంలో రాజీనామా చేయకుండా, లేదంటే తొలగించని వలంటీర్ల వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో అత్యవసరంగా అందించాలంటూ సోమవారమే అన్ని జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్‌లు ఆయా జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఫోన్ మెసేజ్‌లు పంపారు. ఒక్కో సచివాలయ పరిధిలోని వలంటీర్ల పేర్లతో పాటు వారి క్లస్టర్ కోడ్, సీఎఫ్ఎంఎస్ ఐడీ తదితర మొత్తం 11 కాలాలలో వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో పంపాలని సూచించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా అందిన, జిల్లాలో సేకరించిన వివరాలను మంగళవారం అందజేశారు.

ఈఎస్ఎంయూ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏలో ప్రపంచ బ్యాంకు నిబంధనల మేరకు పర్యావరణ, సామాజిక అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు సోమవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము ఉత్తర్వులు జారీ చేశారు.

'టీడీపీ నేతల వేధింపులకు బలైన చింతల శ్రీను'

సాక్షి,అమరావతి: టీడీపీ నేతల వేధింపులకు చింతల శ్రీను బలయ్యారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొమ్మూరి కనకారావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మంగళవారం తాడేపల్లిలో మాట్లాడుతూ.. తన తాతల, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని స్థానిక టీడీపీ నేతలు అక్రమంగా ఆన్‌లైన్ చేయడంతో చింతల శ్రీను ఈ నెల 21న పురుగుల మందు తాగి 28న ఒంగోలు రిమ్స్‌లో మరణించాడన్నారు. చింతల శ్రీను సెల్ఫీ వీడియోలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు స్థానిక టీడీపీ నేతల పేర్లు, ప్రభుత్వ అధికారుల వ్యవహార శైలిని వివరించారని ఆయన చెప్పారు. టీడీపీ నేతల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. అంతేకాక శ్రీను తన వీడియోలో ప్రస్తావించిన వారందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని.. అలాగే వేధింపులకు గురిచేసిన బల్లికురవ ఎస్‌ఐ చౌదరిని కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మానవరక్షణలో 'సీహెచ్ఎస్ఎస్' సరికొత్త అధ్యాయం



స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

దేశం నుంచి ఎంపికైన ఏకైక సంస్థ

వ్యవస్థాపకుడు తెలుగు తేజం డాక్టర్ రమేశ్ కన్నెగంటి

'పుల్లరి' ఉద్యమవీరుడికి స్వయాన మునిమనుమడు

ఈనెల 28-31 తేదీల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు జరగనున్నది. దీనికి భారత్ నుంచి హైదరాబాద్‌లోని మానవ రక్షణ అధ్యయన సంస్థ (సీహెచ్ఎస్ఎస్) ఎంపికైంది.

'చైనా ప్రాబల్యం నుంచి హిందూ, పసిఫిక్ మహాసముద్రాల జలాలను కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీతో ఎలా కాపాడుకోవాలి' అనే అంశాలపై ఈనెల 25న ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, యూఏఈ వంటి ఎనిమిది దేశాలకు చెందిన సీనియర్ మిలటరీ అధికారులు సీహెచ్ఎస్ఎస్‌ను సందర్శించి అక్కడ చర్చలు జరిపారు.

తెనాలి: పైన తెలిపిన రెండు ప్రతిష్టాత్మక అంశాలకు కేంద్రమైన 'సీహెచ్ఎస్ఎస్' (సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్) హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక 'మానవ రక్షణ అధ్యయన సంస్థ'. పన్నెండేళ్లుగా లాభాపేక్ష లేని ఎన్జీవోగా, 'థింక్ ట్యాంక్'గా కృషి చేస్తున్న ఈ సంస్థ, కృత్రిమ మేధతో స్మార్ట్ పోలీసింగ్, ఓడరేవుల రక్షణపై సరికొత్త ప్రోగ్రామ్‌ను రూపొందించింది. దీంతో అమెరికాలోని అంతర్జాతీయ సదస్సుకు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక సంస్థగా నిలిచింది.



ఎనిమిది దేశాల సైనికాధికారులతో సమావేశంలో

సంస్థ వ్యవస్థాపకుడు తెలుగోడే..

ఇంతగా చెప్పుకుంటున్న ఈ 'సీహెచ్ఎస్ఎస్'ను స్థాపించింది తెలుగు వ్యక్తి కావడం విశేషం. ఒకప్పుడు ఇంటర్ ఫెయిలైన ఈ కుర్రోడు.... చదువు విలువ, తల్లిదండ్రుల ఆశలను గుర్తెరిగి కష్టాలను నిచ్చెనగా చేసుకుని తాను అనుకున్నది సాధించాడు. ఆయనే సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ కన్నెగంటి. బీఏ డిస్టింక్షన్‌లో పాసైన ఈయన, సెక్యూరిటీ రిలేషన్స్‌పై ఎంఫిల్ చేశారు. 2006లో 'యూఎస్-ఇజ్రాయెల్ సెక్యూరిటీ రిలేషన్స్ ఇన్ ది పోస్ట్ కోల్డ్‌వార్ ఎరా'పై పీహెచ్‌డీ, 'యూఎస్-ఇజ్రాయెల్-ఇండియా స్ట్రాటజిక్ రిలేషన్స్ (టెర్రరిజాన్ని ఓడించేందుకు మూడు దేశాల త్రిముఖ వ్యూహం)పై పోస్ట్ డాక్టోరియల్ ఫెలోషిప్ చేశారు.

మిషన్ 7516

'కృత్రిమ మేధ మానవ రక్షణకు ఎలా ఉపకరించాలి' అనే విభాగాన్ని ఇటీవలే వెలకొల్పారు. దేశంలోని తొమ్మిది కోస్తా రాష్ట్రాల్లోగల 7,516 కిలోమీటర్ల తీరప్రాంతంలోని 12 మేజర్, 180 మైనర్ పోర్టులను కలుపుతూ ఓడరేవుల రక్షణపై 'మిషన్ 7516'ను రూపొందించారు. దీంతో అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందుకున్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో 'పుల్లరి వీరుడు'గా పోలీసు కాల్పుల్లో అమరుడైన కన్నెగంటి హనుమంతు మునిమనుమడిగా తనకూ సమాజ శ్రేయస్సుపై స్పృహ ఉందంటారు డాక్టర్ రమేశ్ బాబు.

మానవ భద్రతపై దృష్టి

ముంబై పేలుళ్లు, బాబ్రీ మసీదు కూల్చివేత పరిణామాలతో రమేశ్ దృష్టి మానవ భద్రతపైకి మళ్లింది. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని టెక్నాలజీ సాయంతో ఎదుర్కోవడంపై అధ్యయనం, పరిశోధన చేశారు. ఈ క్రమంలో 2013లో కొందరు స్నేహితులు, సంస్థల సహకారంతో హైదరాబాద్‌లో మానవ రక్షణ అధ్యయన సంస్థ (సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్) ఆరంభించారు. 12 ఏళ్లలో దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై 'థింక్ ట్యాంక్'గా పలు విజయాలు సాధించారు. ఐఐటీ, నల్సర్‌లా వర్సిటీ, ఆంధ్ర, తెలంగాణ పోలీసులతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ప్రస్తుత దేశ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ దగ్గర పనిచేసిన ఏకైక తెలుగు వ్యక్తి తానే కావడం అదృష్టమని రమేశ్ చెబుతారు.

లడ్డుకు గడ్డుకాలం!

- క్రమేణా ఆదరణ కోల్పోతున్న ధర్మవరం లడ్డు



సాక్షి, పుట్టపర్తి: శుభకార్యం ఏదైనా.. ధర్మవరం లడ్డూనే ఆధారం. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ధర్మవరం లడ్డూతోనే శుభకార్యాలు ముగించేవారు. ఏ ఫంక్షన్ గురించి చర్చించినా..ధర్మవరం లడ్డూ అనే మాట టక్కున వినిపించేది. పేదింట శుభకార్యాలను ధర్మవరం లడ్డూ ఆదుకునేది. తక్కువ ఖర్చుతో ఫంక్షన్‌లు చేసేసేవారు. 5 దశాబ్దాల నాటి నుంచి ఇక్కడి లడ్డూకు మంచి గిరాకీ ఉండేది. ధర్మవరం పట్టణం మెయిన్ రోడ్డులోనే లడ్డూ దుకాణాలు కనిపించేవి. వందల కుటుంబాలు లడ్డూ తయారీ, విక్రయాలపై ఆధారపడి జీవించేవి. ఏ అవసరంతో ధర్మవరం వెళ్లినా..ప్రతి ఒక్కరూ లడ్డూ తీసుకుని ఇంటికి వెళ్లేవారు. నాడు కళకళలాడిన లడ్డూ దుకాణాలు నేడు వెలవెలబోతున్నాయి. కంప్యూటర్ కాలం వచ్చేసింది. ఆన్‌లైన్ ఆర్డర్లు పెరిగాయి. కొత్త రకాల వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. క్యాటరింగ్ సర్వీసులు వెలిశాయి. ఫలితంగా ధర్మవరం లడ్డూకి గిరాకీ తగ్గింది. కొన్ని దుకాణాలనూ మూసేయడంతో వందల కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయింది..

ఒకప్పుడు కేరాఫ్

ధర్మవరం పట్టు చీరలంటే దేశమందరికీ తెలుసు. అంతే స్థాయిలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ధర్మవరం లడ్డూకు ప్రాధాన్యం ఉంది. పేద కుటుంబాల్లో ఎలాంటి ఫంక్షన్ జరిగినా..లడ్డూ కోసం ధర్మవరం వెళ్లే వారు. ఏ గ్రామంలో ధర్మవరం గురించి అడిగినా లడ్డూ గురించి ప్రస్తావించేవారు. ఫంక్షన్‌లో కట్టే బట్టలు, తినే వంటకాల్లో ధర్మవరం పాత్ర కీలకం. అక్కడ షాపింగ్ లేనిదే ఫంక్షన్ చేసేవారు కాదేమో అనే రీతిలో ధర్మవరం నాడు కళకళలాడింది. లడ్డూ తక్కువ ధరకే అందుబాటులో ఉండటంతో ప్రతి ఒక్కరూ ధర్మవరం వెళ్లి దాన్ని కొనేవారు. శుభకార్యాల ఖర్చు పెరగడం, కొత్త రకాల వంటకాలు అందుబాటులోకి రావడంతో ధర్మవరం లడ్డూ ప్రభావం కోల్పోయింది.

వందల కుటుంబాలకు ఉపాధి కరువు

ధర్మవరంలో లడ్డూ వ్యాపారుల వద్ద పని చేసేవారు వందల సంఖ్యలో ఉండేవారు. ఒక్కో దుకాణంలో 20 మందికి పైగా కూలీలు ఉండేవారు. తయారీ, పార్సిల్, రవాణా.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో విధి నిర్వర్తించేవారు. ఇప్పుడు గిరాకీ తగ్గడంతో ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా కూలీల సంఖ్యను తగ్గించారు. వందల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.

8 కేంద్ర పాలిత ప్రాంతాలు.. 28 రాష్ట్రాలు.. 418 బృందాలు..
2,000 మందికిపైగా విద్యార్థులు.. క్వార్టర్ ఫైనల్.. సెమీఫైనల్ వడపోతలు..
124 మంది విద్యార్థులు చివరిగా మిగిలింది.. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైంది నలుగురు..
అందులో ఏపీ నుంచి.. అదీ విశాఖ నుంచి ఫైనల్‌కు చేరింది ఇద్దరే..
వారే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన శివానీ లహరి, హర్షిత.

ఇద్దరూ.. ఇద్దరే!

నేషనల్ యూత్ ఫెస్ట్‌కి ఎంపికైన శివానీ, హర్షిత

- ప్రజా అర్బన్ గవర్నెన్స్‌లో విశాఖకి చోటు దక్కేలా ప్రాజెక్ట్
- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాప్ తయారు చేసిన అమ్మాయిలు



శివానీ లహరి



డి.హర్షిత

సాక్షి, విశాఖపట్నం: మార్పు మన నుంచే ప్రారంభం కావాలి. మరికొంతమందిలో ఆ మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలి. తమ ప్రయత్నంతో కొంతమందిలోనైనా మార్పు వస్తే.. చాలనుకుంటారు నేటి యువతరం. ఆ కోవకు చెందిన వారే ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో బీఏఎల్ఎల్‌బీ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎం.శివానీ లహరి, డి.హర్షిత. తమ ఆలోచనలను పంచుకునే వేదిక కోసం ఎదురు చూసిన వీరు ఇప్పుడు దొరికిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఐక్యరాజ్యసమితి (యూఎన్-హాబిటేట్) సహకారంతో ప్రజా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏటా జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాదీ 'ప్రజాతంత్రం-2024' పేరుతో 'సెలబ్రేటింగ్ సిటీగవర్నెన్స్ ఇన్ ఇండియా' అనే థీమ్‌తో నేషనల్ యూత్‌ఫెస్ట్‌కు శ్రీకారం చుట్టింది. నగరంలోని సామాన్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన అస్త్రంగా శివానీ, హర్షిత చేసిన ఉపన్యాసాలు ఫైనల్‌కు తీసుకెళ్లాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి హర్షిత మాత్రమే..

ఈ పోటీలకు ఏయూ నుంచి 8 మందితో కూడిన బృందం దరఖాస్తు చేసుకుంది. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకూ జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఇండివిడ్యువల్ ఫెర్ఫార్మెన్స్‌పై ఆన్‌లైన్‌లో డిబేట్ నిర్వహించారు. ఇందులో మేయర్‌తో కూడిన అర్బన్ బాడీ వ్యవస్థలో చర్చోపచర్చలు నిర్వహించారు. ఇందులో డి.హర్షితకు పాలసీ వ్యవహారాలపై మాట్లాడేందుకు ఎంపిక చేశారు. నగరంలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తూ హర్షిత చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుని ఫైనల్‌కు ఎంపికైంది. మొత్తం 18 మంది ఫైనల్‌కు ఎంపికవ్వగా.. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపికవ్వగా తెలుగు రాష్ట్రాల నుంచి ఫైనల్‌కు చేరుకున్న ఏకైక విద్యార్థి హర్షిత మాత్రమే కావడం విశేషం.

చర్చలో.. సూపర్ శివానీ.!

ఎం.శివానీ లహరి ప్రతిభకు ప్రజాతంత్ర న్యాయ నిర్ణేతలు ఆశ్చర్యపోయారు. చిట్టీలు తీసి టాపిక్ ఎంపిక చేసి.. దానిపై మాట్లాడాలని శివానీకి చెప్పారు. సామాన్య ప్రజల్ని పరిపాలనలో ఎలా భాగస్వామ్యం చేస్తారనే అంశంపై టాపిక్ వచ్చింది. ఇందులో ఎలాంటి స్థిరమైన విధానాలు అవలంబించాలనే విషయాన్ని ప్రజెంట్ చేసింది. బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఎలాంటి అవకాశాలు కల్పించాలనే అంశంపై మాట్లాడింది. 150 మంది పాల్గొనగా.. శివానీతో సహా 80 మంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. సెమీస్‌లో శివానీ లహరి చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. పాలసీ డాక్యుమెంట్ రూపొందించే విధానంపై ఆమె ఇచ్చిన ప్రజెంటేషన్ ఫైనల్‌కు చేర్చింది.



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, కళాశాల బృందం

నో యువర్ వార్డ్ యాప్‌తో...

వీరిద్దరూ తమ బృందంతో కలిసి నగర ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన యాప్‌ను డిజైన్ చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన ప్రజెంటేషనే వీరిద్దర్నీ ఫైనల్‌కు తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో సాధారణ ప్రజలు కూడా తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడం, సమస్యలు విభజించి ఆయా అధికారులకు నేరుగా వెళ్లేలా 'నో యువర్ వార్డ్' పేరుతో రూపొందించిన యాప్ న్యాయనిర్ణేతలకు తెగ నచ్చేసింది. నవంబర్ 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగే ఫైనల్‌లో యాప్‌ని ప్రదర్శించాలని ప్రజా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు.

ఆధ్యాత్మిక సమాచారం

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో కొలువైన శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారికి తమలపాకులతో పూజలు నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. స్వామివారికి ఒకరోజు ఆదాయం రూ.1,13,891 వచ్చిందని.. 1,200 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ సహాయ కమిషనర్ చందన తెలిపారు. బొర్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది భక్తులకు వైద్య సేవలందించారు.

ప్రసాదాల తయారీలో నాణ్యత తప్పనిసరి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రసాదాల తయారీలో నాణ్యతని ఖచ్చితంగా పాటించాలని, అందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు హెచ్చరించారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఉన్న ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, రాజగోపురం వద్ద ఉన్న ప్రసాదాల విక్రయశాలని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసాదాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం దేవస్థానంలో పులిహోర, లడ్డు ప్రసాదాలను భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తార, వాటిని నాణ్యతగా తయారుచేసి అందించాల్సిన బాధ్యత తమందరిపైనా ఉందన్నారు. దూర ప్రాంతాలకి లడ్డులను పెద్ద సంఖ్యలో భక్తులు తీసుకువెళ్తుంటారని, అందుకు తగ్గట్టు లడ్డులు రుచికరంగా ఉండాలని సూచించారు. లడ్డూలను తయారుచేసే కైంకర్యపరులకు పలు సూచనలు చేశారు.



విద్యా సమాచారం



మెస్‌లను తనిఖీ చేసిన రెక్టార్

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు ఆర్ట్స్ అండ్ కామర్స్,సైన్స్ హాస్టల్ మెస్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ప్రతి రోజు అందిస్తున్న అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని అక్కడి సిబ్బందికి, అధికారులకు సూచించారు.

డిసెంబర్ 7న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం డిసెంబర్ 7న నిర్వహిస్తున్నట్లు అలుమ్ని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు తెలిపారు. ఏయూ అలుమ్ని అసోసియేషన్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది అలుమ్ని సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూప్ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు హాజరవుతారని చెప్పారు. బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నవంబర్‌లో 'సంతోష్ ట్రోఫీ'

విశాఖ స్పోర్ట్స్: నవంబర్ 15 నుంచి 19 వరకు సంతోష్ ట్రోఫీలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆడే గ్రూప్ పూల్ మ్యాచ్‌లు అనంతపురంలో జరగనున్నాయి. ఈ పూల్‌లో ఏపీతో పాటు మరో మూడు జట్లు ఆడనున్నాయని విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అలయెన్స్, వెల్ఫేర్ సంఘం (వీడీఎఫ్ఏ) కార్యదర్శి ఎ.చినబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎఫ్ఎల్ టోర్నీలో ఏపీ తరఫున గతేడాది కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు పాల్గొన్నదని తెలిపారు. వాస్తవానికి హైదరాబాద్ నుంచి ఐఎఫ్ఎల్‌కు మరో జట్టు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఏపీ తరఫున శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ విశాఖలో ఫుట్‌బాల్ మౌలికవసతులు అభివృద్ధి చేస్తామంటూ గతంలో లైసెన్స్ తీసుకున్నది వాస్తవమేనన్నారు. ఎస్ఎఫ్ఎల్ కార్యకలాపాలు హైదరాబాద్‌లోనే ఉండటంతో, ప్రత్యామ్నాయంగా విశాఖలో కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్‌ను ఆ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

సాగుబడి
స్వాతి కార్తె : అక్టోబర్ 24 నుండి



● మూడింట రెండొంతుల విస్తీర్ణంలో పంటలు, గ్రీన్‌హౌస్‌లు నాశనం
● మేత, నీరు లేక 95% పశువులు, 99% కోళ్ల మృత్యువాత
● ఎఫ్.ఎ.ఓ. తదితర సంస్థల మానవతా సాయంతోనే బతుకులీడుస్తున్న గాజా వాసులు

గాజాలో పంటలు నాశనం... పశువుల మృత్యువాత!

గాజా-ఇజ్రాయెల్ మధ్య ఎడతెగని యుద్ధం గాజాలోని అనేక పదుల సంఖ్యలో మనుషులను బలిగొంది. అంతేకాదు, అక్కడి రైతులు, పశుపోషకుల జీవితాలను యుద్ధం ఛిద్రం చేసింది. కొనసాగుతున్న యుద్ధం స్థానిక ఆహారోత్పత్తి అడుగంటడంతో గాజాలో ఆహార భద్రత వేగంగా క్షీణించింది. గాజాలో దాదాపు 86 శాతం జనాభా (18.4 లక్షల) మంది ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. యావత్ గాజా స్ట్రిప్‌లో తిండి దొరకని తీవ్ర క్షామ పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉంది.

ఎఫ్.ఎ.ఓ. ఉపగ్రహ కేంద్రం ఇటీవల సేకరించిన ఒక అధ్యయనంలో ఉపగ్రహ డేటా ప్రకారం.. గాజాలోని పంట భూమిలో మూడింట రెండొంతుల భూమి నాశనమైంది. గాజా వాసులకు చెందిన దాదాపు 15 వేల (95 శాతం) పశువులు చనిపోయాయి. దాదాపు దూడలన్నీ వధించబడ్డాయి. సుమారు 25 వేల గొర్రెలు (సుమారు 43 శాతం), కేవలం 3 వేల మేకలు (సుమారు 37 శాతం) మాత్రమే సజీవంగా మిగిలాయి. పౌల్ట్రీ రంగానికి కూడా అపార నష్టం జరిగింది. 99% కోళ్లు చనిపోయాయి. కేవలం 34 (1 శాతం) వేలు మాత్రమే మిగిలాయి.

సగానికి సగం జీవాలు మృతి

భయానక యుద్ధం వల్ల గాజాకు చెందిన పశుపోషకురాలు హక్మా ఎల్‌-హమీది తన కుటుంబ జీవనాధారమైన గొర్రెలు, మేకలు సహా దక్షిణ భాగాంలోకి వలస పోయింది. ఈ కుటుంబం కనీసం సగం జీవాలను కోల్పోయింది. పశువుల పనులు ఆమెకు చిన్నప్పటి నుండి అలవాటే. రోజుకు మూడు పూటలా వాటి బాగోగులు చూసుకుంటుంది.

'యుద్ధ కాలంలో ఆహారం లేదు, బార్లీ లేదు, మేత లేదు, నీరు కూడా లేదు. మాకు నలభైకి పైగా పశువులు ఉండేవి. ఇప్పుడు ఇరవై కంటే తక్కువే మిగిలాయి'అని సెంట్రల్ గాజా స్ట్రిప్‌లోని అల్‌-జువైదా నివాసి హక్మా చెప్పారు.

ఈ నష్టాలు ఆమె కుటుంబ జీవనోపాధికి తీవ్ర నష్టం కలిగించాయి. 'ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) మాకు పశువుల మేతను అందించి చాలా సహాయం చేసింది. దేవునికి ధన్యవాదాలు. ఈ జీవాలైనా చనిపోకుండా మిగిలాయి. ఆరోగ్యంగా ఉన్నాయి..' అన్నారామె.

ఎఫ్.ఎ.ఓ. అందించిన వెటర్నరీ కిట్ కూడా 'నాకు చాలా సహాయపడింది. విటమిన్లతో కూడిన దాణాతో పాటు దోమలు/ ఈగల బాధ లేకుండా చేసే స్ప్రే ఆ కిట్‌లో ఉన్నాయి. జీవాలను ఈగలు కుట్టకుండా దీన్ని పిచికారీ చేస్తున్నాను. ఇది నిజంగా బాగుంది' అన్నారామె.

పశుగ్రాసం, వెటర్నరీ కిట్ల పంపిణీ

భద్రత, ప్రయాణ సంబంధ సవాళ్లను అధిగమించి గాజా ప్రజలకు అనేక సంస్థలు మానవతా సహాయాన్ని అందించాయి. గాజాలోని డెయిర్ అల్‌-బలా, ఖాన్ యూనిస్, రఫా గవర్నరేట్‌లలోని 4,400కు పైగా పశు పోషణే జీవనాధారంగా గల కుటుంబాలకు ఎఫ్.ఎ.ఓ. పశుగ్రాసాన్ని పంపిణీ చేసింది. జంతువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, గాజా అంతటా జీవనోపాధులను కాపాడేందుకు దాదాపు 2,400 కుటుంబాలకు వెటర్నరీ కిట్‌లు అదనంగా అందించారు. మల్టీవిటమిన్లు, క్రిమిసంహారకాలు, సాల్ట్ బ్లాక్‌లు, అయోడిన్ గాయం స్ప్రేలు వంటి జంతువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చాలా అవసరమైన వస్తువులను అందించటం విశేషం.

వాస్తవానికి, హక్మా వంటి పశుపోషకులకు ఈ మహా సంక్షోభ కాలంలో ఈ సహాయం సరిపోదు. తన జంతువులను రక్షించుకోవడానికి ఇంకా ఎక్కువ మేత, మరిన్ని మందులు, మరిన్ని గుడారాలు అవసరమని ఆమె చెప్పారు.

ఈ సాయం చాలదు

బాధాకరమైన గత సంవత్సర కాలంలో అపారమైన నష్టాన్ని చవిచూసిన మరొక పశు పోషకుడు వార్డ్ సయీద్. వాస్తవానికి గాజాలోని పాత నగరంలో ఎల్‌-జెటూన్‌కు చెందిన మహిళా పశుపోషకురాలు. యుద్ధం నుంచి ప్రాణాన్ని కాపాడుకోవడానికి డెయిర్ అల్‌-బలాహ్‌కు వలస వెళ్లి ఆశ్రయం పొందారు.

'యుద్ధం కారణంగా మేం దక్షిణాదికి తరలివచ్చాం. మా పశువులను కూడా తోలుకొచ్చాం. సగానికి సగాన్ని కోల్పోయాం. వాటిలో చాలా వరకు దారిలోనే చనిపోయాయి. ఈ మిగిలిన జీవాలే మాకు ఏకైక జీవనాధారం' అన్నారామె. క్షిపణులు తరచూ పడే యుద్ధ ప్రాంతంలో ఆమె తన కుటుంబానికి ఆహారం, పశువులకు మేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి మరీ శ్రమిస్తున్నారు. 'ఎఫ్.ఎ.ఓ. పశువుల మేత, వెటర్నరీ కిట్ ఇచ్చింది. ఈ సాయం సరిపోదు. పశువుల మేత, భద్రత కలిగిన గూడు, ఆహారం ఇంకా కావాలి' అన్నారామె.

యుద్ధం అక్టోబర్ 7న ప్రారంభం కాక ముందు దాదాపు 650 ట్రక్కుల మేత ప్రతి నెలా గాజా స్ట్రిప్‌లోకి తెప్పించుకునేవారు. ఎఫ్.ఎ.ఓ., బెల్జియం, ఇటలీ, మాల్టా, నార్వే ప్రభుత్వాల మద్దతుతో పాలస్తీనా వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రభుత్వేతర సంస్థలతో కలిసి గాజా పశువుల సంరక్షకులకు మేత, వెటర్నరీ కిట్‌లను పంపిణీ చేస్తుంది. అయినా, అది అరకొరగానే మిగిలింది. యుద్ధం వల్ల ఆహారం, దాణా తదితరాలను రవాణా చేయటంలో సహాయక సంస్థలు అష్టకష్టాలను ఎదుర్కొంటున్నాయి. పరిస్థితులు మెరుగుపడితే ఫీడ్ కాన్‌సెంట్రేట్, గ్రీన్ హౌస్ ప్లాస్టిక్ షీట్‌లు, ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులు, వ్యాక్సిన్‌లు, ఎనర్జీ బ్లాక్‌లు, ప్లాస్టిక్ షెడ్‌లు, జంతు షెల్టర్‌లు, మరిన్ని వెటర్నరీ కిట్‌లను అందించడానికి సిద్ధమని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది. గాజా నుంచి ప్రాణాలు అరచేత పట్టుకొని వలస పోయిన హక్మా, వార్డ్ వంటి పశు పోషక కుటుంబాలకు మరింత మెరుగైన సహాయం అందే రోజు కోసం వారు ఇంకొంత కాలం ఎదురు చూడక తప్పదు.

గ్రీన్‌హౌస్‌లు ధ్వంసం

గాజా స్ట్రిప్ ప్రాంతంలో గల పంట పొలాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి 68 శాతం, అంటే 10,183 హెక్టార్లలో పంట పొలాలు యుద్ధం వల్ల నాశనమయ్యాయని ఎఫ్.ఎ.ఓ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 43% పొలాలు నాశనం కాగా, మే నాటికి అది 57%కి పెరిగింది. 71% తోటలు, చెట్లు, 67% స్వల్పకాలిక పంటలు, 59% వరకు కూరగాయ పంటలు నాశనమయ్యాయి. యుద్ధం వల్ల గాజాలోని వ్యవసాయ మౌలిక సదుపాయాలు సర్వనాశనం అయ్యాయి. 1,188 (52%) వ్యవసాయ బావులు దెబ్బతిన్నాయి. 578 హెక్టార్ల (44%)లోని గ్రీన్ హౌస్‌లు నేలమట్టం అయినట్లు అంచనా.





● గాజా స్ట్రిప్ నుంచి దక్షిణాదికి వలస వచ్చి జీవనోపాధి కోల్పోయిన హక్మా, వార్డ్ వంటి పశుపోషకులకు పశుగ్రాసం, వెటర్నరీ కిట్లు ఎఫ్.ఎ.ఓ. పంపిణీ చేసింది. మరిన్ని జంతువులు చనిపోకుండా కాపాడుకోవడానికి, వాటిని ఆరోగ్యంగా ఉంచడానికి ఇవి సహాయపడ్డాయి.



మేడపైనే మట్టి లేని డ్రాగన్ తోట!

● ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఇనుప చువ్వల ఊతంతో డ్రాగన్ మొక్కల పెంపకం
● విశ్రాంత ఉపాధ్యాయిని సంపాదన నెలకు రూ. లక్ష!



ఇంటి పంట

ఉపాయం ఉండాలే గాని ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఉత్సాహంగా మరో వృత్తిని చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చనటానికి కేరళకు చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయిని కృషే నిదర్శనం. కొల్లం పట్టణానికి చెందిన రెమాభాయ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి రెండేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సాయిల్ లెస్ పద్ధతిలో తమ ఇంటిపైనే డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయటం ప్రారంభించారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో హైడ్రోపోనిక్ పద్ధతిలో డ్రాగన్ పండ్లను సాగు చేస్తున్నారు. నెలకు 500 కిలోల డ్రాగన్ ఫ్రూట్స్ దిగుబడి వస్తోంది. కిలో రూ. 200కు విక్రయిస్తూ నెలకు రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు. ఏడాదికి 3 నెలలే డ్రాగన్ ఫ్రూట్ సీజన్ ఉంటుంది.

రిటైరైన కొద్ది రోజులకే ఆమె తల్లి వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆ వేదనలో నుంచి బయటపడటం కోసం ఏదైనా వ్యాపకం పెట్టుకోవాలనుకున్నారు. విదేశీ పండైన డ్రాగన్ సాగును ఇంటిపైనే ప్రారంభించారామె. నేలపైన పెంచడానికి ఇంటి దగ్గర ఖాళీ స్థలం లేదు. అందుకే మేడపై రెండొందల లీటర్ల బ్యారళ్లు 50 పెట్టి, వాటిల్లో వంద డ్రాగన్ మొక్కల్ని పెంచుతున్నారు. మట్టి మోసుకెళ్లి ఇంటిపైన పెట్టటం నాకు కష్టం అనిపించి సాయిల్ లెస్ పద్ధతిని ఎంచుకున్నానని రమాభాయ్ అంటున్నారు.

కొన్ని రెడ్, కొన్ని ఎల్లో రకం డ్రాగన్ రకాలను నాటారు. ఎక్కువైన నీరు బయటకు పోవటానికి బ్యారెల్‌కు అడుగున బెజ్జం పెట్టి.. అందులో ఆకులు, రంపపు పొడి, వరి గడ్డి ముక్కలు, బ్యారెల్‌కు 3 కిలోల చొప్పున కంపోస్టు ఎరువును దొంతర్లుగా వేశారు. వంద గ్రాముల బోన్ మీల్ కూడా కలిపి, మొక్కలు నాటారు. ఎండాకులు, కూరగాయ వ్యర్థాలు, చేపలు, రొయ్యల వ్యర్థాలు, ఆల్చిప్పలతో





సొంతంగా తయారు చేసుకునే ద్రవరూప ఎరువులను మొక్కలకు ఆమె అప్పుడప్పుడూ ఇస్తున్నారు. దీంతో మొక్కలు పోషకలోపాల్లేకుండా ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడినిస్తున్నాయని రమాభాయ్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

'ఏదైనా కంటెయినర్‌లో కిలో చేపలు, రొయ్యలు, పీతల డొప్పలకు కిలో బెల్లంతో పాటు బొప్పాయి పండ్ల తొక్కలు కలపాలి. ఎండ తగలకుండా నీడన ఉంచి అప్పుడప్పుడూ కలియదిప్పుతూ ఉంటే.. 90 రోజులకు సేంద్రియ ద్రావణం సిద్ధమవుతుంది. ఇది కాల్షియం, ఫాస్పరస్‌ను పుష్కలంగా అందిస్తుంది. ఆ బలంతో డ్రాగన్ మొక్కలు చక్కగా కాస్తున్నాయి' అన్నారు రమాభాయ్. జెసిస్ వరల్డ్ పేరిట యూట్యూబ్ ఛానల్‌ను కూడా ఆమె ప్రారంభించారు. సీజన్‌లో మా ఇంటి పైన 200-300 డ్రాగన్ పూలు కనువిందు చేస్తుంటే నా వయసు 60 నుంచి 20కి తగ్గిపోతుంది. బాధలన్నీ మర్చిపోతున్నా అంటున్నారామె సంతోషంగా!

మాటల మర్మాలు

క్లైమెట్ క్రైసిస్ (వాతావరణ సంక్షోభం)

భూగోళంపై వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల వల్ల కలుగుతున్న , కలగబోయే తీవ్ర సమస్యలనే 'వాతావరణ సంక్షోభం' అంటారు. వాతావరణ తీవ్రతలు, ప్రమాదాలు, సముద్రపు ఆమ్లీకరణ, సముద్ర నీటిమట్టం పెరుగుదల, జీవవైవిధ్యం కోల్పోవడం, ఆహారం – నీటి అభద్రత సహా ఆరోగ్య సమస్యలు, ఆర్థిక అవ్యవస్థ, వాతావరణ సమస్యల వల్ల వలసపోవాల్సి రావటం, హింసాత్మక సంఘర్షణలు.. ఇవన్నీ కూడా వాతావరణ సంక్షోభం కోవలోనివే.

క్రీస్తు శకం 1,800వ సంవత్సరం తర్వాత కాలంలో మానవ కార్యకలాపాల వల్ల భూమి పైన వాతావరణంలో సగటు ఉష్ణోగ్రత సుమారు 1.2 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగింది. 1975 తర్వాతే ఇందులో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువగా భూగోళం వేడెక్కింది. భూతాపోన్నతి వల్ల ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మానవ సమాజాలకు, సహజ పర్యావరణ వ్యవస్థలకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల కంటే ఎక్కువ మంది ప్రజలు వాతావరణ సంక్షోభానికి గురైన ప్రదేశాలలో నివసిస్తున్నారు. ఆదాయం తక్కువగా ఉండే దేశాల్లో ప్రజలకు ఈ సెగ ఇతర దేశాల్లో వారికన్నా ఎక్కువగా తగులుతోంది.

1.5 డిగ్రీల సెల్షియస్ కంటే ఎక్కువ భూతాపం పెరుగుదల తిరిగి వెనక్కి రాలేనంతటి అత్యంత ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇదే జరిగితే మానవ నాగరికతకు చాలా తీవ్రమైన ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే, హరిత గృహ వాయు ఉద్గారాలను చాలా మేరకు తగ్గించడానికి, రాబోయే దశాబ్దాల్లో ఉద్గారాలను నికరంగా సున్నా స్థితికి చేర్చే లక్ష్యాలతో ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలకు తట్టుకునే రీతిలో వ్యవస్థలను బలోపేతం చేయడానికి తగినంత పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వాలు చొరవ చూపాలి. భూగోళంపై వాతావరణం ఆధారపడి ఉన్న సహజ పర్యావరణ వ్యవస్థలను, జీవవ్యవస్థలను పరిరక్షించడానికి, పునరుద్ధరించడానికి ప్రభుత్వాలు ఇకెంత మాత్రం ఆలస్యం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవటం ప్రారంభించాలి.



● ఇంటిపంట చిట్కా

ఇంట్లో కంపోస్ట్ ఎరువు తయారీ ఎలా?

వంట గదిలో కూరగాయలు, పండ్ల తొక్కలు, వ్యర్థాల నుండి ఇంట్లోనే తయారు చేసుకోగలిగే కంపోస్ట్ ఎరువు ఇంటిపంట మొక్కలకు సులభంగా, త్వరగా పోషకాలను అందిస్తుంది. అంతేకాదు, ఇది అద్భుతమైన ఎరువు కూడా.

మూత ఉండే డస్ట్ బిన్‌కు చుట్టూ బెజ్జాలు పెట్టి గాలి పారాడేలా (ఎరేటెడ్ బిన్) చేస్తే చాలు. అందులో వంటగది వ్యర్థాలను ప్రతి రోజూ వేస్తూ ఉండాలి.



వారానికోసారి ఆ చెత్తపైన కాస్త మట్టిని చల్లి, కదిలియ తిప్పండి. తడి వ్యర్థాలతో పాటు కొన్ని ఎండిన ఆకులు లేదా చిత్రిక పట్టిన చెక్క వ్యర్థాలు వంటివి కూడా కలపాలి. తడి, పొడి చెత్త కలిపి వేయాలి.

కొంచెం శ్రద్ధ, తగుమాత్రం తేమ ఉండేలా చూసుకుంటూ ఉంటే వాసన, పురుగులు రాకుండా చూసుకోవచ్చు. గాలి తగులుతూ ఉండే బిన్‌లో చేసిన కంపోస్టు కాబట్టి దీన్ని ఏరోబిక్ హోమ్ కంపోస్టు అంటున్నాం. వంటింటి వ్యర్థాలను, ఎండు ఆకులను మున్సిపాలిటీ వాళ్లకు ఇవ్వకుండా.. వాటితో ఇంటి దగ్గరే మనం తయారు చేసే కంపోస్టు వల్ల భూగోళాన్ని వేడెక్కించే కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. ప్రతి కిలో కంపోస్టుకు 3.8 కిలోల ఉద్గారాల విడుదలను నిరోధించిన వాళ్లం అవుతాం.

ఈ పని మన భూమికి మంచిది!

సంచోక్స్



సంచోక్స్.. ఎన్నో ఔషధ గుణాలున్న దుంప పంట. దీనికి మరో పేరు జెరూసలెం ఆర్టిచోక్ (హెలియాంతస్ ట్యూబరోసస్) అని దీనికి మరో పేరుంది. ఆస్టెరాసియా కుటుంబం. ఇది ఒకసారి నాటితే చాలా ఏళ్ల పాటు పెరుగుతుంది. కానీ, పసుపు మాదిరిగా వార్షిక పంట మాదిరిగా కూడా పెంచుతుంటారు. ఉత్తర అమెరికా దీని పుట్టిల్లు. జెరూసలెం ఆర్టిచోక్ అనే పేరు ఉన్నప్పటికీ ఇది జెరూసలెంలో పుట్టిన పంట కాదు. ఆర్టిచోక్ అని ఉన్నప్పటికీ ఇది నిజమైన ఆర్టిచోక్ కాదు. వాడుకలో అలా పేర్లు వచ్చాయంతే. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ఇది బతికేస్తుంది. పోషక విలువలు, చీడపీడలను బాగా తట్టుకునే స్వభావం ఉండటం వంటి గుణగణాల వల్ల మెడిటరేనియన్, ఆ పరిసర ప్రాంతాల్లో దీన్ని సాగు చేయటం ప్రారంభమైంది. ఇప్పుడు అమెరికా, కెనడా, బల్గేరియా, రష్యా సహా అనేక ఐరోపా దేశాల్లో ఇది సాగవుతోంది. మన దేశంలోనూ మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ అక్కడక్కడా సాగవుతున్నదని చెబుతున్నారు.

సంచోక్స్ దుంపలు రకరకాల రంగులు..

సంచోక్స్ మొక్క చూడటానికి పొద్దు తిరుగుడు మొక్క మాదిరిగా ఉంటుంది. 5–8 అడుగుల ఎత్తు పెరుగుతుంది. దీని దుంప బంగాళదుంప మాదిరిగా తినటానికి అనువుగా కండగలిగి ఉంటుంది. సంచోక్స్ దుంపలు తెలుపు నుంచి పసుపు వరకు, ఎరుపు నుంచి నీలం వరకు అనేక రంగుల్లో ఉంటాయి. దుంప బరువు 80–120 గ్రాముల బరువు, 75 సెం.మీ. పొడవు ఉంటుంది. పూలు చిన్నగా పసుపు రంగులో ఉంటాయి. ఆకులపై నూగు ఉంటుంది. సంచోక్స్ మొక్క వేగంగా పెరుగుతుంది. అధిక దిగుబడినిచ్చే శక్తి దీనికి ఉంది.



మంచును కూడా తట్టుకుంటుంది. ఎరువులు కొంచెం వేసినా చాలు, వేయకపోయినా పండుతుంది. కరువును తట్టుకుంటుంది. చౌడు నేలల్లోనూ పెరుగుతుంది. 4.4 నుంచి 8.6 పిహెచ్‌ను తట్టుకుంటుంది. ఉష్ణోగ్రత తక్కువున్నా ఎక్కువున్నా బతికి దిగుబడినిస్తుంది. ఇసుక దువ్వ నేలలు, సారంవతం కాని భూముల్లోనూ పెరుగుతుంది. 18–26 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత దీనికి నప్పుతుంది. ఫిబ్రవరి – మార్చి లేదా సెప్టెంబర్ – అక్టోబర్ లలో విత్తుకోవచ్చు. మొక్క వడపడిపోయిన తర్వాత విత్తిన 5 నెలలకు దుంపలు తవ్వుకోవచ్చు. జెరూసలెం ఆర్టిచోక్ దుంపలు హెక్టారుకు 15 నుంచి 40 టన్నుల దిగుబడి వస్తుంది. దుంపలపై పొర పల్చగా ఉంటుంది. కాబట్టి, జాగ్రత్తగా తవ్వితీయాలి.

భార లోహాలను సంగ్రహిస్తుంది..

జెరూసలెం ఆర్టిచోక్ మొక్క భార లోహాలను సంగ్రహించే స్వభావం కలిగి ఉందని పరిశోధకులు గుర్తించారు. జనావాసాల నుంచి వెలువడే మురుగు నీటిలో నుంచి, నేలలో నుంచి భార లోహాలను సంగ్రహించడానికి ఈ మొక్కలను ఉపయోగించ వచ్చని చెబుతున్నారు. ఆర్టిక్ రకం జెరూసలెం ఆర్టిచోక్ మొక్కల్లో ఈ గుణం ఎక్కువగా ఉందట. దీని మొక్కల చొప్ప పశువులకు మొక్కజొన్న చొప్ప సైలేజీకి బదులు వాడొచ్చు. భూసారం తక్కువగా ఉన్న నేలల్లో ఆచ్ఛాదనగా పచ్చిరొట్ట పెంచటానికి, జీవ ఇంధనాల తయారీకి పచ్చిరొట్ట విస్తారంగా పెంచాలనుకుంటే కూడా జెరూసలెం ఆర్టిచోక్ దుంప పంట ఎంతో ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

షుగర్ రోగులకు ఉపయోగకరం

టైప్ 2 షుగర్, ఊబకాయంతో బాధపడే వారిలో ఇన్సులిన్‌ను విడుదలకు దోహదపడే ఇనులిన్‌ను ఈ దుంప కలిగి ఉంది. ఫ్రక్టోజ్, ఓలిగోఫ్రక్టోస్ తదితర సుగర్స్‌ను నియంత్రించే గుణం జెరూసలెం ఆర్టిచోక్‌కు ఉంది. సాధారణంగా ఇనులిన్‌ను చికోరీ,జెరూసలెం ఆర్టిచోక్ నుంచి పారిశ్రామిక పద్ధతుల్లో వెలికితీస్తుంటారు.

కొత్త పంట

ఈ దుంపను సన్నగా తరిగి, వేడి నీటిలో మరిగించి ఇనులిన్‌ను వెలికితీసిన తర్వాత శుద్ధి చేస్తారు. ఈ ద్రవం నుంచి ఇనులిన్ పొడిని తయారు చేస్తారు. ఈ పొడిని అనేక ఆహారోత్పత్తుల్లో వాడతారు. ఇటీవల కాలంలో ఈ పొడి, కాప్సూల్స్ రూపంలో ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఈ దుంపల్లో ఉండే ఫ్రక్టోజును ఔషధాలు, ఫంక్షనల్ ఫుడ్స్‌లో స్వీట్‌నర్‌గా వాడుతున్నారు. ఫ్రక్టోజ్ గ్లైసిమిక్ ఇండెక్స్ (23) గ్లూకోజ్ (100) లేదా సుక్రోజ్ (65) కన్నా తక్కువ కాబట్టి డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు జెరూసలెం ఆర్టిచోక్ దుంపలు ఆరోగ్యదాయకమైన ఆహారంగా బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి, ముమ్ముందు బాగా ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశం ఉంది.

జెరూసలెం ఆర్టిచోక్ దుంపలు, మొక్క అంతటినీ, ముఖ్యంగా ఆకులను ఔషధాల తయారీలో వినియోగించటం అనాదిగా ఉందనటానికి ఆధారాలున్నాయి. వాపు, నొప్పి, ఎముకలు కట్టుకోవటానికి, చర్మ గాయాలకు మందుగా ఇది పనిచేస్తుంది. యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్‌గా పనిచేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. మధుమేహాన్ని, ఊబకాయాన్ని తగ్గించే గుణం కూడా ఉంది. మలబద్ధకాన్ని పోగొట్టటం, జీవక్రియను పెంపొందించటం, కేన్సర్ నిరోధకంగా పనిచేయటం వంటి అనేక అద్భుత ఔషధ గుణాలు ఇందులో ఉన్నాయి.

బీపీ, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించటంలోనూ ఉపకరిస్తుంది. అండర్సన్, గ్రీవ్స్ అనే ఇద్దరు శాస్త్రవేత్తల చెప్పిందేమంటే.. జెరూసలెం ఆర్టిచోక్ డి-లాక్టిక్ యాసిడ్ రూపంలో లాక్టిక్ యాసిడ్‌ను ఉత్పత్తి చేస్తుందని నిర్ధారణైంది. అంటే, పారిశ్రామిక ఉత్పత్తుల్లో దీన్ని ఉపయోగించుకోవడానికి ఎంతో అవకాశం ఉందన్న మాట. రోటనారోధక వ్యవస్థ లోపాలు, దీర్ఘకాలిక నిస్సత్తువ, గుండె జబ్బులు, జీర్ణకోశ వ్యాధులు, రొమ్ము కేన్సర్, మలబద్ధకం, పేను తదితర వ్యాధులు, రుగ్మతల నివారిణిగా పనిచేస్తుందని చెబుతున్నారు. రోగనిరోధక శక్తిని ప్రేరేపించటం, దేహం లో నుంచి కలుషితాలను బయటకు పంపటంలో దోహదకారిగా ఉంటుంది. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఈ దుంపల ఉపయోగాలు అన్నీ ఇన్నీ కావు.

జెరూసలెం ఆర్టిచోక్ దుంపలను చెరకు, మొక్కజొన్న మాదిరిగా జీవ ఇంధనాల తయారీలోనూ వాడుకోవచ్చట. హెక్టారు పొలంలో పండే దుంపలతో 1500–11,000 లీటర్ల ఇథనాల్ తయారు చేయొచ్చు.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

జోరుగా ఐఫోన్ల ఎగుమతులు

- ఏప్రిల్–సెప్టెంబర్‌లో రూ.50,400 కోట్లు
- 33 శాతం అధికం
- 2024–25లో లక్ష కోట్లు దాటే చాన్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం ఆపిల్ భారత్ నుంచి ఐఫోన్ల ఎగుమతులను గణనీయంగా పెంచింది. 2024 ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో సుమారు రూ.50,400 కోట్ల విలువైన ఎగుమతులను సాధించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విలువ పరంగా 33 శాతం పెరుగుదలను నమోదు చేయడం విశేషం. చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటూ భారత్‌లో తయారీ సామర్థ్యాలను పెంపొందించడానికి యాపిల్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని ఈ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఈ జోరు చూస్తే భారత్ నుంచి విదేశాలకు సరఫరా అయ్యే ఐఫోన్ల విలువ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్లు దాటడం ఖాయంగా కనిపిస్తోందని మార్కెట్ వర్గాల అంచనా. 2023–24లో కంపెనీ సుమారు రూ.84,000 కోట్ల విలువైన ఎగుమతులను నమోదు చేసింది. ప్రభుత్వ రాయితీలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, దేశంలో సాంకేతిక పురోగతి.. వెరశి కంపెనీ భారత్‌లో తన తయారీ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా బీజింగ్–వాషింగ్టన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య చైనాలో తయారీకి సంబంధించిన నష్టాలను తగ్గించడానికి యాపిల్ యొక్క వ్యూహంలో భారత్ కీలక కేంద్రంగా మారింది.

కీలకంగా యాపిల్..

ప్రధాన మార్కెట్ అయిన యూఎస్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్ట్‌లో రూ.24,192 కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్స్ సరఫరా అయ్యాయి. యూఎస్‌కు ఎగుమతుల పరంగా టాప్–1 సెగ్మెంట్‌గా మొబైల్స్ నిలవడంతోపాటు భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతి రంగానికి ఐఫోన్లు వెన్నెముకగా మారాయి. అయిదేళ్ల క్రితం ఇక్కడి నుంచి యూఎస్‌కు ఎగుమతి అయిన స్మార్ట్‌ఫోన్స్ విలువ రూ.43.6 కోట్లు మాత్రమే. తాజా ఎగుమతి గణాంకాలు యాపిల్ తయారీ సామర్థ్యాలను ప్రతిబింబిస్తోంది. యాపిల్ కీలక సరఫరాదారులైన తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్, పెగాట్రాన్ కార్ప్, భారత్‌కు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ దక్షిణ భారతదేశంలో చురుకుగా ఐఫోన్లను అసెంబుల్ చేస్తున్నాయి. చెన్నైకి సమీపంలోని ఫాక్స్‌కాన్ ఫెసిలిటీ అతిపెద్ద సరఫరాదారుగా నిలుస్తోంది. ఇది భారత ఐఫోన్ ఎగుమతుల్లో సగం సమకూరుస్తోంది. టాటా ఎలక్ట్రానిక్స్ గతేడాది విస్ట్రన్ కార్పొరేషన్ నుంచి అసెంబ్లీ యూనిట్‌ను కొనుగోలు చేసింది. ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో కర్ణాటక ఫ్యాక్టరీ నుండి సుమారు రూ.14,280 కోట్ల విలువైన ఐఫోన్లను టాటా ఎలక్ట్రానిక్స్ ఎగుమతి చేసింది.

కొనసాగుతున్న పెట్టుబడులు..

యాపిల్ భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో కేవలం 7 శాతం లోపు మాత్రమే వాటా కలిగి ఉంది. షావోమీ, ఒప్పో, వివో వంటి చైనీస్ బ్రాండ్లదే ఇక్కడ హవా నడుస్తోంది. అయినప్పటికీ ఆపిల్ దేశీయంగా గణనీయంగా పెట్టుబడులు చేస్తోంది. బెంగుళూరు, పుణేలో కొత్త స్టోర్లతో సహా రిటైల్ ఉనికిని విస్తరించే ప్రణాళికలతో భారత్‌లో యాపిల్ వృద్ధి పథం ఆశాజనకంగా కనిపిస్తోంది. భారత్‌లో యాపిల్ అమ్మకాలు 2030 నాటికి రూ.2,77,200 కోట్లకు చేరవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. మధ్యతరగతి వర్గాల్లో పెరుగుతున్న కొనుగోలు శక్తి, సులభతర వాయిదా చెల్లింపుల స్కీములు ఇందుకు కారణంగా తెలుస్తోంది. కఠిన కోవిడ్–19 లాక్‌డౌన్‌లు, ఆర్థిక సంక్షోభం కారణంగా మాంద్యంతో చైనాలో యాపిల్ కంపెనీ అనేక సవాళ్లను ఎదుర్కొంది. దేశీయంగా తయారీ సామర్థ్యం పెంచుతున్నప్పటికీ సమీప భవిష్యత్తులో యాపిల్ ప్రధాన మార్కెట్‌గా చైనాను అధిగమించే అవకాశం భారత్‌కు లేదు. మార్చి 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో యాపిల్ భారత్‌లో రూ.1,17,600 కోట్ల విలువైన ఐఫోన్లను అసెంబుల్ చేసింది. ఉత్పత్తి సామర్థ్యాలను రెట్టింపు చేసింది.

జియోఫైనాన్స్ యాప్‌తో పసిడిలో పెట్టుబడి



ముంబై: జియోఫైనాన్స్ యాప్‌లోని స్మార్ట్‌గోల్డ్ ద్వారా డిజిటల్ రూపంలో పసిడిని కొనుగోలు చేసే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. కస్టమర్లు ఇక ఎప్పుడైనా, ఎక్కడైనా అత్యంత తక్కువగా రూ. 10 నుంచి కూడా స్మార్ట్‌గోల్డ్ యూనిట్లలో ఇన్వెస్ట్ చేయొచ్చని పేర్కొంది. కస్టమర్లు ఈ యూనిట్లను నగదు కింద లేదా భౌతిక బంగారం కింద రిడీమ్ చేసుకోవచ్చు. రూపాయిల్లోను లేదా గ్రాముల్లోను బంగారాన్ని కొనే ఆప్షన్ ఉంటుంది. అరగ్రాము పైబడిన పరిమాణంలో పసిడిని డెలివరీ కూడా తీసుకోవచ్చు.

ముడి చమురుకు కొరత లేదు

- దేశీయంగా తగినంత రిఫైనరీ సామర్థ్యం
- పెట్రోలియం మంత్రి పురి



చండీగఢ్: అంతర్జాతీయంగా ముడి చమురుకు ఎలాంటి కొరత లేదని.. దేశీయ అవసరాలను తీర్చేందుకు వీలుగా తగినంత రిఫైనరీ సామర్థ్యం ఉందని పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ అవి కుదుటపడతాయన్న స్వీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చండీగఢ్‌లో రోజ్‌గార్ మేళా సందర్భంగా మీడియా ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఈ పరిణామాలకు ముందు ప్రపంచవ్యాప్తంగా 105 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రోజువారీగా ఉత్పత్తయ్యేది. ఒపెక్ కూటమి రోజువారీగా 5 మిలియన్ బ్యారెళ్ల ఉత్పత్తి కోత నిర్ణయం తీసుకున్నది. అనంతరం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ఫలితంగా చమురు రవాణాకు భిన్న మార్గాన్ని ఎంపిక చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ఇన్సూరెన్స్ వ్యయాలు పెరిగిపోయాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని చూసినా మన దగ్గరే పెట్రోల్, డీజిల్ ధరలు అతి తక్కువగా ఉన్నాయి. ఎందుకంటే 2021 నవంబర్‌లో, 2022 మే నెలలో రెండు విడతలుగా కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. నేడు చమురుకు కొరత లేదు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ బ్యారెల్ చమురు ధర 72–73 బ్యారెళ్ల వద్దే ఉంది'' అని మంత్రి వివరించారు. దేశీయంగా 270 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనరీ సామర్థ్యం ఉండగా, దీన్ని 310 మిలియన్ మెట్రిక్ టన్నులకు విస్తరిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా 4 లక్షల బ్యారెళ్ల చమురు బ్రెజిల్ నుంచి మార్కెట్లోకి వస్తోందని, యూఎస్ సైతం మరింత పరిమాణాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి పురి చెప్పారు.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ డీల్‌కు సీసీఐ ఓకే



న్యూఢిల్లీ: అజిలస్ దయాగ్నోస్టిక్స్‌లో అదనంగా 31.52 శాతం వాటా కొనుగోలుకై ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. లావాదేవీ పూర్తి అయితే అజిలస్‌లో ఫోర్టిస్ వాటా 89.2 శాతానికి చేరుతుంది. అజిలస్ దయాగ్నోస్టిక్స్‌లో 31.52 శాతం వాటాను రూ.1,780 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్టు ఈ ఏడాది ఆగస్ట్‌లో ఫోర్టిస్ ప్రకటించింది. ఈ డీల్ ద్వారా అజిలస్‌ను రూ.5,700 కోట్లుగా విలువ కట్టారు. కాగా, డీబీ పవర్‌లో డిలిజెంట్ పవర్ విలీనానికి.. అలాగే డీబీ పవర్ హోల్డింగ్ కంపెనీ అయిన డెకోర్ థర్మల్ పవర్‌ను బైబ్యాక్‌కు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించడానికి సీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

లంబోర్గీనీపై రేమండ్ అధినేత గుర్రు

బ్రాండ్ అహంకారం అంటూ వ్యాఖ్యలు ● ఎక్స్ వేదికగా కంపెనీపై నిప్పులు



న్యూఢిల్లీ: ఇష్టంగా కొనుక్కొన్న లంబోర్గీనీ రెబల్టో... వచ్చిన కొత్తలోనే మార్గం మధ్యలో ఆగిపోయింది. కోట్లు పెట్టి కొన్న వాహనం, అదీ బ్రాండ్ న్యూ అయితే కోపం కట్టలు తెంచుకోవడం సహజం. అలాంటి సంఘటనే రేమండ్ గ్రూప్ చైర్మన్ గౌతమ్ సింఘానియాకు ఎదురైంది. సమస్యను కంపెనీ దృష్టికి తీసుకువెళ్లినా స్పందన రాకపోయేసరికి సామాజిక మాధ్యమాల వేదికగా నిప్పులు చెరిగారు. గౌతమ్ సింఘానియా అక్టోబరు 3న ముంబైలో డ్రైవ్ చేస్తుండగా తన రెబల్టో కారు ఎలక్ట్రిక్ సంబంధ వైఫల్యంతో దార్లో ఆగిపోవటంతో కంగుతిన్నారు. లింక్డ్ ఇన్‌లో తన అసంతృప్తిని పంచుకున్న సింఘానియా.. లంబోర్గీనీ ఇండియా హెడ్ శరద్ అగర్వాల్, ఆసియా హెడ్ ఫ్రాన్సిస్కో స్కార్డొని నుండి ఫాలో అప్ లేకపోవడాన్ని గురించి కూడా ప్రస్తావించారు. 'వాళ్ల తీరు దారుణం. ఈ రకంగా వ్యవహరిస్తారని అస్సలు ఊహించలేదు. కస్టమర్ సమస్యలు ఏమిటో తనిఖీ చేయడానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఈ లగ్జరీ కారు డెలివరీ అయిన 15 రోజులకే సమస్యలు ఎదురయ్యాయి. వాహనం విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సుదీర్ఘ అనుబంధం ఉన్న కస్టమర్‌కు సమస్య ఎదురైనపుడు... కనీసం ఫోన్లో కూడా సమస్య ఏంటని అడగటానికి ఎవరూ ముందుకు రాకపోవటం దిగ్భ్రాంతి కరమంటూ శరద్‌ను మరోసారి ఎక్స్‌లో ప్రశ్నించారు. బ్రాండ్ అహంకారం మరో స్థాయికి చేరుతోందా అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రఖ్యాత బ్రాండ్ల కార్లను కొనటం, వాడటంలో సింఘానియా ప్రసిద్ధి. ఫెరారీ 458, ఆడి క్యూ7, నిస్సాన్ స్కైలైన్ జీటీ–ఆర్‌తోపాటు లంబోర్గీనీ గాయాడో వంటివి ఆయన వద్ద ఉన్నాయి. అతని లగ్జరీ కార్ పోర్ట్‌ఫోలియో, డ్రైవింగ్ పట్ల ఉన్న అభిరుచి అతనిని గతంలో ఫార్ములా వన్ కారును పరీక్షించడానికి ఫ్రాన్స్ వరకు తీసుకెళ్లాయి. లంబోర్గీనీ రెబల్టో కారు ధర భారత్‌లో సుమారు రూ.8.89 కోట్ల వరకూ ఉంది.

యాక్సిస్ బ్యాంక్‌కి ఐఎఫ్‌సీ 500 మిలియన్ డాలర్ల నిధులు



ముంబై: హరిత ప్రాజెక్టులకు నిధుల లభ్యతను పెంచే దిశగా ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్‌తో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) జట్టు కట్టింది. ఆయా ప్రాజెక్టులకు ఫైనాన్స్ చేసేందుకు యాక్సిస్ బ్యాంక్‌కు 500 మిలియన్ డాలర్ల రుణాన్ని సమకూర్చేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. భారత్‌లో ఇది తమకు తొలి బ్లూ లోన్ అని ఐఎఫ్‌సీ తెలిపింది. వ్యర్థజలాలల నిర్వహణ, పర్యావరణ అనుకూల టూరిజం మొదలైన రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అందించే రుణాలను బ్లూ లోన్స్‌గా వ్యవహరిస్తారు. యాక్సిస్ బ్యాంక్ తమ క్లైమేట్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోను విస్తరించుకునేందుకు ఇది తోడ్పడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో) 30-10-2024	
విశాఖ	550–00
చిత్తూరు	578–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

నేటి బోర్డు సమావేశాలు

బయోకాన్, డాబర్ ఇండియా, ఇంద్రప్రస్థ గ్యాస్, న్యూ ఇండియా అష్యూరెన్స్, డీసీఎం శ్రీరామ్, టాటా పవర్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, టీటీకే ప్రెస్టీజ్, ఐఆర్‌బీ ఇన్ఫ్రా, 3ఐ ఇన్ఫోటెక్, పీఅండ్‌జీ, ఏజీ క్యాపిటల్, కైటెక్స్ గార్మెంట్స్

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBIN	832.05	5.05
BEL	283.25	4.89
EICHERMOT	4,880.00	3.38
HDFCLIFE	742.1	3.32
SBILIFE	1,657.00	3.18

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	11,005.00	-4.16
TATAMOTORS	844	-3.92
HEROMOTOCO	4,786.05	-2.88
DRREDDY	1,278.50	-2.52
SUNPHARMA	1,864.00	-2.04

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,062
ఎన్‌ఎస్‌ఈ	1,03,953
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,88,844
ఎఫ్ఐఐ	- 549
డీఐఐ	+ 730

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.27	$ 67.38
బ్రెంట్	70.77	$ 71.00

ప్రీమియం వాహనాల వైపు మొగ్గు

- హైబ్రిడ్ వాహనాలకు ప్రాధాన్యత
- మారుతున్న కస్టమర్ల అభిరుచులు
- దేశీ ఆటోమోటివ్ రంగంపై గ్రాంట్ థార్న్‌టన్ భారత్ సర్వే



న్యూఢిల్లీ: వాహనాల కొనుగోలుదార్లు విలాసవంతమైన, పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పోలిస్తే హైబ్రిడ్ వాహనాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. దేశీ ఆటోమోటివ్ పరిశ్రమపై గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఇందులో పాల్గొన్న వారిలో 85 శాతం మంది ప్రీమియం మోడల్స్‌ను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. 40 శాతం మంది హైబ్రిడ్ వాహనాలను ఇష్టపడుతుండగా, 17 శాతం మంది మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వైపు మొగ్గు చూపారు. 34 శాతం మంది పెట్రోల్ వాహనాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వినియోగదారులు మరింత భారీ ఈవీ మౌలిక సదుపాయాలు... ప్రోత్సాహకాల కోసం ఎదురుచూస్తూనే పర్యావరణ అనుకూల ఆప్షన్లను కూడా పరిశీలిస్తున్నారనే ధోరణి వల్లే హైబ్రిడ్ వైపు మొగ్గు చూపుతున్నారని సర్వే తెలిపింది. ఈ నేపథ్యంలో మారుతున్న వినియోగదారుల అంచనాలకు అనుగుణంగా రాణించేలా హైబ్రిడ్, ఎలక్ట్రిక్ సొల్యూషన్స్‌పై వాహనాల తయారీ సంస్థలు దృష్టి పెట్టాల్సిన ఉంటుందని పేర్కొంది.

కీలకంగా పండుగ సీజన్...

వార్షిక అమ్మకాల్లో దాదాపు 30–40 శాతం వాటా పండుగ సీజన్ విక్రయాలే ఉంటాయి కాబట్టి దేశీ ఆటోమోటివ్ పరిశ్రమకు ఇది కీలకమైన సీజన్ అని సర్వే తెలిపింది. అయితే, నిల్వలు భారీగా పేరుకుపోవడం, వాతావరణ మార్పులపరమైన అవాంతరాలు, ఎన్నికలు మొదలైనవి ఈసారి అమ్మకాల వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపినట్లు గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ సాకేత్ మెహ్రా చెప్పారు. యుటిలిటీ వాహనాలు, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు నెలకొన్న డిమాండే.. మార్కెట్‌ను ముందుకు నడిపిస్తోందన్నారు. ''ఈ సెగ్మెంట్స్ వార్షికంగా 13 శాతం వృద్ధి నమోదు చేశాయి. ప్రస్తుతం ప్యాసింజర్ వాహనాల (పీవీ) విభాగంలో వీటి వాటా 65 శాతంగా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో దేశీ విక్రయాలు కేవలం 0.5 శాతం పెరిగి ఒక మోస్తరు వృద్ధిని మాత్రమే నమోదు చేసినప్పటికీ ఎస్‌యూవీలు, యూవీలకు డిమాండ్ నిలకడగా కొనసాగడం ప్రత్యేకమైన వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపిస్తుండటాన్ని తెలియజేస్తోంది'' అని మెహ్రా వివరించారు.

సవాలుగా నిల్వలు..

వాహన నిల్వలు గణనీయంగా పేరుకుపోవడం పరిశ్రమకు సవాలుగా మారింది. రూ.79,000 కోట్ల విలువ చేసే 7.9 లక్షల యూనిట్ల స్థాయిలో నిల్వలు పేరుకుపోయినట్లు మెహ్రా వివరించారు. భారీగా పండుగ డిస్కౌంట్లు ఇవ్వడం ద్వారా పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంపై ఆటోతయారీ సంస్థలు దృష్టి పెట్టాలని సూచించారు. దాదాపు 90 శాతం మంది ఈ తరహా ఆఫర్లు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, కంపెనీలు ప్రకటిస్తున్న సబ్‌స్క్రిప్షన్ విధానాలకు, అలాగే వివిధ కార్ మోడల్స్‌లో మరిన్ని భద్రతా ఫీచర్లకు కూడా డిమాండ్ పెరుగుతున్నట్లు సర్వే పేర్కొంది. ఇక కొనుగోలుదారులు డిజైన్ లేదా పనితీరు వంటి అంశాలకు మించి అధునాతన భద్రతా ఫీచర్ల వైపు మొగ్గు చూపే ధోరణి పెరుగుతోంది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 1,741 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 663 శాతం(8 రెట్లు) దూసుకెళ్లి రూ. 1,741 కోట్లను తాకింది. కోల్ ట్రేడింగ్ బిజినెస్ మందగించినప్పటికీ ఎయిర్‌పోర్ట్స్, న్యూఎనర్జీ విభాగాల ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 228 కోట్లు ఆర్జించింది. ఇబిటా 46 శాతం ఎగసి రూ. 4,354 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం బలపడి రూ. 23,196 కోట్లను తాకింది. సోలార్ మాడ్యూల్, విండ్ టర్బయిన్ తయారీ తదితర అదానీ న్యూ ఇండస్ట్రీస్ ఇబిటా 78 శాతం జంప్‌చేసి రూ. 1,121 కోట్లకు చేరగా.. ఎయిర్‌పోర్ట్ బిజినెస్ 31 శాతం అధికంగా రూ. 744 కోట్లు ఆర్జించింది. మైనింగ్ సర్వీసుల ఇబిటా 65 శాతం పురోగమించి రూ. 400 కోట్లయ్యింది. అయితే కోల్ ట్రేడింగ్ ఇబిటా రూ. 2,063 కోట్ల నుంచి రూ. 1,916 కోట్లకు తగ్గింది. హైదరాబాద్, నోయిడాలలో డేటా సెంటర్ల నిర్మాణం దాదాపు పూర్తికావస్తుండగా.. పుణేలో 38 శాతం పూర్తయినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్థూల రుణభారం రూ. 63,855 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 2,841 వద్ద ముగిసింది.

అదానీ పోర్ట్స్ లాభం జూమ్

క్యూ2లో రూ. 2,414 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37 శాతం జంప్‌చేసి రూ. 2,414 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,762 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,952 కోట్ల నుంచి రూ. 7,372 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,477 కోట్ల నుంచి రూ. 4,434 కోట్లకు స్వల్పంగా తగ్గాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 13 శాతం పుంజుకుని రూ. 4,369 కోట్లను తాకింది. ఈ ఏడాది రూ. 17,000–18,000 కోట్ల ఇబిటాను సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. 46–48 కోట్ల మెట్రిక్ టన్నుల కార్గో పరిమాణాన్ని అందుకోగలమని అంచనా వేసింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్–సెప్టెంబర్) 9 శాతం అధికంగా 22 కోట్ల ఎంటీ కార్గో పరిమాణాన్ని హ్యాండిల్ చేసినట్లు వెల్లడించింది. ఈ కాలంలో ముంద్రా పోర్ట్ 10 కోట్ల ఎంటీ మైలురాయిని అధిగమించినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఏపీసెజ్ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 1,374 వద్ద ముగిసింది.

వోల్టాస్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 133 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వోల్టాస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 4 రెట్లు దూసుకెళ్లి రూ. 133 కోట్లకు చేరింది. రెసిడెన్షియల్ ఏసీ బిజినెస్ పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 36 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం బలపడి రూ. 2,619 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ. 2,487 కోట్లకు చేరాయి. యూనిటరీ కూలింగ్ ప్రొడక్టు(రూమ్ ఏసీ)ల విభాగం నుంచి 31 శాతం అధికంగా రూ. 1,582 కోట్ల ఆదాయం లభించగా.. ఎలక్ట్రోమెకానికల్ ప్రాజెక్టుల నుంచి 5 శాతం తక్కువగా రూ. 890 కోట్లు నమోదైంది. ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సర్వీసుల విభాగం 9 శాతం వృద్ధితో రూ. 147 కోట్ల టర్నోవర్ అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో వోల్టాస్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 1,771 వద్ద ముగిసింది.


కెనరా బ్యాంక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 4,015 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 11 శాతం పుంజుకుని రూ. 4,015 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,606 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 31,472 కోట్ల నుంచి రూ. 34,721 కోట్లకు జంప్‌చేసింది. వడ్డీ ఆదాయం రూ. 26,838 కోట్ల నుంచి రూ. 29,740 కోట్లకు ఎగసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం రూ. 3,798 కోట్ల నుంచి రూ. 4,188 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.76 శాతం నుంచి 3.73 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.41 శాతం నుంచి 0.99 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి స్వల్పంగా మెరుగుపడి 16.57 శాతాన్ని తాకింది.

ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతం ఎగసి రూ. 104 వద్ద ముగిసింది.

సువెన్ లైఫ్‌కు పెరిగిన నష్టాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రగ్ డిస్కవరీ, డెవలప్‌మెంట్ సపోర్ట్ సర్వీసెస్ రంగంలో ఉన్న సువెన్ లైఫ్ సైన్సెస్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.49.6 కోట్ల నష్టం చవిచూసింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీకి రూ.12.7 కోట్ల నష్టం వాటిల్లింది. టర్నోవర్ 16 శాతం తగ్గి రూ.2.57 కోట్లకు వచ్చి చేరింది. ఫలితాల నేపథ్యంలో సువెన్ లైఫ్ సైన్సెస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో మంగళవారం 2.76 శాతం క్షీణించి రూ.118.05 వద్ద స్థిరపడింది.

ఫ్లిప్‌కార్ట్ నష్టాలు తగ్గాయ్

2023-24లో రూ. 4,248 కోట్లు

న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో నష్టాలను తగ్గించుకుంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 13 శాతం తక్కువగా రూ. 4,248 కోట్ల నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2022–23) రూ. 4,897 కోట్ల నికర నష్టం నమోదైంది. రిటైల్ రంగ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్‌నకు చెందిన ఈ కంపెనీ మొత్తం ఆదాయం 26 శాతం ఎగసి రూ. 70,542 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 55,824 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం 24 శాతం పెరిగి రూ. 74,271 కోట్లను దాటాయి. అంతక్రితం ఏడాది ఇవి రూ. 59,817 కోట్లుగా నమోదయ్యాయి.

ఎంటీఏఆర్‌కు స్వల్పంగా తగ్గిన లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్షణ రంగానికి అవసరమైన పరికరాల తయారీలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.18.8 కోట్ల నికరలాభం ఆర్జించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.20 కోట్ల నికరలాభం సాధించింది. ఎబిటా 2 శాతం పెరిగి రూ.36.8 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.167 కోట్ల నుంచి రూ.191 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో ఎంటీఏఆర్ టెక్నాలజీస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో మంగళవారం 4.47 శాతం దూసుకెళ్లి రూ.1,585.85 వద్ద స్థిరపడింది.

హైదరాబాద్ ఘన విజయం

- ఇన్నింగ్స్, 50 పరుగుల తేడాతో పుదుచ్చేరి ఓటమి
- తనయ్ త్యాగరాజన్‌కు 7 వికెట్లు
- రంజీ ట్రోఫీ

సాక్షి, హైదరాబాద్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హైదరాబాద్ జట్టు... రంజీ ట్రోఫీలో తొలి విజయం నమోదు చేసుకుంది. తాజా సీజన్‌లో రెండు మ్యాచ్‌లు ఓడిన హైదరాబాద్... సొంతగడ్డపై పుదుచ్చేరితో జరిగిన పోరులో చక్కటి విజయం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్, 50 పరుగుల తేడాతో పుదుచ్చేరిపై విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులు వెనుకబడిన పుదుచ్చేరి... ఓవర్‌నైట్ స్కోరు 171/2తో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. ఆ జట్టు చివరకు 119.3 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌటైంది. గంగ శ్రీధర్ రాజు (214 బంతుల్లో 106; 11 ఫోర్లు, 1 సిక్సర్) సెంచరీతో కదం తొక్కగా... మిడిలార్డర్‌లో ఎవరూ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. కెప్టెన్ అరుణ్ కార్తీక్ (17), ఆనంద్ (19), ఆకాశ్ (31), విఘ్నేశ్వరన్ (21), అంకిత్ శర్మ (22 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తనయ్ త్యాగరాజన్ 7 వికెట్లతో అదరగొట్టగా... మిలింద్, రక్షణ్ రెడ్డి, రోహిత్ రాయుడు తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించిన హైదరాబాద్‌కు బోనస్ పాయింట్‌తో కలుపుకొని ఏడు పాయింట్లు లభించాయి. దీంతో గ్రూప్ 'బి'లో హైదరాబాద్ ఐదో స్థానానికి చేరింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన విదర్భ 18 పాయింట్లతో టాప్‌లో ఉండగా... మూడింట ఓడిన ఆంధ్ర జట్టు అట్టడుగున ఉంది. తదుపరి మ్యాచ్‌లో వచ్చే నెల 6 నుంచి రాజస్తాన్‌తో హైదరాబాద్ తలపడనుంది.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: 536/8 డిక్లేర్డ్; **పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్:** 153; **పుదుచ్చేరి రెండో ఇన్నింగ్స్:** శ్రీధర్ రాజు (బి) రోహిత్ రాయుడు 106; అజయ్ రోహెరా (స్టంప్డ్) రాధేశ్ (బి) తనయ్ త్యాగరాజన్ 69; అమన్ ఖాన్ (సి) మిలింద్ (బి) తనయ్ త్యాగరాజన్ 11; అరుణ్ కార్తీక్ (ఎల్బీ) రక్షణ్ రెడ్డి 17; ఆనంద్ బైస్ (సి) రాధేశ్ (బి) తనయ్ త్యాగరాజన్ 19; ఆకాశ్ (సి) రాధేశ్ (బి) చామా మిలింద్ 31; మరిముత్తు విగ్నేశ్వరణ్ (ఎల్బీ) తనయ్ త్యాగరాజన్ 21; అంకిత్ శర్మ (నాటౌట్) 22; సతీశ్ (ఎల్బీ) తనయ్ త్యాగరాజన్ 2; సాగర్ (ఎల్బీ) తనయ్ త్యాగరాజన్ 4; గౌరవ్ యాదవ్ (ఎల్బీ) తనయ్ త్యాగరాజన్ 0; ఎక్స్‌ట్రాలు 31, **మొత్తం (119.3 ఓవర్లలో ఆలౌట్)** 333. **వికెట్ల పతనం:** 1-122, 2-140, 3-197, 4-228, 5-248, 6-281, 7-313, 8-325, 9-329, 10-333, **బౌలింగ్:** మిలింద్ 17-4-36-1; రక్షణ్ రెడ్డి 17-7-35-1; రోహిత్ రాయుడు 16-6-34-1; కార్తికేయ 5-2-19-0, అనికేత్ రెడ్డి 28-7-69-0; తనయ్ త్యాగరాజన్ 34.3-9-106-7 అభిరత్ రెడ్డి 1-0-2-0, తన్మయ్ 1-0-4-0.


తనయ్ త్యాగరాజన్

ఆంధ్ర అనూహ్య పరాజయం

- రెండో ఇన్నింగ్స్‌లో 118 ఆలౌట్
- ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో హిమాచల్ గెలుపు
- రంజీ ట్రోఫీ

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు వరుసగా మూడో పరాజయం మూటగట్టుకుంది. సొంతగడ్డపై మ్యాచ్ ఆడుతూ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయిన ఆంధ్ర జట్టు కనీసం మ్యాచ్‌ను 'డ్రా'గా ముగుస్తుందని అంతా భావించగా... అందుకు విరుద్ధంగా జరిగింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా వైఎస్ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన పోరులో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శనే కనబర్చినప్పటికీ... రెండో ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా తడబడిన ఆంధ్ర జట్టు 32.1 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షేక్ రషీద్ (34; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా.. హనుమ విహారి (20), మనీశ్ (23) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. మహీప్ కుమార్ (5), అభిషేక్ రెడ్డి (2), శ్రీకర్ భరత్ (0), విఫలమయ్యారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్లలో వినయ్ గలేటియా 5, మయాంక్ డాగర్ 4 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 478/9తో మంగళవారం నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ ప్రదేశ్ 158 ఓవర్లలో 500 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులు చేయగా... హిమాచల్ ప్రదేశ్‌కు 156 పరుగుల ఆధిక్యం దక్కింది. అయితే మంగళవారం ఆటకు చివరి రోజు కావడంతో రోజంతా బ్యాటింగ్ చేస్తే ఆంధ్ర జట్టు ఓటమిని తప్పించుకున్నట్లే అనుకుంటే... అదీ సాధ్యపడలేదు. హిమాచల్ బ్యాటర్లు క్రీజులో పాతుకుపోయి సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడిన చోట మనవాళ్లు పట్టుమని పది నిమిషాలు కూడా నిలవలేకపోయారు. ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో తాజా సీజన్‌లో హిమాచల్ ప్రదేశ్ రెండో విజయం నమోదు చేసుకుంది. ఇన్నింగ్స్ తేడాతో గెలిచిన హిమాచల్ ప్రదేశ్‌కు బోనస్ పాయింట్‌తో కలుపుకొని 7 పాయింట్లు లభించాయి. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హిమాచల్ కెప్టెన్ రిషీ ధావన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో వచ్చే నెల 6 నుంచి ఉత్తరాఖండ్‌తో ఆంధ్ర జట్టు ఆడనుంది.


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుతో రిషీ ధావన్


వినయ్ గలేటియా


మయాంక్ డాగర్

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: 344; **హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్:** 500; **ఆంధ్ర రెండో ఇన్నింగ్స్:** మహీప్ కుమార్ (ఎల్బీ) వినయ్ 5; అభిషేక్ (ఎల్బీ) వినయ్ 2; మనీశ్ (సి) శుభమ్ అరోరా (బి) వినయ్ 23; షేక్ రషీద్ (ఎల్బీ) వినయ్ 34; హనుమ విహారి (సి) అంకిత్ (బి) మయాంక్ డాగర్ 20; శ్రీకర్ భరత్ (బి) వినయ్ 0; అశ్విన్ హెబ్బర్ (బి) దివేశ్ శర్మ 17; త్రిపురన విజయ్ (ఎల్బీ) మయాంక్ డాగర్ 2; శశికాంత్ (ఎల్బీ) మయాంక్ డాగర్ 0; లలిత్ మోహన్ (సి) మయాంక్ డాగర్ 0; సత్యనారాయణ రాజు (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13, **మొత్తం (32.1 ఓవర్లలో ఆలౌట్)** 118. **వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-65, 4-78, 5-78, 6-98, 7-116, 8-116, 9-116, 10-118, **బౌలింగ్:** వినయ్ 14-0-49-5; దివేశ్ శర్మ 5-1-9-1; అర్పిత్ గులేరియా 2-0-20-0; మయాంక్ డాగర్ 10.1-3-23-4; ఆకాశ్ వశిష్ఠ 1-0-8-0.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంకుకు దీప్తి

దుబాయ్: భారత మహిళల జట్టు స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తిశర్మ కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన మహిళల వన్డే బౌలర్ల ర్యాంకుల్లో దీప్తి రెండో ర్యాంకుకు ఎగబాకింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో దీప్తి రాణించింది. ఆఖరి వన్డేకు ముందే మంచి ఎకానమీ రేట్ ద్వారా భారత ఆఫ్ స్పిన్నర్ రెండు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో ర్యాంకుకు చేరుకుంది. ఈ విభాగంలో ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎకిల్‌స్టోన్ అగ్ర స్థానంలో ఉంది. వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలోనూ దీప్తి ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకులో కొనసాగుతోంది. వన్డే బ్యాటర్ల ర్యాంకుల్లో స్మృతి మంధాన (3వ), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9వ) టాప్-10 ర్యాంకింగ్స్‌లో ఉన్నారు.



తడకమళ్ల మోహిత్‌కు 9 వికెట్లు

- అరుణాచల్‌ప్రదేశ్‌కు తప్పని ఓటమి
- సిక్కిం చేతిలో పరాజయం
- రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్

అహ్మదాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌పై సిక్కిం జట్టు విజయం సాధించింది. అరుణాచల్ ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ స్పిన్నర్ తడకమళ్ల నర్సింగ్ రాజ్ మోహిత్ తన తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే 9 వికెట్లతో సత్తా చాటాడు. అయితే అతని ప్రదర్శన జట్టును గెలిపించలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లతో మెరిసిన మోహిత్... రెండో ఇన్నింగ్స్‌లో మరో ఆరు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. సహచర బౌలర్లు ధారాళంగా పరుగులు ఇచ్చుకుంటున్న చోట... అరంగేట్ర పోరులో 23 ఏళ్ల ఈ కుడిచేతి వాటం ఆఫ్‌స్పిన్నర్ ఆకట్టుకున్నాడు. సిక్కిం మొదటి ఇన్నింగ్స్‌లో 424 పరుగులు చేయగా... అరుణాచల్ ప్రదేశ్ 295 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులు చేసిన సిక్కిం... అరుణాచల్ ప్రదేశ్ ముందు 300 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మోహిత్ విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్‌లో సిక్కిం బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు రాబట్టలేకపోయారు. అయితే లక్ష్యఛేదనలో తడబడిన అరుణాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌట్ కావడంతో... సిక్కిం జట్టు 104 పరుగుల తేడాతో విజయం సాధించింది.


మోహిత్

అంతర్జాతీయ క్రికెట్‌కు వేడ్ గుడ్‌బై



రిటైర్మెంట్ ప్రకటించిన ఆస్ట్రేలియా వికెట్ కీపర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వికెట్ కీపర్-బ్యాటర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. వేడ్ 2021లో జరిగిన టి20 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడు. సెమీఫైనల్లో పాక్ గెలిచే స్థితిలో ఉండగా... షాహిన్ అఫ్రిది వేసిన చివరి ఓవర్లో వేడ్ వరుసగా మూడు సిక్సర్లతో మ్యాచ్‌ను గెలిపించి జట్టును ఫైనల్ చేర్చాడు. దీంతో సెమీస్ దాకా అజేయంగా ఉన్న పాక్ అక్కడితోనే నిష్క్రమించాల్సి వచ్చింది. 36 ఏళ్ల వేడ్ కెరీర్‌కు వీడ్కోలు పలికినప్పటికీ క్రికెట్‌తో అనుబంధాన్ని కొనసాగించేందుకు వెంటనే ఆస్ట్రేలియా జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. మరోవైపు దేశవాళీ క్రికెట్‌తో పాటు బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్)లో రెండు సీజన్లపాటు ఆటగాడిగా కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేశాడు. 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ఈ ఆసీస్ వికెట్ కీపర్ 36 టెస్టులు, 97 వన్డేలు, 92 టి20లు ఆడాడు. చివరిసారిగా ఈ ఏడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో ఆడాడు. ఈ మెగా ఈవెంట్‌తోనే తన అంతర్జాతీయ క్రికెట్ ముగిసిందని వేడ్ అన్నాడు. అప్పటినుంచే కోచింగ్ బృందంలో కలిసి పనిచేసేందుకు సెలక్టర్ జార్జ్ బెయిలీ, హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్‌లతో చర్చలు జరిపినట్లు చెప్పాడు.



'అవును... బ్లాక్ చేశాను'

మెల్‌బోర్న్: మైదానంలో భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్ల మధ్య సంవాదాలు, దూషణలు, వ్యంగ్య వ్యాఖ్యలు కొత్త కాదు. 2017లో ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో పర్యటించినప్పుడు కూడా విరాట్ కోహ్లి, గ్లెన్ మ్యాక్స్‌వెల్ మధ్య అలాంటి ఘటన ఒకటి జరిగింది. దీనికి సంబంధించి ఆసక్తికర అంశాన్ని మ్యాక్స్‌వెల్ పంచుకున్నాడు. 2021లో మ్యాక్స్‌వెల్ ఐపీఎల్‌లో బెంగళూరు జట్టుతో చేరిన తర్వాత కోహ్లితో మంచి స్నేహం కుదిరింది. మైదానంలోనూ, మైదానం బయట కూడా వీరిద్దరు ఎంతో సరదాగా ఉండేవారు. ఒక రోజు కోహ్లి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను మ్యాక్సీ ఫాలో అయ్యేందుకు ప్రయత్నించగా...అది సాధ్యం కాలేదు. దాంతో సందేహం వచ్చిన మ్యాక్స్‌వెల్ 'నువ్వు నన్ను బ్లాక్ చేశావా' అని అడిగాడు. వెంటనే కోహ్లి...'అవును...నాలుగేళ్ల క్రితం నువ్వు నన్ను వెక్కిరించిన తర్వాత ఆ పని చేశాను' అని బదులిచ్చాడు. 2017 సిరీస్‌లో భాగంగా రాంచీలో జరిగిన టెస్టులో ఫీల్డింగ్ చేస్తూ కోహ్లి గాయపడ్డాడు. నొప్పిని భరించలేక కోహ్లి తన భుజంపై చేతిని ఉంచి ఇబ్బందిగా నడిచాడు. అదే టెస్టులో దీనిని మ్యాక్స్‌వెల్ అనుకరించి చూపించాడు. దాంతో ఇది కోహ్లికి ఆగ్రహం తెప్పించింది!



బెంగళూరు బుల్స్ తొలి విజయం

- దబంగ్ ఢిల్లీపై గెలుపు
- బెంగాల్ వారియర్స్, పుణేరీ పల్టన్ మ్యాచ్ 'డ్రా'
- ప్రొ కబడ్డీ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో బెంగళూరు బుల్స్ తొలి విజయం నమోదు చేసుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన హోరాహోరీ పోరులో బెంగళూరు బుల్స్ 34-33 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిన బెంగళూరు జట్టు... ఎట్టకేలకు ఐదో పోరులో గెలుపు రుచి చూసింది. బెంగళూరు తరఫున జై భగవాన్ 11 పాయింట్లతో విజయంలో కీలక పాత్ర పోషించగా... ప్రదీప్ నర్వాల్ (7 పాయింట్లు) తన అనుభవాన్ని చాటుకున్నాడు. దబంగ్ ఢిల్లీ తరఫున అషు మాలిక్ 13 పాయింట్లతో తుదికంటా పోరాడినా జట్టును గెలిపించ లేకపోయాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడగా... కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టిన బుల్స్ బోణీ కొట్టింది. నిర్ణీత సమయంలో బుల్స్ 2 రెయిడ్ పాయింట్లు సాధించగా... దబంగ్ ఢిల్లీ 19 పాయింట్లకు పరిమితమైంది. ఇరు జట్లు చెరో సారి ఆలౌట్ అయ్యాయి. ఈ ఫలితంతో బెంగళూరు బుల్స్ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచినా... ప్రస్తుతానికి అట్టడుగునే ఉంది. దబంగ్ ఢిల్లీ 5 మ్యాచ్‌ల్లో రెండు విజయాలు మూడు ఓటములతో 13 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక ఐదో స్థానంలో కొనసాగుతోంది. బెంగాల్ వారియర్స్, పుణేరీ పల్టన్ మధ్య జరిగిన పోరు 32-32తో 'డ్రా'గా ముగిసింది. బెంగాల్ వారియర్స్ తరుపున సుశీల్ కంబ్రేకర్ 10 పాయింట్లు సాధించగా... నితిన్ కుమార్ 6 పాయింట్లు సాధించాడు. పుణేరి పల్టన్ తరఫున ఆకాశ్ షిండే, పంకజ్ మోహిత్ చెరో 8 పాయింట్లతో పోరాడారు. ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు పోరాడటంతో మ్యాచ్ చివరకు టైగా నిలిచింది. ఐదు మ్యాచ్‌లు ఆడిన 3 విజయాలు, ఒక ఓటమి, ఒక 'డ్రా' నమోదు చేసుకున్న పుణేరి పల్టన్ జట్టు 19 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో ఉంది. బుధవారం జరగనున్న మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటల నుంచి), యూపీ యోధాస్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

టోనీ, స్టబ్స్ శతకాలు

- దక్షిణాఫ్రికా 307/2
- బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

చటోగ్రామ్: యువ ఆటగాళ్లు టోనీ డి జోర్జి (211 బంతుల్లో 141 బ్యాటింగ్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (198 బంతుల్లో 106; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో కదం తొక్కడంతో బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా భారీ స్కోరు దిశగా సాగుతుంది. తొలి టెస్టులో ఘన విజయం సాధించిన దక్షిణాఫ్రికాకు రెండో మ్యాచ్‌లోనూ శుభారంభం దక్కింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా... వెలుతురు లేమి కారణంగా మంగళవారం ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (33) ఎక్కువసేపు నిలవలేకపోగా... డేవిడ్ బెడింగ్‌హామ్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ రెండు వికెట్లు పడగొట్టాడు. టోనీ, స్టబ్స్‌కు టెస్టు క్రికెట్‌లో ఇవే తొలి శతకాలు కావడం విశేషం. మార్క్‌రమ్ ఔట్ కావడంతో క్రీజులో అడుగుపెట్టిన స్టబ్స్... టోనీతో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. సొంతగడ్డపై బంగ్లా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేక పోతుండటంతో సఫారీ బ్యాటర్లు సులువుగా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో మొదట టోనీ 146 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడి బాటలోనే నడిచిన స్టబ్స్ 194 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకున్నాడు. రెండో వికెట్‌కు 201 పరుగులు జోడించిన అనంతరం స్టబ్స్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేశాడు. చివర్లో డేవిడ్ బెడింగ్‌హామ్‌తో కలిసి మరో వికెట్ పడకుండా టోనీ రోజును ముగించాడు.


స్టబ్స్ టోనీ

సాక్షి ప్లస్

బుధవారం । 30-10-2024

వాషింగ్టన్ పోస్ట్‌కు హారిస్ దెబ్బ



హారిస్‌కు మద్దతు పలకొద్దని వార్తాసంస్థను ఆదేశించిన కొత్త యజమాని జెఫ్ బెజోస్

- ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బెజోస్‌పై ఆరోపణలు
- దీంతో నిరసనగా తమ చందా సభ్యత్వాన్ని రద్దుచేసుకున్న 2,00,000 మంది చందాదారులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు పలకాలని గత వారం 'వాషింగ్టన్ పోస్ట్' వార్తాసంస్థ తీసుకున్న నిర్ణయం తాజాగా ఆ సంస్థ సర్కులేషన్‌కు ఎసరుపెట్టింది. హారిస్‌కు మద్దతు పలుకుతున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 'తటస్థ'వైఖరిని అవలంభించాలని సంస్థను ఇటీవల కొనుగోలుచేసిన ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్ తాజాగా ఆదేశించడమే ఇందుకు అసలు కారణం.

అసలేం జరిగింది?

కమలా హారిస్‌కు మద్దతు ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పత్రిక ఎడిటోరియల్ సిబ్బంది గత వారం ప్రకటించారు. ఇది నచ్చని యజమాని, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ వెంటనే రంగంలోకి దిగారు. 'అధ్యక్ష అభ్యర్థికి మద్దతు పలకడం అనేది పక్షపాత భావనను సృష్టిస్తుంది. ఇది పాఠకుల ఆలోచనా స్వాతంత్ర్యాన్ని పోగొట్టడమే అవుతుంది. అందుకే అధ్యక్ష అభ్యర్థులకు మద్దతు పలికే సంప్రదాయాన్ని అంతం చేయాలని కోరుకుంటున్నా. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, నాకు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ సీఈఓ డేవ్ లింప్ మధ్య అక్టోబర్ 25న భేటీ జరిగింది. అయితే ఈ భేటీకి వాషింగ్టన్‌పోస్ట్ హారిస్‌కు మద్దతు ఇవ్వకూడదన్న నిర్ణయానికి సంబంధం లేదు. ఇది ఉద్దేశపూర్వక వ్యూహం కాదు. ఇక్కడ ఏ విధమైన క్విడ్ ప్రోకో జరగలేదని స్పష్టం చేయదల్చుకున్నా''అని వ్యాఖ్యానించారు. దీంతో బెజోస్ ఆదేశాలను శిరసావహిస్తూ వాషింగ్టన్ పోస్ట్ ప్రచురణకర్త విల్ లూయిస్ తాజాగా ఒక ప్రకటన విడుదలచేశారు. 'ఏ అభ్యర్థికి ఓటేయాలనే విచక్షణా సామర్థ్యం అమెరికా ఓటర్లయిన మా పాఠకులకు ఉంది'అని అందులో పేర్కొన్నారు. దీంతో సోమవారం 2 లక్షల మంది చందాదారులు వాషింగ్టన్‌పోస్ట్ సభ్యత్వాన్నిరద్దుచేసుకున్నారు. ఇది సంస్థ ప్రింట్, డిజిటల్ సర్కులేషన్‌ల 8 శాతానికి సమానం. ఈ సంఖ్య మరింతపెరిగే వీలుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కమలా హారిస్‌కు మద్దతుపలికే చందాదారులే తమ సబ్‌స్క్రిప్షన్‌ను వదులుకున్నట్లు వార్తలొచ్చాయి. కొద్ది రోజుల క్రితం లాస్ ఏంజిల్స్ టైమ్స్ సైతం ఏ అభ్యర్థికీ మద్దతు ప్రకటించకూడదని నిర్ణయించింది.

అభ్యర్థికి పత్రిక ఆమోదం ఎందుకు?

అధ్యక్ష అభ్యర్థులను సమర్థించే వార్తాపత్రిక ఎడిటోరియల్ పేజీల సంప్రదాయం అమెరికాలో శతాబ్దానికి పైగా ఉంది. వార్తా పత్రికలు తాము విశ్వసించే అభ్యర్థిని సమర్థించడం ద్వారా సమాచారంతో కూడిన ఓటింగ్‌ను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తాయి. మద్దతు పలకడం అనగానే ఆ వార్తాసంస్థ ఆ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తోందని కాదు. పత్రిక పాత్రికేయ విలువలకు కట్టుబడి పనిచేస్తూనే నిష్పాక్షిక కవరేజీని అందిస్తాయి. ఆ అభ్యర్థి ఏరకంగా అధ్యక్ష పదవికి అర్హుడో వాస్తవకోణంలో తెలియజేయస్తాయి. ఓటేసేటపుడు ఏది ఉత్తమ నిర్ణయమో పాఠకులకు తెలియజేయడం ఈ మద్దతు అంతిమ లక్ష్యం. అనేక వార్తాపత్రికలకు అభిప్రాయాలు, మద్దతును ప్రకటించేందుకు ప్రత్యేకంగా ఎడిటోరియల్ బోర్డ్‌లు ఉన్నాయి. భారత్‌లో ఇలాంటి సంప్రదాయం లేదు. కానీ అనధికారికంగా కొన్ని వార్తాపత్రికలు, టీవీ చానళ్లు తాము మెచ్చిన అభ్యర్థి/రాజకీయ పార్టీకి అనుకూలంగా అత్యధిక కవరేజీ ఇచ్చే ధోరణి మాత్రం భారత్‌లో బాగా పెరిగింది.

ఏ ప్రాతిపదికన సమర్థిస్తారు?

అభ్యర్థి గెలిచి అధ్యక్షుడయ్యాక పరిపాలన ఎలా ఉండొచ్చు? హామీలను నెరవేర్చడానికి అమలుకు పక్కా ప్రణాళిక ఉందా?. మన వార్తాసంస్థ విలువలకు అనుగుణంగా ఏ అభ్యర్థి ఉన్నారు? అసలు అధ్యక్షుడయ్యే అర్హత ఆ అభ్యర్థికి ఉందా? అంతర్జాతీయ పరిణామాలను అవపోశన పట్టి అగ్రరాజ్య అధిపతిగా నెగ్గుకురాగలడా? వంటివి పరిగణనలోకి తీసుకుని వేర్వేరు వార్తాసంస్థలు తమకు నచ్చిన అభ్యర్థికే మద్దతు ప్రకటిస్తాయి. అయితే అమెరికాలో వార్తాపత్రికలు బలపరిచిన అభ్యర్థులు ప్రతిసారీ గెలవలేదనే వాదన కూడా ఉంది. 1897లో దాదాపు అన్ని న్యూయార్క్ వార్తాపత్రికలు మద్దతు పలికిన అభ్యర్థులు ఓటమిని చవిచూడటం గమనార్హం. కానీ న్యూయార్క్ టైమ్స్ అధ్యయనం ప్రకారం 1940 నుంచి 2016 వరకు జరిగిన దాదాపు అన్ని అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యధిక వార్తాపత్రికల మద్దతు అందుకున్న అభ్యర్థే అధికారాన్ని కైవసం చేసుకుని శ్వేత సౌధంలో అడుగుపెట్టగలిగారు.

ఈసారి ఎందుకు వివాదాస్పదమైంది?

అనుకూల, ప్రతికూల అనే అంశాలను పక్కనబెడితే అమెరికా రాజకీయ చరిత్రలో అత్యంత చర్చనీయాంశమైన అభ్యర్థుల్లో ట్రంప్ ఒకరు. అతని అభిప్రాయాలు, తీసుకున్న నిర్ణయాలు అమెరికన్లను తీవ్రంగా విభజించాయి. డెమొక్రటిక్ అభ్యర్థి గెలిస్తే అమెరికా నాశనమవుతుందని ట్రంప్ బలంగా ప్రచారంచేశారు. 2016లో తొలిసారి గెలిచినప్పటి నుంచి మీడియాలో వస్తున్న విమర్శలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ వంటి వార్తా పత్రికలను ఫేక్ న్యూస్ అని పదేపదే ఖండించారు. ఈ నేపథ్యంలో ఎండార్స్‌మెంట్ విషయమై వాషింగ్టన్ పోస్ట్, లాస్‌ఏంజిల్స్ టైమ్స్ వెనుకంజ వేయడానికి వ్యాపారపరమైన ప్రయోజనాలు ఉన్నాయని తెలుస్తోంది. జెఫ్ బెజోస్ కంపెనీ అమెజాన్‌కు అమెరికా ప్రభుత్వంతో బిలియన్ డాలర్ల క్లౌడ్ కంప్యూటింగ్ ఒప్పందాలు ఉన్నాయి. ఆయన రాకెట్ కంపెనీ బ్లూ ఆరిజిన్‌కు స్పేస్ ఫోర్స్, నాసాతో ఒప్పందాలున్నాయి. 2023లో డెమొక్రాట్ల బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ ట్రస్ట్ దావాను కూడా అమెజాన్ ఎదుర్కొంటోంది.

బయోఫార్మా ఇన్నోవేటర్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకున్న సూన్-షియోంగ్ ప్రస్తుతం యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) అనుమతి అవసరమయ్యే కొత్త మందులపై పనిచేస్తున్నారు. విజయావకాశాలు 50-50 ఉన్నాయని సర్వేలు చెబుతుండటంతో ట్రంప్‌ను గెలిపిస్తే తమ వ్యాపార ఒప్పందాలకు ఢోకా ఉండబోదని వ్యాపార దిగ్గజాలు భావించి ఉంటారని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.



అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలో సోమవారం వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకలనుద్దేశించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి వీడియో లింక్ ద్వారా మాట్లాడుతున్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్..





వైట్‌హౌస్ వద్ద దీపావళి వేడుకలకు హాజరైన భారతీయ అమెరికన్ మహిళలు.. ● వేడుకల్లో పాల్గొన్న ఐఎంఎఫ్ ఫస్ట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్

ఏకఛత్రాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు

- నియంత్రణ సంస్థలు, బీజేపీ, అదానీ గ్రూప్‌లు సిండికేట్‌గా ఏర్పడ్డాయి
- కేంద్రంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్, బీజేపీలపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. సెబీ వంటి నియంత్రణ సంస్థలు, బీజేపీ, అదానీ గ్రూప్ కలిసి ఒక సిండికేట్‌గా ఏర్పడ్డాయని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ మేరకు మంగళవారం యూట్యూబ్‌లో ఒక వీడియోను పోస్ట్‌చేశారు. ''అదానీ గ్రూప్ మాత్రమే కీలకరంగాల్లో అగ్రగామిలా కొనసాగేలా ఒక కొత్త సిండికేట్ పనిచేస్తోంది. ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడటమే ఈ సిండికేట్ పని. ఈ గుత్తాధిపత్యం కారణంగా దేశంలోని రాజ్యాంగబద్ధవ్యవస్థల పునాదులకు బీటలు పడుతున్నాయి. విదేశీ ఆయుధాలకు దేశీయంగా తయారైనట్లు రీబ్రాండింగ్ చేస్తూ వేల కోట్లు గడిస్తున్నట్లు అదానీ డిఫెన్స్ వెబ్‌సైట్ చూస్తే ఇట్టే అర్థమవుతుంది. యువ సైనికుల శిక్షణ, పెన్షన్, సంక్షేమం కోసం వెచ్చించాల్సిన నిధుల్ని అగ్నివీర్ పేరిట దారి మళ్లిస్తున్నారు. ఈ ధోరణి జాతి భద్రతను, యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తోంది. విరుద్ధ ప్రయోజనాలు పొందుతూ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్‌పర్సన్ మాధవీ పురీ బుచ్ అదానీ గ్రూప్ సంస్థలకు లబ్దిచేకూర్చేలా వ్యవహరించారు. బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం సెబీ సమగ్రతను మాధవీ ప్రశ్నార్థకంగా మార్చారు. ఈ సిండికేట్ విస్తృతి, మాధవీలాంటి అధికారులు ఎలా అధికారాన్ని కొందరి చేతుల్లో పెట్టారో కాంగ్రెస్ ఎప్పటికప్పుడు బట్టబయలుచేస్తూ పోరాడుతోంది. ఈ మోనోపోలీ బచావో సిండికేట్ వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసు''అని ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ పరోక్ష విమర్శలు చేశారు.

దైవాంశ మోదీ మౌనమేల?

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఢిల్లీలో పత్రికాసమావేశంలో మాట్లాడారు. ''తప్పు చేసి ఇప్పటికే సెబీ పర్యవేక్షణలో ఉన్న ఇండియాబుల్స్ గ్రూప్‌కు చెందిన ఒక వ్యక్తికి మాధవీ తన ప్రాపర్టీని అద్దెకిచ్చారు. సెబీలో శాశ్వత సభ్యురాలిగా చేరాకకూడా నిబంధనలకు విరుద్ధంగా ప్రెడిబుల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వాటాలు కల్గి ఉన్నారు. ఇంటర్నేషనల్ కన్సార్షియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్స్(ఐసీఐజే) బయటపెట్టిన ప్యారడైజ్ పేపర్స్ ఉదంతంలో బయటికొచ్చిన సెయింట్ విన్సెంట్, ది గ్రెనడైన్స్ కేంద్రంగా పనిచేసే జెసీసా ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ ఈ ప్రెడిబుల్ హెల్త్‌లో పెట్టుబడులు పెట్టింది. దీంతో అదానీ గ్రూప్, మాధవీ సంబంధాలు బయటకొచ్చినా దైవాంశ సంభూతునిగా చెప్పుకునే ప్రధాని మోదీ ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారు?''అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఉన్న సెబీ ప్రతిష్టను మోదీ మసకబార్చారని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు.

అంతటా గుత్తాధిపత్యమే

తర్వాత సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లోనూ రాహుల్ ఒక పోస్ట్‌చేశారు.''ఎయిర్‌పోర్టుల్లో గుత్తాధిపత్యం. నౌకాశ్రయాల్లో గుత్తాధిపత్యం. సిమెంట్‌లో గుత్తాధిపత్యం. విద్యుత్‌రంగంలో గుత్తాధిపత్యం. చివరకు రక్షణరంగంలోనూ గుత్తాధిపత్యం. గౌతమ్ అదానీ ఏదైనా రంగంలో అగ్రగామిగా ఎదగాలని ఆశపడగానే ఈ సిండికేట్ వెంటనే ఆయన సంస్థను ఆ రంగంలో నంబర్1 చేసేందుకు కుట్ర పన్నుతుంది''అని రాహుల్ అన్నారు.

మెక్సికో డ్రగ్స్ ముఠాకు యూపీతో లింకులు

- గ్రేటర్ నోయిడాలో 75 కిలోల డ్రగ్స్ పట్టివేత
- తిహార్ జైలు వార్డెన్ సహా నలుగురు అరెస్ట్

గ్రేటర్ నోయిడా(యూపీ): నరమాంస భక్షకులకు మారుపేరుగా ఉన్న భయంకరమైన మెక్సికో డ్రగ్స్ ముఠా జాడలు ఉత్తరప్రదేశ్‌లో బయటపడ్డాయి. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ నెల 25న గ్రేటర్ నోయిడాలోని ఓ భవనంపై నార్కోటిక్ బ్యూరో అధికారులు, ఢిల్లీ పోలీసుల ప్రత్యేక సెల్ అధికారులు జరిపిన సోదాల్లో నిర్ఘాంతపోయే నిజాలు వెలుగు చూశాయి. భవనంలోని భూగర్భంలోని ల్యాబ్‌లో 95 కిలోల డ్రగ్స్ లభించాయి. ఇక్కడే తీహార్ జైలు వార్డెన్‌తోపాటు ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త ఒకరు పట్టుబడ్డారు. దొరికిన డ్రగ్ మెథాంఫెటమైన్ ద్రవ, ఘన రూపాల్లో ఉంది. వివిధ రసాయనాలు, ఖరీదైన యంత్ర సామగ్రి కూడా ఉన్నాయి. పట్టుబడిన వ్యాపారి గతంలోనూ డ్రగ్స్ కేసులో దొరికినట్లు పోలీసులు తెలిపారు. ఇతడే తీహార్ జైలు వార్డెన్‌తో లింకులు పెట్టుకుని, డ్రగ్స్ ఉత్పత్తికి అవసరమయ్యే యంత్రాలు, రసాయనాలను కొనుగోలు చేస్తున్నట్లు తేలింది. ఉత్పత్తి ప్రక్రియను ముంబైకి చెందిన కెమిస్ట్ ఒకరు పర్యవేక్షిస్తున్నారు. మెక్సికోలోని కార్టెల్ సీజేఎన్‌జీ తరఫున ఢిల్లీలో ఉండే ఏజెంట్ డ్రగ్ నాణ్యతను పరీక్షిస్తాడు. ఈ నలుగురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని 27న కోర్టు ఎదుట హాజరు పరిచారు. అనంతరం వ్యాపారవేత్త సహాయకుడిని కూడా అరెస్ట్ చేశారు.పారిశ్రామిక ప్రాంతాల్లో వీటిని నెలకొల్పితే అధికారులకు అనుమానం రాదన్నది నిర్వాహకుల ఆలోచన అని పోలీసులు తెలిపారు. ఇలాంటివి మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్‌లతో ఈ ఏడాదిలోనే బయటపడినట్లు గుర్తు చేశారు.

నరమాంస భక్షకులు.. ఇదే సీజేఎన్‌జీ ప్రత్యేకత

మెక్సికోకు చెందిన అతి భయంకరమైన డ్రగ్స్ ముఠాల్లో కార్టెల్ డి జలిస్కో న్యుయెవా జనరేషన్(సీజేఎన్‌జీ) ఒకటి. సైన్యాన్ని తలపించేలా సొంతపారా మిలటరీ ఫోర్స్, సాయుధ వాహనాలు దీని సొంతం. వీటిన్నిటికీ మించి ఈ గ్యాంగ్ సభ్యులంతా నరమాంస భక్షకులు. ఈ ముఠాలో చేరాలనుకునే వారు కూడా ముందుగా మనుషుల మాంసాన్ని ఎటువంటి జంకు లేకుండా తిని చూపాల్సి ఉంటుంది. లేకుంటే అక్కడే ఖతం చేస్తారు. ముఠాలో 12 ఏళ్ల బాలుడికైనా సరే ఇదే ప్రాథమిక పరీక్ష. వీళ్ల స్థావరాల్లోని ఫ్రిజ్జుల్లో మృతదేహాలు రెడీగా ఉంటాయని చెబుతున్నారు. ఈ ముఠా ఖరీదైన మాదక ద్రవ్యాలను దొంగచాటుగా కనీసం మూడు డజన్ల దేశాలకు సరఫరా చేస్తుందని అంచనా. యూరప్ దేశాలతో పాటు యూఎస్‌ఏలో ఇది విస్తరించి ఉంది. తాజాగా భారత్‌లో అడుగుపెట్టింది.

వయనాడ్‌పై మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయజూస్తోంది
- ఎన్నికల ప్రచార సభల్లో ప్రియాంకా గాంధీ విమర్శలు

వయనాడ్: వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి ఆశ్రయం కోల్పోయిన బాధితులు పునరావాసం కల్పించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. దేశమన్నా, ప్రజలన్నా మోదీ ప్రభుత్వానికి ఎటువంటి గౌరవం లేదన్నారు. గత పదేళ్లుగా ఆ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. బాధిత ప్రాంతాలను పరిశీలించి, బాధితులతో మాట్లాడిన ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ జరిగిందిదేనన్నారు. ప్రజలు పట్టించుకోనంత కాలం మాత్రమే ఇటువంటి రాజకీయాలతో వారు అధికారంలో కొనసాగగలరని పేర్కొన్నారు. ప్రియాంక మంగళవారం వయనాడ్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ విభజను, విద్వేషాన్ని వ్యాపింపజేస్తోందన్నారు. ఎలాగైనా సరే అధికారంలో కొనసాగాలన్నదే బీజేపీ ఏకైక లక్ష్యమని మండిపడ్డారు.

అమెరికాలో బ్యాలెట్ డ్రాప్‌బాక్స్‌లకు నిప్పు

- వాషింగ్టన్, ఒరెగాన్ రాష్ట్రాల్లో ఘటనలు
- పలు బ్యాలెట్ బాక్సులు దగ్ధం

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అమెరికాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాలెట్ డ్రాప్ బాక్స్‌లకు నిప్పు పెట్టారు. సోమవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఒరెగాన్‌లోని పోర్ట్‌లాండ్‌లో మూడు బ్యాలెట్ డ్రాప్‌బాక్స్‌లు కాలిపోగా, వాషింగ్టన్, వాంకోవర్‌లో పెద్దసంఖ్యలో దగ్ధమైనట్లు వార్తలొచ్చాయి. అక్టోబర్ 8వ తేదీన వాంకోవర్‌లో జరిగిన ఘటనలో బ్యాలెట్లకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికారులు వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా బ్యాలెట్ డ్రాప్ బాక్సులకు నిప్పు పెట్టారని పోర్ట్‌లాండ్ పోలీస్ అసిస్టెంట్ చీఫ్ అమాండా మెక్‌మిల్లన్ తెలిపారు. వాషింగ్టన్, ఒరెగాన్ రాష్ట్రాల్లో జరిగిన ఈ చర్యలపై గుర్తు తెలియని నిందితులపై విధ్వంసక పరికరాన్ని కలిగి ఉండటం, ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. వాంకోవర్‌లో సోమవారం బ్యాలెట్ డ్రాప్ బాక్సుల నుంచి పొగలు వస్తుండటంతో పోలీసులు బ్యాలెట్ బాక్స్ పక్కన ఉన్న అనుమానాస్పద పరికరాన్ని తొలగించారు. ఒరెగాన్‌లోని పోర్ట్‌లాండ్‌లో బ్యాలెట్ బాక్స్‌లో సోమవారం ఉదయం ఇలాంటి మరో ఘటనే జరిగింది. ఈ ఘటనలో మూడు బ్యాలెట్లు మాత్రమే దెబ్బతిన్నాయని, మరోసారి ఓటు వేసేలా ఆ ఓటర్లను సంప్రదిస్తామని కౌంటీ ఎన్నికల డైరెక్టర్ తెలిపారు. తమ బ్యాలెట్ లెక్కలోకి వచ్చిందో లేదో స్టేటస్‌ను ఆన్‌లైన్లో చెక్‌చేసుకుని, పరిగణనలోకి రాకపోతే ప్రత్యామ్నాయం కోసం అభ్యర్థించాలని వాషింగ్టన్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ కార్యాలయం ఓటర్లకు సూచించింది. వాంకోవర్‌లో డెమొక్రటిక్ ప్రతినిధి మేరీ గ్లూసెన్‌కాంప్ పెరెజ్, రిపబ్లికన్ ప్రత్యర్థి జోకెంట్ బరిలో ఉన్నారు. బ్యాలెట్ డ్రాప్ బాక్సులకు పోలీసులు రాత్రిపూట రక్షణగా ఉండాలని గ్లూసెన్‌కాంప్ పెరెజ్ డిమాండ్ చేశారు. ఫీనిక్స్‌లో గురువారం మెయిల్‌బాక్స్‌ను తగలబెట్టిన ఘటనలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో దాదాపు 20 బ్యాలెట్లు ధ్వంసమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. వాషింగ్టన్ రాష్ట్రంలో చట్టబద్ధమైన, నిష్పాక్షిక ఎన్నికలకు విఘాతం కలిగించే అతివాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అమెరికా విదేశాంగ మంత్రి స్టీవ్ హాబ్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లందరూ సురక్షితంగా ఎన్నికల్లో పాల్గొనేలా చూసే అధికారుల సామర్థ్యంపై తనకు నమ్మకం ఉందన్నారు.



కాలినట్లు గుర్తులున్న బ్యాలెట్ బాక్స్

రిజర్వేషన్ల నిర్వీర్యానికి కుట్ర

తెలంగాణ, కర్ణాటక, హరియాణా ప్రభుత్వాలపై మాయావతి మండిపాటు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు, హరియాణాలో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని బీఎస్పీ అధినేత్రి మాయావతి మండిపడ్డారు. ప్రస్తుతం దళితులకు అందుతున్న రిజర్వేషన్లను నీరుగార్చేలా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడు పార్టీలు రిజర్వేషన్ విధానాల్లో మార్పుల ద్వారా అట్టడుగు వర్గాల ఐక్యత, హక్కులకు ముప్పు కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అమలు చేసిన దళితులకు సబ్-రిజర్వేషన్ పై ఆమె ఆందోళన వ్యక్తం చేస్తూ మంగళవారం 'ఎక్స్'లో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కోట్లాదిమంది దళితుల ఐక్యతకు శత్రువులన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలని నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పార్టీలతో రాజ్యాంగానికి ముప్పు పెరిగిందని ఆరోపించారు. 'హరియాణాలో బీజేపీ ప్రభుత్వం, తెలంగాణ, కర్ణాటకల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు దళితులను విభజించడానికి కొత్తగా రిజర్వేషన్ విధానాన్ని హడావుడిగా అమలు చేయాలని నిర్ణయించడం ద్వారా రిజర్వేషన్లను నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నాయి'అని ఆమె విమర్శించారు.

మహారాష్ట్రకు దక్కాల్సిన కంపెనీలు గుజరాత్‌కు..

ప్రధాని మోదీ నిర్వాకం వల్లే: శరద్ పవార్



బారామతి: మహారాష్ట్రలో ఏర్పాటు కావాల్సిన ప్రఖ్యాత కంపెనీలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌కు తరలించుకుపోయారని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి శరద్ పవార్ ఆరోపించారు. తమ రాష్ట్రంలో యువతకు దక్కాల్సిన వేలాది ఉద్యోగాలను మోదీ కొల్లగొట్టారని మండిపడ్డారు. మంగళవారం బారామతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో శరద్ పవార్ మాట్లాడారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు సంబంధించిన ఎయిర్‌క్రాఫ్ట్ యూనిట్, ఎయిర్‌బస్ యూనిట్‌ను మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఏర్పాటు చేసేలా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో ఒప్పించామని తెలిపారు. ప్రభుత్వం మారిపోయి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ యూనిట్లు గుజరాత్‌కు వెళ్లిపోయాయని గుర్తుచేశారు. మహారాష్ట్రలో ఏర్పాటు కావాల్సిన ఫాక్స్‌కాన్ సెమీకండక్టర్ ఫ్యాక్టరీ సైతం గుజరాత్‌కు తరలిపోయిందన్నారు. ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి దేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహించాలని పవార్ స్పష్టం చేశారు. మోదీ వల్ల తమ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై విరుచుకుపడ్డారు. రాజకీయ ఆకాంక్షల కోసం సొంత కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తారా? అని నిలదీశారు.

సర్దార్‌పటేల్‌కు ఏనాడో భారత రత్న రావాల్సింది

ఆయన సేవలు మరుగునపడేలా కుట్ర పన్నారు: అమిత్ షా



న్యూఢిల్లీ: వందలాది సంస్థానాలను విలీనం చేసి భారతదేశ సమైక్యతకు పాటుపడిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ శ్రమను, ఆయన దేశానికి చేసిన సేవను మరుగునపరిచే కుట్రలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వాలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరోక్ష విమర్శలు చేశారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయస్టేడియంలో 'ఐక్యతాపరుగు'ను ప్రారంభించిన సందర్భంగా అమిత్ మాట్లాడారు. ''పటేల్ దార్శనికత, పట్టుదల కారణంగానే 550కిపైగా సంస్థానాల విలీనం జరిగి స్వతంత్ర భారతావని సుసాధ్యమైంది. మొండిపట్టుపట్టిన లక్షద్వీప్ ద్వీపాలు, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు సైతం సర్దార్ పటేల్ దెబ్బకు చివరకు భారతావనిలో విలీనంకాక తప్పలేదు. అంతటి పటేల్ కృషికి ఏనాడో భారత రత్న దక్కాల్సింది. 1950లో ఆయన కన్నుమూస్తే దాదాపు 41 సంవత్సరాల తర్వాత ఆయనకు భారతరత్న ఇచ్చారు. ''పటేల్ జయంతి అక్టోబర్ 31వ తేదీ. ప్రతి ఏటా అదే తేదీన ఐక్యతాపరుగు కార్యక్రమాలు జరుగుతాయి. ఈ సంవత్సరం అదే తేదీన దీపావళి పర్వదినం ఉండటంతో రెండూ కుదరని కారణంగా రెండురోజుల ముందే ఐక్యతాపరుగును నిర్వహిస్తున్నాం'అని అమిత్ వివరించారు.

సల్మాన్ ఖాన్, జీషాన్ సిద్దిఖీకి బెదిరింపులు

రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ ● నోయిడాలో నిందితుడి అరెస్టు

నోయిడా: బాలీవుడు నటుడు సల్మాన్ ఖాన్‌తోపాటు మహారాష్ట్ర ఎమ్మెల్యే జీషాన్ సిద్దిఖీని బెదిరింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తయూబ్ అన్సారీ(20)ని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో అతడిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటించారు. నిందితుడు తొలుత ఎమ్మెల్యే జీషాన్ సిద్దిఖీకి సంబంధించిన హెల్ప్‌లైన్ నెంబర్‌కు మేసెజ్ చేశాడని, తర్వాత వాయిస్ కాల్ చేశాడని, అడిగినంత సొమ్ము ఇవ్వకపోతే సిద్దిఖీని, సల్మాన్ ఖాన్‌ను అంతం చేస్తానని బెదిరించాడని తెలిపారు. తాను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడినని, రూ.10 కోట్లు ఇవ్వాలని నిందితుడు డిమాండ్ చేశాడని చెప్పారు. ఈ వ్యవహారమంతా శుక్రవారం చోటుచేసుకుందని, సోమవారం తమకు ఫిర్యాదు అందడంతో సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. యూపీలోని బరేలీకి చెందిన తయూబ్ అన్సారీ నోయిడాలో కార్పెంటర్‌గా పని చేస్తున్నట్లు తేలిందని వివరించారు. జీషాన్ సిద్దిఖీ తండ్రి, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీని దుండగులు ఈ నెల 12న ముంబైలో కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జీషాన్ సిద్దిఖీ ఎన్సీపీ(అజిత్) టికెట్‌పై బాంద్రా ఈస్టు నుంచి పోటీ చేస్తున్నారు.

నేను సాధ్విని కాదు: జయా కిశోరీ

న్యూఢిల్లీ: వస్తువులపై వ్యామోహం ఉండొద్దని తరచూ ఉపదేశాలిచ్చే యువ ప్రబోధకురాలు, ఆధ్యాత్మికవేత్త జయా కిశోరీ తన అత్యంత ఖరీదైన 'డియోర్' బ్యాగు వివాదంపై వివరణ ఇచ్చారు. తన చర్యను సమర్థించుకున్నారు. లక్షల విలువైన డియోర్ బ్రాండ్ చేతి సంచితో ఇటీవల ఒక విమానాశ్రయంలో గాయకురాలు జయాకిశోరీ ప్రత్యక్షమవడం, ఆ వీడియోపై విమర్శలు వెల్లువెత్తడం తెల్సిందే. ఈ విషయంపై మంగళవారం ఆమె ఒక వార్తాసంస్థతో మాట్లాడారు. '' బాగా కష్టపడండి. సంపాదించండి. అంతేగానీ నన్ను విమర్శించే పనులు చేయకండి. అందరిలాగే సాధారణ అమ్మాయిని. సాధువును కాదు. నేనెప్పుడూ చర్మంతో చేసిన లెదర్ బ్యాగును వాడలేదు. నచ్చినట్లు బ్యాగును ఆర్డర్ చేయించుకున్నా. అందుకే ఆ బ్యాగుపై నా పేరు ముద్రించి ఉంది'' అని అన్నారు. '' అంతా మాయ. డబ్బులు సంపాదించడం ఆపేయండి. వస్తువులపై వ్యామోహం వదులుకోండి.. ఇలా నేనెప్పుడూ చెప్పలేదు. నేను పాటించని అంశాలను నేనెందుకు ఉపదేశిస్తాను?' అని ఆమె ఎదురు ప్రశ్నించారు.

రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం..12 మంది మృతి

జైపూర్: రాజస్తాన్‌లోని శికార్ జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సొకటి ఫ్లై ఓవర్ గోడను ఢీకొట్టడంతో బస్సులోని 12 మంది ప్రాణాలు కోల్పోగా 30 మంది వరకు గాయపడ్డారు. సలాసర్ నుంచి వస్తున్న ఈ బస్సు లక్ష్మణ్‌గఢ్ వద్ద ఫ్లై ఓవర్‌ను ఢీకొట్టినట్లు ఎస్పీ భువన్ భూషణ్ యాదవ్ చెప్పారు. డ్రైవర్ వేగంగా నడుపుతూ బస్సుపై నియంత్రణ కోల్పోవడమే ఘటనకు కారణమన్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు కుడివైపు పూర్తిగా ధ్వంసమైందని, ఘటనాస్థలిలోనే డ్రైవర్ మృతి చెందాడని చెప్పారు. లోపల ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీసేందుకు క్రేన్‌ను రప్పించాల్సి వచ్చిందని వివరించారు. బాధితులంతా స్థానికేలనన్నారు.

వలసదారుల పడక మునక..12 మంది జలసమాధి

కైరో: ఈజిప్టుకు చెందిన వలసదారులతో కూడిన పడవ లిబియా తీరంలో మునగడంతో అందులోని 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనలో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని, మిగతా మృతదేహాలను ఒడ్డుకు తీసుకువచ్చామని లిబియాకు చెందిన అల్-అబ్రీన్ అనే స్వచ్ఛంద సంస్థ మంగళవారం తెలిపింది. గత నెలలో లిబియా తీరానికి సమీపంలో వలసదారులతో కూడిన పడవ ఇంజిన్ ఫెయిలవ్వడంతో మునిగిపోయింది. ఘటనలో ఒకరు చనిపోగా, 22 మంది గల్లంతయ్యారు.

బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీవశాస్త్ర పరిచయం

భూమిపై ఎన్నో వైవిధ్యభరితమైన జీవులుంటాయి. జీవుల శాస్త్రీయ అధ్యయనమే బయాలజీ. సుమారు 4.5–5 బిలియన్ ఏళ్ల క్రితం భూమి ఏర్పడింది. భూమి ఏర్పడిన 1 నుంచి 1.5 బిలియన్ ఏళ్ల తర్వాత జీవం ఆవిర్భవించింది. ఆ తర్వాత జరిగిన జీవ పరిణామం ద్వారా ఎన్నో రకాలు జీవులు ఆవిర్భవించాయి.

- భూమిపై జీవ ఆవిర్భావాన్ని వివరించే సిద్ధాంతాల్లో ప్రధానమైంది పాన్‌స్పెర్మియ, జీవావిర్భావ సిద్ధాంతాలు. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించనే లేదు. భూమి వెలుపల నుంచి గ్రహ శకలాల ద్వారా లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామం చెందాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. స్వాంటె అర్హీనియస్ దీన్ని వివరించాడు. ప్రస్తుతం అధిక ఆమోదంలో ఉన్న సిద్ధాంతం Theory of orgin of life(జీవావిర్భావ సిద్ధాంతం). దీన్ని A.I. ఒపారిన్ అనే రష్యాకు చెందిన జియోకెమిస్ట్, జేబీఎస్ హాల్డేన్ అనే బ్రిటన్ జన్యుశాస్త్రవేత్తలు స్వతంత్రంగా ప్రతిపాదించారు. వీరు ప్రతిపాదించిన వివరాల ప్రకారం భూమిపై జీవావిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి.
- పూర్వభూమి వాతావరణం కార్బన్, హైడ్రోజన్, నత్రజని వాయువుల మిశ్రమంగా ఉండేది. నీరు, నీటి ఆవిరి ఉన్నప్పటికీ స్వేచ్ఛా ఆక్సిజన్ ఉండేది కాదు. ఇలాంటి వాతావరణాన్ని క్షయకరణ (Reducing) వాతావరణం అంటారు. అప్పటి అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి కార్బన్, హైడ్రోజన్, నత్రజని మధ్య రసాయన చర్యలు జరిగి మీథేన్, హైడ్రోజన్ సయనైడ్, అమోనియా లాంటివి ఏర్పడ్డాయి. వీటితో నీటి ఆవిరి చర్యపొందడం ద్వారా ప్రస్తుతం కేవలం జీవుల్లో మాత్రమే కనిపించే అమైనో ఆమ్లాలు, చక్కెరలు, కొవ్వు ఆమ్లాలు, నత్రజని క్షారాలు లాంటి సరళ జీవ రసాయనాలు ఏర్పడ్డాయి. ఈ సరళమైన అణువుల మధ్య చర్యల ద్వారా ప్రోటీన్లు, కొవ్వులు, కేంద్రకామ్లాలు, పిండి పదార్థాలు తయారయ్యాయి. సముద్ర నీటిలో ఈ రసాయనాలు కలిసిపోయి జరిగిన కొన్ని చర్యల ద్వారా పూర్వపర జీవకణం ఏర్పడింది.
- భూమిపై ఏర్పడిన మొదటి జీవులన్నీ అవాయుజీవులు (Anaerobes). వీటి చర్యల ద్వారా నీటి అణువు విచ్ఛిన్నమై క్రమంగా స్వేచ్ఛా ఆక్సిజన్ విడుదలైంది. ఆ తర్వాత మొక్కలు ఆవిర్భవించి వాటిలోని కిరణజన్య సంయోగక్రియ ద్వారా మరింత ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదలైంది. ప్రస్తుతం భూమిపై ఉన్న 21 శాతం ఆక్సిజన్‌కు ప్రధాన మూలం మొక్కల్లోని కిరణజన్య సంయోగక్రియ. భూమిపై జీవం ఆవిర్భవించిన తర్వాత, జీవ పరిణా మం జరిగింది. సరళ స్థాయి నుంచి సంక్లిష్ట స్థాయి జీవులు ఎలా పరిణామం చెందాయన్నది మూడు ప్రధాన సిద్ధాంతాలు వివరిస్తాయి. వీటిలో మొదటిది 'ఫ్రాన్స్‌కు చెందిన జంతుశాస్త్రవేత్త జె.బీ. లామార్క్ ప్రతిపాదించిన ఆర్జిత లక్షణాల అనువంశిక సిద్ధాంతం (Theory of Inheritance of Aquired characters). పర్యావరణ ప్రభావం ద్వారా జీవుల్లో కొత్త లక్షణా లు ఏర్పడి అవి తర్వాతి తరాలకు అవిచ్ఛిన్నంగా సంక్రమించడం ద్వారా కొత్త జాతు లు ఆవిర్భవిస్తాయని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఇంగ్లండ్‌కు చెందిన ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకృతివరణ సిద్ధాంతం. దీని ప్రకారం ప్రకృతిలోని పోటీ ఫలితంగా ఆ పోటీ తట్టుకొని నిలిచే జీవజాతులను ప్రకృతి వరిస్తుంది.హ్యూగోడివ్రీస్ అనే డచ్ వృక్ష శాస్త్రవేత్త ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
- భూమిపై ఉన్న జీవులను వర్గీకరించడం ద్వారా వాటిపై సమగ్ర అవగాహన సాధ్యమవుతుంది. అన్ని జీవులు పెరుగుదల, జీవక్రియ, ప్రత్యుత్పత్తి లాంటి సమాన లక్షణాలను ప్రదర్శించినప్పటికీ వాటిలోని కొన్ని ప్రత్యేకతల కారణంగా వాటిని విభజించాల్సిన అవసరముంటుంది. భూ మిపై ఉన్న జీవులన్నింటినీ మొక్కలు, జంతువులు అనే రెండు రకాలుగా అరిస్టాటిల్ వర్గీకరించాడు. అనంతరం అనేక సూక్ష్మజీవులను గుర్తించిన తర్వాత వాటిని కూడా కలుపుకొని అర్థవంతంగా వర్గీకరించాల్సిన అవసరం ఏర్పడింది. రాబర్ట్ విట్టేకర్ అనే జీవశాస్త్రవేత్త జీవులన్నింటినీ ఐదు ప్రధాన రాజ్యాలుగా వర్గీకరించాడు. ప్రస్తుతం ఈ వర్గీకరణే ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉంది. కణ సంక్లిష్టత, శరీర సంక్లిష్టత, పోషణ ఆధారంగా జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

I. మొనీరా రాజ్యం: కేంద్రక పూర్వ జీవులన్నింటినీ ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ ఏక కణజీవులు. ఇవి కేంద్రక పూర్వ కణాలతో నిర్మితమై ఉంటాయి.
ఉదా: బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా (పూర్వనామం: నీలి ఆకుపచ్చ శైవలాలు)

II. ప్రొటిస్టా రాజ్యం: నిజ కేంద్రక జీవుల్లో ఏక కణ జీవులను ఈ రాజ్యంలో చేర్చారు. జంతువుల్లో ప్రోటోజోవా అనే ఏక కణ జీవులను,మొక్కల్లోని ఏకకణ శైవలాలను ఈ రాజ్యంలో చేర్చారు.

III. శిలీంధ్ర రాజ్యం: మొక్కలు, జంతువులు కానీ శిలీంధ్రాలు (Fungi) ఈ వర్గంలో చేర్చారు. శిలీంధ్రాలు పరపోషకాలు. అత్యధిక శిలీంధ్రాలు విచ్ఛిన్నకారులు. జంతు, వృక్ష కళేబరాలపై ఆధారపడతాయి. శిలీంధ్రాల ద్వారా మానవుల్లో, పంట మొక్కల్లో అనేక వ్యాధులు కలుగుతాయి. ఉదా: కాండిడా, పెన్సీలియం.



IV. వృక్ష రాజ్యం: అన్ని బహుకణ మొక్కలను ఈ వర్గంలో చేర్చారు. కిరణ జన్య సంయోగక్రియ ద్వారా వాటి ఆహారాన్ని అవే తయారు చేసుకుంటాయి. ఇవన్నీ స్వయం పోషకాలు.
ఉదా: బహుకణ శైవలాలు, బ్రయోఫైట్స్, టెరిడోఫైట్స్, వివృత బీజాలు, ఆవృత బీజాలు.

V. జంతురాజ్యం (Animalia): అన్ని బహుకణ జంతువులను ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ పరపోషకాలు. అత్యధికంగా స్వేచ్ఛా జీవులు.కొన్ని పరాన్న జీవులు కూడా ఉంటాయి.
ఉదా: రక్తాన్ని పీల్చే అడదోమలు, పేగులోని బద్దెపురుగులు. అత్యధిక జంతువులు శాకాహారులు. కొన్ని మాంసాహారులు, మరికొన్ని సర్వభక్షకాలు కూడా ఉంటాయి.

వివిధ జీవుల శాస్త్రీయ అధ్యయనాల పేర్లు

శిలీంధ్రాలు	మైకాలజీ
శైవలాలు	ఫైకాలజీ
మొక్కలు	ఫైటాలజీ/బోటనీ
జంతువులు	జువాలజీ
స్పంజికలు	పారాజువాలజీ
గడ్డి మొక్కలు	అగ్రోస్టాలజీ
వృక్షాలు	డెండ్రాలజీ
క్షీరదాలు	మామాలజీ
పక్షులు	ఆర్నిథాలజీ
సరీసృపాలు	హెర్పటాలజీ
సర్పాలు	సర్పెంటాలజీ/ఒఫియాలజీ
కప్పలు	బాట్రకాలజీ
చేపలు	ఇక్తియాలజీ
కీటకాలు	ఎంటమాలజీ
తిమింగలాలు	సెటాలజీ
సీతాకోక చిలుకలు	లెపిడో టెరాలజీ
సాలీడు	అరెనియాలజీ

మాదిరి ప్రశ్నలు

1. ప్రకృతి అధ్యయనం కోసం 1831–36 మధ్య కాలంలో డార్విన్ ఏ నౌకలో ప్రయాణించాడు?
1) HMS బీగిల్ 2) టైటానిక్
3) KSK జైగాంట్ 4) TTS పర్ల్

2. ఏ మొక్కపై పరిశోధన ద్వారా హ్యూగో డివ్రీస్ ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు?
1) తోట బఠాని 2) గులాబీ
3) ఈనోథీర 4) ఏదీకాదు

3. భూమిపై ఆవిర్భవించిన తొలి కణాలకు ఒపారిన్ పెట్టిన పేరు?
1) ప్రొటినాయిడ్ 2) కొయసర్వేట్
3) కణం 4) న్యూక్లియాయిడ్

4. కిందివాటిలో సరైంది?
ఎ) ప్రస్తుత భూమి వాతావరణం ఆక్సీకరణ వాతావరణం
బి) పూర్వభూమిలోని సముద్రనీరు అంతస్సారు జలం
1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
3) ఎ, బి 4) ఏదీకాదు

5. కిందివాటిలో శిలీంధ్రం ఏది?
1) ఈస్ట్ 2) పుట్టగొడుగు
3) పెన్సీలియం 4) పైవన్నీ

6. అతిపెద్ద జంతు వర్గం?
1) మొలస్కా 2) ఆర్థ్రోపొడా
3) కార్డేటా 4) నిడేరియా

7. జంతు, మొక్క లక్షణాలు రెండూ ఉన్న జీవి?
1) అమీబా 2) పారమీసియం
3) ప్లాస్మోడియం 4) యూగ్లీన

8. బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?
1) ప్లటనిస్ట గాంజెటిక
2) ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్
3) అకినోనిక్స్ జుబేటస్
4) సిట్టాకుల క్రామెరీ

9. కింది ఏ పక్షులను డార్విన్ పేరుతో పిలుస్తారు?
1) స్వాలోస్ 2) ఫించ్
3) వల్చర్ 4) సీగల్

10. మొక్కలన్నింటిలో ఉన్నతమైనవి?
1) ఆవృత బీజాలు 2) వివృత బీజాలు
3) బ్రయోఫైట్స్ 4) టెరిడోఫైట్స్

11. కిందివాటిలో ద్విదళబీజం ఏది?
1) కొబ్బరి 2) మొక్కజొన్న
3) వరి 4) మామిడి

12. వృక్ష శాస్త్ర పితామహుడు?
1) అరిస్టాటిల్ 2) థియోఫ్రాస్టస్
3) లిన్నెయస్ 4) డార్విన్

13. 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథ రచయిత?
1) ఛార్లెస్ డార్విన్ 2) జె.బి. లామార్క్
3) హ్యూగో డెవ్రీస్ 4) జి.జె. మెండెల్

14. కిందివాటిలో నిజమైన చేప ఏది?
1) స్కార్పియాన్ ఫిష్
2) స్టోన్ ఫిష్ 3) పఫర్ ఫిష్
4) పైవన్నీ

15. కిందివాటిలో బ్యాక్టీరియం ఏది?
1) నాస్టాక్ 2) అనబీన
3) రైజోబియం 4) క్యాలోథ్రిక్స్

16. ఈస్ట్ శాస్త్రీయ నామం?
1) సెకరో మైసిస్ సెరివిజియే
2) పెన్సీలియం నొటేటం
3) కాండిడా ఆల్బికన్స్ 4) ఏదీకాదు

17. కిందివాటిలో పాక్షిక జల క్షీరదం ఏది?
1) సీల్ 2) వాల్‌రస్
3) ఆటర్ 4) పైవన్నీ

18. జీవ వైవిధ్యం అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ స్థానం?
1) 1 2) 6 3) 12 4) 24

19. శిలీంధ్రం, మొక్క వేర్ల మధ్య ఏర్పడే సహజీవనం?
1) లైకెన్ 2) మైకోరైజా
3) మైకోబియాంట్ 4) ఫైకోబియాంట్

20. ప్రస్తుతం ప్రపంచంలో ఎన్ని పులుల ఉపజాతులు ఉన్నాయి?
1) 6 2) 8 3) 10 4) 12

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 3; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 2; 10) 1; 11) 4; 12) 2; 13) 1; 14) 4; 15) 3; 16)1; 17) 4; 18) 2; 19) 2; 20) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరంలో పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు–30 సీట్లు.
- డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు–20 సీట్లు.
- డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు–10 సీట్లు.
- డిప్లొమా ఇన్ అనెస్తీషియా టెక్నీషియన్ కోర్సు–10 సీట్లు.
- డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సు–20 సీట్లు.
- **అర్హత:** ఇంటర్మీడియట్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్ (లాంగ్వేజెస్ మార్కులు మినహాయించి)మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.10.2024.
- **కౌన్సెలింగ్ ప్రక్రియ, సీట్ల కేటాయింపు:** 04.11.2024.
- **తరగతుల ప్రారంభం:** 15.11.2024.
- **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

ఏఐఏఎస్ఎల్, కోల్‌కతాలో 142 పోస్టులు

కోల్‌కతాలోని ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏఎస్ఎల్).. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 142. పోస్టుల వివరాలు: యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్–30, హ్యాండీమ్యాన్(మేల్)–112.
- **అర్హత:** యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టులకు పదో తరగతి, హెచ్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్, హ్యాండీమ్యాన్(మేల్) పోస్టులు పదో తరగతితో పాటు ఇంగ్లిష్ భాష చదవడం, అర్థం చేసుకోవడం వచ్చి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి: 28 ఏళ్లు.
- **వేతనం:** నెలకు యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టులకు రూ.24,960. హ్యాండీమ్యాన్ పోస్టులకు రూ.22,530.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.10.2024
- **వెబ్‌సైట్:** https://www.aiasl.in

ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ - ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్రరాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటివరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12 పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాగాలను గుణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి.. 1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పనిచేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957, అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్–1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961, ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 ని॥ల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్–6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969, జూలై 21న అమెరికాకు చెందిన అపోలో–11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలుమోపారు.
- 1984, ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్–టి–11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర 1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలున్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములున్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.



- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
$1AU = 1.496\times10^{11}$మీ॥
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యం లో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ॥ = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26 కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సం॥లు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం - గురుడు (బృహస్పతి)
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ఠ దూరంలో బుధుడు, గరిష్ఠ దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం-శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు ఉండటానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^0 సెంటీగ్రేడ్ నుంచి 40^0 సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ–2000)
1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
3) 92 1/2 రోజులు 4) 29 రోజులు

2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ – 2000)
1) గెలాక్సీ 2) గాలి
3) దిక్కు 4) వాతావరణం

3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ–2001)
1) $3\times10^4\times60\times60\times24\times365.25$
2) $3\times10^2\times60\times60\times24\times365.25$
3) $3\times10^5\times60\times60\times24\times365.25$
4) $3\times10^3\times60\times60\times24\times365.25$

4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లాలంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ–2002)
1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్

5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ–2002)
1) ఇన్‌శాట్–1బి 2) పీఎస్ఎల్‌వీడీ–2
3) భాస్కర–2 4) ఆర్యభట్ట

6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
1) 149,000,000 కి.మీ.
2) 149,598,500 కి.మీ.
3) 149,593,300 కి.మీ
4) 149,895,500 కి.మీ.

7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ–2003)
1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
2) అపోలో - 11, సోయూజ్–టీ–11
3) వైకింగ్–1, వైకింగ్–2
4) సోయూజ్ –టీ–11, శాల్యూట్

8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ–2006)
1) 88 రోజులు 2) 248 రోజులు
3) 365 రోజులు 4) 243 రోజులు

9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ–2006)
1) 3–6–1984 2) 3–4–1984
3) 3–4–1985 4) 3–6–1985

10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
1) 12,576 2) 12,657
3) 12,756 4) 12,765

11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
1) బృహస్పతి, భూమి
2) బుధుడు, అంగారకుడు
3) శని, శుక్రుడు 4) నెప్ట్యూన్, యురేనస్

12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ–2008)
1) పయనీర్ 2) ఆర్యభట్ట
3) భాస్కర - 2 4) అట్లాంటిస్

13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ–2012)
1) కుజుడు 2) బుధుడు
3) బృహస్పతి 4) యురేనస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 3; 12) 1; 13) 1.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
1) ఆర్యభట్ట
2) భాస్కర–1
3) ఇన్‌శాట్ - 1బి
4) భాస్కర - 2

2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
1) శని 2) భూమి
3) శుక్రుడు 4) బుధుడు

3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
1) భూ పరిభ్రమణం
2) భూ భ్రమణం
3) ఉల్కాపాతం
4) ఏదీకాదు

4. సూర్య గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
4) అన్నీ

5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
1) సెరస్ 2) ఇంకారస్
3) హైడ్రా 4) హేలీ

6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
1) తుంబా 2) శ్రీహరికోట
3) ఢిల్లీ 4) 1, 2

7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
1) శని 2) బృహస్పతి
3) బుధుడు 4) శుక్రుడు

8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతిపెద్దది?
1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
3) హైడ్రా 4) ఇంకారస్

9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
1) అపోలో 2) స్పుత్నిక్
3) కొలంబియా
4) వస్తోక్

10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
1) రష్యా 2) అమెరికా
3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 1; 8) 2; 9) 3; 10) 2.

సాక్షి ప్లస్
బుధవారం। 30-10-2024

మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ప్రకరణ 43ఎ – కార్మికులకు యాజ మాన్యంలో భాగస్వామ్యం కల్పించడం
   బి) ప్రకరణ 43బి: సహకార సంఘాలను ప్రోత్సహించడం
   సి) ప్రకరణ 48ఎ – అడవులు, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి
   డి) ప్రకరణ 39ఎ – సమన్యాయం, ఉచిత న్యాయ సహాయం
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
2. స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) స్పీకర్‌ను రాష్ట్రపతి తొలగించవచ్చు
   2) ఎన్నిక సమయంలో స్పీకర్ సభలో సభ్యుడు కానవసరం లేదు. కానీ నియ మించిన ఆరు నెలల్లో పార్లమెంట్‌కు ఎన్నికవ్వాలి
   3) సభ సాధారణ కాలపరిమితి కంటే ముందే రద్దయితే దానితో పాటే స్పీకర్ కూడా తన పదవిని కోల్పోతారు
   4) రాజీనామా పత్రాన్ని డిప్యూటీ స్పీకర్‌కు సమర్పించాలి
3. కింది వాటిలో భారత ఎన్నికల సంఘం విధులు ఏవి?
   ఎ) లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్య సభ ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించడం
   బి) కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
   సి) ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు, వివాదాలపై నిర్ణయం
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) పైవేవీకావు
4. అతి తక్కువ కాలం పదవిలో ఉన్న రాష్ట్రపతి ఎవరు?
   1) సర్వేపల్లి రాధాకృష్ణన్
   2) జాకీర్ హుస్సేన్ 3) జ్ఞానీ జైల్ సింగ్
   4) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
5. రాజ్యసభ ద్రవ్యబిల్లుకు సవరణలు సూచించి నప్పుడు..?
   1) లోక్‌సభ ఆ సవరణలను ఆమోదిం చవచ్చు, తిరస్కరించవచ్చు
   2) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును వదిలేస్తుంది
   3) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును రాజ్యసభకు పునఃపరిశీలనకు పంపిస్తుంది
   4) రాష్ట్రపతి ఆ ద్రవ్య బిల్లు గురించి ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు
6. కింది వాక్యాల్లో సరైంది ఏది?
   1) ఒక వ్యక్తిని ఏక కాలంలో రెండు లేదా అం తకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించరాదు
   2) సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమించిన విధంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను గవర్నర్ నియమిస్తారు
   3) గవర్నర్‌ను పదవి నుంచి తొలగించే విధానం రాజ్యాంగంలో పేర్కొనలేదు
   4) కేంద్రపాలిత ప్రాంతాలకు శాసనసభ ఉం టే లెఫ్టినెంట్ గవర్నర్ మెజార్టీ పార్టీ నాయకుడిని సీఎంగా నియమిస్తారు
7. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ప్రకరణ 123–ఆర్డినెన్సులను జారీ చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారం
   బి) ప్రకరణ 213 – గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేసే అధికారం
   సి) ప్రకరణ 262 – అంతర్రాష్ట్రీయ మండలి ఏర్పాటు
   1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, సి
8. రాజ్యాంగ పరిషత్ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
   జాబితా – I
   i) సారథ్య సంఘం
   ii) క్రెడెన్షియల్ కమిటీ
   iii) ప్రాథమిక హక్కుల ఉపకమిటీ
   iv) యూనియన్ పవర్స్ కమిటీ
   జాబితా – II
   a) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
   b) రాజేంద్ర ప్రసాద్ c) జె.బి. కృపలానీ
   d) జవహర్ లాల్ నెహ్రూ
   1) i-b, ii-a, iii-c, iv-d
   2) i-a, ii-b, iii-c, iv-d
   3) i-b, ii-c, iii-a, iv-d
   4) i-c, ii-a, iii-b, iv-d
9. అటార్నీ జనరల్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) లోక్‌సభ చర్చలో పాల్గొనవచ్చు
   బి) లోక్‌సభ కమిటీ సభ్యుడు
   సి) లోకసభలో మాట్లాడొచ్చు
   డి) లోక్‌సభలో ఓటు వేయవచ్చు
   1) ఎ మాత్రమే 2) బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి
10. 'భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండ తలను సమర్థించడం, సంరక్షించడం'లను దేనిలో పేర్కొన్నారు?
    1) రాజ్యాంగ ప్రవేశిక
    2) ఆదేశిక సూత్రాలు
    3) ప్రాథమిక హక్కులు
    4) ప్రాథమిక విధులు
11. మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?
    1) కె. సంతానం 2) ఎ.కె. చాంద్
    3) కె.సి. నియోగి 4) వై.బి. చవాన్
12. కింది వాటిలో అఖిల భారత సర్వీసులకు సం బంధించి నియామకాలు చేసేది?
    1) రాష్ట్రపతి
    2) ఏ రాష్ట్రానికి చెందితే ఆ రాష్ట్ర గవర్నర్లు
    3) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
    4) ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు
13. 'జీరో అవర్' అని దేన్ని అంటారు?
    1) సభ ప్రారంభమైన తొలి గంట
    2) సభ్యులు ఎవరూ హాజరుకాని సమయం
    3) ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత, సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు ఉన్న సమయం
    4) ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి, సభా కార్యక్రమాల ముగింపునకు మధ్య సమయం
14. రాజ్యాంగ రిట్లలో 'ఆజ్ఞ' అనేది దేని అర్థం?
    1) ప్రొహిబిషన్ 2) మాండమస్
    3) సెర్షియోరరి 4) కో వారెంటో
15. కేంద్రంలో ఏర్పాటైన మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏది?
    1) జనతా ప్రభుత్వం
    2) యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం
    3) నేషనల్ డెమొక్రటిక్ ప్రభుత్వం
    4) నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం
16. కింది వారిలో ఉన్నతాధికార, దౌత్య సంబంధ పదవులు చేపట్టి ఉపరాష్ట్రపతులుగా కొనసాగిన వారెవరు?
    1) డా.ఎస్.రాధాకృష్ణన్ 2) జి.ఎస్. పథక్
    3) వి.వి. గిరి 4) బి.డి. జెట్టి
17. పీఠికలోని 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ' అనే భావాలను ఏ విప్లవం నుంచి గ్రహిం చారు?
    1) రష్యా 2) ఫ్రెంచ్ 3) అమెరికా 4) జర్మనీ
18. 'సామ్యవాదం, లౌకికవాదం' అనే పదాలను భారత రాజ్యాంగంలో ఎన్నో సవరణ ద్వారా చేర్చారు?
    1) 44 2) 40 3) 38 4) 42
19. 'కో వారెంటో' అంటే..?
    1) బంధీ ప్రత్యక్ష 2) అధికార పృచ్ఛ
    3) పరమాదేశ 4) ఉత్ప్రేషణ
20. 'స్థానిక సంస్థల పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?
    1) లార్డ్ రిప్పన్ 2) లార్డ్ కానింగ్
    3) లార్డ్ రిప్పన్ 4) లార్డ్ మౌంట్ బాటన్
21. 'ఒక తప్పునకు రెండుసార్లు శిక్షార్హం కాదు' అని తెలిపే సిద్ధాంతం ఏది?
    1) రిపగ్నసీ సిద్ధాంతం
    2) ద్వంద్వ శిక్ష నిషేధ సిద్ధాంతం
    3) గ్రహణ సిద్ధాంతం
    4) రెట్రిబ్యూషన్ సిద్ధాంతం
22. కమిటీలు, అవి సిఫారసు చేసిన అంశాలకు సం బంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా – I
    i) బల్వంతరాయ్ మెహతా కమిటీ
    ii) అశోక్ మెహతా కమిటీ
    iii) సి.హెచ్. హనుమంతరావు కమిటీ
    iv) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
    జాబితా – II
    a) రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
    b) జిల్లా ప్రణాళికా బోర్డుల ఏర్పాటు
    c) మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
    d) పంచాయతీరాజ్ సంస్థలను రాజ్యాంగ బద్ధం చేయాలి
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-d, ii-a, iii-b, iv-c
23. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    ఎ) జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఏటా జనవరి 25న నిర్వహిస్తారు
    బి) ఎన్నికల సంఘం తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది
    సి) ఎన్నికల సంఘం తన నివేదికను పార్లమెం ట్‌కు సమర్పిస్తుంది
    డి) ఎన్నికల సంఘం తన నివేదికను ఎవరికీ సమర్పించాల్సిన అవసరంలేదు
    1) ఎ, డి 2) బి, డి 3) ఎ, సి 4) సి, డి
24. కింది వాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు ఏవి?
    ఎ) ఏక పౌరసత్వం
    బి) ద్వంద్వ ప్రభుత్వం
    సి) లిఖిత రాజ్యాంగం
    డి) ద్విసభా పద్ధతి ఇ) ఒకే రాజ్యాంగం
    ఎఫ్) కేంద్రం రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరిం చడం
    1) ఎ, బి, సి, ఎఫ్ 2) బి, సి, డి
    3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ
25. కింది వాటిలో ఏక కేంద్ర లక్షణాలు ఏవి?
    ఎ) అఖిల భారత సర్వీసులు
    బి) అత్యవసర అధికారాలు
    సి) అధికార విభజన
    డి) స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయవ్యవస్థ
    ఇ) గవర్నర్ వ్యవస్థ
    ఎఫ్) రాజ్యాంగేతర సంస్థలు
    1) ఎ, బి, ఇ, ఎఫ్ 2) బి, సి, డి
    3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ
26. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం – ఏప్రిల్ 24
    బి) ప్రవాస భారతీయ దివస్ – జనవరి 9
    సి) ప్రాథమిక విధుల దినోత్సవం – జనవరి 3
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, బి, సి 4) సి, డి
27. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలి పదవీ కాలం ఎన్నేళ్లు?
    1) రెండేళ్లు 2) మూడేళ్లు
    3) నాలుగేళ్లు 4) ఐదేళ్లు
28. ప్రాంతీయ పార్టీలు, వాటి వ్యవస్థాపక అధ్య క్షులకు సంబంధించి కింది వాటిని జతపరచం డి?
    జాబితా – I
    i) శివసేన ii) ద్రవిడ మున్నేట్ర కజగం
    iii) ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం
    iv) దేశీయ ముర్‌పొక్కు ద్రవిడ మున్నేట్ర కజగం
    జాబితా – II
    a) సి.ఎన్. అన్నాదురై
    b) ఎం.జి. రామచంద్రన్
    c) బాల్‌థాకరే d) విజయ్‌కాంత్
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-d, ii-a, iii-b, iv-c
29. ప్రాంతీయ పార్టీలు, వాటిని ఏర్పాటు చేసిన సం వత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా – I
    i) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్
    ii) అసోం గణ పరిషత్
    iii) తెలంగాణ రాష్ట్ర సమితి
    iv) తెలుగుదేశం పార్టీ
    జాబితా – II
    a) 2001 b) 1985
    c) 1998 d) 1982
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-b, ii-c, iii-a, iv-d
    4) i-d, ii-c, iii-a, iv-b
30. షెడ్యూల్ 12లో పేర్కొన్న అంశాలు ఎన్ని?
    1) 19 2) 18 3) 29 4) 28
31. అధికరణ 136 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం?
    1) సివిల్ జూరిస్‌డిక్షన్
    2) అప్పిలేట్ జూరిస్‌డిక్షన్
    3) స్పెషల్ లీవ్ పిటిషన్
    4) ట్రాన్స్‌ఫర్డ్ జూరిస్‌డిక్షన్
32. ఏ రాజ్యాంగ సవరణ ప్రకారం 2020 వరకు రిజర్వేషన్లు పొడిగించారు?
    1) 77 2) 98 3) 95 4) 84
33. కింది వాటిలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు లేనివారు?
    1) లోక్‌సభ సభ్యులు
    2) రాజ్యసభ సభ్యులు
    3) ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభల సభ్యులు
    4) రాష్ట్ర శాసన మండలి సభ్యులు
34. స్వతంత్ర భారత తొలి ఆర్థిక మంత్రి?
    1) ఆర్.కె. షణ్ముగం చెట్టి
    2) జాన్ మత్తాయ్ 3) సి.డి. దేశ్‌ముఖ్
    4) టి.టి. కృష్ణమాచారి
35. వివిధ జాతీయ పార్టీలు, అవి ఏర్పాటైన సం వత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా – I
    i) బహుజన్ సమాజ్ పార్టీ
    ii) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ
    iii) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
    iv) భారతీయ జనతా పార్టీ
    జాబితా – II
    a) 1925 b) 1980
    c) 1999 d) 1984
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-b, ii-c, iii-a, iv-d
    4) i-d, ii-c, iii-a, iv-b

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 2	5) 1
6) 3	7) 3	8) 1	9) 3	10) 4
11) 3	12) 1	13) 3	14) 2	15) 1
16) 1	17) 2	18) 4	19) 2	20) 1
21) 2	22) 3	23) 1	24) 2	25) 1
26) 3	27) 2	28) 3	29) 2	30) 2
31) 3	32) 3	33) 4	34) 1	35) 4

Who among them is taller...

REASONING

Directions(Q.1-4): **Five friends Lokesh, Manoj, Gopal, Raveesh and Rohit have agreed to work together on a part-time job offered by a local restaurant. The restaurant opens 5 days a week and this group have following schedules when they can work.**

- Neeraj and Raveesh can work on Monday, Tuesday and Wednesday
- Raveesh and Rohit can work on Monday, Wednesday and Thursday
- Rohit and Lokesh can work on Monday, Friday and Thursday
- Lokesh and Manoj can work on Friday, Tuesday and Thursday.
- Neeraj and Manoj can work on Friday, Tuesday and Wednesday.

Based on the above passage, answer the following questions.

1. **Which one of the five friends cannot work on Thursday?**
   a) Neeraj b) Raveesh
   c) Rohit d) Lokesh
   e) Manoj
2. **Which is the one who cannot work on Tuesday?**
   a) Neeraj b) Raveesh
   c) Rohit d) Lokesh
   e) Manoj
3. **Name the person who cannot work on Friday?**
   a) Neeraj b) Rohit
   c) Manoj d) Raveesh
   e) Lokesh
4. **Name the person who cannot work on Monday?**
   a) Rohit b) Manoj
   c) Raveesh d) Lokesh
   e) Neeraj

Answers(1-4): To answer this kind of questions, tabulating the given information is very useful.


- People working on monday- Neeraj, Raveesh, Rohit and Lokesh.
- People working on Tuesday- Neeraj, Raveesh, Lokesh and Manoj
- People working on Wednesday - Neeraj, Raveesh, Rohit and Manoj
- People working on Thursday - Raveesh, Rohit, Lokesh and Manoj
- People working on Friday - Rohit, Lokesh, Manoj and Neeraj

1. **Ans:** a.
   From the above table, it is clear that Neeraj Cannot work on Thursday.
2. **Ans:** c.
   Rohit Cannot work on Tuesday.
3. **Ans:** d.
   Raveesh Cannot work on Friday.
4. **Ans:** b.
   Manoj cannot work on Monday.

Directions(Q.5-7): **Four couples are invited to a dinner party. They will be seated at a circular table. Follo- wing are the seating conditions.**

- Geeta refuses to sit next to Ali
- Lata wants to sit in between Tilak and Hari
- Champa refuses to sit next to Farooq
- Niti is seated on Ali's right hand side
- Farooq and Tilak are seated exactly opposite to each other
- The seating arrangement is such that one women is always between two men.


5. **Which of the following is the only possible seating arrange-ment to suit the above condi-tions?**
   a) Niti is to the right of Tilak
   b) Lata is in between Geeta and Farooq
   c) Champa is opposite to Geeta
   d) Farooq is adjacent to Champa
   e) Ali is to the right of Geeta



BANK EXAMS
REASONING

6. **Which of the following combi- nations is not as per the instru- cted sitting arrangement?**
   a) Geeta, Farooq, Lata
   b) Ali, Champa, Tilak
   c) Hari, Lata, Tilak
   d) Farooq, Niti, Ali
   e) Hari, Geeta, Farooq
7. **Which of the following state- ments are correct?**
   I. Ali is on Champa's right
   II. Lata is on Tilak's left
   III. Farooq is between Niti and Geeta
   1) I 2) II 3) III 4)

Answers(5-7):
Male members:
Ali, Tilak, Hari and Farooq



Female members:
Geeta, Lata, Champa and Niti.
From the given data the seating arrangement of the 4 couples is as follows.

5. **Ans:** c.
   From the above arrangement, it is clear that Champa and Geeta are exactly opposite.
6. **Ans:** a.
   Geeta, Farooq, Lata are not seated in this order.
7. **Ans:** e.
   From the above arrangement, it is clear that Ali is on Champa's right, Lata is on Tilak's left and Farooq is between Niti and Geeta.

Directions(Q.8-12): **Read the following information carefully and answer the questions.**

- Six friends P,Q,R,S,T and U are members of a club and play a different game of Football, Cricket, Tennis, Basket ball, Badminton and Volleyball.
- 'T' who is taller than 'P' and 'S' plays Tennis.
- The tallest among them plays Basketball
- The shortest among them plays Volleyball
- 'Q'&'S' neither plays Volleyball nor Basketball
- 'R' plays Volleyball
- 'T' is between Q who plays Football and 'P' in order of height

8. **What does 'S' play?**
   a) Football
   b) Either cricket or Badminton
   c) Cricket d) Badminton
   e) None of these
9. **Who among them is taller than 'R' but shorter than P?**
   a) T b) Data inadequate
   c) Q d) U
   e) None of these
10. **Which of the following state- ments is not true?**
    a) 'T' is taller than 'R'
    b) 'U' is taller than 'Q'
    c) 'P' is shorter than 'R'
    d) 'Q' is taller than 'S'
    e) 'S' is taller than 'P'
11. **Who among the following plays Basketball?**
    a) S b) U c) Q d) K
    e) None of these
12. **Who will be at the third place if they are arranged in descen- ding order of their height?**
    a) T b) Q c) P d) S
    e) None of these

Answers(8-12): From the given information, it is clear that 'R' plays Volleyball, 'T' plays Tennis and 'Q' plays Football. 'S' plays either Cricket or Badminton.

Order of Heights
Q>T>P and T>P&S
⇒ Q>T>P> S>P
(∴R is the shortest)
The tallest person shall plays Basketball, so it is only 'U' who can play Basketball. Hence 'P' also plays either Cricket or Badminton. Tabulating the above information...

Name	Game	Rank in Height
U	Basketball	1
Q	Football	2
T	Tennis	3
P }	Cricket &	} 4
S	Badminton	5
R	Volley ball	6

8. **Ans:** b.
   'S' plays either cricket or Badminton
9. **Ans:** e.
   'S' is taller than 'R' but shorter than 'P'
10. **Ans:** c.
    From the above table, it is clear that 'P' is taller than 'R'
11. **Ans:** b.
    'U' Plays Basketball.
12. **Ans:** a.
    From the table, it is clear that 'T' is third from top if they are arranged in descending order.

Directions(Q.13): **Persons X,Y,Z and Q live in red, green, yellow and blue coloured houses not necessarily in the same order. 'Z' lives in a yellow house. The green house is adjacent to the blue house. 'X' does not live adjacent to 'Z'. The yellow house is in between the green and red houses. The colour of the house X lives in is ____**

a) blue b) green
c) red d) can't be determined

Ans: a.
From the given information, Z lives in a yellow house, Which is in between green and red houses. and also 'X' is not adjacent to 'Z'. Therefore 'X' lives in blue house.

Directions(Q.14): Five persons with names P, M, U, T and 'X' live separately in A palace, a hut, a fort, a house, a hotel. Each one likes two different colours from among the Blue, Black, Red, Yellow, Green. 'U' likes red and blue. 'T' likes black. The person living in a palace does not like black or blue. 'P' likes blue and red. 'M' likes yellow. 'X' lives in a hotel.

14. **'M' lives in a ——?**
    a) hut b) fort
    c) palace d) house

Ans: c.
Given information can be tabulated as follows.

Person:	U	T	P	M	X
Colours:	Red/ Blue	Black	Blue/ Red	Yellow	–

It is given that the person living in palace does not like black or blue. so U, T and P cannot live in palace. Also it is given that 'X' lives in a hotel. Therefore the only person left over is 'M' and he lives in palace.